విమర్శక వతంసులు

(వ్యాస సంపుటి)

రచయిత

ఆచార్య ఎస్వీ రామరావు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001

పోన్ నెం. 2475 3724

విమర్శక వతంసులు

(వ్యాస సంపుటి)

రచయిత:

ఆచార్య ఎస్వీ రామారావు

ప్రధాన సంపాదకులు:

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్

డా॥ సి. నారాయణరెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు:

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001

ఫోన్ నెం. 040-2475 3724

VIMARSAKA VATHAMSULU

(Essays on Telugu Critics)

Author : **Prof. S.V. Rama Rao,** M.A., Ph.D.
Former Head, Dept. of Telugu & Dean,
Osmania University, Hyderabad - 7.
Mobile : 9848012053.

మొదటి ముద్రణ : 2011

ప్రతులు : 1000

వెల : రూ. 45-00

ప్రతులకు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాద్ - 500 001
ఫోన్ : 040-24753724

ముద్రణ :
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
40-ఎపిహెచ్‌బి, విద్యానగర్,
హైదరాబాద్ - 500 044.
ఫోన్ : 040-2761 8261

అవతారిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత,
పద్మభూషణ్ డా. సి. నారాయణరెడ్డి
అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ లోకనంది శంకరనారాయణరావు వంటి పలువురు సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943లో రూపుదిద్దుకొని, ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్య మిత్రులు కీ.శే. డా. దేవులపల్లి రామానుజ రావుగారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించారు. ఉత్తమాదర్శాలతో, ఆశయాలతో ఆవిర్భవించిన పరిషత్తు కాలానుగుణంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలందుకుంటున్నది. వీటిలో భాషా బోధన, గ్రంథ ప్రచురణ ముఖ్యభూమికలు వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాల, స్నాతకోత్తరస్థాయి ప్రాచ్య కళాశాల నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపొందించి నిర్వహించే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి వైలక్షణ్యాన్ని చేకూర్చుకున్నాయి.

పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీ లోకం హార్దికంగా స్వాగతిస్తున్నది. ఇంతవరకు 200 పైగా గ్రంథాలు వెలువరించింది. "విమర్శక వతంసులు" అనే ఈ గ్రంథాన్ని రచించిన ఆచార్య ఎస్. వి. రామారావు, నేను ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యత్వం నిర్వహిస్తున్నప్పుడు నా విద్యార్థిగా వున్నారు. ఆయన నా పర్యవేక్షణలో "తెలుగులో సాహిత్య విమర్శ"పై పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టం అందుకున్నారు. విమర్శ ప్రక్రియపై ప్రామాణిక గ్రంథంగా అది పండితలోకం ప్రశంసలు పొందింది. ఆచార్య రామారావు సాహిత్య

విమర్శన రంగంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుని విస్తృతంగా రచనలు చేస్తున్నారు. సి.పి.బ్రౌన్‌తో ప్రారంభించి వల్లంపాటి వెంకట సుబ్బయ్య వరకు ప్రముఖ దివంగత విమర్శకులపై ఆచార్య రామారావు రచించి, లోగడ పత్రికల్లో ప్రచురించిన ఇరవై మూడు వ్యాసాలను సంపుటీకరించి సాహితీ లోకానికి అందిస్తున్నాం. విషయ సాంద్రత, అభివ్యక్తి సంక్షిప్తత సంతరించుకున్న ఈ వ్యాసాలు విద్యార్థులకు, పరిశోధకులకు, పండితులకు ఉపకరించేవిగా వున్నాయి.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగే అందరి మన్ననలు పొందగలదని విశ్వసిస్తున్నాను.

25-04-2011

డా.సి. నారాయణరెడ్డి

ముందుమాట

తెలంగాణ ప్రాంతంలోనే కాకుండా యావదాంధ్రదేశంలో ప్రతిష్ఠ పొందిన సంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. 1943లో స్థాపితమై ఆనాటి పాలకుల నిరాదరణకు గురియైన తెలుగు భాషకు ప్రాచుర్యం కల్పించిన సంస్థ ఇది. ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షల నిర్వహణ ద్వారా నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది అభ్యర్థులకు ఉపాధి కల్పించింది. ఎన్నో సదస్సులు నిర్వహించి వాటిని గ్రంథాలుగా ప్రచురించింది. కీ.శే.డా. దేవులపల్లి రామానుజ రావు గారి సంకల్ప బలానికి, మా ప్రస్తుత అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్ డా.సి.నారాయణరెడ్డి గారి కార్యదీక్షతోడై పరిషత్తు చేపట్టిన కార్యక్రమాలు దిగ్విజయంగా నడుస్తున్నాయి. డా.సి. నారాయణరెడ్డి గారి అధ్యక్షతన పరిషత్తు ఎంతో పటిష్ఠంగా రూపొందింది.

గతంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు అనేక గ్రంథాలు ప్రచురించింది. అవి అనేక ప్రక్రియలకు సంబంధించినవి. వాటిలో విమర్శ గ్రంథాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఆచార్య ఎస్.వి. రామారావు గారు రచించిన "విమర్శక వతంసులు" గ్రంథాన్ని ప్రకటిస్తున్నది. ఆచార్య ఎస్. వి. రామారావు గారు తెలుగు సాహిత్య విమర్శ రంగంలో ఎంతో కృషి చేశారు. ఆయన పరిషత్తు కార్యవర్గ సభ్యులు కూడా. రామారావు గారు ఇంతకు ముందు తెలుగు సాహిత్య విమర్శను గురించి కొన్ని గ్రంథాలు రచించారు. ఇటీవల పత్రికల్లో మరి కొన్ని విమర్శ వ్యాసాలు రాశారు. ఆ వ్యాసాలను క్రోడీకరించి "విమర్శక వతంసులు" అనే ఈ గ్రంథం పొందుపరిచారు. దీనిని పరిషత్తు పక్షాన ప్రచురించమని కోరారు. మా అధ్యక్షులు డా.సి. నారాయణరెడ్డిగారు రామారావు గారి మీది వాత్సల్యంతో, ఈ గ్రంథం విలువను గమనించి, పరిషత్తు పక్షాన ప్రకటించడానికి నిర్ణయించారు. పరిషత్తు పక్షాన ఈ గ్రంథాన్ని ప్రచురించటానికి అవకాశం కల్పించిన ఆచార్య ఎస్.వి.రామారావు గారికి కృతజ్ఞతలు.

విమర్శకుల ఛాయాచిత్ర సేకరణలో మాకు సహకారం అందించిన ఆచార్య ఎస్వీ రామారావు, డా॥ సిహెచ్. లక్ష్మణచక్రవర్తి, ముఖ్యంగా నండూరు బంగారయ్య గారి ఛాయాచిత్రాన్ని సేకరించి పంపిన ప్రముఖ కవి, విమర్శకులు డా॥ అద్దేపల్లి రామమోహనరావు, ప్రముఖ కవి శ్రీ ఎస్.ఆర్. పృథ్వి (రాజమండ్రి) గార్లకు మా ప్రత్యేక కృతజ్ఞతలు.

25-04-2011

డా. ఎల్లూరి శివారెడ్డి

ప్రధాన కార్యదర్శి

నా మాట

సాహిత్యతత్త్వాన్ని రసజ్ఞ పాఠకులకు మనోగోచరం కావించేది సాహిత్యవిమర్శ. విమర్శలేనిది కావ్య ప్రకాశం జరుగదు. విద్యార్థిదశలోనే విమర్శ ప్రక్రియపై ఆసక్తి ఏర్పడటంతో గురువర్యులు డా॥సి. నారాయణరెడ్డి గారి పర్యవేక్షణలో ఆ ప్రక్రియావికాసంపై పరిశోధనచేసి డాక్టరేట్ పట్టం పొందాను. నా సిద్ధాంత గ్రంథం 'తెలుగులో సాహిత్య విమర్శ' ముద్రితమైన (1974) తర్వాత విమర్శనాసాహిత్యానికి దోహదం చేసిన కొందరు విమర్శకులపై వివిధ సందర్భాలలో ప్రత్యేక వ్యాసాలు వెలువరించటం జరిగింది. అవి కొన్ని పత్రికలు, జాతీయ సదస్సు సంచికలలో ప్రచురితమైనాయి. వాటి సంపాదకులను కృతజ్ఞతాపూర్వకంగా స్మరించుకొంటున్నాను.

ఈ సంపుటిలో చేరినవారిలో కొందరు పరిశోధకులుగా, మరికొందరు విమర్శకులుగా తమ ప్రతిభను ప్రదర్శించిన వారున్నారు. విమర్శ–పరిశోధన అవినాభావ సంబంధమైనవి. అవి పరస్పర ఆధార ఆధేయములు. విమర్శనా క్షేత్ర విస్తరణకు కృషి సల్పిన సహృదయ శేఖరులెందరో ఉన్నారు. కీర్తిశేషులైన కొందరి విమర్శలను మాత్రమే ఇందులో సమాలోచించటం జరిగింది.

డా.సి.నారాయణరెడ్డిగారు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్ష బాధ్యత స్వీకరించినప్పటినుంచీ బహుముఖీనమైన, ప్రయోజనాత్మకమైన కార్యక్రమాలను చేబట్టారు. వినూత్న సదస్సులు, పరిణతవాణి మున్నగు ప్రసంగవ్యాసాల ప్రచురణలు వానిలో కొన్ని. తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యాన్ని చాటే వ్యాససంపుటి సంపాదకత్వంతోపాటు ప్రసిద్ధ విమర్శకులను గురించిన ఈ గ్రంథ ప్రచురణకు అవకాశం కల్పించిన గురువుగారికి వినయపూర్వక ప్రణామాలు. పరిషత్తు పక్షాన ఈ గ్రంథం వెలువడటానికి సహకరించిన ఆత్మీయులు, ప్రధాన కార్యదర్శి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికీ, కోశాధికారి మంత్రి రామారావుగారికీ, గోవిందరాజు రామకృష్ణారావుగారికీ, పాండురంగయ్యగారికీ, గ్రంథముద్రణలో తోడ్పడిన తాళ్లపల్లి మురళీధర గౌడ్ గారికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

26 మార్చి 2011 డా. ఎస్వీ రామారావు

అనుక్రమణిక

1. సి.పి.బ్రౌన్

(1798-1884)



సువిశాలమైన తెలుగు సాహితీ సుక్షేత్రంలో శైవ వాఙ్మయానికి ప్రత్యేకమైన-విశిష్టమైన స్థానం ఉంది. శైవ వాఙ్మయాన్ని వెలుగులోనికి తెచ్చి దాని వైశిష్ట్యాన్ని చాటి చెప్పిన పరిశోధకులు ఎందరో మహానుభావులు. అట్టివారిలో ప్రథమ స్మరణీయుడు సి.పి.బ్రౌన్. మూలనపడివున్న తెలుగు కావ్యాలను సేకరించి, శుద్ధ ప్రతులుగా రూపొందించి తెలుగు సాహిత్యానికి గొప్ప సేవలు అందించిన మహనీయుడు సి.పి.బ్రౌన్.

కలకత్తాలోని క్రైస్తవ మిషనరీ డేవిడ్ బ్రౌన్ దంపతులకు 1798 నవంబరు 10వ తేదీన జన్మించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ లండన్‌లో విద్యాభ్యాసం (1812-17) కావించి, 1817 ఆగష్టులో ఉద్యోగనిమిత్తం మద్రాసుకు వచ్చారు. అక్కడి ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాలలో నాలుగు సంవత్సరాలపాటు (1817-20) తెలుగు, మరాఠీ మొ॥ భాషలలో శిక్షణ పొందారు. 1820 ఆగష్టులో కడపజిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేసి తర్వాత మచిలీపట్నం, రాజమండ్రి, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో వివిధ పదవుల్లో కొనసాగారు. ఈ కాలంలోనే తెలుగుభాషలో పాండిత్యాన్ని సంపాదించుకొని, ఆ భాషా సారస్వతాలను ఎంతో అభిమానించి వాటికి ఎనలేని సేవ చేశారు. పదవీ విరమణతో 1855లో స్వదేశానికి చేరుకొని, లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసి (1865), 1884 డిసెంబర్ 12వ తేదీన మరణించారు.

బ్రౌన్ సాహితీ వ్యవసాయంలో పేర్కొనతగినవి - నిఘంటు, ఛందో, వ్యాకరణ గ్రంథాలు-వేమన పద్యాల అనువాదం-పరిశోధనా వ్యాసాలు, కావ్య పరిచయాలు (నోటీసులు) మొ॥నవి. తెలుగులో గ్రంథ పరిష్కరణా విధానానికి(Textual Criticism) చక్కని పునాది వేశాడు బ్రౌన్. మూలనపడి వున్న తాళపత్ర ప్రతులను సేకరించి, కఠిన శబ్దాలకు అర్థాలు వ్రాయించి, ముద్రణకు సిద్ధం చేయించారు. కొన్నింటిని స్వయంగా ముద్రింపజేశారు. ఈ కృషిలో భాగంగానే ఎన్నో శైవ కావ్యాలు తొలిసారిగా వెలుగులోకి వచ్చాయి.

శైవ సాహిత్యమన్నా, ద్విపద కావ్యాలన్నా బ్రౌన్ ఎంతో అభిమానాన్ని ప్రదర్శించారు. మదరాసు లిటరరీ సొసైటీ వారి ఆంగ్లపత్రిక "Journal of Literature and Science" లో ప్రచురించిన ఈ కింది వ్యాసాలే అందుకు నిదర్శనం.

1. Essay on creed, customs and Literature of the Jangams (1840 January - June, Vol.11)
2. Account of Basava Puran - The Prinicipal Book used as a religious code by the Jangams (1840 October, Vol.12)

వీటిలో మొదటి వ్యాసాన్ని సొసైటీ సమావేశంలో బ్రౌన్ స్వయంగా చదివారు. 1871లో లండన్‌లో జర్నల్ ఆఫ్ రాయల్ ఏసియాటిక్ సొసైటీ (JRAS) లో ఇది పునర్ముద్రితమైంది. ఇవికాక "Essay on Language and Literature of the Telugus" అన్న వ్యాసంలో కూడా (1831 July - December, Vol.10) శైవ వాఙ్మయ ప్రసక్తి (అక్కమహాదేవి చరిత్ర యక్షగానం మొ॥) ఉంది. ఈ వ్యాసాలు తొలిదశలో వెలువడిన తెలుగు సాహిత్య చరిత్రలుగా పరిగణింపదగినవి.

వీరశైవుల ఆచారవ్యవహారాలన్నా, వీరశైవ మత ప్రవర్తకుడు బసవేశ్వరుడన్నా బ్రౌన్ దొరకు గౌరవం ఉంది. 1839లో సిద్ధమైన 'వీర మహేశ్వరాచార సంగ్రహం' అన్న ద్విపద కావ్యానికి రిమార్కులో ఈ విధంగా వ్రాశారు-

"బసవేశ్వరుని సిద్ధాంతాలకు విరుద్ధమైన బ్రాహ్మణ మూఢాచారాలను అంగీకరించడానికి ఇది తాపత్రయపడే గ్రంథం. ఇటువంటివి స్మార్తులకూ, ఆరాధ్యులకూ పొత్తు కుదిర్చే ఉద్దేశంతో రచించినవి. వీటిని మత విరుద్ధాలుగా జంగాలు కొట్టిపారేస్తే

ఆశ్చర్యం లేదు. బసవేశ్వరుడు ఏ ఆచారాలను నిర్మూలించడానికి పాటుపడ్డాడో వాటిని ఈ గ్రంథం ప్రబోధిస్తుంది. మరీ ముఖ్యంగా 424వ పుటలో చెప్పిన మంత్రాలు మొదలైన వాటిని బసవేశ్వరుడు గర్హించాడు". సాంప్రదాయకమైన వైదికమత సాహిత్యాన్ని 'బ్రాహ్మణ సాహిత్యం' గానూ, వీరశైవుల సాహిత్యాన్ని 'జంగాల సాహిత్యం' గానూ బ్రౌన్ వ్యవహరించేవాడు. "ముదివిటులు విధవలంజలు పదకవితలు"... అని దేశి రచనలను చిన్నచూపు చూస్తున్న కాలంలో నిరాదృతమైన ద్విపద కావ్యాలను ఉద్ధరించి వాటికి గౌరవస్థానం కల్పించారు బ్రౌన్.

"తెలుగు గ్రంథాలను సామాన్య కావ్యాలు, మహాకావ్యాలు అని రెండు వర్గాలుగా విభజించవచ్చు. సామాన్య కావ్యాలు ద్విపద ఛందస్సులో ఉంటాయి. మహాకావ్యాలు చంపూ ప్రబంధాలు. బ్రాహ్మణ విద్వాంసుల అంచనా ప్రకారం నిరాడంబరత ఒక దోషం. ద్విపదలలో ఈ గుణం ఉంటుంది. అదీకాక ద్విపద కావ్యాల్లో చాలామట్టుకు, బహుశా అన్నీ- శూద్రరచనలు కావచ్చును. పద్యకావ్యాలు సర్వసాధారణగా పవిత్రకులం వాళ్ల రచనలు. అయితే తెలుగువాళ్ళు గర్వంగా చాటుకునే వసుచరిత్ర శూద్రుడు చెప్పినదే" (Essay on the Language and Literature of the Telugus).

ఆనాడు వ్యాప్తిలో వున్న బ్రాహ్మణ - బ్రాహ్మణేతర భేదాలను ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. అయితే సాహిత్యాన్ని అంచనా వేయడానికి కులమతాలు కొలబద్దలు కావు. పైగా బ్రౌన్ కాలం నాటికి కవుల కులాలు సరిగ్గా నిర్ధారణ కాలేదు అన్న అంశాన్ని కూడా గుర్తించాలి.

ప్రసిద్ధ చంపూ ప్రబంధాలకు పరిష్కృత ప్రతులు సిద్ధం అయ్యాక 1839లో బ్రౌన్ దృష్టి ద్విపద కావ్యాలపై మళ్లింది. మొత్తం 13 ద్విపద కావ్యాల ప్రతులు ముద్రణకు సిద్ధం చేయించారు. ఆరణిమఠం వీరభద్రయ్య అనే వీరశైవ విద్వాంసుని సూచనల ప్రకారం పాల్కురికి సోమన 'పండితారాధ్యచరిత్ర' కు మూడుప్రతుల నుండి పాఠ భేదాలు స్వీకరించాడు. తర్వాత పిడుపర్తి సోమనాథుని 'ప్రభులింగలీల'ను నరసింహాచారి చేత పరిష్కరింపజేశారు. బ్రౌన్ అభిప్రాయంలో ప్రభులింగలీల ఉత్తమ కావ్యం. సోమన బసవపురాణాన్ని అద్భుత కథల సంకలనంగా పేర్కొన్నారు. సి.పి.బ్రౌన్ సాహిత్యాభిమానం

మూలంగా సేకరింపబడి పరిష్కృతమైన శైవ కావ్యప్రతులు ఇవి-పండితారాధ్య చరిత్ర,బసవపురాణం,ప్రభులింగ లీల, కాశీఖండం, శ్రీకాళహస్తి మాహాత్మ్యం, శ్రీకాళహస్తీశ్వరశతకం, వీరమహేశ్వరాచార సంగ్రహం.

బ్రౌన్ వ్యాసాలన్నీ ఆంగ్ల భాషలోనే వ్రాయబడిన విషయం సువిదితం. తెలుగు కావ్యాల వైశిష్ట్యాన్ని ఇతర భాషాభిజ్ఞులకు పరిచయం చేయాలన్న సదుద్దేశంతో వాటి భాగాలను ఇంగ్లీషులోకి అనువదించారు. ప్రజాదరణ పొందిన వేమన పద్యాల అనువాదం (1829) ఎంతో ప్రసిద్ధి పొందింది. ప్రసిద్ధ శైవకావ్య భాగాలను కూడా ఆయన అనువదించారు. బసవపురాణాన్ని సంక్షిప్త రూపంలో (150 పుటలు) ఆంగ్లీకరించారు. శ్రీకాళహస్తి మాహాత్మ్యం కథను సంగ్రహంగా వ్రాశారు. ప్రభులింగలీల మూడవ ఆశ్వాసంలో కొంత భాగాన్ని, పండితారాధ్య చరిత్రలోని కొంతభాగాన్ని అనువదించారు.

బసవపురాణంలోని పదాలకు తన నిఘంటువుల్లో స్థానం కల్పించి వాటికి ప్రామాణికతను కల్పించారు. శివలింగంపట్ల ఉన్న దురభిప్రాయాలను తొలగించటానికి లింగ విషయసంబంధమైన వ్యాసాన్నికూడా వ్రాశారంటే బ్రౌన్ శైవాభిమానం ద్యోతకం కాగలదు. "వేమన పద్యాలను ప్రచురించినందుకు, జంగాలను వెనకేసుకొని వచ్చినందుకు, నా హైందవ వ్యతిరేకత రుజువు అయినదని భావించేవారు" అని తన ఆత్మకథలో వ్రాసుకొన్నారు.

బ్రౌన్ తన జీవితకాలంలో చేసిన రచనలు వేలపుటల్లో, ఎన్నో సంపుటాలకు విస్తరించి ఉన్నాయి. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు ఏర్పాటు చేసిన సి.పి. బ్రౌన్ రీసర్చ్ ప్రాజెక్ట్‌లో భాగంగా బ్రౌన్ రచనల 52 సంపుటాలు సేకరించి మైక్రోఫిల్మ్ రూపంలో భద్రపరచారు. వాటిలో ఒక సంపుటం పూర్తిగా వీరశైవులకు సంబంధించిందే కావటం గమనార్హం.

ఈ విధంగా సి.పి.బ్రౌన్ సాహిత్య సేవలో శైవ వాఙ్మయ పరిశోధనకు ప్రత్యేకస్థానం ఉంది. ప్రప్రథమంగా తెలుగు శైవ సాహిత్యాన్ని సాహిత్యాభిమానులకు పరిచయం చేసిన ఘనత విదేశీయుడైన బ్రౌన్‌కే దక్కింది. ఆయన కృషిని స్ఫూర్తిగా గ్రహించి అనంతర పరిశోధకులు ఈ మార్గంలో ముందంజ వేశారు. వీరశైవుల ఆచారవ్యవహారాలు - రచనలపై, బసవపురాణంపై బ్రౌన్ రచించిన ఆంగ్ల వ్యాసాలు ఆంధ్రీకరించి ప్రచురిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.


బ్రౌన్‌కు చిన్ననాటినుంచే విమర్శనా దృక్పథం అలవడింది. షేక్స్‌పియర్ 'టెంపెస్ట్' నాటకంలో డ్రైడెన్ చేసిన మార్పులను ఖండించి వాటిని తొలగించాలని కోరటంతో ప్రదర్శకులు వాటిని తొలగించటం జరిగింది. తెలుగు - ఇంగ్లీషు నిఘంటువులో ఉపయుక్తములైన ఆంధ్రకావ్యాలకు వ్రాసిన లఘు పరిచయం (On the Names of Books quoted in this dictionary) , ఆంధ్ర క్రైస్తవ కావ్యాలకు వ్రాసిన 'నోటీసులు', వేమన పద్యానువాదానికి వ్రాసిన లఘు వ్యాఖ్య, వసుచరిత్ర టీక (1844), తాతాచార్యుల కథలు (1855) మున్నగు గ్రంథాల ఆంగ్లపీఠికలు ఆయన సూక్ష్మపరిశీలనాదృష్టిని చాటుతాయి.

నాడు ఉపలభ్యమైన ఆంధ్ర వాఙ్మయాన్నంతా పరిశీలించిన సాహితీ జిజ్ఞాసువు సి.పి బ్రౌన్. వితరణశీలిగా ప్రసిద్ధి కెక్కిన బ్రౌను దొరకు ఒక పేదకవి "లావొక్కింతయులేదు" అను పద్యాన్ని వ్రాసి పంపగా - "ఏను మృతుండనౌదు" అనే భాగవత పద్యాన్నే బదులుగా రాసి పంపటంలో అతని సమయస్ఫూర్తితో పాటు ఆంధ్ర కావ్యాలతో గల గాఢ పరిచయం ప్రస్ఫుటమవుతుంది. భాషా పరిశోధనకు కూడా బ్రౌన్ మార్గం వేశారు. వ్యాకరణ, నిఘంటు పీఠికల్లో ప్రతిపాదించిన భాషా సిద్ధాంతాలు సహేతుకమై ప్రామాణికంగా ఉన్నాయి. ఛందస్సుకు సంబంధించిన గ్రంథాన్ని (The Prosody of Telugu and Sanskrit Languages - 1827) కూడా రచించారు. తెలుగు కావ్య లక్షణంపై ఆయన వ్రాసిన గ్రంథానికి (1827) కాలేజి బోర్డువారు వేయి సవరనులు బహుమతిగా ఇచ్చారని విశ్రుతి. తెలుగు పరిశోధనా దీపాన్ని వెలిగించిన పాశ్చాత్యుల్లో చిరస్మరణీయుడు సి.పి. బ్రౌన్.

"He was the first who applied himself to a thorough examination of Telugu Literature and if others shall hereafter be enabled to follow his example, it will only by the light of those aids which he left for their guidance" (కొత్తపల్లి వీరభద్రరావు - సి.పి. బ్రౌన్)

(బసవకృప, మే2003)

2. కొమర్రాజు వెంకటలక్ష్మణరావు
(1876-1923)



ఆంధ్ర మహాభాగవతం రచించి తెలుగు ప్రజలందరి అభిమానాన్ని చూరగొన్న సహజకవి బమ్మెర పోతన వరంగల్‌కు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో వున్న బమ్మెర వాస్తవ్యుడు. అయితే మన కవుల చరిత్ర రచన ప్రారంభదశలో పొరపాటుగా పోతన జన్మస్థలం కడపజిల్లాలోని ఒంటిమిట్టగా భావించటం జరిగింది. దీనికి కారణం పోతన భాగవతంలో ఏకశిలానగర నామప్రస్తావన ఉండటం. ఈ అపోహను తొలగించి ఏకశిలానగరం అంటే ఓరుగల్లే అని చారిత్రక సాక్ష్యాలతో సోపపత్తికంగా నిరూపించిన పరిశోధక వతంసులు కొమర్రాజు వెంకటలక్ష్మణరావు. ఓరుగల్లుకు సంస్కృతీకరణం ఏకశిలా నగరం. పోతనతో పాటు ఆంధ్ర భాగవత రచనలో పాలుపంచుకొన్న ఏర్చూరు సింగన, వెలిగందల నారయల గ్రామాలు వరంగల్, ఖమ్మం జిల్లాలలోనివే అని తేల్చారు కొమర్రాజు వారు.

ఈ విధంగా చరిత్రకు సంబంధించిన అనేక సత్యాలను వెలుగులోనికి తెచ్చిన మహనీయులు లక్ష్మణరావుగారు. రామాయణంలోని పర్ణశాల మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర కాకుండా భద్రాచలం సమీపంలో ఉందని నిరూపించారు. శ్రీశైలం, ద్రాక్షారామాలతో పాటు త్రిలింగ దేశంలోని మూడవ క్షేత్రం శ్రీకాళహస్తిగాక – కరీంనగర్ జిల్లా గోదావరీ తీరంలోని కాళేశ్వరం అని చాటి చెప్పారు.

కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలులో 1876 మే నెల 18వ తేదీన జన్మించిన కొమర్రాజు లక్ష్మణరావు బాల్యం నల్లగొండ జిల్లా భువనగిరి, దేవరకొండలలో గడిచింది. నాగపూరులో బి.ఏ.పట్టం పొంది 1900 ప్రాంతంలో హైదరాబాదుకు వచ్చారు. ప్రైవేటుగా చదివి కలకత్తా విశ్వవిద్యాలయం నుండి 1902 లో ఏం.ఏ. డిగ్రీ పొందారు.

నిజాం ప్రభుత్వం కాలంలో తెలుగు భాషా సాహిత్యాలకు విశిష్టమైన సేవ చేస్తూ తెలంగాణలో సాంస్కృతిక చైతన్యానికి, ఆంధ్రోద్యమానికి దోహదం చేసిన మనీషి ఆయన. మునగాల రాజా నాయని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు సహకారంతో 1901లో హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం స్థాపించారు. గడిచిన నూరు సంవత్సరాలకు పైగా తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక వికాసంలో ప్రముఖ పాత్ర వహించిన ఏకైక సంస్థ భాషానిలయ గ్రంథాలయం. అదే కాకుండా 1905లో ఆయన నెలకొల్పిన విజ్ఞాన చంద్రికామండలి చరిత్ర పరిశోధన రంగానికి సంబంధించిన అమూల్యగ్రంథాలు పెక్కింటిని ప్రచురించింది.

లక్ష్మణరావుగారు స్వయంగా బహు గ్రంథకర్త. ఆయన రచించిన 'హిందూ మహాయుగము' తెలుగులో వెలువడిన మొదటి ప్రామాణిక దేశ చరిత్రగా పేరు గడించింది. తర్వాతి భాగమైన 'మహ్మదీయ మహాయుగము' లో అక్కన్న మాదన్నల చరిత్ర సవిస్తరంగా ఉంది. ఆయన వ్రాసిన 'శివాజీ చరిత్ర' గడియారం వెంకట శేషశాస్త్రి గారి 'శివభారత' ప్రబంధ రచనకు స్ఫూర్తి నొసగింది.

1908లో లక్ష్మణరావుగారి కార్యక్షేత్రం మద్రాసుకు మారటంతో విజ్ఞాన చంద్రికా మండలి కూడా అక్కడికి తరలి వెళ్ళింది. కందుకూరి వీరేశలింగం పంతులు స్వీయ చరిత్రతో పాటు పెక్కు చారిత్రక నవలలను ఈ గ్రంథ మండలి ముద్రించింది.

చరిత్ర పరిశోధకులుగానే కాక విజ్ఞాన సర్వస్వ నిర్మాతగా కూడా కొమర్రాజు వారు వాసి గడించారు. తెలుగులో విజ్ఞాన సర్వస్వప్రచురణకు ఆయన శ్రీకారం చుట్టారు. 1915-18 మధ్య ఆయన సంపాదకత్వంలో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వం మూడు సంపుటాలు వెలువడ్డాయి. 35 అంశాలకు చెందిన వేయి వ్యాసాలు 2000 పుటలకు పైగా వీనిలో చోటు చేసుకున్నాయి. వీనిని లక్ష్మణరావు గారు, మేడేపల్లి వేంకట రమణాచార్యులు గారు రచించారు. వీనిలో కొన్ని స్వతంత్ర వ్యాసాలుగా, ప్రత్యేక గ్రంథాలుగా కూర్చదగిన స్థాయి గలవి.

ఈ సంపుటాలలో లక్ష్మణరావు గారు రచించిన వ్యాసాలు, సమకాలీన పత్రికల్లో వెలువరించిన పరిశోధనాత్మక వ్యాసాలు కలిపి 'లక్ష్మణరాయ వ్యాసావళి' పేరుతో రెండు భాగాలుగా వెలువడ్డాయి. విజ్ఞాన నిధులుగా పేర్కొనదగిన ఈ వ్యాసాలు ఆయన భాషా వైదుష్యానికీ, సూక్ష్మ పరిశీలనా ప్రతిభకూ గీటురాళ్ళు. అభిజ్ఞాన శాకుంతలంపై వ్యాసం ప్రత్యేకంగా సమగ్ర పరిశోధనా గ్రంథంగా ఉగ్గడింపదగింది.

సంస్కృతాంధ్రాంగ్ల మరాఠీభాషల్లో నిష్ణాతులైన లక్ష్మణరావుగారు ప్రసిద్ధ పారిభాషిక పదాలెన్నింటినో రూపొందించి వాడుకలోకి తెచ్చారు. యూనివర్సిటీకి సమానార్థకంగా వున్న 'సర్వ కళాశాల'కు బదులుగా 'విశ్వవిద్యాలయం' అన్న పదాన్ని వ్యవహారంలోకి తెచ్చారు. ఎడిటర్‌కు సమానార్థకంగా 'పత్రికాధిపతి' స్థానంలో 'సంపాదకుడు' అన్న వాడుకను రూఢి చేశారు. ఆయన రూపొందించిన శ్రీకృష్ణదేవరాయ చిత్రపటం ఆధారంగానే తిరుమల శ్రీవేంకటేశ్వర ఆలయంలోని రాయల కాంస్య విగ్రహం నిర్మించబడింది. 1923 జులై 13వ తేదీన మద్రాసు ఎగ్మూరులో కందుకూరి వీరేశలింగం కూర్చొని పరమపదించిన కుర్చీలోనే కాలధర్మం చెందారు లక్ష్మణరావుగారు. సమాజసేవ, భాషావాఙ్మయ సేవ మూర్తీభవించిన ఆ మనీషి జీవితం మనందరికీ మార్గదర్శకమైనట్టిది.

(చేతన, సెప్టెంబర్ 2007)

3. ఆదిరాజు వీరభద్రరావు

(1890–1973)



క్రీ. శ. 1425 ప్రాంతంలో సీతాపతిరాజు అనే మహావీరుడు ఓరుగల్లును పరిపాలించాడు. మహ్మదీయుల దాడి నుంచి వరంగల్‌కు విముక్తి కలిగించిన ఈ రాజు గురించి చరిత్రకారులకు తెలియజేసిన పరిశోధకులు ఆదిరాజు వీరభద్రరావు. తెలంగాణా ప్రాంతంలో చరిత్రగర్భంలో మరుగున పడిపోయిన అనేక నూతనాంశాలను వెలికితీసి తెలుగుజాతి చరిత్రకు మహోపకారం చేసిన మహనీయుడు ఆయన.

ఆదిరాజుగారు 1890 సం.లో ఖమ్మం జిల్లా మధిర తాలూకా దెందులూరు గ్రామంలో ఆదిరాజు లింగయ్య, వెంకమాంబ దంపతులకు జన్మించారు. హైదరాబాదులోని రావిచెట్టు రంగారావు ఇంట్లో ఉండి చాదర్‌ఘాట్ హైస్కూలులో విద్యాభ్యాసం కావించారు. 1914 నుండి 1948 వరకు మహబూబ్ కాలేజీలో, చాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో, ఆ తర్వాత మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా పనిచేశారు.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, విజ్ఞాన చంద్రికా మండలి, గోలకొండ పత్రిక, ఆంధ్ర సారస్వత పరిషత్తు, సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశ సమితి మున్నగు పలు సంస్థలు, పత్రికల నిర్వహణలో వీరభద్రరావు ప్రముఖపాత్ర వహించారు. కొమర్రాజు

లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఖండవల్లి లక్ష్మీరంజనం మున్నగు ప్రసిద్ధ పరిశోధకులకు సహాయకులుగా ఉండి పెక్కు చారిత్రక వ్యాసాలు, పరిశోధన గ్రంథాలు రచించారు.

నాడు దక్కన్ రేడియోగా వ్యవహారంలో ఉన్న హైదరాబాదు రేడియో కేంద్రం నుంచి తొలి తెలుగు ప్రసంగం చేసిన కీర్తి వీరభద్రరావుగారికే దక్కింది. 150 ప్రసంగాలు ఆయనవి ఆకాశవాణి నుంచి ప్రసారమైనాయి.

1901లో శ్రీకృష్ణదేవరాయ భాషానిలయం స్థాపన సభలో పిన్న వయస్కుడుగా అతిథులకు తాంబూలాలు పంచి పెట్టిన ఆదిరాజువారు అనంతర కాలంలో ఆ గ్రంథాలయం కార్యవర్గసభ్యుడుగా, కార్యదర్శిగా వ్యవహరించి ఆ సంస్థ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారు. కొమర్రాజు వారు నెలకొల్పిన విజ్ఞాన చంద్రికా మండలి నిర్వహణలో కూడ ఆయన ముఖ్య పాత్ర వహించారు. ఆ సంస్థ హైదరాబాదు నుంచి మద్రాసుకు మారినపుడు 1908 నుంచి 1914 వరకు అక్కడే వుండి కార్యభారాన్ని వహించారు.

సురవరం ప్రతాపరెడ్డి గారు తెలంగాణలోని సంస్కృతాంధ్ర కవుల రచనలు సేకరించి 'గోలకొండ కవుల సంచిక' రూపొందిస్తున్న సందర్భంలో ఆ సంచిక వెలువడటానికి వీరభద్రరావు ఎంతో పాటుపడ్డారు. తర్వాత గోలకొండ పత్రిక ఉపసంపాదకులుగా కూడ వ్యవహరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఖండవల్లి లక్ష్మీరంజనంగారు స్థాపించిన సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశ సమితిలో దీర్ఘ కాలం సంపాదకులుగా పనిచేసి ఆ విజ్ఞానకోశ ప్రచురణలో, వ్యాస రచనలో ముఖ్య బాధ్యతను నిర్వహించారు.

వీరభద్రరావుగారు విశిష్ట రచయిత. గొప్ప చరిత్ర పరిశోధకులు. మౌలికమైన చారిత్రక సామగ్రి ఆధారంగా తెలంగాణా చరిత్ర నిర్మాణానికి ఎంతో కృషి సలిపారు. ప్రాచీనాంధ్ర నగరములు, మన తెలంగాణము, తెలంగాణా శాసనములు, షితాబ్‌ఖాన్ శాసనము మున్నగు గ్రంథాలు వారి పరిశోధనా ప్రతిభకు నిదర్శనాలు. 'ప్రాచీనాంధ్ర నగరములు' గ్రంథంలో అలంపురం, కొండాపురం, కొలనుపాక, గోలకొండ, పానుగల్లు, భోనగిరి, రాచకొండ, వరంగల్లు మొదలగు 12 ప్రాంతాల రాజకీయ, సాంఘిక చరిత్ర సూక్ష్మపరిశీలనా దృష్టితో వివరింపబడింది. 'మన తెలంగాణము' వ్యాస సంపుటిలోని


10 వ్యాసాలలో కాకతీయుల చరిత్ర, పాకాల సరస్సు, శాసనాలు, నాణెములు, దేవాలయాలు, ఆదిమానవుల సమాధులైన కెయిరనులు (వీటికే రక్కసి గుళ్లు, రాక్షసి గుళ్ళు అని వ్యవహారం ఉంది) మొదలైన పలు చారిత్రకాంశములు వెల్లడయినాయి. షితాబ్‌ఖాను అను బిరుదుగల సీతాపతిరాజు చరిత్రకు ఆధారమైన ఓరుగల్లు కోటలోని శాసనాన్ని పరిష్కరించి లక్ష్మీరంజనంగారి ఆంగ్ల పీఠికతో వీరభద్రరావుగారు ప్రచురించారు. శేషాద్రి రమణ కవులు, గడియారం రామకృష్ణశర్మ ప్రభృతులు సేకరించిన శాసనాలను సంపాదించి 'తెలంగాణా శాసనములు' రెండు భాగాలుగా ప్రకటించారు.

మహానుభావులు, దేశభక్తులు, విద్యా విజ్ఞాన వేత్తలైన వారి జీవితచరిత్రలు భావితరాలవారికి ఉపకరిస్తాయన్న ఉద్దేశంతో ముఖ్యంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సరళ శైలిలో వారు పలువురి జీవిత చరిత్రలు వ్రాశారు. జీవిత చరితావళి, లలిత కథావళి, చైతన్యము, రత్నప్రభ, గ్రీకు పురాణగాథలు మొదలైనవి ఈ కోవకు చెందినవి. నవ్వుల పువ్వులు ఆయన హాస్య ప్రియతకు తార్కాణం. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర రచించడమే కాక, ఆయన షష్టిపూర్తి సంచికను, భాషానిలయం గ్రంథాలయ రజతోత్సవ, స్వర్ణోత్సవ సంచికలను వెలువరించారు. చరిత్ర, భాషా సాహిత్య రంగాలను తన విజ్ఞాన ప్రభతో దీప్తిమంతం చేసిన ఆదిరాజు వీరభద్రరావు 1973లో పరమపదించారు.

(చేతన, ఆగస్టు 2007)

4. బండారు తమ్మయ్య

(1891–1970)



శైవ వాఙ్మయ పరిశోధకులుగా విమర్శకులుగా, ప్రశస్తి గడించిన మహానుభావులు బండారు తమ్మయ్యగారు. శివకవుల కావ్యాలను వెలుగులోకి తెచ్చి అపరిమితమైన వాఙ్మయోత్సాహాన్ని ప్రదర్శించిన శైవవాఙ్మయ దీక్షాపరులు వారు. శివకవుల గురించి, శైవమతాన్ని గురించి సాధికారికమైన, సప్రమాణమైన పెక్కు రచనలు వెలువరించారు. అందుచేతనే "He is an authority on what he writes" అని గిడుగు రామమూర్తి గారి ప్రశంసలను అందుకొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా గంగలకుర్తి అగ్రహార వాస్తవ్యులైన తమ్మయ్యగారు 1891 సెప్టెంబరు 24వ తేదీన (ఖరనామసంవత్సరము భాద్రపద బ.సప్తమి గురువారం రాత్రి) అమలాపురంలోని మాతామహుల యింట్లో జన్మించారు. వ్యావసాయిక వృత్తిపరులైన లింగబలిజ కుటుంబీకులు చిట్టెమ్మ, లింగయ్య ఆయన తల్లిదండ్రులు. తండ్రి మరణం (1907) తర్వాత మెట్రిక్యులేషన్ పరీక్ష పూర్తి చేసిన (1908) తమ్మయ్యగారు 1910 లో అమలాపురం తాలూకాఫీసులో గుమాస్తాగా చేరి అంచెలంచెలుగా ఉన్నతపదవులు పొంది కలెక్టరాఫీసులో 'హుజూర్ హెడ్ అకౌంటెంట్'గా 1946లో పదవీవిరమణ చేశారు.

ఉద్యోగంలో చేరిన తర్వాత వారి రచనా వ్యాసంగం ప్రారంభమైంది. 1914 కృష్ణా పత్రికలో నాచన సోమన, రఘునాథరాయలు మొదలైన కవులపై వ్యాసాలు ప్రకటించారు. ఇటు ఉద్యోగంలోనూ, అటు సాహిత్యరంగంలోనూ అందరిమన్ననలు పొందారు.

"వారు పైఅధికారులకు తలలోని నాలుక, క్రింది యుద్యోగులకు మచ్చరము లేని నెచ్చెలి..... కార్యాలయాంతరమున నుద్యోగులు, గృహాంతరమున సారస్వతోపాసకులు".

తమ్మయ్యగారు స్వయంకృషితో సంస్కృత, కన్నడ భాషలు కూడా అభ్యసించి వాటిలో పాండిత్యం సంపాదించారు. కాళిదాస మహాకవి కావ్యాలను వచన రూపంలో ఆంధ్రీకరించారు. రఘువంశ కథనము (1930), కుమార సంభవము (1965) నిర్దుష్టము, ప్రౌఢ గంభీరము, శ్రవణ సుభగము అయిన గద్యశైలితో కూడి పాఠ్యగ్రంథాలుగా ప్రశస్తి కెక్కాయి. వీరశైవ తత్త్వావగాహన కొరకు కన్నడ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆ భాషా గ్రంథాలను తెలుగులోకి అనువదించారు.

ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో (1922) పాల్కురికి సోమనపై వెలువరించిన వ్యాసం ఆ మహాకవిపై తమ్మయ్య గారి పరిశోధనకు శ్రీకారం చుట్టింది. వారి సూచనలను గ్రహించి కాశీనాథుని నాగేశ్వరరావు గారు బసవపురాణం (1929), పండితారాధ్య చరిత్ర (1941)లను ముద్రించారు. అయితే వాటి పీఠికలలో వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, చిలుకూరి నారాయణరావుగారు వెలిబుచ్చిన అభిప్రాయాలతో తమ్మయ్య గారు ఏకీభవించలేదు. వేదం వేంకట కృష్ణశర్మ 'శతకవాఙ్మయ సర్వస్వము' లోని అభిప్రాయాలను కూడా ఖండిస్తూ 'త్రిలింగ' పత్రికలో వ్యాసం వ్రాశారు. పాల్కురికి సోమనాథుడు మొదటి ప్రతాపరుద్రుని కాలానికి చెందినవాడని నిర్ధారిస్తూ 'పరిశోధన' పత్రికలో మరొక వ్యాసం వెలువరించారు.

1948లో తమ్మయ్యగారు వెలువరించిన 'పాలకురికి సోమనాథకవి' ఆ మహాకవిపై వెలువడిన ఏకైక విమర్శ గ్రంథంగా పేర్కొన దగింది. సోమనాథుని జీవిత, కవిత్వ విశేషాలు ఇందులో శాస్త్రీయ పద్ధతిలో సహేతుకంగా పరామర్శితమైనాయి. సమకాలీన పండిత పరిశోధకులు భావించినట్లుగా సోమన ఆరాధ్యబ్రాహ్మణుడు కాదని, వీరశైవ జంగమ కులానికి చెందినవాడని, రెండవ ప్రతాపరుద్రుని కాలంలో కాక మొదటి ప్రతాపరుద్రుని కాలంలో జీవించాడని తమ్మయ్యగారు నిరూపించారు. అనంతర కాలంలో పాలకురికి సోమన కృతులపై పరిశోధన సలిపిన వే.నరసింహారెడ్డి (చేతనావర్తకవి) కూడా తమ్మయ్యగారి అభిప్రాయాలనే నిర్ధారించాడంటే ఆయన సూక్ష్మ పరిశోధనా దృష్టి ద్యోతకమవుతుంది. ప్రఖ్యాత విమర్శకులైన కట్టమంచి రామలింగారెడ్డిగారు "Your great book 'Palkuriki Somanatha Kavi' is by far the best book on one of

our greatest poets" అని ఈ గ్రంథాన్ని ప్రశంసించారు. సికింద్రాబాదు శివధర్మగ్రంథమాల వారు తొలుత ప్రచురించిన ఈ గ్రంథం 1966 లో ద్వితీయ ముద్రణ పొంది విశ్వవిద్యాలయ స్థాయిలో ఉపయుక్త గ్రంథంగా గణనకెక్కింది.

వీరశైవ మత ప్రవర్తకుడైన బసవేశ్వరుని సిద్ధాంతాలకు పాల్కురికి సోమన భాష్యకారుడుగా ప్రసిద్ధి గడించినట్లుగానే సోమన సాహిత్యానికి వ్యాఖ్యాతగా బండారు తమ్మయ్య వినుతి కెక్కారు. వారి పరిశోధనా ప్రతిభను గుర్తించిన వావిళ్ళ వారు బసవపురాణం, అనుభవసారం కృతులను వారిచేత పరిష్కరింపజేసి (1954) ముద్రించారు. చతుర్వేదసారం, సోమన లఘుకృతులు కూడా ఆయన పరిష్కరణలో (1965) ముద్రితమైనాయి. వృషాధిప శతకానికి హృద్యమైన టీకను (1969) వెలువరించారు.

సోమనాథకవిపై ఎంత అభినివేశమో, శ్రీనాథకవిపై కూడా తమ్మయ్యగారికి అంతే అభిమానం. 'శ్రీనాథమహాకవి తరువాత నన్ను మిక్కిలిగా ఆకర్షించిన కవి పాలకురికి సోమనాథుడు' అని స్వీయ చరిత్ర (పుట. 50) లో పేర్కొన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి 'శృంగార శ్రీనాథము' (1923)లోని అభిప్రాయాలను విమర్శిస్తూ సారస్వత సర్వస్వంలో వ్యాసం (1924) వెలువరించిన తమ్మయ్యగారు తర్వాత రెడ్డి సంచికలో (1938) శ్రీనాథునిపై విపులమైన పరిశోధనా వ్యాసాన్ని ప్రచురించారు. ఈ వ్యాసాలే విస్తృత రూపాన్ని పొంది 'శ్రీనాథమహాకవి' గ్రంథంగా (1969) రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆర్థిక సహాయంతో ప్రకటితమైనాయి.

శ్రీనాథుని జీవిత విశేషములు, వైదుష్యము, రసజ్ఞత, మతము, శీలము, కవిత్వము, ఛందోవ్యాకరణ విశేషములు మున్నగు శీర్షికలతో కూడిన ఈ గ్రంథంలో సరసత్వము (వక్రత, ధ్వని) కవిసార్వభౌముని కవిత్వంలో ప్రధాన గుణం అని తమ్మయ్యగారు ఉగ్గడించారు. శ్రీనాథుని శివభక్తి తత్పరతను చాటిన ఈ గ్రంథం అతడు శృంగారి యను వాదం మళ్ళీ తలెత్తకుండా చేసిందని అందలి పీఠికలో నిడుదవోలు వెంకటరావుగారు పేర్కొన్నారు. "శ్రీనాథునిపై వెలువడిన సమగ్రగ్రంథం ఇది ఒకటియే" అని భారతి పత్రికా సమీక్ష (1968 డిసెంబర్) ప్రశంస నిది చూరగొన్నది. సోమనాథుని కృతుల వలెనే శ్రీనాథుని భీమేశ్వర పురాణం, క్రీడాభిరామం కూడా తమ్మయ్యగారి పరిష్కరణలో వావిళ్ళ ప్రచురణలుగా వెలువడ్డాయి.

బండారు తమ్మయ్యగారి విశిష్ట విమర్శ పంథకు మరొక నిదర్శనం 'వేమన చరిత్ర' (1970). రెడ్డిరాణి పత్రికలో ప్రచురితమైన (1932-34) వ్యాసాలే ఈ విస్తృత గ్రంథ రూపాన్నిదాల్చాయి. చరిత్రాంశములతో పాటు వేమన కవితా వైశిష్ట్యం కూడా ఇందులో వివేచితమైంది. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి పీఠికతో కూడిన ఈ గ్రంథంలో వేమన వీరశైవుడని తమ్మయ్యగారు ప్రతిపాదించారు.

సమకాలీన పత్రికలైన ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, కళ, సమదర్శిని, విభూతి, శ్రీశైలప్రభ మున్నగు వాటిలో వారు ఉత్తమ పరిశోధనాత్మక, విమర్శనాత్మక వ్యాసాలు పెక్కు ప్రచురించారు. వానిలో 21 వ్యాసాలు 'వ్యాసావళి' పేరుతో రెండు భాగాలుగా (1968, 69) ప్రకటితమైనాయి. "వీరి వ్యాసములు పరిశోధనమునకు పట్టుగొమ్మలు, పాండిత్యమునకు పాథోనిధులు, విజ్ఞానమునకు నిధులు" అని దివాకర్ల వెంకటావధాని గారు ఉగ్గడించారు.

తమ్మయ్యగారు 80వ యేట 1970 డిసెంబరు 15వ తేదీన శివైక్యం చెందారు. చివరి దశలో వారు రచించిన 'స్వీయ చరిత్ర' ను అభిమానులు (కాకినాడ శైవసేవాసమితి) 1972 లో వెలుగులోనికి తెచ్చారు. ఆయన జీవిత విశేషాలనూ, సాహిత్యకృషినీ తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తంగా ఉంది. తమ్మయ్యగారు తాను పరిష్కరించిన కావ్యాలకూ, ఇతర పరిశోధకుల రచనలకూ విశిష్టమైన పీఠికలు సమకూర్చారు. వానిలో తొమ్మిది పీఠికలను సంకలించి వారి శత జయంతిని పురస్కరించుకొని (బండారు తమ్మయ్య పీఠికలు - 1990) తెలుగు విశ్వవిద్యాలయం వారు ప్రకటించారు.

శైవ సాహిత్యాన్నే కాక, దానికి ఆధారమైన శైవమత వాఙ్మయాన్ని కూడా మథించి తమ రచనల ద్వారా శైవమత తత్త్వాన్ని సువిశదం కావించారు తమ్మయ్యగారు. వారణాసి జంగమమఠం ప్రచురణ అయిన 'శక్తి విశిష్టాద్వైతము' (కన్నడ నుంచి తెనుగుసేత) వీరశైవమత స్వరూపాన్ని విశదం చేస్తుంది. ఇంకా 'వీరశైవ దర్శనము' (1959), 'ఆంధ్ర వీరశైవ వివాహవిధి' అన్న గ్రంథాలు కూడా కన్నడం నుంచి తెనిగించారు. సంస్కృత మలయరాజస్తవము, శ్రీశైల మల్లికార్జునస్తవములను ఆంధ్రీకరించారు. బసవపురాణం,

పండితారాధ్య చరిత్ర, ప్రభులింగ లీలల ఆధారంగా 'మడివాలు మాచయ్య చరిత్రము' (1969) వెలువరించారు. ఈ విధంగా 'శైవ సారస్వత సిద్ధాంత సారవత్సంపదకు సార్వభౌమ పట్టము కట్టుకొన్న వారు తమ్మయ్యగారు' (దివాకర్ల వెంకటావధాని).

ఉద్యోగ విరమణ తర్వాత తమ్మయ్యగారు ఐదుసంవత్సరాలు కిర్లంపూడి ఎస్టేట్ మేనేజర్ (1946-51)గా ఉన్నారు. జమీందారీల రద్దుతో ఆ బాధ్యత కూడా తొలగి అప్పట్నుంచీ తమ విశ్రాంతజీవితాన్ని శైవసారస్వత సేవకే వినియోగించారు. తాను జీవించివున్నకాలంలోనే అనేక బిరుదులూ, సన్మానాలుపొందిన గౌరవం వారికి లభించింది. 1962 నుంచి ప్రభుత్వం చేత నెలకు ఏభై రూపాయల పండిత పారితోషికం పొందారు.

తమ్మయ్యగారు కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు కార్యవర్గ సభ్యులుగా ఉండి శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి తరువాత 1966లో దానికి అధ్యక్షులుగా నియమితులైనారు. పరిషత్తు ఆధ్వర్యంలోనే వారి షష్టిపూర్తి సన్మానసభ జరిగి (1956 మే) 'పండిత బండారు తమ్మయ్య షష్టిపూర్తి సన్మాన సంచిక' వెలువరించబడింది. ఆ తర్వాత కాకినాడ ఆంధ్ర కళాపరిషత్తు వారు 1960లో సప్తత్యుత్సవాన్ని నిర్వహించి 'సప్తతిసమ్మానోత్సవ సంచిక' ను ప్రకటించారు. 1965 సెప్టెంబరులో గుడివాడ తాలూకా పామర్రులో 75వ జన్మదినోత్సవాలు జరిగాయి.

ఆంధ్ర సాహిత్య పరిషత్తు చేత 'విమర్శకాగ్రేసర' బిరుదు పొందిన (1925-బాపట్ల) తమ్మయ్యగారు శ్రీశైలం వాగీశ పండితారాధ్య స్వాములవారిచే 'ఐతిహాసిక సమ్రాట్' బిరుదును (1952-గుంతకల్) కూడా అందుకొన్నారు. షష్టిపూర్తి సన్మాన సందర్భంలో వీరశైవ సమాజం వారు 'శివశరణ' బిరుదుతో (అనంతపురం), వారణాసి విశ్వేశ్వర శివాచార్యులు 'ధర్మభూషణ' (1951) బిరుదుతో సత్కరించారు. సప్తతిసన్మానోత్సవంలో ఆంధ్ర కళాపరిషత్తు వారు శైవసాహితీ సార్వభౌమ (1960) బిరుదునొసగి వారి పట్ల తమ గౌరవ భావాన్ని చాటుకొన్నారు. పాల్కురికి సోమనపై వారి పరిశోధనకు ప్రతిగా "సోమసాహిత్యాచార్య' బిరుదు (1969-బెంగుళూరు) లభించింది. వారి సాహితీ శేముషిని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వ గౌరవాన్ని (1968) కల్పించింది. ఆ సందర్భంలో ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు చేసిన 'విశిష్టసభ్య ప్రశంస' బండారు తమ్మయ్యగారి బహుముఖీన ప్రతిభకు నిలువెత్తు దర్పణం.

"వారు శివచరణ వరివస్యాపరాయణులైనను సత్త్వగుణ సంపన్నులు; విద్యావిజ్ఞాన విరాజమానులైనను వినయవారాన్నిధులు; వయోవృద్ధులైనను భాషావధూటి విలాస లాలసులు; కపటమెరుంగనివారు; కీర్తి కాంక్షలేనివారు".

బండారు తమ్మయ్యగారి రచనలు

1. రఘువంశ కథనము (1930)
2. పాలకురికి సోమనాథకవి (1948, 1966)
3. కుమార సంభవము (1965)
4. శ్రీనాథమహాకవి (1968)
5. వేమన చరిత్ర (1969)
6. మడివాలు మాచయ్య చరిత్రము (1969)
7. వ్యాసావళి - 1 భా. (1968)
8. వ్యాసావళి - 2 భా. (1969)
9. స్వీయచరిత్ర (1972)
10. బండారు తమ్మయ్య పీఠికలు (1990)

అనువాద రచనలు

11. శక్తి విశిష్టాద్వైతము
12. ఆంధ్ర వీరశైవ వివాహవిధి
13. వీర శైవ దర్శనము
14. ఆంధ్ర మలయరాజస్తవము
15. శ్రీశైల మల్లికార్జునస్తవము

పరిష్కృత గ్రంథాలు


1. బసవ పురాణం (1954) - వావిళ్ల
2. ప్రభులింగ లీల (పిడుపర్తి సోమనాథుడు) - 1963

3. అనుభవ సారము (వావిళ్ళ)
4. చతుర్వేదసారము (1965)
5. పాలకురికి సోమన లఘుకృతులు (1965)
6. వృషాధిపశతక టీక (1969)
7. భీమఖండము (వావిళ్ళ)
8. క్రీడాభిరామము (వావిళ్ళ)
9. చెన్నబసవపురాణము (అత్తలూరి పాపయామాత్యుడు)

(బసవకృప, ఫిబ్రవరి 2003)

5. కోరాద రామకృష్ణయ్య

(1891-1962)



20వ శతాబ్ది ప్రథమార్ధంలో తెలుగు పరిశోధనా రంగంలో గణనీయమైన పాత్ర వహించిన విమర్శక వతంసులు కోరాద రామకృష్ణయ్యగారు. ఆంధ్ర మహాభారతాన్ని చారిత్రక విమర్శనాపద్ధతి (Historical Method) లో పరిశీలించిన విమర్శకులలో వారు ప్రముఖులు. విశ్వవిద్యాలయ స్థాయిలో కవిత్రయ భారతం – ముఖ్యంగా తిక్కన భారతాన్ని తులనాత్మక అధ్యయనం (Comparative Study) తో వివేచించిన తొలి విమర్శకులు. ఈ మార్గంలో వారు వేసిన తొలి అడుగులే మలితరం వారికి జాడలుగా నిలిచాయి. వారు రచించిన విమర్శ గ్రంథాలు, వ్యాసాలే అందుకు ప్రత్యక్ష సాక్ష్యాలు.

1891 అక్టోబరు 2వ తేదీన విద్వద్వంశంలో జన్మించిన రామకృష్ణయ్యగారు మచిలీపట్నం నోబుల్ కాలేజీనుంచి 1915 లో బి.ఏ. పట్టం పొంది విజయనగరం మహారాజా కళాశాలలో సంస్కృతాంధ్ర పండితులుగా చేరారు. ఆ రోజుల్లోనే కూచిమంచి వెంకట సుబ్బారావుతో కలిసి రామకృష్ణయ్య రచించిన వ్యాసం వారి నూత్న విమర్శనా దృక్పథాన్ని పట్టియిస్తుంది. అది 1917 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో అచ్చయిన 'విమర్శనా పద్ధతులు' అన్న వ్యాసం. ఈ వ్యాసంలో మూడు విధాలైన విమర్శన పద్ధతులను వారు పేర్కొన్నారు. 1. చారిత్రక పద్ధతి, 2. కవిజీవితమును గూర్చిన విమర్శనము, 3. కవితా విమర్శనము-కవిత్వతత్త్వ విచారణ. ఆ తర్వాత వెలువడిన 'ఆంధ్ర భారత

కవితావిమర్శనము'లో కూడా రామకృష్ణయ్యగారు ఈ విమర్శన పద్ధతులను ప్రస్తావించారు. అయితే అందులో నాలుగు రకాలైన పద్ధతులుగా విభజించారు. 1. కవితా విశేషములు, 2. సాహిత్య పద్ధతి లేదా ఆలంకారిక పద్ధతి, 3.కవి జీవిత సమన్వయము, 4. యుగలక్షణ సమన్వయము. చివరి రెండు పద్ధతులను పాశ్చాత్య విమర్శన రీతులుగా పేర్కొని, ఆంధ్ర భారతాన్ని ఆ పద్ధతులలో పరిశీలించవలసిన అవసరం ఉందని భావించారు.

మద్రాసు విశ్వవిద్యాలయంలో దక్షిణదేశ భాషాశాఖలు ఏర్పడటంతో అప్పటి ఉపాధ్యక్షులైన రఘుపతి వెంకటరత్నం నాయుడు ప్రోద్బలంతో కోరాడవారు తెలుగు విభాగానికి ప్రథమాధ్యక్షులుగా నియమితులైనారు. 1927 నుంచి 1950 వరకు ఇరవైమూడు సంవత్సరాలు ఆ విభాగంలో రీడర్‌గా పనిచేశారు. నవంబర్ 1928లో వారొసగిన ఉపన్యాసాలు 'ఆంధ్రభారత కవితావిమర్శనము' పేరిట విస్తృత గ్రంథ రూపం దాల్చాయి. 1929 లో ఆంధ్రగ్రంథమాల పన్నెండవ ప్రచురణగా ఇది ప్రకటితమైంది. దేశకాల పరిస్థితులకు, వాఙ్మయానికి గల పరస్పర సంబంధాన్ని అన్వేషించి ఆయా యుగాలలోని కవితా రీతులను అనుశీలించాలన్నది రామకృష్ణయ్య గారి దృక్పథం. ఈ దృక్పథమే వారి గ్రంథానికి ఆదర్శంగా నిలచింది.

"ఆయా యుగములందు వాఙ్మయమున కప్పటి దేశకాల పరిస్థితులెట్లు తోడ్పడినవో, కవులకేయే కాలముల నేయే నూతనోద్బోధములు కలిగినవో, ఒక యుగమందలి కవిత తరువాతి యుగములందలి కవితలకెట్లు మార్గదర్శకంబైనదో పరిశీలించి కనుగొనిన గాని వాఙ్మయ చరిత్రను సంపూర్ణముగా దెలిసికొనిన వారము కాలేము."(పు. 12)

కవులను బట్టి, వాఙ్మయ పోషకులను బట్టి కాక వివిధ వాఙ్మయ శాఖల సక్రమ పరిణామ రీతిని బట్టి యుగ విభాగం చేయటం సమంజసంగా ఉంటుందని సాహిత్య చరిత్రను ఆయన ఆరుయుగాలుగా విభజించారు. 1. ప్రాఙ్నన్నపార్య యుగము, 2.పురాణ యుగము, 3.శ్రీనాథయుగము – లేదా – సంధియుగము, 4.ప్రబంధ యుగము, 5.దక్షిణ దేశ వాఙ్మయ యుగము, 6.ఆధునిక యుగము. తర్వాతి సాహిత్య చరిత్రకారులు చాలా వరకు ఈ విభాగాన్నే అనుసరించారు.

ఆంధ్రభారత కవితావిమర్శనం మొదటి ప్రకరణంలో ప్రాఙ్నన్నయ యుగంలోని దక్షిణ దేశ భాషా వాఙ్మయాల స్థితి సోదాహరణంగా వివరింపబడింది. మత పరిస్థితుల

ప్రభావాన్ని విశదీకరించిన రెండవ ప్రకరణం నన్నయ వైదిక దృష్టిని, తిక్కన కావ్య కళాదృష్టిని నిరూపించింది. అవతారికల ఆధారంగా కవుల వ్యక్తిత్వ పరిణామాల చిత్రణకు పూనుకోవటం సమకాలీన పరిశోధనా రంగంలో నూత్నాంశంగా గమనించదగింది. వైదిక మార్గానికి భక్తి మార్గాన్ని కూడ జోడించి అద్వైతానంద, కావ్య రసాంబుధులలో ఆంధ్రావళిని అలరించిన తిక్కన భారత రచనలో అద్వైతభావం, కళా సౌందర్యం చక్కని సమ్మేళనం చెందాయని రామకృష్ణయ్య ఉగ్గడించారు. ఎఱ్ఱన కవితా రచనలో నన్నయ, తిక్కనల కావ్యలక్షణాలు హృద్యంగా సమన్వయించాయని విపులీకరించారు.

కవిబ్రహ్మ కవితా నిర్మాణచాతుర్యం విశదీకరించే రెండు ప్రకరణాలు కోరాడ వారి విమర్శనా ప్రతిభకు నిదర్శనాలు. "ఒక కవియొక్క గొప్పతన మాతడు చేపట్టిన విషయము యొక్క గౌరవమును బట్టియేగాక, ఆ విషయమును – ఆ వస్తువును – దానెట్లుపయోగ పఱచికొనినాడు – ఎట్టి శిల్పచాతుర్యమును చూపినాడు – దానికే వన్నె చిన్నెలు పెట్టి ఎట్టి నూతన వస్తువు – నూతన సృష్టిగా జేసి చూపి తన ప్రతిభను మెఱయించినాడు – అను దానినిబట్టి యుండును. ఆ కార్యమునంతను ఆవరించియుండు నాతని యాత్మశక్తియె (Personality) తన్మహత్వమునకు గారణ మగుచుండును. అదియె మనము ముఖ్యముగ గమనింపదగిన విషయము." (పుట.6) అని వారు భావించారు.

ఈ గమనికతోనే విరాటపర్వం ఆంధ్రీకరణలోని ఔచిత్యం, నూత్నకల్పనలలోని వైశిష్ట్యం పరామృష్టమైనాయి. తెనుగుభారతాన్ని ప్రబంధమండలిగా పేర్కొన్న తిక్కన విరాటపర్వం ఒక ప్రత్యేక ప్రబంధం. అందలి వస్త్వైక్యం, వర్ణనలు, రసపోషణ, పాత్రపోషణ, నాటకరీతులు, అలంకార ప్రయోగాలు మున్నగు అంశాలు ఈ గ్రంథంలో సువ్యక్తమైనాయి. ఆంధ్ర భారతాన్ని మూలంతో సరిపోల్చి పరిశీలించే తులనాత్మక పద్ధతికి కూడ రామకృష్ణయ్యగారు రాచబాటవేశారు.

సారస్వత వ్యాసములు (1950), 'తిక్కన గారి విరాటపర్వం' వ్యాసం (ఆంధ్ర మహాభారతోపన్యాసములు. 1956) ఆంధ్ర భారత కవితా విమర్శనములోని అభిప్రాయాలకు విపులీకరణలు. 'కాళిదాసుని కళా ప్రతిభలు' ఆ మహాకవి నాటక కళా చాతుర్యం, పరిణామాలను వివరించే లఘు గ్రంథం. రామకృష్ణయ్యగారు మద్రాసు విశ్వవిద్యాలయం ద్వారా విష్ణుపురాణం, విష్ణుమాయా నాటకం, నవనాథ చరిత్ర, పరతత్త్వ

రసాయనం, వల్లభాభ్యుదయం, నన్నెచోడుని కుమారసంభవం మొ॥ గ్రంథాలకు సంపాదకత్వం వహించి, వానిని ప్రచురింపజేశారు. తర్వాత తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థలో పరిశోధకులుగా ఉన్న సందర్భంలో (1950-56) శ్రీనివాస విలాస సేవధి (ద్విపద), వేంకటాద్రి మాహాత్మ్యం (వచనం) మొదలగు శ్రీ వేంకటేశ్వరాంధ్ర సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలు వెలువరింపజేశారు.

భాషాశాస్త్ర రంగంలో రామకృష్ణయ్యగారి పరిశోధనాకృషి ఎంతో విలువైనది. అర్వాచీన పరిశోధకులకు మార్గదర్శకమైనది. విజయనగరం కళాశాలలో పనిచేస్తున్న రోజులలోనే భారతి మొదలగు పత్రికలలో "ద్రావిడభాషా పద చరిత్రము" మున్నగు వ్యాసాలు ఆయన వెలువరించారు. చారిత్రక పద్ధతిలో ఆంధ్రభాషా లక్షణాలను పరిశీలించి, సజాతీయ భాషలతో సమన్వయించడం, భాషాశాస్త్ర దృష్టితో వ్యాకరణాన్ని అధ్యయనం చేయడం రామకృష్ణయ్యగారు అవలంబించిన వినూత్న మార్గాలు. భాషోత్పత్తిని నిరూపించే సూత్రాలను వివరిస్తూ వారు తొలుత ప్రకటించిన "భాషోత్పత్తి క్రమము - భాషా చరిత్రము" (1935) భాషా శాస్త్ర విజ్ఞానానికి పీఠికాప్రాయమైన గ్రంథం.

ఆంధ్రభాషా సంధిసూత్రాల చారిత్రక పరిశీలనమైన 'సంధి' (1935) తెలుగు శబ్దాల రూపాన్ని నిరూపించే సంధి నియమాలను సోదర భాషలతో సరిపోల్చి సమన్వయించింది. సాంప్రదాయకమైన వ్యాకరణాన్ని ఆధునిక పద్ధతిలో విశ్లేషించారు కోరాడవారు. "దక్షిణదేశ భాషా సారస్వతములు-దేశి"(1949) గ్రంథంలో దేశి పదజాలాన్ని బట్టి దక్షిణదేశ భాషల విశేషలక్షణాలను, దాక్షిణాత్య సారస్వతంలోని ఛందస్సాహితీ రీతులను బట్టి దేశి వాఙ్మయ సంప్రదాయాలను విశదీకరించారు. భాషా విజ్ఞానానికి సంబంధించిన ఇతర వ్యాసాలు 'భాషా చారిత్రక వ్యాసములు' పేరుతో సంకలితమైనాయి.

తెలుగులోనే కాక ఆంగ్లంలోకూడా "Studies in Dravidian Philology" (1935) "Dravidian Cognates" (1944) మొదలగు గ్రంథాలు రామకృష్ణయ్యగారు వెలువరించారు. దక్షిణ ద్రావిడ భాషలలోని సమానార్థక పదాలను సేకరించి, వివరణ పూర్వకంగా ప్రకటించిన తొలి ప్రయత్నం Dravidian Cognates. తిరుపతి ప్రాచ్య పరిశోధనా సంస్థ పత్రికలో ధారావాహికంగా ప్రచురితమైన "Telugu Language in the first millenium A.D" శాసనాల ఆధారంగా తెలుగు భాషను చారిత్రక పరిశీలన

కావించింది. ఇవికాక ఆంగ్లంలో పెక్కు భాషాశాస్త్ర సంబంధమైన వ్యాసాలు వివిధ పరిశోధనా పత్రికలలో వెలువరించారు. అంతేకాక అనేక భాషాశాస్త్ర సదస్సులలో పాల్గొని అమూల్యమైన పరిశోధనా పత్రాలను సమర్పించారు.

ఆధునిక ప్రయోజనాల కనుగుణంగా భాషా ప్రణాళికను రూపొందించుకోవాలని, దానివలననే భాషా ప్రగతి సుసాధ్యమౌతుందని కోరాడవారు భావించారు. భాషలో మార్పు అనివార్యమని గుర్తించారు. అందుకే సౌష్ఠవమైన గ్రాంథిక భాషలో గ్రంథ రచన కావించిన రామకృష్ణయ్య గారు సందర్భానుగుణంగా సరళమైన తేట తెలుగులో రేడియో ప్రసంగాలు వినిపించారు. ఆంధ్ర మహాభారతం – విద్యావిధానం, ఆంధ్ర మహాభారతం – ఆశ్రమ జీవితం, జానపద క్రీడా కలాపములు, తోలుబొమ్మలాటలు, వారిధి చూపిన వసుధ, తాళపత్ర గ్రంథములు – దామెర్ల అంకభూపాలుని ఉషాపరిణయం మొదలైన రేడియో ప్రసంగాలే ఇందుకు నిదర్శనం.

గహనమైన విషయాలను కూడ సరళ సుందరంగా సుబోధకంగా వ్యక్తీకరించే నైపుణ్యం కోరాడవారికి అలవడిన సుగుణం. వారి సరళ భాషా శైలికి కింది వాక్యాలే తార్కాణం–

“ఈ రోజుల్లో తెల్లని కాగితాల మీద చక్కగా అచ్చువేసి, గట్టిగా బైండు చేసి, మన కందించబడుతుంటే పుస్తకాలను సుఖముగా కూర్చొని చదువుకుంటున్నాము. కాని, వెనుకటి రోజులలో – అనగా అచ్చురాక పూర్వము తాటాకుల మీద ఇనుప గంటాలతో వ్రాసి, ఆ ఆకులకు చిల్లులు పొడిచి వాని ద్వారా త్రాడు కూర్చి కట్టబడిన గ్రంథాన్ని కూడాను.....” **(తాళపత్ర గ్రంథములు – దామెర్ల అంకభూపాలుని ఉషాపరిణయం)**

ఇవికాక తెలుగు సంస్కృతికి సంబంధించిన “తాళిబొట్టు – మంగళసూత్రం”, “ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి” మొదలైన పరిశోధనా వ్యాసాలు వివిధ పత్రికలలో చెల్లా చెదురుగా గోచరిస్తాయి. నిశితమైన వివేచనకు, సూక్ష్మ పరిశీలనకు నిదర్శనమైన కోరాడవారి వ్యాసాలు వారి శతజయంతిని పురస్కరించుకొని సంపుటంగా వెలువడితే ఎంతో ఉపయోగకరం కాగలదు.

భాషాశాస్త్ర గ్రంథాలే కాక "Telugu Literature out side the Telugu Country" (1941) మొదలైన గ్రంథాలు, వ్యాసాలు రామకృష్ణయ్యగారి ఆంగ్లభాషా వైదుష్యానికి

గీటురాళ్ళు. పాశ్చాత్య విమర్శ రీతుల ప్రస్తావన, మిల్టన్, షేక్స్‌పియర్ మున్నగు ఆంగ్ల కవులపై విమర్శల ప్రసక్తి మొదలైన అంశాలు అలా వుంచి – "ఆంధ్రభారత కవితా విమర్శనం"లో తెలుగు పదాలకు సమానార్థకమైన ఆంగ్ల శబ్దాలను కుండలీకరణంలో పేర్కొనడం ప్రత్యేకంగా గమనించదగ్గది. ఇది ఆంగ్ల విమర్శ పరిభాషకు కృత్రిమమైన అనువాదంగా (Artificial Translation) నాటి హిందూ పత్రిక (18-6-1930) సమీక్షకుడు పేర్కొన్నప్పటికీ తన భావాన్ని స్పష్టం చేయడానికి ఆయన వాడిన పారిభాషిక పదజాలం ఆసక్తిదాయకమైనది. ఇందుకు కొన్ని ఉదాహరణలు:

అద్భుత సన్నివేశం	–	(Romantic Situation)
శిల్ప గోపనం	–	(Art lies in concealing art)
ఆత్మశక్తి	–	(Personality)
స్వాభావికత్వగుణం	–	(Realistic Touch)
గుణము	–	(Effect)
గుణవత్తరంగా	–	(Effectively)
భాషాశక్తి	–	(Force of Language)
మనోవృత్తుల గమన వైఖరి విశదీకరించుట	–	(Psychological Descriptions or Descriptions of Mental attitudes and Conflicts)
మనోవృత్తి ప్రకాశకమగు వర్ణన	–	(Revealing Mental attitudes)
కళాసౌందర్యము	–	(Artistic Beauty)
కావ్య కళాదృష్టి	–	(Artistic Point of view)
నాటక కళారీతి	–	(Dramatic element)
కథాకథన పద్ధతి	–	(Narrative Style)
పద్యరచనలో తూగు	–	(Balance)
సమాంతర రచనా రీతి	–	(Parallel Structure)
ఆవేశము	–	(Inspiration)
ఉద్దేశ కల్పనము	–	(Motive)
సాంకేతిక జీవితము	–	(Conventional Life)

నిష్పాక్షికమైన వివేచన, విస్పష్టమైన విశ్లేషణ, హేతుబద్ధమైన తార్కికత రామకృష్ణయ్యగారి విమర్శలోని విశిష్టత. భావి విమర్శకులకు మార్గదర్శకమైన సూత్రాలను నిర్దేశించటమే కాక నిర్దిష్టమైన రీతిలో కావ్యానుశీలన కావించిన సహృదయ శిఖామణి కోరాడవారు.

కోరాడ రామకృష్ణయ్యగారు 1962 మార్చి 28వ తేదీన దివంగతులైనారు. "ఆంధ్రభాషా వాఙ్మయముల చరితమును, వాని సక్రమపరిణామమును అన్వేషించి విమర్శించుటయే ప్రాచ్యపరిశోధనాలయమందలి యాంధ్రశాఖ చేయదగిన పనిగా నున్నది" (ఆం.భా.క.పీఠిక) అన్న రామకృష్ణయ్యగారి వాక్కులు భాషా సాహిత్య పరిశోధకులకు స్ఫూర్తిమంతం కావాలి.

(వాఙ్మయి, జనవరి – జూన్ 1992)

6. రాయప్రోలు సుబ్బారావు

(1892-1984)



తెలుగుభాష ముదుళ్ళు వెలార్చు వేడుకతో అభినవ స్వరకల్పన కుద్యమించి ఆధునిక కవితకు నాంది పలికిన రాయప్రోలు సుబ్బారావు (1892-1984) సారస్వత ప్రియులకు ఆ కవితాతత్త్వాన్ని విశదం చేయవలసిన అవసరాన్ని గుర్తించాడు.

పూర్వ లక్షణములు దిద్దు బుద్ధిలేదు
అతినవీనముల్ శాసించు సహము కాదు
నవ్య కావ్య దృష్టిని చూపినాడ నంతె
కలదుగాదె అనుక్తంబు గ్రథనమందు (రమ్యా)

నవ్యకావ్య దృష్టిని చూపటానికే రాయప్రోలు కలం నుంచి రమ్యాలోకం (1938) మాధురీ దర్శనం (1949) వెలువడ్డాయి. అవి పద్యరూపంలో వెలసిన ఆధునిక కవితా సూత్రాలు-నవ్యకవిత్వ మేనిఫెస్టోలు.

ఈ శతాబ్ది ఆరంభంలో తెలుగు కవిత కొత్త మలుపు తిరిగింది. కాల్పనిక వాదం ప్రభావంతో తలెత్తిన స్వేచ్ఛా ప్రియత, జాతీయ పునరుజ్జీవనంలో ప్రభవించిన దేశాభిమానం, సంఘసంస్కరణం నవకవులకు ఊపిరి పోశాయి. వస్తువరణంలో, భావాభివ్యక్తిలో, రచనా భంగిమలో, ప్రక్రియా స్వరూపంలో అనిదంపూర్వమైన నవ్యత గోచరించసాగింది. వస్తు చిత్రణకంటె, దానివల్ల పొందిన అనుభూతులకు ప్రాధాన్యం హెచ్చింది. ఓజోగుణ భూయిష్ఠమైన శైలి స్థానంలో సుకుమారమైన శయ్యా చోటు

చేసుకొంది. ఒక్కసారిగా వచ్చిపడిన ఈ పరిణామం ధాటికి సంప్రదాయ ప్రియులు తట్టుకోలేకపోయారు. ఆత్మాశ్రయమైన అనుభూతులు, నవీన పదబంధాలు, పలుకుబడులు వారికి రుచించలేదు. ఫలితంగా 'ఎంకిపాటలపై గాలి దుమారం' చెలరేగింది. అధిక్షేపాత్మకమైన 'శుక్లపక్షం' పొడసూపింది. 'నేటి కాలపు కవిత'కు వక్రభాష్యం వెలసింది.

ఈ నేపథ్యంలో ఆధునిక కవితకు తాత్త్విక భూమిక స్థాపన అవసరమైంది. రమ్యాలోక, మాధురీ దర్శనాలు ఆ ప్రయోజనాన్ని నెరవేర్చాయి. రమ్యాలోకం పేరు వినగానే ధ్వన్యాలోకం గుర్తుకు రాకమానదు. అభినవ కవితలోని రసరూపాన్ని రమ్యంగా ఆలోకించి రాయప్రోలు సహృదయులకు ఆనందవర్ధనుడే అయినాడు.

కావ్యసౌందర్య దర్శనం కావించిన రమ్యాలోకంలో అనుక్తమైనవి మాధురీ దర్శనంలో ప్రసక్తమైనాయి. మొదటి గ్రంథానికి రెండవది పూరకం. ఒక విధంగా ఇవి బాల, ప్రౌఢ వ్యాకరణాల వంటివి. సూత్ర ఫక్కీలో విరచితమైన ఈ రెండు కృతులూ వ్యాఖ్యాన సాపేక్షాలు. రమ్యాలోకం పన్నెండు భాగాలు 158 గీత పద్యాలలో కొనసాగగా, పదకొండు దళాలుగా విభక్తమైన మాధురీ దర్శనం 102 కందపద్యాలలో కూర్చబడింది. తొలి ముద్రణలో 'సఖా' అన్న మకుటంతో రచితమైన మాధురీ దర్శనంలోని కందాలు మలిముద్రణలో 'సుధీ' అన్న మకుటంతో గోచరిస్తాయి. చెళ్ళపిళ్ల వెంకటశాస్త్రి గారికి ఆస్థాన మహాకవి బిరుద ప్రదాన సభలో (1950) సుబ్బారావు వారికి ఈ కృతి సమర్పణ కావించారు.

రమ్యాలోకంలో రస - రామణీయకాలను వివేచించిన రాయప్రోలు మాధురీ దర్శనంలో శృంగార - మాధుర్య స్వరూపాలను సమాలోచించారు. ఇవి రసభావాలకు, రచనాభంగిమకు పర్యాయపదాలుగా ప్రస్తావితమైనాయి. ఈ రెండు అవినాభావ సంబంధమైనవి. వధూవరులవలె అవిభాజ్యమైనవి.

విగళిత ముఖమై శబ్దము
తగిలెడి అర్థమును వధువు ధవుని విధమునన్
జగదఖిల బాహిరాంతర
సుగతులుగాన్ తన్మనోజ్ఞ సుఖనృతులు సుధీ.

శబ్దం బాహిరమైన రచనకూ, అర్థం ఆంతరంగికమైన రసానికి సూచకాలు. అవి బాహిరాంతర సుగతులు. ఈ బంధాన్నే

పాలలో వెన్న లీలమై గ్రాలు లీల
శబ్దమందు అర్థంబును చక్క నెసగు
ఒకటి యాస్వాదనీయమై యుత్సవించు
ఒకటి హృదయంగమంబుగా నుపకరించు (రమ్యా).

అని ఉగ్గడించారు. ఆయన దృష్టిలో అంతఃకరణ రంజకమైన రసానికి ఆకర్షరమ్యమైన రచనకూ ఉన్న సంబంధం అంత గాఢమైనది.

రమణీయార్థ తరంగిత
కమనీయంబైన కావ్య కంఠధ్వనిలో
సుమమున మకరందము వలె
భ్రమించు రసము హృదయానురక్తముగ సుధీ !

పూలలో తేనెవాకవలె కమనీయమైన కావ్యంలో రమణీయార్థ పూరితమైన రసం తరంగితమై సహృదయులను రంజింపజేస్తుంది. అట్టి రసమే అభినవకవితకు ప్రాణం. నవనవలాడెడి నుడులతో నవకవులు దానిని సవరించారు.

కవితకు రసమసువులు, తత్
కవనము భావ ప్రఫుల్ల కమనీయముగా
నవనవలాడెడి నుడువుల
సవరింత్రు కవులు సుహృత్ ప్రసన్నగతి సుధీ!

సుకుమారాస్వాదనము, ఆనందావరణము, ప్రేయస్సంవరణము నవ్య కవిత్వ గుణాలుగా సంభావించారు రాయప్రోలు. అవి వరుసగా కావ్య భాషకు, రసానికి, ప్రేమకు లక్షకాలు. ప్రియంగా హితంగా అనుద్వేగంగా ప్రేమాధ్యయన సూత్రాన్ని భావకవులు ప్రతిపాదించారు.

ప్రియమును హితము ననుద్వే
గయుతమునగు వాక్యము అధిగత కవి కంఠం
బయి మానవులకు ప్రేమా
ధ్యయన ప్రతిపాద్య సూత్రమయి నిల్చె సుధీ !

ఈ ప్రేమాధ్యయన సూత్రమే అమలిన శృంగార తత్వంగా ప్రశస్తి గడించింది. సుబ్బారావుగారి కావ్యాలలో ప్రతిపాదితమైన ప్రేమతత్త్వమే ఆయన లక్షణగ్రంథాల్లో శృంగారంగా అభివ్యక్తమైంది. అయితే అది ప్రాచీన కవులు భావించిన సంభోగ శృంగారం కాదు. ఆధునిక కవులు ఆదరించిన వియోగ శృంగారం. స్నేహ వాత్సల్యాదుల సంగ్రహ రూపం. కాని సంభోగ శృంగారాన్ని ఆయన నిరసించలేదు. అది దంపతీ నిష్ఠమైనపుడే సుష్టురసంగా మనగలుగుతుందని ఆయన తాత్పర్యం.

రతి చిత్పదార్థ మది పు
ష్పితమయి స్త్రీ పుంసయోగ చిరశిక్షాస్నే
హితమై సుమానుష భవ
క్రతు కల్యాణంబున కగు రమ్యముగ సుధీ !

సృష్టికి ఆలంబనమైన దాంపత్య సంబంధాన్ని భవభూతి మహాకవి పవిత్రమైన సుమానుషమైన క్రతువుగా ఉగ్గడించాడు. 'లవియింపకుమి ప్రజాతంతువు' అనే శ్రుతి వాక్యం మిథునబంధ సవనోత్సవం ద్వారానే పాలింపబడుతుందని సుబ్బారావుగారు పేర్కొనటంలో దాంపత్య బంధం వ్యక్తిగతమైనదిగా గాక సామాజిక బాధ్యతగా భావింపబడింది. అందువల్లనే నవ్యకవులు ఊహాప్రేయసులను సృష్టించినా కులపాలికలను ప్రేమించినా వత్సలామృత రుచులనె వలచినారు కాని మోహమధువును గవేషించలేదు. స్త్రీని ప్రేయసిగా గృహలక్ష్మిగా సౌందర్యాధిదేవతగా జగన్మాతగా ఆరాధించారు.

స్త్రీ పుంసయోగాన్ని గురించి, నరనారీ సంబంధాన్ని గురించి సుబ్బారావుగారు మాధురీ దర్శనంలో విపులంగా చర్చించారు. స్త్రీ పుంసయోగసిద్ధి కలాపమైన జగత్తును మంగళాలంబ సముద్దీపితం చేయటానికి నవకవులు మాధుర్యోపాసకులైనారని వచించారు. ఈ మాధుర్యోపాసనకు మార్గదర్శకులై నరనారీ సంబంధానికి నూతన లక్ష్యాన్ని నిర్దేశించారు.

నరనారీ సంబంధము
పరిభావింపుము దిశావిభాగము వరుసన్
ధర జననీ భగినీ సహ
చరీ కుమారీ క్రమము నిజంబగుట సుధీ!

మానవీయమైన సంబంధాలను భార్యాభర్తృ సంబంధంగా - మాతాపుత్ర సంబంధంగా- సోదరీ సోదర సంబంధంగా - కుమారీ జనక సంబంధంగా భిన్నరూపాలలో ఆయన దర్శించారు. దీనినే 'తృణకంకణం' కావ్యనాయిక

పరమ ధర్మార్థమైన దాంపత్య భక్తి
స్తన్య మోహనమైన వాత్సల్య రక్తి
సాక్షి మాత్ర సుందరమైన సఖ్యసక్తి
పొందు నాదిమమగు ప్రేమయందె ముక్తి.

అని ఉగ్గడిస్తుంది. పూర్వ కవులు విప్రలంభ సంభోగములు విస్తరించి శృంగార శాఖలైన స్నేహ వత్సలాదులను సంగ్రహించారనీ, అవి కూడా రసస్థాయులే అనీ రమ్యాలోకం వచిస్తున్నది. ఇవన్నీ మౌలికమైన ప్రేమలోనే లీనమవుతాయని రాయప్రోలు తాత్పర్యం.

ఈ విధంగా రాయప్రోలు సుబ్బారావు మానవీయమైన సంబంధాల ఆధారంగా ప్రతిపాదించిన ప్రేమతత్వం సామాజిక దృక్పథాన్ని సమకూర్చుకొని అమలిన శృంగార సిద్ధాంతంగా రూపొందింది.

ఇక్కడ ఒక విషయాన్ని విశదం చేయటం అవసరం. అమలిన శృంగారం అన్నపదబంధం రాయప్రోలు ప్రోక్తం కాదు. కురుగంటి సీతారామయ్య ప్రభృతులు చేసిన ఈ నామకరణం సుబ్బారావు స్వీకరించటంతో వ్యవహారంలో రూఢి అయింది. నిజానికి 'అమలిన శృంగారం' అన్నది 'ప్రబంధ' శబ్ద వ్యవహారం వంటిదే. ప్రబంధం అంటే కావ్య సామాన్యం అన్న ప్రసిద్ధార్థం ఉన్నప్పటికీ - 16వ శతాబ్దంలో శ్రీకృష్ణ దేవరాయల కాలంలో వెలసిన వర్ణనాత్మక కావ్య రూపమే 'ప్రబంధం'గా సాహిత్య చరిత్రలో రూఢికెక్కింది. 'శృంగార' శబ్దం కూడ రాయప్రోలు సుబ్బారావు కాలంలో సామాజిక అవసరంగా విలక్షణమైన అర్థాన్ని సంతరించుకొని 'అమలిన' విశేషణాన్ని జోడించుకొన్నది.

ఈ నేపథ్యాన్ని గమనించకపోవటం వల్లనే అమలిన శృంగార సిద్ధాంతం అనేక రాద్ధాంతాలకు దారితీసింది. పర - స్త్రీ పురుషుల మధ్య కలిగే ఆకర్షణ భావం సురతస్పర్శతో కూడిన శృంగారంగా కాకుండా నిర్మలమైన స్నేహభావంగా పర్యవసించినప్పుడే సామాజిక

సుస్థితి ఏర్పడుతుందన్నది ఆ సిద్ధాంత సారాంశం. పూర్వకాలంలో వచ్చిన వర్తమాన యుగంలో సామాజిక స్పృహ నుంచి ఉత్పన్నమైన ఆచరణ యోగ్యమైన ఆదర్శ దర్శనమే అమలిన శృంగార సిద్ధాంతం.

ప్రేమసూక్త మహోపాసనా మయులగు
నవ్యుల కుపాధియయ్యె సౌందర్యమొకటె

అంటూ రసాన్ని సౌందర్యంగానూ, సౌందర్యాన్ని శృంగారంగానూ, వాటిని ఆనంద పర్యవసాయులుగానూ సంభావించి ఆ మూడింటికి అభేదాన్ని పాటించారు సుబ్బారావుగారు.

అంగాంగ విలక్షణ రుచి
సంగత తను సౌష్టవంబు సౌందర్యమగున్
శృంగార మాయె కృతుల అ
నంగ వ్యంజక కలామయ స్ఫాతి సుధీ !

అంటూ సౌందర్య శృంగారాలను అభిన్నంగా పేర్కొన్నారు.

కరుణ శృంగారాలు రెండే నిజ రసవిపాక భోగం అందిస్తాయని రమ్యాలోకంలో రచించిన రాయప్రోలు క్రొత్తగా 'నిజరస' ప్రతిపాదన చేశారు. దీన్నే ఆయన 'ఋతురసం'గా కూడా పేర్కొన్నారు.

కరుణ శృంగారములు రెండే ఋతరస ప్రతిపత్తి నందెడి (మిశ్రమంజరి)

అయితే విషయ విశ్రాంతిమయమైన శాంతమే సాహితీరస పర్యవసాయి అని పై రెండు రసాలను శాంతంలో సమీకరింపజేశారు. మాధురీదర్శనం ఈ అభిప్రాయాన్నే చాటుతుంది.

జగమంతయు సౌందర్య
స్థగితము శివమయము తత్ప్రసాధన రేఖా
నిగరణ రచనా వ్యంజన
నగు ఆనందంబు శాంతియగు నవల సుధీ.

సౌందర్య ఉపాధిగా కలుగుతున్న ఆనందం (శృంగారం) శాంతం అవుతున్నది. శృంగార రసపరిధి నుంచి వీర, హాస్య, అద్భుతరసాలు – కరుణ రస పరిధినుంచి రౌద్ర, భయానక, బీభత్స రసాలు ఉత్పన్నమవుతాయన్నది లాక్షణికాభిప్రాయం. ఇవన్నీ ప్రవృత్తి రసాలు. నివృత్తి రసమైన శాంతంలో అవి పర్యవసిస్తున్నాయి. కాగా రాయప్రోలు భావనలో నిజరసం (ఋతురసం) శాంతమే అన్నది సుస్పష్టం. మిగిలిన ప్రవృత్తి రసాలు నిజరస భోగాన్ని అందించేవివే లేదా – ఋతురస ప్రతిపత్తి నందే కాని సాక్షాత్తు నిజరసాలు కావు. 'తృణకంకణా' ది కృతులు రాయప్రోలు రసవివేచనకు లక్ష్యభూతంగా నిలుస్తాయి. వినూత్న రసమార్గంలో సాగినా సుబ్బారావుగారు అభినవగుప్తుని శాంత రస సమీకరణ లక్ష్యం వైపు పయనించారు. భారతీయ లాక్షణికాభిప్రాయాలను, సంస్కృతాంధ్ర కవుల సూక్తులను తన లక్షణ గ్రంథాలలో ప్రస్తావించిన ఈ అభినవ కవి వాటిని నవ్య దృష్టితో సమీక్షించిన నూత్న భాష్యకారుడు.

భాష కంటె నవ్యులకు తపస్సు లేదు అని భావించిన రాయప్రోలు సౌందర్యరూపమైన రసానందానుభూతికి సాధనం 'భంగిమ' అని – అది 'మృదుపదబంధ సరణి' అని సుమకోమలమైన భావకవితా శైలిని నిర్వచించారు. మాధురీ దర్శనంలో 'అఖిల సహృదయ లీలాశయ లాలనా లలిత భంగిమ' ను పేర్కొన్నారు. ప్రకృతి ముఖంలో 'లలితావలోకన స్నేహజ లీలావ్యతికలితమైన దివ్యాంశ'ను దర్శించిన ఈ నవకవితా లాక్షణికుడు కావ్య కళను నిత్య సుందర లలితాలంబనమూ, అనంత లావణ్య సముజ్జ్వలమూ అయిన హస్తాభినయ విలసనంగా సంభావించాడు. సుబ్బారావు మొదటి కావ్యం 'లలిత'. ఆయన నివాసం 'లలితాకుటీరం' అన్న అంశాలు ఇక్కడ స్మరణీయం.

మానసిక, శారీరక శుద్ధి (Purgation) కావించే కరుణ, శృంగార రసాలు మాధురీ భావ విలసితాలు. వాగభీప్సితమైన మధురపథం, అనశ్వరభావనా నిరతి సుకవులకు అనుసరణీయాలు.

> **"మనసున మొలకెత్తిన మె**
> **త్తని తీపులు మిగుల సున్నితము లయ్యావి ప**
> **చ్చని పదముల పొదిగిల్లన్**
> **తనికెడి ముచ్చట్లు........"**

సంవృతములైన మాధురీ దర్శనం రాయప్రోలు లాక్షణిక హృదయానికి నిదర్శనం.

(కాకతీయ విశ్వవిద్యాలయం సదస్సు)

7. దువ్వూరి రామిరెడ్డి

(1895-1947)



వనకుమారి, కృషీవలుడు, పానశాల మున్నగు కృతులు రచించి, కవికోకిలగా లబ్ధప్రతిష్ఠులైన దువ్వూరి రామిరెడ్డి సారస్వత వ్యాసములు కూడ వెలువరించి విమర్శరంగంలో స్థానం సంపాదించుకొన్నారు. సమకాలీన పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాలు, స్వీయకావ్యాలకు కూర్చిన తొలిపలుకులు, రేడియోప్రసంగాలు, డైరీలు, లేఖలు మొ॥నవి ఆయన విమర్శహృదయాన్ని సువ్యక్తం చేస్తాయి.

మద్రాసు నుంచి పి.వి.రాజమన్నారు నడుపుతుండిన 'కళ' పత్రికలో 1922-23 ప్రాంతంలో కవిత్వతత్త్వ నిరూపణకు సంబంధించిన తొమ్మిది వ్యాసాలు వరుసగా వెలువరించారు రామిరెడ్డి. ఇవి కావ్య సౌందర్యం గురించిన ఆయన దృక్పథాన్ని చాటుతాయి.

"కళలయందు రస రామణీయకములె ప్రధానములు". "కావ్యమునందు రామణీయకము ముఖ్యము. తక్కిన గుణములు అందుకు పోషకములుగ నుండవలయును రామణీయకమనునది ప్రతిభావంతుడైన కవియొక్క రచనా నైపుణ్యమునకు సంబంధించినది" అని భరతుడు పేర్కొన్న రసానికి జగన్నాథపండితరాయలు వచించిన రామణీయకతను జోడించి 'రసరామణీయకము'లన్న సమన్వయాన్ని ప్రతిపాదించారు. ఆంగ్లకాల్పనిక కవులైన షెల్లి, కీట్సుల సౌందర్యవాదం కూడా దీనికి దోహదం చేసింది.

"కీట్సు సౌందర్యమును పోషించిన కవి. షెల్లీ ఇంద్రియాతీతములైన ఆధ్యాత్మిక విషయములను గానము చేసిన తపసి" అని కీర్తించిన దువ్వూరి "Poetry is the rythmic creation of beauty" అని పేర్కొన్న 'ఎడ్గార్ ఆలన్‌పో'ను అమెరికా దేశపు పండితరాయలుగా ఉగ్గడించారు.

"పండితరాయలు రసమునందు రామణీయకమున్నదని నుడివియున్నారు. అంతకన్న రమణీయభావము నందు రసమున్నదని చెప్పుట సమంజసముగనుండును" అని భావాన్ని (రసాన్ని), సౌందర్యాన్ని అవిభాజ్యంగా భావించిన రామిరెడ్డి కవిత్వ వివేచనలో సౌందర్యవాదానికి పట్టం కట్టారు. "కావ్యాత్మ ఇంద్రియగోచరమును అనుభవసాక్షికము నగు సౌందర్య స్ఫురణము" అన్నది ఆయనకు గల స్పష్టమైన అభిప్రాయం. కేవల భావ ప్రకటనం కవిత్వం కాదు. ఇది సత్య సౌందర్యములతో మిళితమైనప్పుడే శ్రేయోదాయకం అవుతుందని ఆయన భావించారు. "Beauty is truth, truth beauty" అన్న షెల్లీవాక్కులు దీన్ని బలపరుస్తున్నాయి.

ఈ దృక్పథంతోనే ఆస్కార్‌వైల్డ్ ప్రభృతులు నెలకొల్పిన 'కళ కళ కొరకే' (Art for art sake) అన్న వాదాన్ని ఖండిస్తూ కవిత్వంలో నీతి ప్రాధాన్యాన్ని వక్కాణించారు రామిరెడ్డి. కవిత్వతత్త్వం, కావ్య ప్రయోజనం, కావ్యజీవితం మున్నగు కవిత్వ సంబంధి అంశాల పరామర్శలో భారతీయ–పాశ్చాత్య లాక్షణిక మతాలను పరిశీలించి సమన్వయాన్ని ప్రతిపాదించారు. కాని ప్రాచ్య–పాశ్చాత్య మార్గాల మధ్యవున్న వైరుధ్యాలను కూడా స్పష్టంగా వివేచించి, భారతీయ సిద్ధాంతములపై తనకు గల ప్రత్యయాన్ని నిర్ద్వంద్వంగా చాటిచెప్పారు.

"ప్రాచ్య పాశ్చాత్య శిక్షణమార్గములందు పరస్పర వైరుధ్యము గోచరించుచున్నది. ఒకరికి శాంతియు నిరాడంబరమైన జీవనము ప్రధానము. మరియొకరికి తృష్ణ, చిత్తసంక్షోభము, ఆటోపము ముఖ్యము. నేతిచే తడుపబడిన అగ్నిహోత్రమువలె భోగములనుభవింపబడుకొలది వృద్ధి చెందుచుండుననియు, కావున భోగముల నియతముగ గ్రహింపవలయుననియు నొకరి మతము. భోగముల వీలైనంతవరకు వృద్ధి పొందించి వానిననుభవింపనిదే నాగరికత గాదని మరియొకరి అభిప్రాయము. ప్రాచ్యులకు జీవితము పరమార్థమును సాధించుటకై ఏర్పడిన యొక ఉపకరణము. పాశ్చాత్యులకు

జీవితమే ఒక పరమార్థము. కావున యిట్టి మార్గభేదములు రెండు ఖండముల యొక్క లలితకళలయందు నస్థిగతముగ నంకితమైయున్నవి" అంటూ భారతీయ కళ కొన్ని శిల్ప సమయములకు కట్టుబడివుంటుందని కవికోకిల ఉగ్గడించారు.

కట్టమంచివలెనే సమాజసాహిత్యాల పరస్పర సంబంధాన్ని వివేచించారు రామిరెడ్డి. కవుల కావ్యాల్లో సమకాలీన సాంఘిక పరిస్థితులు, జాతి అభ్యుదయ పరిణామాలు ప్రతిఫలించటం అనివార్యం. అందుచేతనే సాహిత్యాన్ని సమాజ ఉచ్చనీచ స్థితులను తెలియజేసే 'భారమితి'గా పేర్కొన్నారు. కాని భారతీయ సంస్కృతికి ప్రతిరూపాలైన భారత రామాయణాలను నిరసించిన రామలింగారెడ్డితో ఆయన విభేదించారు. "సంస్కృత భారతము వెర్రి వెర్రి వేదాంతములు, ధర్మాధర్మములు మొ॥ అసంబద్ధ చర్చలతో, భగవద్గీతాది అసంగత ప్రకరణములతో నిండియున్నద"ని కట్టమంచి అభిప్రాయం. దీనికి పూర్తిగా విభిన్నంగా "రామాయణ మహాభారతములు లేకుండిన హైందవ సంఘమేమైయుండునో! హిమవత్పర్వతము మొదలు కన్యాకుమారి వరకు గల యీ విశాల భారతదేశమున నీరెండు జాతీయ కావ్యములను చదువని, వినని హైందవుడుండునా?" అంటూ ఈ జాతీయ కావ్యాలు నవంనవములు, చిరంజీవములు అని దువ్వూరి ఉగ్గడించారు.

అయితే నవ్యవకవిత్వానికి కట్టమంచి అందించిన ప్రోత్సాహాన్ని ప్రశంసిస్తూ అభినవ కవితానావకు కర్ణధారిగా నిలచిన కట్టమంచి విమర్శగ్రంథం (కవిత్వతత్త్వ విచారము) నవీన కవితోద్యమానికి మార్గదర్శకమైందని కొనియాడారు. ఆధునిక కవిత్వాన్ని, కవులను ఆక్షేపిస్తూ పోలవరపు రామబ్రహ్మం "ప్రజామిత్ర", "సుబోధిని" పత్రికల్లో వ్రాసిన వ్యాసాలకు సమాధానంగా దువ్వూరి రామిరెడ్డి 'ఉదయిని' పత్రికలో 'అభినవాంధ్రకవిత్వము' అన్న వ్యాసం వెలువరించారు. అభినవకవితోద్యమ ఫలితముగ కొంత పునరుద్ధరణము కొంత నూతన సృష్టి కొనసాగింది. ఒక నూత్న సంప్రదాయము కరుడుగట్టు ప్రథమ దశయందు కొన్ని దోషములు పొడసూపవచ్చునని వచిస్తూనే రామబ్రహ్మం చూపిన దోషాలు కాలానుగుణమైన మార్పులు మాత్రమే అని సమర్థించారు.

నవ్యకవిత్వాన్ని ఇంతగా అభిమానించిన దువ్వూరి ఛందోరహితమైన వచన కవితను వ్యతిరేకించటం గమనించదగింది. "లయ యొక్క శ్రుతి సుభగత్వమే ఛందస్సు. ఛందస్సు


లేని పద్యము విన్నప్పుడు ఉప్పులేని చప్పిడికూరతో అన్నము తిన్నటులుండును" అంటూ పఠాభి 'ఫిడేల్ రాగాల డజన్' కు శ్రీశ్రీ కూర్చిన 'ఇంట్రో' లోని అభిప్రాయాలను ఖండించారు. "యథార్థమైన కవిత్వమునకు అనివార్యముగా ఛందస్సు అనుగతమౌను" అని భావించి నవత్వం పేరిట అవయవ విచ్ఛేదం చేసి లయాశక్తిని అణగద్రొక్కటం భావ్యం కాదని పేర్కొన్నారు.

నాటకకళకు సంబంధించిన వ్యాసాలలో సమకాలీన నాటకాలపై నాటకరంగంపై దువ్వూరి విమర్శాభిప్రాయాలు ద్యోతకమవుతాయి. కవి, నాటక, ప్రేక్షకుల సహకారం చేతనే నాటకశిల్పం సంస్కరింపబడుతుందని ఆయన భావించారు. ఇంకా తిక్కన, పెద్దనలపై వ్యాసాలు-పానశాల, ఖండకావ్యములకు రచించిన ఉపోద్ఘాతాలు కవికోకిల హృద్యమైన విమర్శకు గీటురాళ్ళు. "సారస్వత ప్రపంచమున పలుకుబడి కలవారు ఒకప్పుడు పొరపడుదురేని ఆ పొరపాటు తత్త్వదర్శనమునకును, సారస్వత పురోభివృద్ధికి ఆటంకముగ ఏర్పడవచ్చునను భయముతో" వ్యాసములు విరచించిన దువ్వూరి రామిరెడ్డి సాహిత్య విమర్శ రంగంలో కూడ స్థానం సంపాదించుకొన్నాడు.

(సాహితీ కౌముది, జనవరి 2005)

8. సురవరం ప్రతాపరెడ్డి
(1896-1953)

"అతడు నీహారాచలమంత ఎత్తువాడు
ఈ నాడీ బ్రహ్మాండములోన కానరాడు" *(దాశరథి)*



ప్రథమాంధ్ర సాంఘిక చరిత్ర నిర్మాతగా, చరిత్ర లోతులను ముట్టిన పరిశోధకాగ్రణిగా, సృజనాత్మకశీలియైన రచయితగా, నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించిన పోరాట యోధుడుగా, తెలంగాణా సాహిత్య సాంస్కృతిక చైతన్య వైతాళికుడుగా యావదాంధ్ర దేశంలో చిరయశస్సు గడించిన మహాపురుషుడు సురవరం ప్రతాపరెడ్డి.

పాలమూరు జిల్లా అలంపూరు తాలుకాలోని 'నీళ్ళులేని' ఇటికాలపాడు వాస్తవ్యుడైన ప్రతాపరెడ్డి గారు కర్నూలు హైస్కూలు విద్యార్థిగా ఉన్న తరుణంలో వెల్లాల శంకర శాస్త్రి (సదాశివశాస్త్రి అన్న కుమారుడు) వద్ద సంస్కృతం అభ్యసించారు. ఉపనిషత్తులు - తర్క - వ్యాకరణ శాస్త్రాలను ఆకళించుకొన్నారు. హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఏ. చదివారు. అప్పుడే వేదం వేంకటరాయశాస్త్రి పరిచయం కలిగింది. పినతండ్రి బలవంతంపై తిరువనంతపురం నుండి లా డిగ్రీ పొందారు. హైదరాబాద్‌లో న్యాయవాది వృత్తిని చేబట్టినా ఆయన ప్రవృత్తికి సరిపడక వదిలిపెట్టారు. నెలకు 800 రూ॥ల ఆదాయం ఉన్న ఆ వృత్తిని కాదని తనకు అభిమాన పాత్రమైన పత్రికా సంపాదకులుగా స్థిరపడ్డారు. 1926లో గోలకొండ పత్రికను ప్రారంభించి ఇరవై రెండు సంవత్సరాలు (1947 వరకు) దానికే

అంకితమైనారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఫారసీ, సంస్కృతం, ఆంగ్ల భాషల్లో నిష్ణాతులైన సురవరం జీవిత ప్రస్థానం కవిగా, పరిశోధకుడుగా, పత్రికా సంపాదకుడుగా, వివిధ సంస్థా నిర్వాహకుడుగా బహుముఖీన ప్రజ్ఞా పాటవంతో సాగింది. పద్యాలు, ఖండకావ్యాలు, కథలు, నాటకాలు మున్నగు ప్రక్రియా వైవిధ్యంతో కూడిన ప్రతాపరెడ్డి సాహిత్య రచనలు ఆయన సృజనాత్మక భావుకతకు గీటురాళ్లు.

వివేచనాత్మకమైన పరిశోధనా సాహిత్యం సురవరం వారికి అఖండ ఖ్యాతిని ఆర్జించింది. 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' ఆయన పరిశోధనా శేముషికి నిలువెత్తు నిదర్శనం. "ప్రభువెక్కిన పల్లకి కాదోయ్, అది మోసిన బోయీ లెవ్వరు?" అంటూ రాజవంశాల ప్రశంసలకే పరిమితమైన దేశ చరిత్రను సామాన్య జన జీవితం వైపు మరల్చి ప్రప్రథమంగా ఆంధ్రుల సాంఘిక చరిత్రను అందించారు. అందుచేతనే భారత ప్రభుత్వం తెలుగు సాహిత్యానికి ఒసగిన బహుమతుల్లో తొలి తాంబూలం అందుకొన్నది ఈ గ్రంథం. సాంఘిక చరిత్ర ప్రక్రియకు బీజాలు ఆయనలో 1929 నుంచే గోచరిస్తాయి. సుజాత పత్రికలో (మే 1929) 'తెనాలి రామకృష్ణుని కాలమునందలి ఆంధ్రుల సాంఘిక జీవనము' అన్న వ్యాసాన్ని ప్రచురించారు. తర్వాత కూడా కాకతీయులు, రెడ్డి రాజులు, కృష్ణదేవరాయలు, కదిరీపతి కాలం నాటి సాంఘిక పరిస్థితులను చిత్రించిన వ్యాసాలు వెలువరించారు. వీటికి లభించిన ఆదరణ ప్రోత్సాహాల మూలంగా 1949 లో ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' వెలువడింది. తొలుత కాకతీయుల యుగం నుంచే ఇది ప్రారంభమైనా తర్వాత తూర్పు చాళుక్య యుగం కూడా (ద్వితీయ ముద్రణ) చేర్చబడింది.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర :

ప్రతాపరెడ్డి గారి నిర్ణిద్ర పరిశ్రమకు, నిశిత పరిశీలనకు నిదర్శనం ఆంధ్రుల సాంఘిక చరిత్ర. క్రీ.శ.1900 వరకూ వెలువడిన కావ్యాలు, చరిత్ర గ్రంథాలు, స్థానిక చరిత్రలు, శాసనాలు మొదలైన ఆకరాలన్నీ అవలోడన చేశారు. ఆయన వివిధ ప్రకరణాల చివర పేర్కొన్న ఉపయుక్త గ్రంథాలు సుమారు ఏభైవరకు ఉంటాయి. ప్రతి యుగంలోను మతము, వ్యవసాయము, వ్యాపారము, పరిశ్రమలు, ప్రజాజీవనము, కళలు మొ॥ అన్ని అంశాల పరిశీలన ఉంది.

ప్రాచీన కావ్యాలలోని ఆంతరంగిక సాక్ష్యాల ఆధారంగా చారిత్రకాంశాలు వెలికితీయటం ఇందలి ప్రత్యేకత. దశకుమార చరిత్ర, క్రీడాభిరామం, సింహాసన ద్వాత్రింశిక, ఆముక్తమాల్యద, పాండురంగ మాహాత్మ్యం, కాశీయాత్రా చరిత్ర మున్నగు అసంఖ్యాక ప్రాచీనాధునిక గ్రంథాలను ఆయన పరామర్శించారు. ఆముక్తమాల్యదలోని సూర్యోదయ వర్ణన పద్యం ఆధారంగా ఆనాడు సాముగరిడీలుండేవని, వాటిలో ఎర్రమట్టి నింపేవారని, సంగ్తోలా మొ॥ సంగడములుండేవని నిరూపించటం ఆయన సూక్ష్మదృష్టికి ఒక ఉదాహరణ మాత్రమే.

"ఏకధారగా నన్ను చదివించిన గ్రంథము ఈ మధ్యలో ఇదొక్కటే. ఎన్నో సంవత్సరాలుగా ఏకాగ్రతతో చదివి సంగ్రహింపనిది ఈపని నిర్వహింపగలుగుట కాదు. స్వాతంత్ర్యము సిద్ధించిన తర్వాత ఆంధ్ర సాహిత్యములో వెలువడిన అనర్ఘ గ్రంథాలు కొన్నింటిలో ఈ గ్రంథము అగ్రగణ్యమని నమ్ముతాను" అని సుప్రసిద్ధ విమర్శకులు రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారు లేఖద్వారా తమ అభిప్రాయాన్ని తెలుపటం ఈ గ్రంథ ప్రాశస్త్యానికి తార్కాణం. పలుమార్లు ముద్రితమైన ఆంధ్రుల సాంఘిక చరిత్ర హిందీలోకి అనూదితం కావటం విశేషం. చాళుక్యులకు ముందుయుగాలలోని సంఘ చరిత్రను కూడా వ్రాయాలన్న కోరిక సురవరం వారి బహుముఖ వ్యాసంగాల వల్ల నెరవేరక పోవటం మన దురదృష్టం.

హిందువుల పండుగలు :

ఆచార వ్యవహారాలు, మత సంప్రదాయాలను శాస్త్రీయ దృక్పథంతో, హేతువాదంతో పరిశీలించి వాటి నిగ్గు తేల్చిన పరిశోధక జిజ్ఞాసువు ప్రతాపరెడ్డి. ఒక దసరా పండుగ సందర్భంగా నిజాం రాజు కొత్వాలు వెంకట రామారెడ్డిని ఆ పండుగ వెనుక ఉన్న విశిష్టతను గురించి ప్రశ్నించగా సమాధానం ఇవ్వలేక సందిగ్ధంలో పడిన ఆయన మన పండుగల చరిత్రను వ్రాయాలని సురవరం వారిని కోరారు. దానిని ఆదేశంగా పాటించి పురాణాలు, శాస్త్రాలు, స్మృతులు, వ్రతకథలు అవలోడన చేసి 'హిందువుల పండుగలు' (1931) ప్రకటించారు. తెలుగువారితో పాటు భారతీయులందరూ జరుపుకొనే పండుగలు, వ్రతాలు, జయంతులు, ఉత్సవాలకు (యాభైకి పైగా) సంబంధించిన గాథలు – విశేషాలను ప్రామాణికంగా ఇందులో చర్చించారు. దీని మొదటి ముద్రణకు డా॥

సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు సంగ్రహ పరిచయము వ్రాయగా, తృతీయ ముద్రణ పీఠికలో (1953) సురవరం వారు పండుగలను నాలుగైదు విధాలుగా వర్గీకరించి, గ్రంథరచన ఉద్దేశాన్ని, ప్రేరణనూ వివరించారు. దీని ఆరవ ముద్రణను సు.ప్ర. సాహిత్య వైజయంతి ట్రస్టు వెలువరించటం (2006) ఈ గ్రంథానికి గల ఆదరణను తెలుపుతుంది.

రామాయణ విశేషములు :

భారతీయులకు ప్రియమైన ఆధ్యాత్మిక గ్రంథాన్ని చారిత్రక దృష్టితో వివేచించిన విశిష్ట విమర్శ 'రామాయణ విశేషములు'. చిదిరెమఠం వీరభద్రశర్మ గారి 'విభూతి' పత్రికలో (1941-43) వ్యాసరూపంగా విరచితమైన ఈ గ్రంథం 1943లో పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్య శాస్త్రి పీఠికతో ప్రచురితమైంది. దీనిలో కొన్ని సవరణలు చేస్తూ సురవరం వారు 'ప్రజావాణి' పత్రిక సంపాదకులుగా (1951) ఉన్నపుడు మలి ముద్రణ ప్రారంభించారు. కాని ప్రజావాణి ఆగిపోవటంతో ఈ గ్రంథ ప్రచురణ కూడా నిలచిపోయింది. వారు కీర్తిశేషులైన (1953) తర్వాత తెలంగాణా రచయితల సంఘం ఆంధ్ర రచయితల సంఘంగా పరివర్తన చెందిన సందర్భంలో ఆ సంఘ కార్యదర్శి అయిన బి.రామరాజుగారు తనకు లభించిన సవరణలను చేర్చి ద్వితీయ ముద్రణ (1957 మార్చి) ను వెలువరించారు. అనుముల వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రిగారు మలికూర్పు పీఠికను కూర్చారు.

రామాయణ కథా కాలం, నాటి భూగోళ స్వరూపం, రాజకీయ, సాంఘిక మత వ్యవస్థలు, నాటి సంఘంలో స్త్రీ స్థానం మున్నగు పలు అంశాలను ప్రతాపరెడ్డి గారు సత్యాన్వేషణ దృష్టితో సమాలోచించారు. రామాయణంలో ప్రక్షిప్తాల గురించి ప్రత్యేక ప్రకరణంలో చర్చించారు. హోమరు వ్రాసిన ఇలియడ్ వాల్మీకి రామాయణ ప్రతిబింబమే అని నిరూపిస్తూ జైన బౌద్ధ రామాయణ గాథలను కూడా పరామర్శించారు. కిష్కింధ, లంక మొ॥ ప్రాంతాలను వివరిస్తూ పంచవటి భద్రాచలం ప్రాంతంలోనిదే అని, కైకేయి గిరివ్రజము నేటి ఇరాన్ మండలంలోనిదని గుర్తించారు. వానర, రాక్షస జాతుల లక్షణాలను, వాటి వర్గాలను విశదీకరించిన అధ్యాయం ప్రతాపరెడ్డి గారి బహుముఖ వైదుష్యాన్ని చాటి చెబుతుంది. ఈ గ్రంథమునందు "వారి సర్వంకష పరిశీలనా పాటవము తారాపథ వ్యాప్తమైనదనుట కేవలము స్వభావోక్తి" (ఆచార్య ఎల్లూరి శివారెడ్డి).

సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు :

లోతైన పరిశీలనకూ, ప్రగాఢమైన పాండిత్యానికి తావలమైన పెక్కు సాహిత్య వ్యాసాలు సురవరం కలం నుంచి వెలువడ్డాయి. గోలకొండ పత్రికలోనే కాక కళ, పినాకిని, సుజాత, ప్రబుద్ధాంధ్ర, ప్రజాబంధు, మీజాన్, రెడ్డిరాణి, విభూతి, మాతృసేవ, శోభ మున్నగు పెక్కు సమకాలీన పత్రికలలో 1922–53 మధ్య కాలంలో వైవిధ్య పూరితమైన పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. వీనిలో ఏరిన ముత్యాలను 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు' పేరుతో రెండు భాగాలుగా (1988) ఎస్వీ రామారావు సంపాదకత్వంలో సు.ప్ర. సాహిత్య వైజయంతి ప్రకటించింది.

సాహిత్య వీధిలోని అన్ని కోణాలపై సురవరం వారి నిశితమైన చూపు ప్రసరించింది. మొదటి భాగంలో నన్నెచోడుడు మొదలుకొని అనర్ఘరాఘవకర్త (బిజ్జుల తిమ్మభూపాలుడు) వరకు గల ప్రాచీనాంధ్ర కవుల కావ్యాలపై సమాలోచనలో కవుల దేశకాల చర్చలు, కర్తృత్వ వాదాలు, కవిత్వానుశీలనం చోటు చేసుకొన్నాయి. గాథా సప్తశతిలోని సామాజిక చిత్రణ, వివిధ యుగాల ఆంధ్ర వాఙ్మయ సమీక్షలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. జానపద సాహిత్యంపై ప్రతాపరెడ్డి గారికి గల ఆసక్తి ప్రశంసనీయమైనది. బిరుదురాజు రామరాజు గారిని జానపద వాఙ్మయ పరిశోధనకు ప్రోత్సహించి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆ ప్రక్రియ అధ్యయనానికి మార్గదర్శకులైన వారు ప్రతాపరెడ్డి గారేనంటే అత్యుక్తి కాదు. 'పల్లెపదాలు' శీర్షికలో వెలువడిన సురవరం వ్యాసాలు ప్రత్యేక గ్రంథంగా ప్రచురణ పొందదగినవి.

ప్రతాపరెడ్డి వ్యాసాలు రెండవ భాగంలో సాహిత్యేతరమైన వ్యాసాలు సంకలితమైనాయి. వీనిలో ఆయన ఆకాశవాణి (రేడియో) ప్రసంగాలు కూడా చేరాయి. వర్ణవ్యవస్థ, హిందూ సమాజంలో స్త్రీ స్థానం మొ॥ అంశాలు వీటిలో శాస్త్ర, స్మృతి ప్రమాణాలతో పరిశీలించబడినాయి. ఆయుర్వేదం, టప్పాచరిత్ర, తాంబూలం, మామిడిపండు, గుర్రం మున్నగు వాటి ఉపయోగ విశేషాలు రెడ్డిగారి సహజ వ్యంగ్య హాస్య ధోరణిలో చిత్రితమైనాయి. ఎనిమిది వ్యాసాలు స్థల చరిత్రకు సంబంధించినవే కావటం విశేషం. పంచేశ్వరం, పానుగల్లు, గోలకొండ, ఎలిఫెంటా గుహలు మొదలైన ప్రదేశాల చరిత్రను

తవ్వి వెలికితీశారు. హజ్రత్ ఉమర్ వ్యాసం ఆయన విశాల దృష్టిని చాటగా, వేదం వెంకటరాయశాస్త్రి, వెంకటరామారెడ్డి, మాడపాటి హనుమంతరావుల వ్యక్తిత్వ చిత్రణలు రేఖాచిత్ర రచనకు (స్కెచ్) చక్కని ఉదాహరణలు. సురవరం వారి లోకజ్ఞతకూ, బహువిషయ పరిజ్ఞానానికీ దీపికలు ఆయన వ్యాసాలు.

శబ్ద వ్యుత్పత్తుల నిరూపణ వారికి గల భాషా పాండిత్యాన్ని, భాషాశాస్త్ర పరిజ్ఞానాన్నీ పట్టి ఇస్తుంది. హంస అంటే బాతు అనీ, హంస 'గంస్'గా మారి 'గూస్' (Goose) అయిందని ఆయన అభిప్రాయం (రామా.విశే).

కింది పదాల వ్యుత్పత్తిని ఈ విధంగా పేర్కొన్నారు (శబ్దాల ముచ్చట వ్యాసం)

ద్వార	–	ద్వి+ఆర (రెండు రెక్కలు)
చొక్కా	–	చొగా (పార్సీశబ్దం)
కాగితం	–	కాగజ్
కందిలి	–	క్యాండిల్ (ఆంగ్లం)
సెమ్మె	–	షమా (పార్సీ) = దీపం
గ్యాసునూనె	–	ఘాస్ = గడ్డి నుంచి తీసిన నూనె (కిరోసిన్)

దక్షిణదేశంలోని పట్టణ నామాలు అక్కడి ఆచారాలు – పద్ధతుల మూలంగా తెలుగు సామెతలలోకి ఎలా ఎక్కాయో హృద్యంగా (దాక్షిణాత్యలోకోక్తులు వ్యాసం) విశదీకరించారు. అరవ చాకిరీ, తిరుపతి క్షౌరం, చిదంబర రహస్యం, పుంగనూరు మనిషి, కంచంత (కంచి అంత) కాపురం, ద్రావిడ ప్రాణాయామం, కుంభకోణం, శ్రీరంగనీతులు, ఆడమళయాళం మొ॥నవి. శబ్ద రత్నాకరం మున్నగు నిఘంటువుల కెక్కని పదముల సూచికను సిద్ధం చేసి ఆ వ్రాత ప్రతిని తమ మిత్రులైన కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారికి ఇచ్చినట్లు తెలుస్తున్నది (సు.ప్ర.జీవితము, సాహిత్యము – ఎల్లూరి శివారెడ్డి – పుట.201) వివిధ శాస్త్రాలకు సంబంధించిన సాంకేతిక పదకోశం రూపొందించే సంకల్పం ఉన్నట్లు గోలకొండ పత్రిక ద్వారా (7-6-1943) ప్రకటించారు కాని అది నెరవేరినట్లు లేదు.

పరిష్కరణలు :

నిరంతర పరిశోధనా జిజ్ఞాసువు అయిన ప్రతాపరెడ్డి గారు ఎంతో శ్రమకు ఓర్చి పెక్కు తాళపత్ర గ్రంథాలు, జానపద గేయాలు, ముద్రిత గ్రంథాలు సేకరించారు. రెడ్డి

హాస్టల్ కార్యదర్శిగా ఉండగా అందలి గ్రంథాలయానికి ఎన్నో తాళపత్ర ప్రతులు, గ్రంథాలను చేర్చారు. కర్నూలులో సేకరించిన (1924) రాజపీఠము వంశావళి తాళపత్రప్రతిని సంస్కరించి 'కర్నూలు రాజుల వంశావళి' పేరుతో ముద్రించారు. 'కృష్ణార్జున సంవాదము' (గయోపాఖ్యానము) ను శేషాద్రిరమణ కవుల పీఠికతో ప్రచురించారు. గద్వాలరాజు చినసోమభూపాలుని 'రతి రహస్యము' (పద్యానువాదం) ను మద్రాసులోని గ్రంథమండలికి ముద్రణ కోసం ఇచ్చారు. పాలమూరు కవి రెడ్డి మల్లారెడ్డి దేశాయి (17వ శ.) 'గంగాపుర మాహాత్మ్యము' కావ్యమును పరిష్కరించి విపులమైన పీఠికతో విజ్ఞానవర్ధినీ పరిషత్తు పక్షాన (1946) ప్రకటించారు.

వీరరాఘవీయ వ్యాఖ్య సురవరం పర్యవేక్షణలో నాగరలిపిలో వనపర్తిలో ముద్రితమైంది. పాలవేకరి కదిరీపతి 'శుకసప్తతి' తొలిముద్రణలో లేని కృత్యాదిని చేర్చి విస్తృత పీఠికతో పరిష్కృతప్రతిని ప్రచురణకై వావిళ్ల వారికి అందించారు. ఖండవల్లి లక్ష్మీరంజనం 'ఆంధ్ర సాహిత్యచరిత్ర సంగ్రహము' మున్నగు సమకాలీన గ్రంథాలకు పీఠికలు సంతరించటమే కాక పత్రికల్లో బసవపురాణము మొ॥ ప్రాచీన కావ్యాల సమీక్షలు వెలువరించారు.

హైందవ ధర్మవీరులు :

దేశ-స్థల చరిత్రలనే కాక దేశంకోసం, ఉన్నతాశయ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులు, త్యాగమూర్తుల గాథలను బాల బాలికలకు అర్థమయ్యే రీతిలో సరళశైలిలో ప్రతాపరెడ్డి రచించగా 1937లో వట్టికోట ఆళ్వారుస్వామి 'హైందవ ధర్మపోలీలు' పేరుతో మల్లంపల్లి సోమశేఖరశర్మ పరిచయ వాక్యాలతో ప్రకటించారు. గ్రీసుదేశంలో 'ధర్మపైలీ' కనుమవద్ద లియోనిదాసు అను వీరుడు కొద్దిమంది సైనికులతో శత్రుమూకల దాడిని ఎదుర్కొని అమరుడైన కథ ప్రసిద్ధం. ఆ పేరు అందరికీ అర్థం కాదని భావించి ద్వితీయ ముద్రణలో (1952) 'హైందవధర్మ వీరులు'గా మార్చారు సురవరం. దీని తృతీయ ముద్రణ (1987) సు.ప్ర. సాహిత్యవైజయంతి ఆధ్వర్యంలో వెలువడింది. రాజపుత్ర, మహారాష్ట్ర వీరులతో పాటు బాలచంద్రుడు, సోమనాద్రి, సదాశివరెడ్డి మున్నగు పరాక్రమవంతుల గాథ లిందులో ఉన్నాయి. వీరిలో ఇద్దరు స్త్రీలు కూడా (సావిత్రీబాయి,

ఇందుమతి) ఉన్నారు. ఈ గ్రంథాన్ని హైదరాబాద్ రాష్ట్ర విద్యాశాఖ వారు మూడవ ఫారం పాఠ్య గ్రంథంగా నిర్ణయించారంటే దీని ప్రత్యేకత బోధపడుతుంది. తానాజీ మాలుసురే, సోమనాద్రి కథలు చాలాకాలం వరకు తెలుగు వాచకాల్లో పాఠాలుగా ఉండేవి.

రెడ్డిగారు అనుముల వెంకటశేషకవితో కలిసి 'హిందూస్థాన్ చరిత్ర' పేరుతో రెండు చిన్న పుస్తకాలు ప్రచురించారు. ఇవి కూడా ఉన్నత పాఠశాల పాఠ్యగ్రంథాలుగా ఉన్నాయి. బ్రిటిషు చరిత్రకారుల వ్రాతలను రెడ్డి గారు వీనిలో ఖండించారు. వివిధ సంస్థల నిర్వహణలో ప్రోత్సాహకుడుగా ఉన్న మహనీయుడు రాజాబహద్దర్ వెంకట రామారెడ్డి జీవిత చరిత్రను (1939) కూడా ఆయన వెలువరించారు. కట్టమంచి దీనికి పీఠికను వ్రాశారు. ద్వితీయ ముద్రణ పొందిన (1959) ఈ గ్రంథం ఆంగ్లంలోకి కూడా పరివర్తితమైంది. 'సురవరం వారి వంశ చరిత్ర', 'స్వవిషయ సంగ్రహము' ఈనాటికీ అముద్రితంగా ఉన్నాయి. రెండవది రెడ్డిగారి అసంపూర్ణ ఆత్మకథ. 1938-49 మధ్య విరామంతో అప్పుడప్పుడు వ్రాసుకొన్న ఈ స్వీయ చరిత్రలో ఆయన బాల్యదశ, మరి కొన్ని జీవిత విశేషాల వివరాలు గోచరిస్తాయి.

భాష విషయంలో ప్రతాపరెడ్డి గారికి కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఆయన రచనలు చాలావరకు గ్రాంథిక భాషలోనే విరచితమైనాయి. అయితే అవి వ్యావహారిక భాషకు దగ్గరగా సరళంగా సూటిగా ఉంటాయి. రామాయణ విశేషములు గ్రాంథిక భాషలో ఉన్నా 'నేను నాశైలిలో ఉద్దేశ పూర్వకంగా వ్యావహారిక పదాలను వాడినాను. గ్రాంథిక వ్యావహారిక శైలికై ప్రయత్నించుచున్నాను' అని 'మనవి' మాటల్లో పేర్కొన్నారు. భక్త తుకారాం నాటకం తొలుత గ్రాంథికములోనే వ్రాసినా అది నటులకు కృత్రిమంగా ఉంటుందని భావించి దానిని వ్యావహారికంలోకి తిరుగ వ్రాశారు. ఆయన గ్రాంథిక - వ్యావహారిక భాషలపై ద్వేషం గల భాషా దురభిమాని కాదు. పత్రికా వార్తలలో, వ్యాఖ్యలలో వ్యావహారికమే వాడినారు. రెడ్డి గారిది విషయానుగుణమైన భావానుగుణ శైలి అని చెప్పవచ్చు.

ప్రామాణిక భాష గురించిన సురవరం అభిప్రాయాలు శ్రద్ధతో గమనింపదగినవి:

"వచ్చుచున్నాడు, చేయుచున్నాడు వంటి రూపములను తెలుగువారిలో నెవ్వరును వాడుట లేదు. కావున ఇక ముందు వస్తున్నాడు, చేస్తున్నాడు అనురూపాలను గ్రాంథికముగా భావించుటయే సరసము. వచ్చారు, చేశారు అనునవి చారు రూపములు కావు. ఇవి

తూర్పు తీరపు జిల్లాలలోనే కలవు. రాయలసీమలో నందరును వచ్చినారు, చేసినారు అని విలక్షణముగా నేటికిని పలుకుదురు. తెలంగాణ మందును ఇంచుమించంతే. ఇట్టివి బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమున వాడుకలో నుండు రూపాలు. ఇట్లు చూపి చెప్పుట ఏలన నేనవలంబించిన శైలి గ్రామ్యము కాదనియు, శిష్ట వ్యావహారమందుండునదనియు, ఇదే యీనాటి గ్రాంథికమనియు పూని నిరూపించుటకే" (భక్తతుకారాం పీఠిక).

లిపి సంస్కరణకు సంబంధించికూడ ప్రతాపరెడ్డి నూత్నమైన వివేచన చేశారు. 'ఆంధ్రాక్షర సంస్కారము' వ్యాసం (1939), 'ఆంధ్రలిపి సంస్కరణము' లఘుగ్రంథం (1946)లలో ఈ వివేచన గోచరమవుతుంది. తెలుగు భాష అక్షరాల సంఖ్యను తగ్గించటానికి ఆయన చక్కని ప్రతిపాదనలు చేశారు. కన్నడ, తెలుగు భాషలకు ఏకలిపిని కల్పించిన రెడ్డిగారు ప్రపంచ భాషలన్నింటికీ ఒకే లిపిని సూచిస్తూ బెర్నార్డ్‌షాకు ఇంగ్లీషులో జాబు వ్రాశారంటే లిపి వివేచనలో ఆయన ప్రత్యేకత వెల్లడవుతుంది.

మాతృభాషపై సురవరం వారికి గల అభిమానం గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. "తన మాతను, తన మాతృభూమిని, తన మాతృభాషను ప్రేమింపని ద్విపాద పశువును స్వామిభక్తి గల కుక్కతో సహితము నుపమించుట కుక్క కపచారమగును. మాతృభాషలను నిరసించి పరభాషనాశ్రయించువాడు గోమాతృక్షీరమునకు విముఖుడై ఒంటెపాలకై మూతిసాచువాని పోలియుండును." (గ్రంథాలయోద్యమము). ఈ మాటలను మన పరిపాలకుల దృష్టికి తీసుకెళ్లగలిగితే ఆమహానుభావుడి భాషా సేవలో అణుమాత్రమైనా పుణ్యం లభిస్తుంది.

9. నండూరి బంగారయ్య

(1903–1970)



నండూరి బంగారయ్య కవి, నాటకకర్త, ప్రముఖంగా విమర్శకుడు. బంగారయ్య గారు 1903 నవంబర్ 20వ తేదీన తూర్పుగోదావరి జిల్లా చెయ్యేరులో జన్మించారు. పట్టభద్రులై న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ రాజమండ్రిని నివాసంగా చేసుకున్నారు. 19 సంవత్సరాల వయసులోనే ఆయన రచనా వ్యాసంగం ప్రారంభమైంది. 'సమాశ్వాసగీతిక' (ఆంధ్రపత్రిక ఉగాది సంచిక – 1922) మొ॥ గేయకవితలు పత్రికల్లో ప్రచురితమైనాయి.

బంగారయ్య రచించిన రెండునాటకాలూ ప్రత్యేకతను సంతరించుకొన్నాయి. నాటకకళకు సంబంధించిన వస్తువునే స్వీకరించి 'రాజ్యలక్ష్మి' (1928) అన్న ప్రయోగాత్మక నాటకం వెలువరించారు. బళ్లారి రాఘవ మున్నగు వారి అభిప్రాయాలను సమర్థిస్తూ స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించాలని ఈ నాటకంలో ప్రతిపాదింపబడింది. 'ఆంధ్రతేజము' (1938) రంగస్థలంపై విజయవంతంగా ప్రదర్శింపబడిన నాటకం. కొండవీటి రెడ్డిరాజులకు, రాచకొండ పద్మనాయకులకు మధ్య ధరణికోట గురించిన వివాదం ఈ నాటక ఇతివృత్తం. కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత ఆంధ్రదేశ సమైక్యతకు తెలుగు వీరులు చేసిన కృషి ఇందులో ప్రాముఖ్యం వహించింది.

1922–56 మధ్యకాలంలో సమకాలీన పత్రికల్లో సుమారు నలభై వ్యాసాలు రచించారు బంగారయ్యగారు. వీనిలో కొన్ని బిగువు సత్యానందం అనే ఆయనతో కలిసి వ్రాసినవి ఉన్నాయి. బి.స.బంగారయ్య పేరుతో రెండు వచన లఘు గ్రంథాలు 'తెనుగు

నుడి-నానుడి', 'తెనుగా? ఆంధ్రమా?' వెలువడ్డాయి. ఇవి నాటి భాషావివాదాలకు సంబంధించినట్టివి.

నన్నయ తిక్కనల కవితాసౌష్ఠవంపై భారతి మొ॥ పత్రికల్లో ప్రచురితమైన వివేచనాత్మకమైన వ్యాసాలు బంగారయ్య గారి సూక్ష్మపరిశీలనా దృష్టికి నిదర్శనాలు. 'నన్నయ అవతారిక' వ్యాసంలో ప్రసన్న కథా కవితార్థయుక్తిని, 'నన్నయ నాదసౌష్ఠవము' వ్యాసంలో అక్షర రమ్యత తత్త్వాన్ని విస్పష్టంగా ప్రామాణికంగా వివేచించారు. అర్థ శబ్దానికి శబ్దార్థం అన్న సామాన్య వ్యవహారం కాకుండా పరమార్థం అన్న విశిష్టార్థం నిక్షిప్తమై ఉందని ఆయన అభిప్రాయం. "దుర్గమార్థ జలగౌరవ భారత భారతీ సముద్రము దటియంగ నీదను", "మహాభారత బద్ధ నిరూపితార్థ మేర్పడ" మున్నగు వాక్యాలే దీన్ని సూచిస్తాయి. కథను హృద్యంగా చెప్పటమే కాకుండా అందలి పరమార్థాన్ని ధ్వనింపచేయటమే ప్రసన్న కథాకవితార్థయుక్తి. కథకు పరమార్థంతో పొత్తు కుదర్చటమే 'అర్థయుక్తి' తాత్పర్యం. ఇంకా శయ్యలో (కవితాశైలి) సన్నివేశం స్ఫురించేటట్లు రచించటమే నన్నయ కథాకథన ప్రత్యేకత అని బంగారయ్య ఉగ్గడించారు.

నన్నయ కావ్యశయ్యలో నాదసౌందర్యం అంతర్వాహినిగా ప్రసరిస్తుందని అక్షర రమ్యతలోని విశిష్టతను హృద్యంగా పేర్కొన్నారు బంగారయ్య గారు. "నన్నయ్య రచనమున కీ నాద మాధుర్యము ప్రాణము" అని ఆయన వచించారు. "వీనులకు నిది యమృతోప మానమయ్యె వేదనాదంబు" మున్నగు పంక్తులను ఉదాహరిస్తూ వేదవిదుడైన నన్నయ రచనలో వేదస్వరంలోని నాద మాధుర్యం ఇమిడి ఉందని చాటి చెప్పారు. అర్థం తెలియకపోయినా నన్నయ రచనాశైలి హృదయానందం కలిగిస్తుందంటూ నన్నయ నాద సౌష్ఠవంలోని వైవిధ్యాన్ని సోదాహరణంగా వివరించారు. మహాకవులు ఛందస్సులో సిద్ధించే లయతోనే తృప్తిపడకుండా, అక్షరాల పొందికలో ఆ లయకు అభివృద్ధిని చేకూరుస్తారంటూ ఏ శబ్దం తర్వాత ఏ శబ్దం పొందుపరచాలో నన్నయకు బాగా తెలుసునంటూ ఉగ్గడించారు. శబ్దం వేరు, శబ్ద సారం వేరు. "కొందరు మహాకవులు శబ్దసిద్ధులు. మరి కొందరు అర్థసిద్ధులు. ఉభయసిద్ధులు అత్యల్ప సంఖ్యాకులు" అని భావించిన బంగారయ్య నన్నయ అక్షర రమ్యతలో శబ్ద సిద్ధిని, ప్రసన్న కథా కవితార్థ యుక్తిలో అర్థసిద్ధిని సాధించాడని ప్రస్తుతించారు.

"నన్నయ చిత్రించిన రాజరాజు" అన్నవ్యాసం కూడా ఆయన విలక్షణ దృష్టికి గీటురాయి. రాజరాజ నరేంద్రుని శరీర సౌందర్యము, పరాక్రమము, పవిత్రశీలము, వితరణ గుణము నన్నయ అవతారికలో సువిదితమైనాయని ఆయన పేర్కొన్నారు. భారత శ్రవణాసక్తి రాజరాజు శీలంలో విశిష్టలక్షణంగా గుర్తించిన బంగారయ్య అతని సాహితీ రసజ్ఞతయే నన్నయ భారత రచనా ప్రాశస్త్యానికి దోహదం చేసిందని, రాజరాజు భారత రచనకు మార్గదర్శకుడని ఉగ్గడించారు.

1933–37 మధ్య భారతి పత్రికలో తిక్కనపై వెలువరించిన వ్యాసాలు బంగారయ్య విశిష్ట విమర్శన పంథాకు గీటురాళ్లు. ఆంధ్ర మహాభారతం అనువాద గ్రంథమైనప్పటికీ కావ్యదృష్టితో స్వతంత్ర కావ్యంగా పరిగణింపదగినది. ఈ దృష్టితో 'నవ యుగోదయము–తిక్కన' వ్యాసంలో తిక్కన వ్యక్తిత్వాన్ని, కవితాగుణాలను విశదీకరించారు. భారత రచనలో తిక్కన జీవితాన్ని సమన్వయించటం ఈ వ్యాసంలోని ప్రత్యేకత. అద్వితీయమైన శైలి, సన్నివేశాలను పూసగుచ్చినట్లు తీర్చిదిద్దే అపురూప స్వరూప సౌష్ఠవం, పాత్రీకరణ పాటవం తిక్కన కవితా గుణాలుగా ఆయన ఉగ్గడించారు. "భారతము – పరమార్థ ప్రదర్శనము (అనువృత్తము)" శీర్షికలోని వ్యాసాలలో ప్రత్యేకంగా పాత్రపరామర్శ చేశారు. శ్రీకృష్ణుని లీలాస్వరూపము, యోగీశ్వర తత్త్వము, కర్ణునికి శ్రీకృష్ణునిపై గల గౌరవము, వైవిధ్యముతో కూడిన భీష్మ పాత్రలోని ఆత్మ సంయమనము, అర్జునుని పౌరుషశక్తిని ఈ రెండు వ్యాసాలు ద్యోతకం చేస్తాయి.

ఆంధ్ర మహాభారతంపై వెలువరించిన వ్యాసాలు, శాకుంతల నాటకంపై ప్రత్యేక విమర్శనాగ్రంథం తెలుగు సాహితీ విమర్శకులలో నండూరి బంగారయ్య గారికి విశిష్ట స్థానం కల్పించాయి. ఈ విషయంలో కోరాడ రామకృష్ణయ్య గారితో వీరికి సామ్యం కనిపిస్తుంది. ఇరువురూ తిక్కన, కాళిదాసులపై ప్రధానంగా తమ దృష్టిని ప్రసరించారు. తమ "ఆంధ్ర భారత కవితా విమర్శనము" (1929) గ్రంథరచనలో బంగారయ్య సహకారం ఉన్నట్లుగా కోరాడవారు అందలి పీఠికలో పేర్కొన్నారు. మదరాసు విశ్వవిద్యాలయంలో తెలుగు రీడర్‌గా కోరాడ పరిశోధన చేస్తున్న కాలంలో (1928) బంగారయ్య ఆ తెలుగు శాఖలో 'ఫెలో' గా ఉండటం వల్ల ఇది సాధ్యమైంది. కాళిదాసు కావ్యాలపై కోరాడ లఘు విమర్శ గ్రంథం (కాళిదాసుని కళాప్రతిభలు) వెలువరించగా నాటకంపై నండూరి విపుల విమర్శ గ్రంథం (శాకుంతల విమర్శనము) విరచించారు.

తిక్కన భారతంపై వీరి ప్రత్యేక అధ్యయనాన్ని గమనించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు హైదరాబాదులో ఆంధ్రమహాభారతంపై 1955లో నిర్వహించిన సదస్సుకు ఉపన్యాసకులుగా ఆహ్వానించారు. ఈ సదస్సులోని ఉపన్యాసాలు "ఆంధ్రమహాభారతో పన్యాసములు" (1957) పేరిట ప్రకటితమైనాయి. రామకృష్ణయ్య 'తిక్కన–విరాటపర్వము' లోని కవితా దృక్పథం విశదీకరించగా, బంగారయ్య 'తిక్కన– ఉద్యోగ పర్వము' లోని వస్తునిర్వహణ వైశిష్ట్యాన్ని వివేచించారు. బంగారయ్య వ్యాసం సహేతుకంగా – శాస్త్రీయమైన పద్ధతిలో కొనసాగింది. "భారతము నందలి శిల్పకళా లక్ష్మికి వజ్రకిరీటము ఉద్యోగ పర్వము" అని ఉగ్గడిస్తూ కావ్యశిల్పం పై దృష్టిని సారించారు. బంగారయ్య గారి విమర్శ సాహిత్యం ప్రధానంగా శిల్పాభిముఖంగా సాగింది. అంతకు ముందే వెలువడిన 'శాకుంతల విమర్శనము' (1952) లో శిల్పవిమర్శ దృక్పథం ప్రస్ఫుటంగా ద్యోతకం అవుతుంది.

'శిల్ప' శబ్దం సాహిత్య ప్రపంచంలో క్రొత్తది కాదు. 'శీల' ధాతువునుంచి 'శిల్ప' శబ్దం నిష్పన్నమైంది. ఆంధ్రమహాభారతంలోని "ఛందః శిల్పము" పై పరిశోధన చేసిన పాటిబండ మాధవశర్మగారు "కవియొక్క అంతరింద్రియ బహిరింద్రియముల ఏకాగ్రమైన వ్యాపారము శిల్పము" అని నిర్వచించారు. కవి యొక్క అభ్యాసము బాహిరమైనది కాగా సమాధి ఆంతరంగికమైనది. ప్రాచీనాంధ్ర కవుల్లో తిక్కన, అతని సమకాలీనుడైన మంచన 'శిల్ప' శబ్దాన్ని ప్రయోగించారు.

> **"అమలోదాత్త మనీష నేనుభయకావ్య ప్రౌఢి పాటించు**
> **శిల్పమునన్ పారగుడ....."** *(నిర్వచనోత్తర రామాయణం)*

> **"కేయూరబాహు చరితము సేయుము నీ వట్టి కావ్య**
> **శిల్పము మెఱయన్"** *(కేయూరబాహు చరిత్రము)*

అయితే ప్రాచీనులు పేర్కొన్న ఈ కావ్య శిల్పాన్ని సాహిత్య విమర్శ ద్వారా అన్వయించే ప్రయత్నం ఆధునిక యుగంలోనే జరిగింది. "రసభంగమా కాదా యనుటయే శిల్ప విమర్శనము యొక్క పరీక్ష" అని కవిత్వతత్త్వ విచారకుడైన కట్టమంచి 'శిల్పవిమర్శ' శబ్దాన్ని వాడాడు. కాగా విశ్వనాథ సత్యనారాయణ, నండూరి బంగారయ్య శిల్ప విమర్శ

పద్ధతిని ప్రాచుర్యంలోకి తెచ్చారు. ఈ విమర్శ పద్ధతికి ప్రశస్తమైన నిదర్శనం బంగారయ్యగారి 'శాకుంతల విమర్శనము'.

ఈ గ్రంథంలోని పది ప్రకరణాలలో సగభాగం 'భారతి' పత్రికలో ప్రచురితమైనాయి. మొదటి ప్రకరణంలో కాళిదాసు కవితా దృక్పథంలోని పరిణామదశలు విపృతమైనాయి. మాళవికాగ్నిమిత్రంలో కథా కల్పనం, విక్రమోర్వశీయంలో పద్య రచనం, శాకుంతలంలో రసనిర్వహణం పరిపుష్టంగా ఉన్నాయని, నాటక త్రయంలోని క్రమపరిణామం విశదీకరింప బడింది. కులపతి (కణ్వమహర్షి) ఆశ్రమంలో ప్రారంభమై ప్రజాపతి (మరీచముని) ఆశ్రమంలో ముగిసిన శాకుంతల నాటక కథలో రసైక్యం పూర్ణ సిద్ధితో సాక్షాత్కరిస్తుందని బంగారయ్య ఉగ్గడించారు.

ఈ రససిద్ధికి దోహదం చేసినవి ఆకృతి సౌష్ఠవం, ఘటనా శిల్పం కాగా ఇవి నిర్మాణ శిల్పానికి చెందిన అంశాలుగా పేర్కొన్నారు. ఘటనాశిల్పం, రచనా శిల్పం, ఆశ్రయశిల్పం, నిర్మాణశిల్పం అన్న శిల్ప విమర్శ సంబంధమైన పరిభాషను జోడిస్తూ నాటక విశ్లేషణ కావించారు. 'ఇతివృత్తంతు నాట్యస్య శరీరం' అంటూ భరతుడు పేర్కొన్న పంచసంధులు, సంధ్యంగాలు వస్తుపోషణను బలోపేతం చేస్తాయన్న విషయాన్ని జీర్ణించుకొన్న సంప్రదాయజ్ఞుడు బంగారయ్య. ఈ లాక్షణిక దృక్పథాన్ని ఆధునిక విమర్శ మార్గంలో వ్యక్తీకరిస్తూ విశ్లేషించటం ఆయన ప్రత్యేకత.

కాని కాళిదాసు నిర్మాణ శిల్పాన్ని ఇంతగా విశ్లేషించి వివరించిన బంగారయ్య నాటకంలోని పాత్రీకరణను మాత్రం సమర్థించలేదు. పాత్రల ఆదర్శీకరణం వల్ల వ్యాసుని శకుంతలోపాఖ్యానంలోని సహజ పరిణామం లోపించిందని భావించారు. సమకాలీన యుగ ప్రభావం దీనికి కారణమని పేర్కొన్నారు. ఈ విమర్శగ్రంథంలోని చివరి ప్రకరణం నండూరి వారి స్వతంత్రమైన వివేచనా శక్తికి గీటురాయిగా నిలుస్తుంది. వ్యాస భారతం, కాళిదాసు నాటకం కథలను తులనాత్మక పరిశీలన చేసి మూలంలోని వాస్తవికతవైపు మొగ్గు చూపారు.

అయితే అనంతరకాలంలో కాళిదాసు ఆదర్శీకరణను సమర్థిస్తూ విశ్వనాథ వారు 'శాకుంతలము యొక్క అభిజ్ఞానత' (1961)ను వెలువరించారు. భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేసిన ఈ రెండు గ్రంథాలూ శిల్పవిమర్శ వైశిష్ట్యాన్ని నిరూపిస్తాయి. తెలుగులో

కాళిదాసు కావ్య విమర్శకులలో స్మరణీయులు ముట్నూరి కృష్ణారావు (సమీక్ష-1937), ఖండవల్లి సూర్యనారాయణ శాస్త్రి (కాళిదాస హృదయము-1966), ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి (కాళిదాస కళామందిరం-1972). నాటక విమర్శ అనగానే గుర్తుకు వచ్చేవి నండూరి బంగారయ్య, విశ్వనాథ సత్యనారాయణల ఉత్కృష్ట విమర్శ గ్రంథాలు. భారతీయ భాషలలోని కాళిదాస విమర్శలలోనే ఇవి తలమానికంగా చెప్పదగినవి.

ప్రాచీన సాహిత్యంపైనే కాక సమకాలీన సాహిత్యంపై కూడా నండూరి బంగారయ్యకు గల సమాదరానికి నిదర్శనం విశ్వనాథ, పానుగంటి ప్రభృతులపై వెలువరించిన విమర్శ వ్యాసాలు. 'కిన్నెరసాని పాటలు' వ్యాసం విశ్వనాథ సత్యనారాయణపై ఆయన అభిమానాన్ని చాటుతుంది. లలిత గంభీర భావములు, వర్ణనా కౌశలంతోకూడిన ఈ ఖండకావ్యం రసచ్యుతిలేని ధ్వని కావ్యంగా ఆయన పేర్కొన్నారు. పదమునకు, అర్థమునకు, భావమునకు గల పొందిక ఇందలి ఉత్కృష్ట గుణంగా భావించారు. " కవి తనకు అభిమానాస్పదమైన 'తెనుగుదనము'ను ఈ కావ్యములో అంతర్వాహినిగా ప్రవహింపజేసినారు" అనటం బంగారయ్య విలక్షణ దృష్టికి తార్కాణం.

'సాక్షి' రచయితగా పేరుగడించిన పానుగంటి లక్ష్మీనరసింహారావు నాటకరచనలో కూడా అద్వితీయమైన ప్రతిభను ప్రదర్శించారు. లోనారసి చూస్తేకాని ఆయన నాటకశిల్ప వైశిష్ట్యం గోచరించదు. తనకాలంలో ఆయన నాటకాలపై వ్యాపించి వున్న కొన్ని దురభిప్రాయాలను ఖండిస్తూ 'పానుగంటి వారి నాటక రచనా పాటవము'ను నిరూపించారు బంగారయ్య గారు. ఇబ్సెన్, బెర్నార్డుషా మున్నగువారి నాటకాలకంటె కూడా పానుగంటి నాటకాలు ప్రశస్తమైనవని ఆయన భావించారు. 'ఆంధ్ర విశ్వవిద్యాలయము - ఆంధ్ర సారస్వతాభివృద్ధి' అన్న సూచనాత్మక వ్యాసం ఆంధ్ర భాషా సాహిత్య ప్రగతిని గురించిన బంగారయ్య గారి ఆకాంక్షలను వెల్లడిస్తుంది. ఆయన 1970 ప్రాంతంలోకీర్తిశేషులైనారు.

(ఆధునిక సాహిత్య విమర్శకులు - ప్రస్థానాలు, వ్యాససంకలనం, 2008)

10. తిరుమల రామచంద్ర

(1913–1997)



భాషా సాహిత్య పరిశోధకుడుగా, బహుభాషా కోవిదుడుగా, పత్రికా రచయితగా, జాతీయవాది అయిన స్వాతంత్ర్య సమరయోధుడుగా వాసికెక్కిన మహనీయుడు తిరుమల రామచంద్ర. అనంతపురం జిల్లా ధర్మవరం తాలుకా రాగవంపల్లెలోని మాతామహుల యింట్లో జానకమ్మ, శేషాచార్య దంపతులకు 1913 జూన్ 13వ తేదీన ఆయన జన్మించారు. తిరుపతి సంస్కృత కళాశాలలో ఎనిమిది సంవత్సరాలపాటు విద్యనభ్యసించి మద్రాసు వెళ్ళారు.

భగవద్భక్తి, దేశభక్తిగల శ్రోత్రియ కుటుంబంలో పుట్టడం అదృష్టంగా భావించిన రామచంద్ర విద్యార్థి దశలోనే సత్యాగ్రహంలో పాల్గొని రాయవెల్లూరు, తిరుచినాపల్లి జైళ్లలో సంవత్సరం పాటు కారాగారవాసం అనుభవించారు. సహాయనిరాకరణ సభలకు సంస్కృతంలో మార్చింగ్ సాంగ్స్ వ్రాశారు. నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విప్లవ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఇది వారి విద్యాభ్యాసానికి ఆటంకాలు కలిగించటం వల్ల ప్రైవేట్‌గా చదివి విద్వాన్ పరీక్షలో ఉత్తీర్ణులైనారు.

ప్రాచీన తాళపత్ర ప్రతులను పరిశోధించటంలోనూ, వాటికి వివరణాత్మక సూచికలు సిద్ధం చేయటంలోనూ ప్రసిద్ధి గడించారు రామచంద్ర. మద్రాసు ప్రాచ్య లిఖిత

భాండాగారంలో కాపీయిస్టుగా 1934 లో ఆయన ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. అక్కడే సుప్రసిద్ధ పండితులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారితో పరిచయం ఏర్పడింది. తర్వాత మానవల్లి రామకృష్ణకవి దగ్గర సహాయకులుగా చేరి తంజావూరు సరస్వతీ మహలులో పండితుడుగా నియమితులైనారు. ఆ అనుభవంతో లాహోరు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో పండితుడుగా (1939 - 40) పనిచేసి సుమారు వేయి ప్రతులకు పట్టికలు రూపొందించారు. అక్కడ ఉన్నప్పుడే హిందీ ప్రభాకర్ పరీక్షలో ఉత్తీర్ణులై కొంతకాలం హైస్కూలులో హిందీ పండిట్‌గా పనిచేశారు.

అవి ద్వితీయ ప్రపంచయుద్ధం ఆరంభమైన రోజులు. సైన్యంలో చేరాలన్న కోరికతో రామచంద్ర బెలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో హవల్దారుగా శిక్షణ పొంది ఆఫ్ఘనిస్థాన్, పర్షియాల సరిహద్దులోని బెటాలియన్‌లో చేరారు. అయితే "పఢ్‌నా, పఢానా, లిఖ్‌నా" అన్న అభిప్రాయాన్ని జీర్ణించుకొన్న రామచంద్ర ఆ వాతావరణంలో ఇమడలేక తన ప్రాంతానికి తిరిగి వచ్చారు.

హంపీ నుంచి హరప్పా వరకూ, తంజావూరు నుంచి లాహోరు వరకూ కొనసాగిన తిరుమల రామచంద్ర జీవనయానంలో ఎన్నో అపూర్వమైన అనుభూతులూ, అపారమైన అనుభవాలూ గోచరమవుతాయి. వివిధ పత్రికల్లో పనిచేసి రచయితగా, పరిశోధకుడుగా రాటుతేలారు. ఢిల్లీలో డెయిలీ టెలిగ్రాఫ్, మద్రాసులో భారతి, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, హైదరాబాద్‌లో తెలంగాణా, మీజాన్, ఆంధ్రభూమి మున్నగు వివిధ దిన, వార, మాస పత్రికల్లో రిపోర్టర్‌గా, కాలమిస్ట్‌గా, సహ సంపాదకుడుగా పలు బాధ్యతలు నిర్వహించారు. సుమారు 19 కలం పేర్లతో (పరిశోధక్, పరిశీలక్, తాతాచార్య, జిజ్ఞాసువు, ప్రయాణికుడు, ప్రేక్షకుడు మొ॥) రచనలు చేశారు. తిమ్మావఝ్ఝల కోదండరామయ్యతో కలిసి స్వయంగా 'పరిశోధన' పత్రికను నిర్వహించారు. మద్రాసు నుండి ద్విమాస పత్రికగా (1954-56) వెలువడిన ఈ పత్రిక పాల్కురికి, ధర్మవరం, గురజాడ, వేటూరి స్మారక ప్రత్యేక సంచికలు వెలువరించింది.

పెక్కు పత్రికల్లో రామచంద్ర రచించిన అసంఖ్యాక వ్యాసాలు, సంపాదకీయాలు, గ్రంథసమీక్షలు, వ్యక్తుల పరిచయాలు అనంతరకాలంలో ప్రత్యేక గ్రంథాలుగా ప్రచురితమై పేరు ప్రఖ్యాతులు గడించాయి. సంస్కృత, ప్రాకృత, హిందీ, కన్నడ, తమిళ, ఆంగ్ల

భాషలలో నిష్ణాతులైన రామచంద్ర భాషా రంగంలో గణనీయమైన పరిశోధన సల్పారు. 'నుడి – నానుడి' (1963) శీర్షికలో తెలుగు పదాలు, సామెతలు, నుడికారాల పుట్టు పూర్వోత్తరాలను ఆసక్తికరంగా చర్చించారు. ఎన్నో గ్రంథాలయాలను దర్శించి ఛాయా చిత్రాలు మొదలైన ఆకరాల ఆధారంగా 'మన లిపి–పుట్టు పూర్వోత్తరాల' ను (1978) ప్రామాణికంగా పరామర్శించారు. ప్రాచీన నవీన తెలుగు సాహిత్యాలకు సంబంధించిన అంశాలపై సమీక్షాత్మకంగా విశ్లేషణాత్మకంగా వెలువరించిన వ్యాసాల సంపుటి 'సాహితీ సుగతుని స్వగతం' (1969) 1971లో రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతికి పాత్రమైంది. విభిన్న రంగాలకు చెందిన ప్రముఖ వ్యక్తులను పరిచయం చేయటంలో కొత్త ఒరవడిని చూపి వినూత్న సాహితీ ప్రక్రియకు మార్గదర్శకులైనారు. మరపురాని మనీషి (ఆంధ్రప్రభ), తెలుగువెలుగు (ఆంధ్రపత్రిక) శీర్షికల్లో రామచంద్రగారి ప్రత్యేకబాణీ, రచనాశైలి ద్యోతకమవుతాయి. సరళ సుందరమైన వాడుకభాషా శైలిని ఆయన స్వంతం చేసుకున్నారు. కావ్య పరిష్కర్తలుగా, పీఠికా కర్తలుగా ప్రశస్తి గడించిన మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, నిడదవోలు వెంకటరావుల కృషిని పరామర్శిస్తూ 'మూడు వాఙ్మయ శిఖరాలు' (1987) గ్రంథం వెలువరించారు.


శాతవాహన యుగంలోని ప్రాకృతకావ్యం 'గాథాసప్తశతి' పై ఆయనకు మక్కువ ఎక్కువ. అందు చిత్రితమైన గ్రామీణజీవన సౌందర్యం, తెలుగుపదాలు మొ॥ అంశాలను విశదీకరిస్తూ వ్రాసిన గ్రంథానికి (గాథాసప్తశతిలో తెలుగుపదాలు) కూడా 1980లో రాష్ట్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. సప్తశతిలోని వర్ణనలను కథలుగా మలచి 'హాలుని గాథలు' పేరుతో మరొక గ్రంథం ప్రచురించారు. బౌద్ధజైన రామాయణాలను పరిశీలించి 'ప్రాకృత సాహిత్యంలో రామకథ' అన్న పరిశోధనాత్మక గ్రంథం ప్రకటించారు. తొలిదశలో విరచించిన సంస్కృత 'సుమతీశతకం' (1933), 'సత్యాగ్రహ విజయః' (1934) నాటకం ఆయన సంస్కృత భాషా వైదుష్యానికి నిదర్శనాలు. ఇంకా బృహత్కథా మంజరి (1968), కల్పనాదత్ జోషి (1946), సర్దార్‌పటేలు (1948) మున్నగు అనువాద గ్రంథాలు ఆయన లేఖిని నుంచి వెలువడ్డాయి. వారి స్వీయచరిత్ర 'హంపీ నుంచి హరప్పాదాక' డా॥ అక్కిరాజు రమాపతిరావుగారి కృషి మూలంగా వెలుగులోకి వచ్చింది.

తిరుమల రామచంద్రగారి ప్రజ్ఞాపాటవాలకు గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు ఆయనను వరించాయి. మహామహోపాధ్యాయ (కాశీపండిత పరిషత్తు), పత్రకార శిరోమణి బిరుదులు లభించాయి. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ (డి.లిట్.), తెలుగు విశ్వవిద్యాలయం నుంచి విశిష్ట పురస్కారం పొందారు. 1997 అక్టోబర్ 12వ తేదీన తన 84వ ఏట దివంగతులైన తిరుమల రామచంద్ర భాషాసాహిత్య పరిశోధనలకు స్ఫూర్తిప్రదాతగా, మరపురాని మనీషిగా కలకాలం గుర్తుంటారు.

(చేతన, డిసెంబర్ 2007)

11. పుట్టపర్తి నారాయణాచార్యులు

(1914-1990)



తెలుగు నవ్య కవిత్వ ప్రాదుర్భావ దశలో జన్మించిన పుట్టపర్తి నారాయణాచార్యులు ఆనాడు దేశాన్ని ఉర్రూతలూగించిన జాతీయోద్యమంచే ప్రభావితులై సాహితీ సృజనం కావించారు. సమకాలీన సాహిత్యోద్యమాల్లో పాలు పంచుకున్నారు. జాతీయ వాదం, కాల్పనిక వాదం, అభ్యుదయ వాదం ప్రేరణలతో పద్య, గేయ కృతులు విరచించారు. అయితే వీటన్నింటినీ అధిగమించి - అనూచానంగా వస్తూన్న సంప్రదాయ సిద్ధమైన తాత్త్విక జిజ్ఞాస- ఆధ్యాత్మిక చింతన ఆయన్ను ముందుకు నడిపించి ఆయన కలానికి బలమొసగింది. భక్త్యావేశ రచనలను వెలువరింపజేసింది. శివతాండవం, పండరి భాగవతం, జన ప్రియ రామాయణం అందుకు ప్రత్యక్షర నిదర్శనాలు. భారతీయ తాత్త్విక ధారలో ప్రముఖ పాత్ర వహించిన అరవింద దర్శనం ప్రభావం పుట్టపర్తి వారిపై అమితంగా గోచరిస్తుంది.

ఒక మహాకవి ఉత్తమ విమర్శకుడుగా కూడా రూపొందటం సహజమే. నారాయణాచార్యులు గారు ఆవేశాత్మకమైన కవితా రచనతో పాటు, ఆలోచనాత్మకమైన విమర్శ రచన కూడా కొనసాగించారు. విమర్శ రంగంలో రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు వారికి ఉత్తేజం కలిగించారు. శర్మగారి ప్రభావంతోనే కాబోలు ఆచార్యులు 'పెనుగొండ లక్ష్మి' వంటి కావ్యాలనే కాక, రాయలనాటి రసికతా జీవనము, విజయనగర రాజుల సామాజిక చరిత్ర మున్నగు రచనలు వెలువరించారు.

కల్పనా ప్రధానమైన ప్రబంధాల ఆధారంగా నాటి సామాజిక జీవితాన్ని అంచనా వేయడం సమంజసం కాదని దానిని కాల్పనిక వాద విమర్శగా పరిగణించారు కొందరు విమర్శకులు. కాని వాటిలోని అతిశయోక్తులు, ఉత్ప్రేక్షల వెనుక పరిశీలిస్తే స్వభావోక్తులు గోచరించక పోవు. పెద్దన చేసిన హిమవత్పర్వత వర్ణనమంతా పెనుకొండ ప్రాంతంలోని పర్వతాలు, అరణ్యాల ఆధారంగా కొనసాగిందంటే అత్యుక్తి కాదు.

పుట్టపర్తి నారాయణాచార్యులు గారు విజయనగర ప్రభువుల గురువైన తాతాచార్యుల వంశానికి చెందిన వారు కావటం చేత విజయనగర సామ్రాజ్యం పట్ల అభిమానం ఆయనకు స్వభావ సిద్ధంగానే అబ్బిన గుణం. ప్రాంతీయాభిమానం దురభిమానాలకు దారి తీసి వెర్రి తలలు వేయకుండా – పుట్టపర్తి కవిలో సముచితమైన సాహితీసమాలోచనకు దోహదం చేసింది. 'ప్రబంధ నాయికలు' (1945)లో వరూధిని, సత్యభామ, గిరిక, ప్రభావతి పాత్రలను పరామర్శించిన నారాయణాచార్యుల దృష్టిని విశేషంగా ఆకట్టుకొన్న ప్రబంధ కవిత్రయము తెనాలి రామకృష్ణుడు, భట్టుమూర్తి, శ్రీకృష్ణదేవరాయలు.

'తెనాలి రామకృష్ణుని తెనుగు కవిత' అన్న ప్రసంగ వ్యాసం రామకృష్ణుని ఆంతరిక బాహ్య స్వరూపములను సుస్పష్టం చేసిన అమూల్యమైన రచన. తెలంగాణ రచయితల సంఘం జనగామ శాఖ వారు దీనిని ఎనభై పుటలలో (1953) ప్రచురించారు. రామకృష్ణుని భావ స్వాతంత్ర్యం, వక్రోక్తి, హాస్యమయ రచన, కథను నడపుటలోని ప్రత్యేక శైలి మున్నగు అంశాలను సోదాహరణంగా నిరూపిస్తూ ఆ మహాకవి శబ్దమూర్తితో పాటు ఆధ్యాత్మిక మూర్తిని కూడ మన కనులకు కట్టిస్తుంది ఈ వ్యాసం.

లోకంలో తెనాలి రామకృష్ణుని చుట్టూ తలా తోకాలేని కల్పిత గాథలెన్నో అల్లుకొని ఉన్నాయి. వీటిని ప్రస్తావిస్తూ నారాయణాచార్యులు గారు "ఈ కథా ప్రవాదము లనెడు ప్రాచిని దొలగించి చూచినచో పండితుడుగా కవిగా మాత్రమే గాక తత్త్వవేత్తగా మనుష్యుడుగా రామకృష్ణుడు చాల గొప్పవాడు" అని ఉగ్గడించారు. తాతాచార్యుల పట్ల రామకృష్ణుడు 'చిల్లర'గ ప్రవర్తించినట్లు ప్రచారంలో వున్న కథలను పేర్కొని ఈ విధంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు–

"వాస్తవమునకు వెంకటపతిరాయల కడ తాతయాచార్యులనుభవించిన ఘనత – దేవేంద్రుని కడ బృహస్పతికి లేదు. వారి నా కాలమున రామకృష్ణు డేమైనా జెనకి యున్నచో నిస్సందేహముగ నురికంబ మెక్కియుండును. మన యభాగ్యము గొలది సినిమా

నిర్మాతలు గూడ కథలు నమ్మి తాతయాచార్యునొక "డ్రాభ" గా చిత్రించిరి. వారు తాము ధనము దండిగ సంపాదించితిమని చంక లెగురవేయవచ్చును. కాని యా మనుష్యులు చరిత్రకు చేసిన ద్రోహము మాత్రము మరువరానిది. సినిమా నిర్మాతలకు - విద్యా పరిశ్రమలకును నేయూరి కేయూరు".

ఈ వాక్యాలు కొందరు నిర్మాతలకు వర్తించకపోయినా చారిత్రక వాస్తవికత పట్ల పుట్టపర్తి వారికి గల నిష్ఠ అటువంటిది. ఈ మాటలు విన్న తర్వాతనైనా మన తెలుగు సాహితీ పరులు పాఠ్యగ్రంథాలలో, కవుల చరిత్రలలో అష్టదిగ్గజ కవుల 'లిస్టు' నుంచి తెనాలి రామకృష్ణుని తొలగించగలిగితే ధన్యులౌతారు.

పాండురంగ మాహాత్మ్యములోని హాస్యమయ రచనను పైపైన మాత్రమే చూసి వదలిన విమర్శకులున్నారు. నిగమశర్మ సొమ్ములు ఎత్తుకొని పోగా -

"శోకించు వృద్ధ భూసురు డాత్మ పితృదత్త దర్భ ముద్రికకు చిత్తంబు కలగ
నత్తగారిచ్చిన హరి సుదర్శనపు పేరునకు ముత్తయిదువ వనటబొందు
క్రొత్తగా జేయించికొన్న ముక్కరకునై యడలు దుర్వారయై యాడుబిడ్డ"

అని రామకృష్ణుడు వ్రాశాడు. ఈ సీసంలోని హాస్యమే సాధారణంగా అందరికీ ఎదురయ్యేది. రాళ్ళపల్లి వారు కూడ "పరిహాసము పవిత్ర వస్తువును గూడ గమనింపదేమో" అని ఈ సందర్భంలో పేర్కొన్నారు. కాని నారాయణాచార్యులు గారు మరింత 'లోతు'కు వెళ్లి ఈ సన్నివేశాన్ని ఎలా దర్శించారో చూడండి -

"ఈ సీసమును చదివిన వెంటనే మనకు ఫక్కుమని నవ్వు వచ్చును. కాని తరువాత యానాటి బ్రాహ్మణుల పితృభక్తి ఎంతటిదో వారిచ్చిన వస్తువులపై తత్సంతానమున కెట్టి భక్తియో, నాటి కోడంద్రకు నత్తగారిపై నెంతభక్తియో గాక ప్రేమయు గూడనో మనకు జ్ఞాపకమునకు వచ్చి యానాటి సౌమనస్యముల నెంచి రిత్తపడిపోదుము". ఇంతటి నిశిత దృష్టి గల విమర్శక సౌమనస్యులు 'సరస్వతీపుత్రులు'.

వారి సూక్ష్మపరిశీలనా శక్తికి, విమర్శనా ప్రతిభకు మరొక నిదర్శనం 'వసుచరిత్ర సాహితీ సౌరభం' (1970). భీమవరం రామరాజ భూషణ పరిషత్తు ఏర్పాటు చేసిన ఉపన్యాసముల సంకలనం ఈగ్రంథం. సత్య సందర్శనమే ప్రధానంగా వినూత్న దృష్టితో కొనసాగాయి ఈ

వ్యాసాలు. వసురాజు యందు ఆరోపితమైన రామరాయల గుణాలను పేర్కొని, కావ్య నాయకునితో కృతిపతికి అభేదాధ్యవసాయం వసుచరిత్ర రచనకు హేతువైన దన్న నూత్నాంశాన్ని ప్రతిపాదించారు నారాయణాచార్యులు. రామరాజ భూషణుని వాగ్వైచిత్రీ విలసిత చమత్కారం, పద ప్రయోగ ప్రావీణ్యం, పద్య రచనా శిల్పం మున్నగు వానితోపాటు కథా కల్పనలో, రచనా విధానంలో మనుచరిత్ర అనుసరణం కూడా ఈ వ్యాసాలలో విశదీకరింపబడ్డాయి. సంగీత, జ్యోతిర్విద్యలతో విమర్శకునికి గల పరిజ్ఞానం కూడ సువ్యక్తమౌతుంది.

యువభారతి వారు నిర్వహించిన ఉపన్యాస మంజరి 'చైతన్య లహరి' (1992)లోని 'శ్రీకృష్ణదేవరాయలు' ప్రసంగ వ్యాసం అనిదంపూర్వమైనది. అత్యంత విశిష్టమైనది. 'ఆముక్తమాల్యద' కు ఆమూలాగ్ర వ్యాఖ్యగా, శ్రీ సంప్రదాయ రహస్య ప్రకాశకంగా ఉదాత్త ఫణితిలో కొనసాగిన ఈ వ్యాసం సరస్వతీ పుత్రుల అపార శేముషికి తార్కాణం. 'ప్రతిభా లహరి' (1974)లో శ్రీనాథుని వైదుష్యాన్ని విశదీకరించిన పుట్టపర్తి 'శ్రీనాథుడు – అతని మనస్తత్వము' వ్యాసంలో (వ్యాస సంపుటి) అభిమానం మూర్తీభవించిన కవి సార్వభౌముని వ్యక్తిత్వాన్ని హృద్యంగా చిత్రించారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రకటించిన 'ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు' (1957)లోని రెండు విపుల వ్యాసాలలో పోతనపై ఏర్పడిన దురభిప్రాయాలను ఖండించి అతని కవితా స్వరూపాన్ని సుస్పష్టం కావించారు. వ్యాసుని రచనకు పోతన మెరుగులు దిద్దాడన్న అతివృష్టికీ, పోతన్న కవియే కాదు – అతని భక్తి మాత్రం గొప్పదని వచించే అనావృష్టికీ మధ్య ఊగిసలాడుతున్న సహజ పాండిత్యుని కవితా తత్త్వాన్ని సప్రమాణంగా నిరూపించారు.

పుట్టపర్తి వారి బహుభాషా వైదుష్యం సృజనాత్మక సాహిత్యంలోనే కాక విమర్శనాత్మక రచనల్లో కూడా ప్రస్ఫుటమౌతుంది. 'మహా భారత విమర్శనము' (1965) వ్యాస భారత విశిష్టత, పాత్రల తత్త్వం, రాజకీయ సాంఘిక వ్యవస్థ మొదలైన విషయములను విశదీకరించటమే కాక భారత కథలో సందేహాలకు సమాధానాలు కూడ వెల్లడిస్తుంది. విజ్ఞాన సర్వస్వ వ్యాసాలలో (విశ్వ సాహితి – 6వ సంపుటి) మళయాళ, మహారాష్ట్ర, ప్రాకృత భాషా సారస్వత వివేచన గోచరమౌతుంది. ఇవి కాక వివిధ సందర్భాలలో వాగ్గేయకారులు, పద కవితలు మొ॥ వాని గురించిన వ్యాసాలు పెక్కు వున్నాయి. వీనిలో కొన్ని వ్యాస సంపుటి, వ్యాస సౌరభం పేర్లతో లఘు సంపుటులుగా వెలువడ్డాయి.

పుట్టపర్తి వారి విమర్శలను పరికిస్తే ఒక సందర్భంలో వారే నుడివినట్లు ఆయా గ్రంథాలను ఎట్టి దృష్టితో వారు చదివారో నిరూపిస్తాయి. కవుల పద ప్రయోగం ఆధారంగా వారి సాహితీ వ్యక్తిత్వాలను మూర్తి కట్టించే శిల్ప దృష్టి, చారిత్రక సత్యాలను వెలికి తేవాలన్న పరిశోధక దృష్టి నారాయణాచార్యులు గారిది. ఆయా కవులపై పరివ్యాప్తమై ఉన్న అపవాదులను తొలగించి వారి కవితా తత్త్వాన్ని నిరూపించటం ఆయన ప్రధాన లక్ష్యం. ఈ సమాలోచనలో సర్వాంగీణమైన వారి వైదుష్యం, బహుముఖ శాస్త్ర పరిజ్ఞానం ద్యోతకం అవుతాయి.

ఆచార్యుల వారి పరిశోధనలో సత్యాన్వేషణ దృష్టి ఎలా పరివ్యాప్తమై వుందో చూడండి– "పంపా విరూపాక్ష బహు జటా జూటకారగ్వధ ప్రసవ సౌరభ్యములు, కళసాపుర ప్రాంత కదళీ వనాంతర ద్రాక్షాలతా ఫల స్తబకములు, కర్ణాట కామినీ కర్ణహాటక రత్న తాటంకయుగ ధాళధళ్యములు, తుంగభద్రా సముత్తుంగ వీచీ ఘటా గంభీర ఘుమ ఘుమారంభములు "కర్ణాట కటక పద్మ వన హేళి" కవితలలో నిలచి అడుగడుగునను హల్లీసకములు ద్రొక్కినవి. పై పద్యములోని 'కళసాపురము' కృష్ణానది యొద్దన నున్నదని ఒక విమర్శకులు వివరించినారు. 'కళాసాపురము' హంపి సమీపమున నున్నది. అది యిప్పుడొక పల్లెటూరు. అందిప్పటికిని అరటి తోటలు ద్రాక్షతోట లెక్కువ. తక్కిన మూడు పాదములందును విద్యానగరము చుట్టునే సుళ్లు తిరిగిన భావన హఠాత్తుగ నొక్క పాదమున కృష్ణ కెగురవలసిన పని ఏమి వచ్చినది?" అని తన అభిప్రాయాన్ని చాటుతారు.

పుట్టపర్తి వారి విమర్శనా శైలి గాంభీర్య మాధుర్యములను సంతరించుకొని ప్రవాహ సదృశంగా నిరర్గళంగా సాగుతుంది. ఆలోచన, ఆవేశం ఒక దానితో ఒకటి పెనవైచుకొని పరవళ్లు తొక్కుతాయి. ఒకటి రెండు ఉదాహరణములు పరికిద్దాం. శ్రీనాథుని సీస పద్య శైలి గురించి– "పద్య రచనము నందలి యొయ్యారమును భట్టారకుల తర్వాత ప్రౌఢముగ దిద్దినవాడు శ్రీనాథుడే.... అతడొక్కసారి సీస పాదములను హిమ శిఖరి శిఖరములవలె నుత్తుంగమున నడపును. మృణాళ దీర్ఘములుగ బొడిగించును. పద్మినీ పద్మాతపత్రము వలె విశాలము సేయును".

తెనాలి రామకృష్ణుని పద్యములలోని ఒయ్యారపు నడక "అవిసి పూలు విదిర్చినట్లు, చిలుకల గుంపులను లేపినట్లు విశేషణ విశేష్యముల నొక్కుమ్మడి కలిపి విదలించుచు

బోవునట". "ఓ యరవింద కోరక సహోదర చారు పయోధరాఢ్య, అంశేంశూద్వహ" అని క్రొత్త క్రొత్తలుగ సంబోధిస్తూ ప్రేమికుడు అనురాగమును వలె దీర్ఘ దీర్ఘముగ సమాసమును పెంచునట. ఇటువంటి హృద్యమైన శైలి పాఠకులను చదివించకుండా వుండగలదా!

తెనాలి రామకృష్ణునిపై పూర్వకవుల ప్రభావాన్ని వివరించే సందర్భంలో పుట్టపర్తి వారి చమత్కారోక్తులను చూడండి–

"వ్యాస వాల్మీకి ముఖ సూక్తి వైభవముల
నేర్పు మీరంగ నిజ కావ్య దర్పణముల
సరస మానసముల వేరు పరచు కీర్తి ధవుల
నన్నయ భట్టాది కవుల దలతు".


అని రామకృష్ణుని స్తుతి. ఎవరిని పురస్కరించిన – నెవ్వరిని తిరస్కరించినట్లగునో! అందులకై రామకృష్ణ కవి మంచి యుపాయము వెదకినాడు. తెనుగు కవులందరిని యొక సీస పద్యములో తల్లి వేసినాడు. "ఈ పద్యము నందున్న 'యాది' శబ్దము కుంభకర్ణుని కడుపు వంటిది. రామకృష్ణుని కన్న ముందు పుట్టిన వారును – సమకాలికులును – పుట్టబోవు వారును – అందరీ"యాది" శబ్దములో దూరుకొనవచ్చును. అయితే శ్రీనాథమహాకవిని రామకృష్ణుడు ప్రత్యేకముగ పొగడక పోవుట నాకు చూడ నన్యాయము" అని కూడ వారు వెంటనే ఉగ్గడించారు.

సహృదయ హృదయావర్జకమైన పుట్టపర్తి నారాయణాచార్యులుగారి విమర్శలు ఈనాడు అందుబాటులో లేవు. రాయలనాటి రసికతా జీవనము, ప్రబంధ నాయికలు ఎప్పుడో నాలుగు దశాబ్దాల క్రితం హైస్కూలు లైబ్రరీలో చదివాను. అవి పునర్ముద్రణ పొందలేదు. అట్లే చెదురుమదురుగా ఉన్న వారి విమర్శవ్యాసాలను గుదిగుచ్చి వ్యాస మంజరిగా వెలువరిస్తే తెలుగు విమర్శ రంగానికి మేలు చేసినవారమవుతాం.

(మూసీ, మార్చి 1998)

12. కొత్తపల్లి వీరభద్రరావు

(1922–2006)



సుప్రసిద్ధ ఆచార్యులు, బహుభాషావేత్త, విమర్శక వతంసులు డా॥ కొత్తపల్లి వీరభద్రరావుగారు 2006 మే నెల 8వ తేదీన, తమ 84వ ఏట, దివంగతులు కావటం తెలుగు సాహితీ జగత్తుకు తీరనిలోటుగా పేర్కొనదగింది. డాక్టరేట్ పట్టం కోసం పరిశోధన చేసి 1960లో ఆయన వెలువరించిన 'తెలుగుపై ఇంగ్లీషు ప్రభావం' ఆధునిక సాహితీ ప్రక్రియలపై పరిశోధన సల్పిన అస్మదాదు లెందరికో మార్గదర్శకమైంది. వీరేశలింగయుగ సాహిత్యాన్ని ప్రభావితం చేసిన పాశ్చాత్య సాహితీరీతులను తులనాత్మకంగా వివేచించిన విశిష్టగ్రంథం అది. ఆయన అంతటితో ఆగకుండా మఱుగున పడి ఉన్న తెలుగు సాహిత్యాన్ని ఉద్ధరించిన 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ జీవిత చరిత్రను కూడా వెలుగులోకి తెచ్చారు. ఆయన అధ్యయన శీలం, పరిశోధనా ప్రవృత్తి చివరివరకూ కొనసాగుతూ ఎన్నో సత్ఫలితాలను ప్రసాదించింది. తత్త్వశాస్త్రాలూ, ఆధ్యాత్మిక గ్రంథాలూ మథించి రచించిన 'అవతార తత్త్వ వివేచన' (1995) గ్రంథమే అందుకు నిదర్శనం.

1922 మే నెల 19వ తేదీన రాజమండ్రిలో రామమ్మ, వెంకటరత్నశర్మ దంపతులకు జన్మించిన కొత్తపల్లి అమలాపురం హైస్కూలు, రాజమండ్రి ఆర్ట్సు కళాశాలలో చదివి 1943లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ.లో ఉత్తీర్ణులైనారు. 1956లో గంటిజోగి

సోమయాజి పర్యవేక్షణలో పిహెచ్.డి. పట్టం పొందారు. వఝుల చినసీతారామశాస్త్రి ప్రభృతులు ఆయన గురువులు. ఎం.ఏ. తర్వాత నాటి సుప్రసిద్ధ పండితుల వద్ద న్యాయ, వేదాంత, మీమాంస శాస్త్రాలు అభ్యసించారు.

సాంప్రదాయకమైన పండిత కుటుంబంలో వేదాధ్యయనంతో ప్రారంభమైన వీరభద్రరావు జీవితం పాశ్చాత్య విజ్ఞానార్జనతో నిగ్గుతేలి పాతకొత్తల మేలికలయికగ, సంప్రదాయ ఆధునికతల వారధిగా ఆదర్శ మార్గంలో పయనించింది. వీరభద్రరావు బహుభాషావేత్త. సంస్కృతాంధ్రాంగ్ల హిందీ భాషల్లో పాండిత్యంతో పాటు పంజాబీ, బెంగాలీ, రష్యన్, ఫ్రెంచ్ భాషలను కూడా అభ్యసించారు.

1942 నుంచి 1994 వరకు 52 వత్సరాల సుదీర్ఘ బోధనానుభవంతో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది 'దేశికోత్తమ' బిరుదును (1997 – విజయభావన – విజయనగరం) సార్థకం చేసుకొన్నారు కొత్తపల్లి. రాష్ట్ర విశ్వవిద్యాలయాలలోని అధ్యాపకులు, ఆచార్యుల్లో పలువురు ఆయన శిష్య ప్రశిష్యులే అంటే అత్యుక్తికాదు. కీ.శే. నండూరి రామకృష్ణమాచార్యులు వారి సహాధ్యాయిగా ఉన్నారు.

విజయనగరం మహారాజా కళాశాల (1942–59), ఢిల్లీ విశ్వవిద్యాలయం (1959–68), తెలుగు అకాడమీ (1968–78), హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (1978–85), అధికార భాషా సంఘం (1985–87), తెలుగు విశ్వవిద్యాలయం (1989–94) మొదలగు విద్యాసంస్థలు – భాషా సంస్థలలో వివిధ ఉన్నత పదవులు నిర్వహించి వాటికి వన్నె తెచ్చారు. 1961–62 మధ్యకాలంలో మాడిసన్‌లోని విస్కాన్సిన్ యూనివర్సిటీ (అమెరికా)లో ప్రొఫెసర్‌గా 'భారతీయ సంస్కృతి'ని బోధించారు.

వీరభద్రరావు విస్కాన్సిన్, ఢిల్లీ, హైదరాబాద్ విశ్వవిద్యాలయాల్లో తెలుగు విభాగాలను ప్రారంభించి వాటిని సువ్యవస్థితమైన ప్రణాళికలతో రూపకల్పన చేశారు. తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు 'తెలుగు' పత్రికను నెలకొల్పి, తెలుగు భాషా పరిశోధనను విస్తృతం చేశారు. జ్యోతిషశాస్త్రం ఆయనకు అభిమానమైన విషయం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఐదు సంవత్సరాలు జ్యోతిష విభాగాధిపతిగా పనిచేసి 1994లో పదవీ విరమణ పొందారు.

అభినవకవితా ప్రవర్తకుడు రాయప్రోలు సుబ్బారావు అల్లుడైన వీరభద్రరావు తెలుగు పరిశోధనారంగంలో 'తన' దైన స్థానాన్ని భద్రపరచుకొన్నారు. ఆయన సతీమణి పేరు లలిత (రాయప్రోలు తొలికృతి నామధేయం) కాగా, కుమారుని పేరు శ్రీసుధీ (రాయప్రోలు పద్యాలలోని ఒక మకుటం 'సుధీ'). వారి నివాసం 'లలితా కుటీరం'.

పైన పేర్కొన్న ఉద్గ్రంథాలేకాక, నేషనల్ బుక్‌ట్రస్ట్, సాహిత్య అకాడమీ సంస్థల పక్షాన అనువాద గ్రంథాలు కూడా ప్రకటితమైనాయి. సర్‌ఆర్థర్‌కాటన్ (తెలుగు), వంగసాహిత్య చరిత్ర (ఆచార్య సుకుమార్ సేన్), గురునానక్, కొండమీద మంట (అనితాదేశాయ్ ఆంగ్ల నవల 'ఫైర్ ఆన్ ది మౌంటెన్') మొదలగునవి వారి ప్రచురిత గ్రంథాలు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జీవిత, సాహిత్యాలపై వ్రాసిన చివరి గ్రంథం ఆ మహాకవిపై ఆయనకు గల గౌరవాభిమానాలను ద్యోతకం చేస్తుంది. ఇవి కాక సదస్సుల పత్రాలు, వ్యాసాలు కూడా ముద్రితం కావలసిన అవసరం ఉంది. వీరభద్రరావు సాహిత్య, వ్యక్తిత్వాల్లో డాక్టరేట్ పరిశోధనలకు వలసినంత విస్తృత సమాచారం లభిస్తుంది.

ఇంతటి విద్వన్మూర్తి అయిన కొత్తపల్లివారు వివిధ శాఖల్లో పనిచేయటం చేత పదవీ విరమణ తర్వాత పొందవలసిన పెన్షన్ చాలాకాలం వరకూ అందక ఇబ్బందులకు గురియైనారు. చివరకు శంకర్‌దయాళ్‌శర్మ జోక్యంతో పెన్షన్ లభించినట్లు ప్రతీతి. మన వ్యవస్థ ప్రభుత్వరంగంలోని లోపాలకు ఇది మచ్చుతునక.

మద్రాసు విశ్వవిద్యాలయం 'సెమినార్'లో పాల్గొంటున్న సమయంలో వారికి గుండెపోటు వచ్చింది. ఆ సెమినార్‌లో పాల్గొన్న నేను సాహితీ మిత్రులతో కలిసి అక్కడి విజయాసంస్థ ఆస్పత్రిలో ఆయన్ను సందర్శించాను. అచిరకాలంలోనే వారు కోలుకొని ఆరోగ్యవంతులై నిర్విఘ్నంగా సాహితీ సేవ కావించారు. అనేక సాహితీ సభల్లో వారితో కలిసి పాల్గొన్న సన్నివేశాలు, వారితో సాహిత్య సంభాషణలు మరచిపోజాలనివి.

ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారి విద్వత్తు, సాహితీకృషి కలకాలం మన హృదయాల్లో భద్రపరచుకోదగినవి. తెలుగు సాహితీపరులకు ఆదర్శవంతమూ, స్ఫూర్తిదాయకమూ అయినట్టివి.

(జయంతి,2006)

13. కుందుర్తి ఆంజనేయులు

(1922-1982)



"రచనల పూలతోటలో
ఛందస్సుల పూలమొక్కలు నాటను
భావనలో సామాన్యుడి
జీవితం వలయాలు దాటను".

వచన కవిత్వానికి శ్రీశ్రీ, నారాయణబాబు, శిష్ట్లా మొదలైనవారు నారు పోసిన వారు కాగా నీరు పోసినవాడు కుందుర్తి. అభ్యుదయ కవితాశాఖగా అవతరించి నేడు వటవృక్షంగా రూపొందిన ఈ కవితా ప్రక్రియకు పరివ్యాప్తిని కలిగించిన వారిలో తిలక్, కుందుర్తి ముఖ్యులు. కుందుర్తి వచన కవితను రచించడమే కాదు, దాన్ని ఒక ఉద్యమంగా భావించి ఆ ఉద్యమ ప్రచారానికి అమితంగా పరిశ్రమించిన కవి విమర్శకుడు. ఆయన రచించిన వ్యాసాలు, విమర్శలు, పీఠికలు, సమీక్షలు మొ॥నవి వచనకవితా ప్రాశస్త్యాన్ని నిరూపించే ప్రధానలక్ష్యంతోనే కొనసాగాయి. వచన గేయ స్వరూప స్వభావాలను నిర్దేశించి దాని ప్రగతికి పాటుపడిన కవి విమర్శకులలో కుందుర్తి ఆంజనేయులుగారికి ప్రత్యేకస్థానం ఉంది.

సెవెన్‌స్టార్స్ సిండికేట్ నిర్వహణలో నవకవితావేదికగా కొనసాగి అర్ధంతరంలోనే అంతర్ధానమైన 'నవత' పత్రిక ద్వితీయ, తృతీయ సంచికలలో (1964) వచనకవితా లక్షణాలను వివరిస్తూ కుందుర్తి రెండు వ్యాసాలు ప్రచురించారు. 'వచనగేయం ఒక ఉద్యమం' అను వ్యాసంలో అంతస్సౌందర్య దర్శనం కొరకైన అన్వేషణకు ఫలితంగా వచనగేయం ఆవిర్భవించిందంటూ- భారతకవుల ధర్మదీక్ష, శివకవుల ఆవేశం, భావకవుల ఆత్మాశ్రయపద్ధతి కలిసి వచనగేయం రూపుదాల్చిందని ఉగ్గడించారు. 'తెనుగుకవిత్వపు

భస్మరాసులమీద పారిన ఆకాశగంగ' గా అభివర్ణించడంలో వచనగేయానికి కుందుర్తి దృష్టిలో ఎంత విలువ వుందో అవగతమౌతుంది. అయితే రూపంలో విప్లవం సాధించినంత మాత్రాన వచనకవితకు ఒక ప్రత్యేక తత్త్వం వున్నట్లుగా చెప్పలేము. ఈ సత్యాన్ని గుర్తించిన కుందుర్తి స్థూలంగా అభ్యుదయ తత్త్వాన్ని ఆశ్రయించే ఈ కవితాలత కొనసాగిందని 'హృదయం విప్పి...' అను వ్యాసంలో వెల్లడించారు. అభ్యుదయ కవితాపథంలో ఆవేశం పాలు ఎక్కువగా ఉన్న తొలిదశను గడచి ఆలోచనకు ప్రాధాన్యం యిచ్చిన మలిదశకు వచనకవిత చిహ్నమని ఆయన అభిప్రాయం.

వచనగేయ ప్రక్రియలో కథాకావ్యాల ఆవశ్యకతను నొక్కి వక్కాణించినవారిలో కూడా కుందుర్తి ప్రథముడు. వస్త్వాశ్రయ పద్ధతిని అనుసరించటం వల్ల ప్రాచీన కావ్యాలు జీవితంలోని సర్వలక్షణ వైవిధ్యాన్ని ప్రదర్శించగలిగాయని, ఆ మార్గంలోనే ఉత్తమ కావ్యం వెలువడటానికి అవకాశం వుందని ఆయన విశ్వాసం. కథా సంవిధానం కవితకు అనవసరపు తొడుగు అని తిలక్, రమణారెడ్డి ప్రభృతులు వాదించినా కుందుర్తి సిద్ధాంతం సులభంగా త్రోసివేయదగింది కాదు. ఏమాత్రం కథాంశంలేని కవితలు కేవలం ప్రబోధగేయాలు, వర్ణనాత్మక రచనలు కావచ్చుకాని రసపోషణ మున్నగు లక్షణాలకు అవి సరితూగవని ఆయన అభిప్రాయం. విజయలక్ష్మి, శీలా వీర్రాజు మున్నగువారి కథా కావ్యాలు ఈ వాదాన్నే బలపరుస్తున్నాయి. వచనగేయరచనకు వ్యావహారికభాష మాత్రమే అనుకూలమైందని ప్రతిపాదించినది కూడా కుందుర్తే. కవిత్వపుశైలి సామాన్య ప్రజల సంభాషణల స్థాయికి దిగి రావాలని ఆయన ఆకాంక్ష.

ఆంధ్రపత్రిక సౌమ్య ఉగాది సంచిక (1969–70) లోని 'వర్తమాన సాహిత్యం–పోకడలు' అను వ్యాసమూ, జనధర్మ పత్రికానుబంధమైన 'స్వాతంత్ర్యోత్తర కాలాన తెలుగుకవిత'(1969) అను సంకలనంలోని వ్యాసమూ గడచిన పాతికేళ్ళలోని కవిత్వ తత్త్వాన్ని చక్కగా విశదీకరిస్తున్నాయి. ప్రస్తుత సమాజంపై అసంతృప్తి, ఈనాటి వ్యవస్థపై తిరుగుబాటు, కొత్త వ్యవస్థకోసం ఆకాంక్ష, దాని రూపురేఖలు తీర్చిదిద్దాలనే ప్రయత్నం అద్యతనాంధ్ర కవిత్వానికి పునాది వేశాయని కుందుర్తి పరిశీలనలో తేలిన సత్యం. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో పెనవేసుకుపోయిన నేటి కాలానికి నిజమైన ప్రతినిధిగా వచనగేయాన్ని పేర్కొంటూ అంతర్జాతీయ భావనాచైతన్యంతో కూడిన నవకవిత పరిధి విశాలమై వస్తువిస్తృతి చెందినందుకు హర్షాన్ని వెలిబుచ్చారు.

అయితే - నవకవితా మార్గంలో నానాటికీ ప్రబలమవుతున్న విశృంఖలత్వాన్నీ, అయోమయత్వాన్నీ కుందుర్తి తీవ్రంగా ఖండించారు. భావకవులు రమ్యతకు, అభ్యుదయ కవులు సాంఘిక ప్రయోజనానికి ప్రాధాన్యం యివ్వగా అద్యతన కవులు వాటిని వదలి వెక్కిరింపును అలవరచుకున్నందుకు నిరసన ప్రకటించారు. గోపాలచక్రవర్తి, కుందుర్తిల సంపాదకత్వంలో ఫ్రీవర్స్ ఫ్రంట్ వెలువరించిన 'వచన కవిత' (1967) గ్రంథంలోని వ్యాసంలో పై అభిప్రాయాలే వెల్లడవుతున్నాయి. వచనగీతికి కూడా కట్టుబాట్లు అవసరమనీ, చమత్కారం కవుల దౌర్బల్యానికి చిహ్నమనీ భావించిన కుందుర్తి ప్రయోజనంలేని ప్రయోగాలతో నిండిన దిగంబరకవుల అరాజక ధోరణిని ఇందులో దుయ్యబట్టారు. సోమసుందర్ ఆధ్వర్యంలో వెలువడిన 'కళాకేళి' పత్రికలోని (ఏప్రిల్ 1968) వ్యాసంలో కూడా నవకవితలోని ఆంగ్లభాషా శబ్దప్రయోగ జనిత చమత్కారాన్నీ, సంస్కృతభాషా పదాడంబరాన్నీ నిరాకరించారు. కావ్యభాషా సాంకర్యమంటే తనకు గిట్టదని ఇతర సందర్భాలలో కూడా ఆయన పేర్కొన్నారు.

లక్షణ విమర్శలేకాక ఉత్కృష్టమైన లక్ష్యవిమర్శకు కూడా సాక్షీభూతమైన వ్యాసాలను కుందుర్తి వెలువరించారు. వరవరరావు ప్రభృతుల నిర్వహణలో కొనసాగిన 'సృజన' పత్రిక వచనకవితా విహాయసంలో ధ్రువతారగా వెలుగొందిన బాలగంగాధర్ తిలక్ అస్తమయ సమయంలో ప్రకటించిన ప్రత్యేక సంచికలో (నవంబర్ 1966) 'నువ్వులేవు - నీపాటవుంది' శీర్షికలో తిలక్ కవిత హృద్యంగా పరామర్శింపబడింది. తిలక్ కవిత ఒక పద్ధతికి కట్టుబడి వుండలేదన్న విమర్శను ఖండిస్తూ బహుముఖ కవితారీతుల ప్రదర్శనాపేక్ష లోపం కాదనీ, వచనగేయ ప్రక్రియలో అన్నిరసాలను ఒప్పించవచ్చుననీ కుందుర్తి సమర్థించారు. కాల్పనికోద్యమపు శబ్దసౌందర్యం, అభ్యుదయ భావనల మేళవింపు తిలక్ విజయానికి ప్రధానకారణమని రమణీయంగా ఉగ్గడించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలశాఖ ఆధ్వర్యాన జరిగిన చర్చాసదస్సులోని (28-2-67) ఉపన్యాసం 'మహాప్రస్థాన కావ్య మీమాంస' పేరుతో 'సృజన'లో (ఆగస్టు 1969) ప్రచురితమైంది. పద్యం - మాత్రాఛందస్సు - వచన గేయం కవితా ప్రస్థానంలో ఏర్పడిన సహజ పరిణామమనీ అది శ్రీశ్రీలో కూడా గోచరిస్తున్నదనీ కుందుర్తి ఇందులో పేర్కొన్నారు. మహాప్రస్థాన కావ్యంలో రూపానికి, వస్తువుకు సమప్రాధాన్యం ఉన్నప్పటికీ రెండవదాని బలమే ఎక్కువగా గోచరిస్తుందంటూ అందలి కథాఖండికలను ప్రశంసించారు. సూటిగా వ్యక్తీకరించటం, సాంఘిక ప్రయోజనం

శ్రీశ్రీ కవిత్వంలోని ప్రత్యేకతలు కాగా, ఆధునిక కవిత్వానికి ప్రజాదృక్పథం కల్పించిన ఘనత శ్రీశ్రీదేనని ఉగ్గడించారు. శ్రీశ్రీ గ్రాంథిక భాషా ప్రయోగాలపై, చమత్కార స్థాయికి ఉదాహరణలైన చాటువులపై నిరసన కూడా ఇందు లేకపోలేదు. అందుకే ఆర్వీయార్ మున్నగువారి ఖండనలకు ఈ వ్యాసం గురైంది.

గోరాశాస్త్రి 50వ జన్మదినం సందర్భంగా ప్రకటితమైన అభినందన సంచిక (ఏప్రిల్ 1969)లోని వ్యాసం రూపంలో చిన్నదైనా గుణంలో దొడ్డది. ఒక తరాన్ని ఉత్తేజపరచిన వచన రచయితగా అభివర్ణిస్తూ, దినపత్రిక జర్నలిజానికి నార్ల వెంకటేశ్వరరావువలె, మేగజిన్ జర్నలిజానికి గోరాశాస్త్రి ఒరవడి దిద్దారని కుందుర్తి సమంజసంగానే భావించారు. గ్రంథాన్ని చదవకుండానే సమీక్ష చేయటం, గ్రంథవిషయ వివరణకన్నా తమ పాండిత్య ప్రకర్షను చాటటమే ప్రధానంగా భావించటం ఆదర్శాలుగా పెట్టుకొన్న సమీక్షకులవలె కాకుండా గ్రంథతత్త్వ ప్రకాశనమే ముఖ్యమన్న ఉద్దేశ్యంతోనే కుందుర్తి సమీక్షలు కావించారనటానికి జయంతి మొ॥ పత్రికలలోని గ్రంథసమీక్షలే ఉదాహరణంగా ఉన్నాయి.


కుందుర్తి విమర్శక హృదయాన్ని విస్పష్టం చేయటానికి 'కుందుర్తి కృతులు' (1975) కు ఆయన రచించిన పీఠిక (ఇదీ నాదారి) అన్నింటికన్నా మిన్నగా తోడ్పడుతున్నది. పైన పేర్కొనబడిన రచనలలోని అభిప్రాయాలకు వేదికగా ఈ భూమిక నిలుస్తుంది. తాను విశ్వనాథ శిష్యుణ్ణని చెప్పుకున్నా, ప్రాచీన కవితపై ఆదరాన్ని కనబరచినా కుందుర్తిని సంప్రదాయ వాదిగా పరిగణించటం అవివేకమే అవుతుంది. ఆవేశం పాలు తగ్గి ఆలోచన పాలు హెచ్చిన మార్క్సిస్టు కవి ఆయన. నూటికి నూరుపాళ్లూ అభ్యుదయ భావనను జీర్ణించుకున్న అచ్చమైన కవి. కుందుర్తి విమర్శలను కూడా ఈ దృష్టితో అనుశీలన చేయటం అవసరం. 1922 డిసెంబర్ 16న గుంటూరు జిల్లా కోటవారి పాలెంలో జన్మించిన కుందుర్తి ఆంజనేయులు 1982 అక్టోబరు 25న పరమపదించారు.

> "నిజం చెప్పలేని పుస్తక సమీక్షల
> పూలదండలకు మెడలు వంచను
> బ్రతుకు కావ్యాల రసౌచిత్యాలు చర్చించే
> విమర్శనలో వ్యక్తిదూషణల మతకలహాలు పెంచను."

*(అడుగుజాడలు వ్యాస సంకలనం, జనవరి **1976**)*

14. వడలి మందేశ్వరరావు

(1922 - 2011)



విమర్శతత్త్వాన్ని సమ్యగవగాహనతో విశ్లేషించిన సద్విమర్శకులు వడలి మందేశ్వరరావు. 1922 డిసెంబర్ 21వ తేదీన పశ్చిమగోదావరిజిల్లా కోనసీమలోని కొమరాజులంకలో రాజేశ్వరి కామశాస్త్రి దంపతులకు జన్మించిన వడలి విద్యాభ్యాసం భద్రాచలం హైస్కూలులో కొనసాగింది. తెలుగు ఉపాధ్యాయులు జటావల్లభుల సూర్య నారాయణశాస్త్రి, తాత కృష్ణమూర్తి, తండ్రి కామశాస్త్రి ఆయనలో సాహిత్యాభిరుచిని రేకెత్తించారు. పిఠాపురం రాజాకళాశాలలో ఆంగ్లోపన్యాసకులు పెద్దాడ రామస్వామి, తెలుగు పండితులు కోపల్లి శివకామేశ్వరరావుల విద్యార్థిగా ఆంధ్రాంగ్లసాహిత్యాలతో పరిచయం ఏర్పడింది. బెనారస్ విశ్వవిద్యాలయం నుంచి ప్రైవేట్‌గా ఏం.ఏ. ఆంగ్లంలో ప్రథములుగా ఉత్తీర్ణులైనారు. రాజమండ్రి శిక్షణకళాశాలలో బి.ఎడ్. చేసి హైదరాబాద్ సీఫెల్ నుండి ఆంగ్లభాషాబోధనలో పి.జి. డిప్లమా పొందారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్రంలో అడ్వాన్స్‌డ్ కోర్స్ చేయటం ఆయన ఆలోచనలో స్పష్టతకు దోహదం చేసిందనవచ్చు.

పాఠశాలల్లో, ఉపాధ్యాయ శిక్షణకేంద్రాలలో, విశాఖపట్నం, తిరువనంతపురం, సీఫెల్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆంగ్లాధ్యాపకుడుగా, ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అనుభవంతో ఆంగ్లభాషాసాహిత్యాలలో నిష్ణాతులుగా రూపొందారు. ఆంగ్ల

పాఠ్యపుస్తకాల రచయితగా, అధ్యాపకుల పునశ్చరణ శిబిరాలకు డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఆనందవాణి వారపత్రికలో 'సాహిత్యవీధి' శీర్షికారచయితగానేకాక, గిడుగు సీతాపతి, శ్రీశ్రీ, ఆంధ్రశేషగిరిరావులు సహసంపాదకులుగా పనిచేయటం ఆయన గొప్ప సాహితీవేత్తగా రూపొందటానికి దోహదంచేసింది. సమదర్శిని సాహిత్య సమాఖ్య అధ్యక్షుడుగా పలుసాహితీ సమావేశాలను నిర్వహించారు.

ఆంధ్రాంగ్ల సాహిత్యాలను నిష్ఠతో అధ్యయనంచేసిన మందేశ్వరరావు సాహిత్యతత్త్వాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకొని ఉత్తమ విమర్శనాదృక్పథాన్ని అలవరచుకొన్నారు. విస్పష్టమైన ఆలోచన, తులనాత్మక వివేచన, సమన్వయ దృష్టికి ప్రతిఫలనమైన పెక్కు విమర్శ రచనలు వెలువరించారు. ఆయన సహృదయతకు గీటురాళ్లుగా సుమారు పది విమర్శ గ్రంథాలు గోచరిస్తాయి – 1. అనుశీలన (1969) 2. సాహిత్యం – విమర్శ (1984) 3. నూరేండ్ల సాహిత్యంలో కొన్ని ధోరణులు దృక్పథాలు (1991) 4. పాశ్చాత్యసాహిత్య విమర్శ చరిత్ర – సిద్ధాంతాలు (1994) 5. సాహిత్య తత్త్వవివేచన (1993) 6. విమర్శ: నాటినుండి నేటికి (1996) 7. సాహిత్య ప్రస్థానం – కొన్ని మజిలీలు (2002). ఇవికాక అనువర్తిత విమర్శకు ప్రశస్తనిదర్శనాలుగా నిలచేవి మూడు గ్రంథాలున్నాయి. – ఇది కల్పవృక్షం (1985), మరోమారు కల్పవృక్షం, శిల్పినన్నయ (1989). రాజు కవితారచన 'సూర్యకతారి'ని The Sun's Dagger పేరుతో ఆంగ్లీకరించిన వడలి ఇరవైరెండు మంది తెలుగుకవులను ఆంగ్లపాఠకులకు పరిచయంచేస్తూ Modern Poetry in Telugu (2002) అన్న విమర్శ గ్రంథం వెలువరించారు. పీఠికలు, పత్రికావ్యాసాలు, సమీక్షలు, రేడియో ప్రసంగాలలో కూడా ఆయన విమర్శనాదృక్పథం సువ్యక్తమవుతుంది.

ప్రాచ్యపాశ్చాత్య విమర్శ దృక్పథాల సమన్వయంతోపాటు తెలుగు సాహిత్యంలోని దేశీయతను వెలుగులోకి తెచ్చిన విశిష్ట విమర్శకులు మందేశ్వరరావు. పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలు, భారతీయ అలంకారశాస్త్రప్రస్థానాలు, తెలుగుకవుల దృక్పథాలు ముప్పేటగా కలబోసుకున్న విమర్శమార్గం ఆయనది. సాహిత్య విమర్శ సూత్రాలు, అనువర్తిత విమర్శవ్యాసాల సంకలనాలు ఆయన విమర్శగ్రంథాలు.

తొలిగ్రంథం 'అనుశీలన'లో విమర్శ లక్షణాలు – భేదాలు, కవి విమర్శకుల సంబంధాలు విస్పష్టంగా వివేచితమైనాయి. 'సాహిత్యం – విమర్శ' మొదటి ప్రకరణంలోని ఐదువ్యాసాలలో సాహిత్యం – విమర్శ, సాహిత్యం– శాస్త్రం, కవితలో శిల్పం, క్లాసిక్ – రొమాంటిక్, సాహిత్యం– ఆధునికత అంశాలు పరామర్శితమైనాయి. విమర్శ సృజనశక్తిలోని భాగమనీ, కవిలో విమర్శనాపాటవం అంతర్లీనంగా ఉంటుందనీ, వ్యాఖ్యాత, ఆలంకారికుడు మన సంప్రదాయంలోని విమర్శకుని రూపాలని వడలి భావించారు. భావనాత్మకమైన కావ్యం హృదయ ప్రధానమని, ఆలోచనాత్మకమైన శాస్త్రం బుద్ధి ప్రధానమని, కావ్య – శాస్త్రాల భాషాభివ్యక్తిలో తేడా ఉంటుందని పేర్కొన్నారు. భారతీయాలంకారశాస్త్రంలో సాహిత్య వివేచన ఉన్నత శిఖరాలనందుకొన్నదని ఉగ్గడించారు. లలితకళలైన శిల్ప, చిత్ర లేఖనాలు కవితాకళలో ప్రతిఫలిస్తాయంటూ కవిత్రయం వారి కవితా శిల్పాన్ని విశదీకరించారు.

పాశ్చాత్య విమర్శద్వారా వ్యాప్తికి వచ్చిన క్లాసిసిజం, రొమాంటిసిజంలగురించి విస్తృతంగానే చర్చించారు వడలి. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాల ఫలమైన క్లాసిసిజం, భావావేశపూరితమైన (అద్భుతదర్శనం) రొమాంటిసిజం రెండూ విభిన్న దృక్పథాలైనా లయబద్ధంగా అవి ఎక్కడో ఒకచోట కలుసుకొంటాయని పేర్కొన్నారు. ఉభయకవుల సాహిత్యాన్ని విశ్లేషిస్తూ ఆసక్తికరమైన చర్చచేశారు.

"గురజాడ నాటకంలో క్లాసిస్ట్, కవితలో రొమాంటిస్ట్‌లా కనబడతాడు. "రొమాంటిస్ట్‌గా ప్రారంభించి క్లాసికల్ కవిగా పెరిగినవాడు విశ్వనాథ..... కవిత్వ పరిధిని విస్తృతపరచిన ఈన ఒక్కడే మనకు మంచి క్లాసిక్."

కవిత్వాన్ని ప్రజాపరం చేయటంఅన్న క్లాసికల్ లక్షణానికి శ్రీశ్రీ మంచి ఉదాహరణ" (సాహిత్యం – విమర్శ, పు. 72–78)

"మనరొమాంటిక్ యుగం ముగిసింది. క్లాసికల్ యుగంలోకి అడుగుపెట్టాం." అని భావించిన వడలిని 'నడుస్తున్న ఆలోచన'గా ఉగ్గడించారు జి.వి. సుబ్రహ్మణ్యం.

సాహితీప్రపంచానికి ఆత్మీయ మిత్రులైన తంగిరాల వెంకట సుబ్బారావు ప్రోత్సాహంతో వడలివారి సప్తతి సందర్భంగా ప్రచురితమైన వ్యాససంపుటి 'సాహిత్య

తత్త్వ వివేచన'లో సాహిత్య సిద్ధాంతాలు, విమర్శ పద్ధతులు మరోసారి హృద్యంగా పరామర్శితమైనాయి. సాహిత్య ప్రయోజనం గురించి ఎవరు ఎన్నివిధాలుగా చెప్పినా భారతీయ దృష్టిలో ఆనందమే చరమలక్ష్యమనీ, లాంగినస్ మున్నగు పాశ్చాత్యులుకూడా 'రమణీయోదాత్తత' (Sublimity) ను ఉదాత్త వాక్కుకు ఫలంగా భావించారని స్పష్టీకరించారు. కావ్యసృష్టికి హేతువులు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలు అని ఆలంకారికులు పేర్కొంటే – అనుకరణ (Imitation) హేతువన్నది పాశ్చాత్యుల అభిప్రాయమని వచించారు. కవి అనుభూతి, సమకాలీన ప్రభావంతోపాటు అలంకారశాస్త్రం నిర్దేశించిన గుణాలంకారరీతులు, శబ్ద శక్తులు కవిత్వం అస్తిత్వాన్ని నిర్ణయిస్తాయంటూ కవిలోని సృజనాత్మకత, శైలి, సహృదయుని తాదాత్మ్యతపై కావ్యవిలువలు ఆధారపడి ఉంటాయని ఉగ్గడించారు. "కవి ఆశయం మనకు దొరికేది కావ్యంలోనేకాని కవితోజరిపిన ఇంటర్వ్యూలో కాదు" అనటం వడలి విమర్శక హృదయాన్ని పట్టి ఇస్తుంది.

"కవిని గురించి కాక కావ్యాన్ని గురించే మాట్లాడాలి. అప్పుడే అది 'సాహిత్య' విమర్శ అవుతుంది.... కావ్య విమర్శకు 'కావ్యమే' కాని కవి 'వస్తువు' కాదు" (జీవనరేఖలు – తాళ్లపల్లి మురళీధరగౌడ్, పు.11) అన్నమాటలుకూడా దీన్ని సమర్థిస్తాయి.

"కావ్యమూల్యాన్ని నిర్ణయించడం తత్కాల అభిరుచులమీదా, తత్కాల సాహిత్య విలువల మీదా, ఆనాటి సామాజికాది దృక్పథాలమీదా ఆధారపడి ఉంటుంది. కనుక కావ్యమూల్యానికొక స్థిరత్వముండదు. కాని సాహిత్య సౌందర్యాన్ని పోషించే విలువలకు సాపేక్షంగా స్థిరత్వముంటుంది. ఇది శ్రోతలో విలక్షణమైన అనుభవాన్ని కల్గిస్తుంది. ఈ అనుభవం ఏకైకమైనదిగా ఉండక, బహుముఖంగా ఉండడమే సాహిత్య సౌందర్య లక్షణం.... ఇట్టి కావ్యసౌందర్యం బహిర్గత మవడానికి భావుకునిలోని భావయిత్రీ ప్రతిభ జ్వలియించాలి." (సా.త.వి.పు. 115)

"అందుచేత మార్క్సిస్టు శాస్త్రీయ దృక్పథంతో చూసినప్పుడు ఒకానొక రచన లోపభూయిష్ఠంగా కనబడితే అది సాహిత్యంకాదని నిర్ణయించలేము. అది మార్క్సిస్టు దృక్పథాన్ని ప్రతిబింబించే రచన కాదని మాత్రమే అనగలం. ఆ రచనలో మానవీయ

సంబంధాలు, శిల్పాదులు ఎంతవరకు తృప్తికరంగా ఉంటాయో అంతవరకూ అది సాహిత్యమే. ఇది ఒక్క మార్క్సిస్టు దృక్పథానికే కాదు, మరి ఏ ఇతర సాహిత్యేతర ప్రమాణాలతో సాహిత్యాన్ని సమీపించడానికైనా వర్తిస్తుంది." (సా.త.వి., పు. 106)

పై అభిప్రాయాలు మందేశ్వరరావుగారి సమ్యక్ అవగాహననూ, విస్పష్టమైన అవలోకననూ ప్రతిబింబిస్తాయి. 'నూరేండ్ల సాహిత్యంలో కొన్ని ధోరణులు - దృక్పథాలు' లోని మొదటి వ్యాసం అటు పాశ్చాత్యదేశాల్లో, ఇటు తెలుగుదేశంలో ప్రవర్తిల్లిన సాహిత్య ఉద్యమాలు, ధోరణులను పరామర్శిస్తే, రెండోవ్యాసం (తెలుగులో సాహిత్య విమర్శ - కొన్నిమజిలీలు) పై ఉద్యమాల నేపథ్యంలో కొనసాగిన తెలుగు విమర్శ పరిణామ వికాసాలను విశదీకరిస్తుంది. "వస్తువును స్వీకరించడంతో పాటు దానిని కవిత్వంగా మలచడంలోనే కవిశక్తి ఇమిడి ఉంది."అన్న అభిప్రాయం ఇందులో స్పష్టమవుతుంది. (పు. 45)

కళాతత్త్వ వివేచన కావించిన మరొక గ్రంథం 'సాహిత్య ప్రస్థానం - కొన్ని మజిలీలు'. "సాహిత్య విమర్శ, కళాతత్త్వవివేచేన - ఒకవంక భావనాశక్తినీ, అతీంద్రియతనూ ఆదరిస్తూ మరొకవంక వస్త్వాశ్రయమైన శాస్త్రీయ దృక్పథాన్నీ గౌరవిస్తున్నాయి. అదేవాని విశిష్టత." (పు.17). కవి - సామాజికుల లక్షణాలను సవిస్తరంగా చర్చించిన వడలి భావకవిత మొదలుకొని స్త్రీ చైతన్య, దళితవాద, ఆధునికోత్తర సందర్భాలలో సామాజికుని (సహృదయ పాఠకుని) చైతన్య స్పందనను చక్కగా విశదం చేశారు. "ఆధునికోత్తర సందర్భాన వస్తూన్న సాహిత్యమంటే అది..... ఒక ఉద్యమస్థాయిలో ఉన్నదికాదు. దానికొక మానిఫెస్టో లేదు. హఠాత్తుగా వచ్చిందీకాదు. ఆధునికకాలం అనబడేదాని అనంతరాన క్రమోన్మీలమవుతూన్న ఆలోచనలూ, అభివ్యక్తి ఎట్టివై ఉంటాయన్న పరిశీలన అవసరం. సాహిత్యం సజీవ స్రవంతి. మార్పు దాని స్వభావం. అంచేత సాహిత్యంలో సహజంగా వచ్చే ఈ మార్పును చూసి బెంగపడవలసిన పనిలేదు కాని అది ఎట్టిదో గుర్తుపట్టడం మాత్రం అవసరం" అన్న ముందుమాటలోని వాక్యాలు ఆయన విమర్శరీతిలోని అత్యాధునిక దృష్టిని చాటుతాయి.

"దళిత స్త్రీ వాదకవులు కావ్యశబ్దపరిధిని విస్తృతపరచడమే కాకుండా కొత్త పద బంధాలను సృష్టిస్తున్నారు. కొత్త శబ్ద - భావచిత్రాలను అల్లుతున్నారు. స్వయంవ్యక్తిత్వం కోసం ప్రయత్నిస్తున్నారు". ఇది మంచి పరిణామం అన్న పురోగమనశీలి ఆయన. ఇంకా ఆధునిక తెలుగు సాహిత్య విమర్శగురించిన కోవెల సంపత్కుమార వ్యాసంపై ప్రతిస్పందన, వచనకవిత పూర్వాపరాలు, సంపత్కుమార 'ఆముక్త' కావ్య సమీక్ష, మునిపల్లెరాజు కథలకు పీఠిక మొదలైనవి ఈ సంపుటిలో చోటుచేసుకొన్నాయి. క్లాసిక్ - రొమాంటిక్ వ్యాసం ఇందులో పునరుక్తమైంది. డా॥ సుమనశ్రీ, వాడ్రేవు చినవీరభద్రుడు చేసిన ఇంటర్వ్యూలో "గణితంలోవుండే 'రిగర్' విమర్శలోకి రావాలని" ఆకాంక్షించారు.

ఆంగ్లసాహిత్య వివేచనలో వడలివారు ప్రదర్శించిన ప్రజ్ఞాపాటవాలను గుర్తించిన తెలుగు విశ్వవిద్యాలయంవారు ఆయన 'పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర - సిద్ధాంతాలు' గ్రంథాన్ని ప్రకటించారు. ప్లేటోనుంచి ఇరవైయవశతాబ్ది చివరివరకూ గల ప్రధాన విమర్శ ధోరణుల చరిత్రతోపాటు ఆయాసిద్ధాంతాలు ఒకదానినుండి మరొకటి ఎలా ఉత్పన్నమైనాయో వివరించిన తీరును పరిశీలిస్తే ఈ గ్రంథ నామసార్థక్యం బోధపడుతుంది. అంతటితో ఆగకుండా తులనాత్మక విమర్శలోకూడా ఆయన ప్రత్యేకత అవగతమవుతుంది. భారతీయ - పాశ్చాత్య విమర్శ సిద్ధాంతాలు ఎక్కడ సమన్వయిస్తాయో, ఎక్కడ విభేదిస్తాయో క్షుణ్ణంగా అవగాహన కలిగిన నిశిత విమర్శనావీక్షణం ఆయనది.

సాహిత్యం, విమర్శ స్వరూపస్వభావాలను సుస్పష్టంగా సమాలోచించిన వడలి మందేశ్వరరావు అనువర్తిత విమర్శలోనూ ప్రత్యేకతను చాటుకొన్నారు. ప్రాచీనుల్లో నన్నయ్య, ఆధునికుల్లో విశ్వనాథ ఆయన అభిమానకవులు. అందుకే వారిపై ప్రత్యేక విమర్శ గ్రంథాలు వెలువరించారు. 'శిల్పి నన్నయ'లో (1989) ఆది, సభాపర్వాలలోని కవితాశిల్పాన్ని హృద్యంగా వివేచించారు. "కవితా, శిల్పమూ రెండూ పరస్పరాశ్రయాలు మాత్రమే కావు. అవి ఒక దానిమీద ఒకటి నిరంతరమూ జరిపే రసాయనిక చర్యవల్లనే కావ్యం ఆవిర్భవిస్తుంది. అందుచేతనే నన్నయ కవీ,

శిల్పీకూడా." నన్నయ కథాకథనం ప్రసన్నంగా ఉంటూన్నట్లు కనబడుతూ సాంద్రంగా ఉంటుంది. ఉపాఖ్యానాలతోపాటు ప్రధానకథలో గోచరించే సాంద్రతను అనిదంపూర్వకమైన 'లోచూపు'తో విశదీకరించారు వడలి.

సాధారణంగా 'శిల్పి' అనగానే తిక్కన పఠితలముందు మెదలుతాడు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నన్నయ్య-తిక్కనల మార్గాలలోని భిన్నత్వాన్ని చక్కగా విశ్లేషించారు. "తిక్కన పద్యంలోని 'రిగర్' కాని, సాంద్రతకాని నన్నయపద్యంలో కనబడదు. ఇక నన్నయ కథాకథనంలోని సాంద్రత తిక్కనలో దొరకదు. కథనం చెప్పడంలో తిక్కన విశ్రాంతిని కల్పిస్తాడు, పద్యం చెప్పడంలో మాత్రం ఎక్కడా బిగువు సడలకూడదు. నన్నయ సరిగ్గా దీనికి వ్యతిరేకమైన మార్గాన్ని అవలంబిస్తాడు. పద్యం చెప్పడంలో శ్రోతకు విశ్రాంతిని, హాయిని కలిగిస్తాడు కాని కథనం విషయంలో మాత్రం మహా పట్టుదల కనబడుతుంది. ఏ పరిస్థితులలోనూ సాంద్రత దెబ్బతినకూడదు." (పు. 85,86) తర్వాతికవులు దురదృష్టవశాత్తూ పద్యం చెప్పేమార్గంలో నన్నయను, కథను చెప్పేతీరులో తిక్కనను అనుకరించటంవల్ల తెలుగుపద్యంలో అందం మిగిలిపోయింది, కథలో సాంద్రత సన్నగిలింది అన్న వడలి అభిప్రాయం సహృదయ పరిశీలనార్హమైనది.

భారతకథకు నాయకుడు శ్రీకృష్ణుడు కాడని, నాయకునికి కావలసిన లక్షణాలన్నీ ధర్మరాజులో ఉన్నాయని ఆయన భావించారు - "నాయకునికి ప్రధానలక్షణం ఇతివృత్తమంతా అతని చుట్టూ అల్లుకొని ఉండడం. భారత కథ అంతా ధర్మరాజు చుట్టూ అల్లుకొని ఉన్నది కాని శ్రీకృష్ణుని చుట్టూ అల్లుకొనిలేదు." (పు. 92) కుమారాస్త్ర విద్యాప్రదర్శన సమయంలో "పృథ అనే అరణివల్ల ఉద్భవిల్లిన పాండవ అగ్నిత్రయం నా కులముయొక్క దురితములనెడు మహారణ్యాన్ని కాల్చివేస్తుంది." అన్న ధృతరాష్ట్రుని వాక్కులలోని విధివైపరీత్యాన్నీ (Irony), సభాపర్వంలోని నాటకీయత మున్నగు అంశాలనూ ఎత్తిచూపటంలో వడలి నిశిత విమర్శనాదృష్టి ద్యోతక మవుతుంది.

ఉత్కృష్టమైన అనువర్తిత విమర్శకు ఎత్తిన పతాక మందేశ్వరరావుగారి కల్పవృక్షకావ్యానుశీలనం. ఇది కల్పవృక్షం, మరోసారి కల్పవృక్షం గ్రంథాలరూపంలో ఈ విమర్శ ప్రకాశమానమైంది. ఆరుకాండలలోని కావ్యశిల్పం 'ఇది కల్పవృక్షం'లోని

ప్రకరణాలలో పరమోదాత్తంగా వ్యాఖ్యాతమైంది. సర్వకవిత్వమర్మవిదుడైన విశ్వనాథ సాహితీవ్యక్తిత్వాన్ని నిరూపించే కథనశిల్పం, శబ్ద ప్రయోగం, పాత్రచిత్రణం, నాటకీయత, వర్ణనావైదగ్ధ్యం, అలంకారసామగ్రి, ఛందఃప్రయోగం, ఔచితీశోభ మున్నగు సకలాంశాలు ఇందులో సోదాహరణంగా ప్రదర్శితమైనాయి. ఎవరూ ఊహించలేని భావాలు, మలుపులు రామాయణ కల్పవృక్షంలో గోచరిస్తాయి. "కథ రామకథే, కాని కథలోని మలుపులన్నీ క్రొత్తవిలా కనబడతాయి. పాత్రలు ప్రాతవే, కాని వానిమనసులలోని లోతులను త్రవ్వడం కొత్తది." క్రొత్తకోణాలనుంచి చూస్తేనే జాతిని జాగరితం చేసే శక్తి అందులో ఎక్కడ ఉందో అర్థమవుతుంది. 20వశతాబ్ది వాళ్లకు – ఇంకా అనంతరకాలం వాళ్లకు కూడా – తమకోసమే ఈ కావ్యం వ్రాసినట్టు అనిపింపజేస్తుంది అంటారు వడలి.

నన్నయ, తిక్కనలతో తులనాత్మకవివేచన కూడా కల్పవృక్ష విమర్శలోని విశిష్టత. వశిష్ఠునికథలో నన్నయ కథ అంతా వశిష్ఠుని దృష్టితో చెప్పబడగా, విశ్వనాథ కథ అంతా విశ్వామిత్రుని దృష్టినుంచి చెప్పబడింది. అలాగే నన్నయ ఋష్యశృంగునికథకూ విశ్వనాథచెప్పిన కథకూ వనానికీ, పురానికీ ఉన్నంత తేడా ఉంది. అరణ్యకాండలో రాముడు ఖరదూషణులతో చేసిన యుద్ధవర్ణన తిక్కన యుద్ధవర్ణనలను కూడా అధిగమించిందని పేర్కొన్నారు. కిష్కింధకాండలోని ఋతువర్ణనల వైశిష్ట్యాన్ని వివరిస్తూ "ముందుముందు ఋతువులను ఇంత చక్కగా, నిశితంగా పరిశీలించగల్గిన కవి మనకు రాకపోవచ్చును." అని ఉగ్గడించారు.

"కల్పవృక్షం సంప్రదాయంలో వేళ్లూని ఉంది. కవి ప్రతిభాక్షేత్రాన్ని చీల్చుకొని వచ్చింది. సమకాలీన వాయువీచికలు, సకలాంధ్ర సాహిత్యాంశువులు దీనిమీద ప్రసరించాయి" అంటూ వాస్తవికతా దృష్టితో పూర్వవిమర్శకులెవరూ స్పృశించని కోణాలనుంచి దర్శించటం వడలి విమర్శనా ప్రతిభకు ప్రతిఫలనం. కవికే కాకుండా విమర్శకునికీ అవసరమైన ప్రతిభా వ్యుత్పత్తులను పుష్కలంగా పండించుకొన్న ఆయన సృజనాత్మకతకూ, భావుకతకూ నిలువెత్తు నిదర్శనలు విశ్వనాథ విమర్శలు.

వడలి వారి అనువర్తిత విమర్శనారీతికి సాక్ష్యాలుగా మరికొన్ని వ్యాసాలు పై వ్యాససంపుటులలో గోచరిస్తాయి. వరూధిని కలభాషిణులు వ్యాసంలో ఆ గంధర్వ

– మానవాంగనలలోని సామ్యవైషమాలు చిత్రితమైనాయి. 'రుద్రకవి నిరంకుశోపాఖ్యానం' లో 'కవిత్వ తత్త్వ ధౌరేయత' కేవలం శబ్దగతమైనది కాగా, సుగ్రీవ విజయంలో శిల్పసంబంధమైనదిగా భావించారు. సామాన్యుడైన 'కన్యాశుల్కంలో అసిరిగాడు' పాత్రచిత్రణలో గురజాడ ప్రతిభను, కృష్ణశాస్త్రి శ్రవ్యనాటికలలోని గుహుడు ధనుర్దాసుల తారతమ్యాన్ని వివరించిన వ్యాసాలు పాత్ర పరిశీలనారీతిలో ప్రత్యేకతను చాటుతాయి. గురజాడ రచనల్లో మాండలికాలు, ప్రజలభాషలో పాటలు – నాడూ నేడూ వ్యాసాలు, తూమాటి దొణప్ప గ్రంథసమీక్షలు వడలివారి భాషాశాస్త్ర పరిజ్ఞానాన్ని వెల్లడిస్తాయి.

'విమర్శ: నాటినుండి నేటికి' ఆయన వ్యాసాలు, సమీక్షలు, పీఠికలు, జ్ఞాపకాల సంకలనం. ఇందలి మొదటిభాగంలో భారతీయసాహిత్య దృక్పథం, అభినవ విమర్శ, నవ్య సంప్రదాయం, స్త్రీవాదం మున్నగు అంశాల విశ్లేషణతో కూడిన పదివ్యాసాలున్నాయి. తర్వాతిభాగంలో శేషేంద్ర, పేర్వారం, ఎండ్లూరి సుధాకర్, పమిడి రామనరసింహం మొదలగు వారి గ్రంథాల ముందుమాటలు, సమీక్షలున్నాయి. ఆది – సభాపర్వాలను (శిల్పినన్నయ) వివేచించిన వడలి స్త్రీపర్వంనుండి స్వర్గారోహణ పర్వాలవరకు గల వస్తువును (శోకంనుండి స్వర్గానికి) కథారూపంలో వెలువరించారు.

వడలి మందేశ్వరరావు విమర్శలు ఆయన విస్పష్ట వివేచనకు, సమన్వయ దృక్పథానికి గీటురాళ్లు. నన్నయ పద్యాన్నయినా, శ్రీశ్రీ గేయాన్నయినా సమచిత్తంతో విశ్లేషించగల సమదర్శి ఆయన. విమర్శలో ఆయన అవలంబించిన శైలి శరత్కాల ప్రవాహంలా స్వచ్ఛంగా సాగుతుంది. అన్వయకాఠిన్యానికి, అస్పష్టతకు తావివ్వని ఆయన రచనలు పాఠకులతో స్నేహంచేస్తున్నట్లుగా, ఆత్మీయంగా ఉంటాయి.

సహస్రచంద్రదర్శనం పూర్తిచేసుకొన్న మందేశ్వరరావుగారు ప్రశాంతజీవితం గడుపుతూ తమ 89వ ఏట 7–3–2011 నాడు కాలధర్మం చెందారు. ఆయన సాహితీసేవకు గుర్తింపుగా మచిలీపట్నం కవిప్రభాపురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, జి.వి.ఎస్. సాహిత్య విమర్శ పురస్కారం మొదలైనవి

పొందారు. 'ఇది కల్పవృక్షం' గ్రంథానికి కాకినాడ విశ్వనాథ సాహిత్యపీఠం బహుమానం లభించింది. తెలుగుభాషా సంస్కృతులను గాఢంగా అభిమానించిన వడలివారి సందేశాన్ని పాటించడం మన కనీస కర్తవ్యం.

"మనకు మన సంస్కృతినీ భాషనూ పోషించుకోవలసిన అవసరం ఉండడంవల్ల, వెయ్యేండ్ల సాహిత్యాన్నీ కాలదన్ని ఏనాటికానాడు నిన్న, నేడు పుట్టిన, పుట్టబోతున్న రచనలే తెలుగుభాషా సాహిత్యాలనుకోవడం చాలా ప్రమాదకరం. ప్రపంచంలో చాలాభాషలు, సంస్కృతులు దుస్థితిలో ఉన్నాయి..... మనం వెయ్యేండ్ల సాహిత్యాన్ని కన్నెత్తి చూడకపోతే, మన కండ్లను మనమే పొడుచుకున్నట్లవుతుంది."

15. బిరుదురాజు రామరాజు

(1925–2010)

జాతీయాచార్యులు, పరిపాలనాదక్షులు, పరిశోధనాగ్రగణ్యులు అయిన బిరుదురాజు రామరాజు గారు పరమపదించటంతో (8 ఫిబ్రవరి 2010) తెలంగాణమే కాదు యావదాంధ్ర దేశమూ ఒకమహోన్నత వ్యక్తిని కోల్పోయింది. ఆయన జాతీయతకు ప్రతిరూపం. సంస్కృతికి నిలువెత్తు స్వరూపం. పల్లె పదాలకు పట్టుగొమ్మ. సాహితీ విద్వన్మూర్తి. జానపద వాఙ్మయ పరిశోధన పరికీర్తి.



రామరాజుగారు వరంగల్ జిల్లా దేవునూరులో 1925 ఏప్రిల్ 16వ తేదీన లక్ష్మీదేవి, నారాయణ దంపతులకు జన్మించారు. మడికొండ, వరంగల్‌లలో పాఠశాల, ఇంటర్ విద్యను పూర్తిచేసి, హైదరాబాద్ నిజాం కళాశాల నుంచి బి.ఏ. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల నుంచి ఎం.ఏ.డిగ్రీలు పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఎం.ఏ. చేసిన మొదటి విద్యార్థి పల్లా దుర్గయ్య కాగా, ఎం.ఏ. తెలుగు ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులైన (1951) మొదటి విద్యార్థి రామరాజు గారు. అంతేకాదు తెలుగు శాఖలో తొలి డాక్టరేట్ పొందిన (1956) కీర్తి కూడా ఆయనకే దక్కింది. 1952లో అధ్యాపక వృత్తి చేబట్టి రీడర్(1957), ప్రొఫెసర్(1968) పదోన్నతులు పొందారు. తెలుగు శాఖ అధ్యక్షులుగా (1973–83), ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్‌గా (1978–82), వరంగల్ పి.జి. సెంటర్ ప్రిన్సిపాల్‌గా (1968–74) బాధ్యతాయుతమైన ఉన్నతపదవులు నిర్వహించారు. యుజిసి జాతీయాచార్యులుగా పరిగణన పొంది (1980–81), పదవీవిరమణ తర్వాత (1983) రెండేళ్ళు(1984–86) ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా

కొనసాగారు. 1976 లో కాకతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కృషి సలిపి దాని రూపకల్పనకు దోహదం చేశారు.

రామరాజుగారి పరిశోధనా ప్రతిభ బహుముఖీనంగా ప్రదర్శితమై పలువురి ప్రశంసలకు పాత్రమైంది. జానపద వాఙ్మయ పరిశోధన – సేకరణ, చారిత్రక పురుషులు, కవులు, పరిశోధకులు, యోగిపుంగవులు మున్నగు మహనీయుల చరిత్రలు వెలుగులోకి తేవటం, కావ్య పరిష్కరణ – ముద్రణ, నిఘంటురచన, శ్రీసత్యసాయి వాఙ్మయ సంకలనం మొదలైన వివిధ ప్రక్రియారూప పరిశోధనలు చేబట్టి సిద్ధహస్తులనిపించుకొన్నారు.

తెలంగాణా వైతాళికులు సురవరం ప్రతాపరెడ్డి నుంచి స్ఫూర్తి నందుకున్న రామరాజు గారు విశ్వవిద్యాలయస్థాయిలో జానపద సాహిత్య పరిశోధనకు ఆద్యులైనారు. జానపద సాహిత్య సేకరణ – విశ్లేషణ – వర్గీకరణకు మార్గదర్శకమైన ఆయన సిద్ధాంత గ్రంథం 'తెలుగు జానపద గేయ సాహిత్యము' (1958) ఆ ప్రక్రియకు చెందిన విజ్ఞాన సర్వస్వం. ఆయన పర్యవేక్షణలో నలభై మందికి పైగా పిహెచ్.డి., ఎం.ఫిల్. డిగ్రీలు తీసుకున్నారు. మాతృ సంస్థ అయిన ఉస్మానియా తెలుగు శాఖ ఆధ్వర్యంలో జానపద విజ్ఞాన మ్యూజియంకు దోహదం చేశారు. జానపద సాహిత్య సర్వే (1980–83) డైరెక్టర్‌గా కొనసాగారు. 1972 నుంచి జానపద సాహిత్య పరిషత్తు గౌరవాధ్యక్షులుగా ఉన్నారు.

రామరాజుగారు సంస్కృతాంధ్ర ఆంగ్ల ఉర్దూ భాషలలో నిష్ణాతులు. ఎం.ఏ. సంస్కృతం డిగ్రీ పొందటమే కాక 'సంస్కృత సాహిత్యానికి ఆంధ్రుల సేవ' పై విస్తృతమైన పరిశోధన గ్రంథం (Contribution of Andhras to Sanskrit Literature -2002) వెలువరించారు. ఉర్దూ – తెలుగు నిఘంటు నిర్మాణంలో పాలుపంచుకొన్నారు. హిందీ, ఆంగ్ల భాషా గ్రంథాలను (జాతక కథలు, గురుగోవింద సింగ్, ప్రేంచంద్) తెలుగులోకి అనువదించారు. జానపద విజ్ఞానానికి సంబంధించిన ఆరు గ్రంథాలను ఆంగ్లంలో రచించారు.

కావ్య పరిష్కర్తగా, పీఠికా రచయితగా కూడ ఆయన వాసికెక్కారు. శ్రీకృష్ణదేవరాయల జాంబవతీ పరిణయము, కాళహస్తికవి సంస్కృత 'వసుచరిత్ర' శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ్యము, కదిరీపతి శుకసప్తతి, చింతలపల్లి ఛాయాపతి రాఘవాభ్యుదయము,

బొద్దుచెర్ల తిమ్మన ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధము మున్నగు అలభ్యకావ్యాలను సేకరించి, పరిష్కరించి, విపుల పీఠికలతో ప్రకటించారు. ఇంకా మధురవాణి రామాయణసారతిలకం, అభినవ కాళిదాసు శృంగార శేఖర బాణము, తి.ట.శ్రీనివాసాచార్యుల వేంకటార్య విజయ వైజయన్తి, అణ్ణమాచార్యుల రసోదరబాణః మొ॥ సంస్కృత కావ్యరూపకాలు, సాయపనేని వెంకటాద్రినాయకుని సకల జీవ సంజీవనం, మడికిసంగన పద్మపురాణం, రఘునాథనాయకుని వాల్మీకి చరిత్ర మొ॥ తెలుగు కావ్యాలు వారి పరిష్కరణలో పీఠికలతో ప్రచురితమైనాయి.

చరిత్రపుటలకెక్కని ఎందరో అజ్ఞాత వ్యక్తులు, కవులను వెలుగులోకి తెచ్చిన ఖ్యాతి రామరాజు గారికి దక్కింది. అధ్యాపక వృత్తిలో చేరిన వెంటనే తెలుగు వీరుడు (1952) చారిత్రక నవల, వీరగాథలు (1954)రచించారు. 1954లోనే కృష్ణా పత్రికలో 'తెలంగాణా కవి మిత్రులు' శీర్షికలో వట్టికోట, దాశరథి మున్నగు యువకవులను పరిచయం చేశారు. గోలకొండ పత్రిక ద్వారా (1960-61) 'మరుగుపడిన మాణిక్యాల'ను వెలికితెచ్చారు. 'చరిత్ర కెక్కని చరితార్థులు'లో (1985) 22 మంది తెలుగు కవులను, 12గురు సంస్కృత కవులను సాహిత్య లోకానికి పరిచయం చేశారు. దేవులపల్లి రామానుజరావు అమృతోత్సవం సందర్భంలో అంకితం చేసిన 'తెలుగు సాహిత్యోద్ధారకులు'లో (1992) ఆరుగురు విశిష్ట పరిశోధకుల సమగ్ర చరిత్రను అందించారు. సి.పి.బ్రౌన్, కొమర్రాజు లక్ష్మణరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి ఒద్దిరాజు సోదరులు, ఆదిరాజు వీరభద్రరావు, శేషాద్రి రమణ కవుల సారస్వతసేవ ఇందులో సవిస్తరంగా పరామర్శితమైంది. ఇంకా విజ్ఞాన సర్వస్వాలు, ప్రత్యేక సంచికల్లో ఎన్.కె. రావు (నాగులపల్లి కోదండరామారావు), వడ్లకొండ నరసింహారావు ప్రభృతుల సామాజిక సేవను ఉగ్గడించే పెక్కు వ్యాసాలు రచించారు. అల్లూరి సీతారామరాజు (1961), జి.పుల్లారెడ్డి (1992), సొరకాయల స్వామి చరిత్ర(1992), మౌనస్వామి(1994) జీవిత చరిత్ర ప్రక్రియా రచనలో రామరాజుగారి విశిష్ట స్థానాన్ని నిరూపిస్తాయి. ఆయన రాయలసీమ సాధువులు గ్రంథాన్ని ప్రొఫెసర్ ఎం.కుమారస్వామి Saints of Rayalaseema పేరుతో, తెలుగు మునులు – యోగులు గ్రంథాన్ని ప్రొఫెసర్ ఎం.శివరామ కృష్ణ Saints and Sages పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు.

ఆచార్య రామరాజుగారి పరిశోధనా ప్రతిభకు, నిర్ణిద్ర పరిశ్రమకు నిలువెత్తుపతాకలు 'ఆంధ్రయోగులు' సంపుటాలు (1988–2009). మామూలు మనుషులుగా జీవిస్తూనే పూర్వజన్మ సుకృతం చేత ఆధ్యాత్మిక పరిజ్ఞానాన్ని పొందిన ఆదర్శమూర్తులైన 301 మంది యోగుల చరిత్రలను ఆరు సంపుటాలలో వెల్లడించి సమాజానికి మేలు చేశారు. పుట్టపర్తి భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారి అనుగ్రహానికి పాత్రులైన రామరాజుగారి భక్తి ప్రపత్తికి శ్రీసత్యసాయి విన్నపాలు, శ్రీసత్యసాయి పద్య సూక్తులు మున్నగు కృతులు నిదర్శనాలుగా నిలుస్తాయి. 'నేను – నా సాయి' అన్న వేయి పుటలు మించిన బృహత్ గ్రంథం ఎనభై అయిదు సంవత్సరాల వయసులో – అనారోగ్య దశలో కూడా ఆయన అవిశ్రాంత రచనా వ్యాసంగానికి అమూల్యమైన జ్ఞాపికగా మిగిలింది. రామరాజుగారి రచనాశైలి కూడా సరళ సుందరమై పఠితలను ఆకట్టుకొంటుంది. చిన్నచిన్న వాక్యాలలో ఆసక్తికరంగా శాస్త్రీయాంశాలను కూడా మధుర మంజులమైన రీతిలో వివరించే శైలి ఆయనకు సహజ సిద్ధమైనది. పాండిత్యాన్ని, సరసత్వాన్ని సమపాళంగా కలబోసుకొన్న సహృదయ శేఖరులు వారు.

రాష్ట్రాభిమానం, జాతీయాభిమానం మూర్తీభవించిన సమున్నతమైన వ్యక్తిత్వం రామరాజు గారిది. నిజాం నిరంకుశ పాలనలో లాఠీ దెబ్బలు తిన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో కారాగారవాసం అనుభవించారు. విశ్వహిందూ పరిషత్తు, జాతీయ సాహిత్య పరిషత్తు నిర్వహణలో సుశిక్షితులైన కార్యకర్తగా ముఖ్యపాత్ర వహించారు. తెలంగాణా రచయితల సంఘం తొలి కార్యదర్శిగా(1954) 1956 తర్వాత నెలకొన్న ఆంధ్ర రచయితల సంఘం ప్రథమ కార్యదర్శిగా సాహితీచైతన్యానికి పాటుపడ్డారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, ఆంధ్ర సారస్వత పరిషత్తు కార్యక్రమాల్లో కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా చురుకుగా పాల్గొన్న నిత్య చైతన్యశీలి ఆయన. ఖండవల్లి లక్ష్మీరంజనంగారి సాహచర్యంతో తెలుగు శాఖ ప్రగతికి ఎంతో దోహదం చేసి ఎందరో పరిశోధకులను, కవిపండితులను తీర్చిదిద్దారు. ఉస్మానియా, కాకతీయ తెలుగుశాఖల్లో వివేచన, విమర్శిని సారస్వత సంచికలను నెలకొల్పటంలో ఆయన ప్రగతిశీల దృక్పథం ద్యోతకమవుతుంది.


తన జీవిత కాలంలో జీవన సాఫల్యానికి గుర్తింపుగా ఎన్నో విలువైన పురస్కారాలు పొందిన పరిపూర్ణమూర్తి ఆయన. బూర్గుల – సురవరం అవార్డులు, రాజాలక్ష్మీఅవార్డు,

తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం, రాష్ట్రప్రభుత్వం ఆత్మగౌరవ పురస్కారం, అజోవిభోఫౌండేషన్ సన్మానం, న్యూజెర్సీ తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ బహుమానం, సద్గురు శివానంద ఉన్నత పౌర సమ్మానం, సి.పి.బ్రౌన్ అకాడమీ తెలుగు భారతి పురస్కారం మొదలైనవి ఆయన కీర్తి కిరీటంలోని మాణిక్యాలు. రష్యా, మారిషస్, కెనడా మున్నగు విదేశాల సదస్సులకు ఆహ్వానితులుగా ఆయన వాటిని సందర్శించారు.

భాషా వాఙ్మయ పరిశోధకులకు ఆదర్శప్రాయమైన సమున్నత వ్యక్తిత్వం బిరుదు రామరాజు గారిది. వారి సాహితీ వాల్లభ్యం, పరిశోధనాభినివేశం, పరిశోధక వాత్సల్యం అమేయమైనవి. అమృత హృదయులైన రామరాజుగారి శిష్యవాత్సల్యాన్ని చూఱగొన్న వారిలో నేను ఒకణ్ణి. ఎం.ఏ.లో (1962-64) ఆయన నాకు ప్రత్యక్ష గురువు. ఆతర్వాత తెలుగుశాఖలో ఆయన నేతృత్వంలోనే అధ్యాపకుడిగా పనిచేసే సదవకాశం లభించింది. తెలుగుశాఖ నుంచి డీన్ పదవిని పొందిన మొదటి వారు ఆయనైతే, ఆయన తర్వాత ఆ పదవి నాకు లభించింది. 1985లో నా తొలి వ్యాససంపుటి (అన్వీక్షణం) ఆవిష్కరణ సభలో గురుపూజలో భాగంగా ఆయన్ను సన్మానించుటయే కాక, 1992లో ప్రచురితమైన 'సమవీక్షణం' వారికే అంకితమిచ్చాను. వారి 'ఆంధ్ర యోగులు' చివరి సంపుటి సభలో వక్తగా పాల్గొనే అవకాశం కలిగించటం ఆయనకు నాపై గల ప్రేమకు సాక్ష్యం. గురుమూర్తి, పితృసమానులు అయిన ఆ మహానుభావుడికి నా శ్రద్ధాంజలి.

(పాలపిట్ట, మార్చి, 2010)

16. గుంటూరు శేషేంద్రశర్మ
(1927-2007)



గుంటూరు శేషేంద్రశర్మగారు విద్వత్కవి, విద్వద్విమర్శకుడు. ప్రౌఢ పరిపాకంతో విలక్షణ వైదగ్ధ్యంతో కొనసాగిన కవితా సృజనకు దీటుగా ఆయన విమర్శ వివేచన కూడా ప్రకాశించింది. శేషేంద్ర పద్యకావ్యాలు వెలువడిన తొలిదశలోనే (1954-1970) ఆయన ప్రముఖ విమర్శలు వెలువడటం గమనార్హం. సొరాబు(1954), ఋతుఘోష(1963) కావ్య ప్రకాశం తర్వాత 1970 లో 'పక్షులు' కవితా సంపుటితో ఆయన వచన కవితా మార్గాన్ని అవలంబించి ఆ మార్గంలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నాడు.

'ఆంధ్రప్రభ' సారస్వతానుబంధంలో ప్రచురితమైన **'నరుడు-నక్షత్రాలు'** శీర్షికలోని వ్యాసపరంపర ద్వారా (1963) శేషేంద్రశర్మ పాఠకులకు విమర్శకునిగా పరిచయమైనాడు. ఇందులో వైజ్ఞానిక సంబంధ వ్యాసాలతోపాటు సాహిత్య లక్షణ వివేచన, పద్యరచనా శిల్ప పరిశీలనతో కూడిన వ్యాసాలు కూడా చోటు చేసుకున్నాయి. వైజ్ఞానిక, చారిత్రక, సాహిత్య విషయాల సమ్మేళనమైన వ్యాస సంపుటి ఇది. **'ఊహలో'** అన్న లఘువ్యాససంపుటి కూడా ఈ కోవలో చేరదగింది.

పద్యశిల్ప ప్రాశస్త్యాన్ని వివరించే మరొక విశిష్ట వ్యాస సంపుటి **'సాహిత్య కౌముది'**(1968) ఆయన పాండితీ ప్రతిభకు, కూలంకష పరిశోధనాశక్తికి, కావ్యానుశీలన రీతికి నికషోపలంగా నిలుస్తుంది. ప్రాచీన కవుల ప్రతిభా సన్నికర్షచేత బహుముఖ

శిల్పసౌందర్యాన్ని సంతరించుకొన్న తెలుగు పద్యరచనా శిల్పం, భావికవులకు మార్గదర్శకులైన రెండవ కవిత్రయం – శ్రీనాథ, జక్కన, పినవీరనల పద్య రచనా పరిణతి ఇందలి వ్యాసాలలో సువ్యక్తమైనాయి. తిక్కన విరాట పర్వమును ఏకైక ధ్వనికావ్యంగా ఉగ్గడించిన శేషేంద్రశర్మ శ్రీనాథుని శబ్దశక్తి, విలక్షణశబ్ద ప్రయోగాలను 'శ్రీనాథావతార తత్త్వము' వ్యాసంలో ఉదాత్తశైలిలో వ్యక్తీకరించాడు. శ్రీనాథ మహాకవిని 'జగన్మోహిని అవతారం'గా ఉగ్గడించాడు.

తిక్కన హరిహరాద్వైతంతో అంతరించిన వీరశైవోద్యమం, అద్వైతకవుల సాహిత్య వైశిష్ట్యం, కన్నడాంధ్ర వాఙ్మయాల సాన్నిహిత్యం 'కౌముది'లో సూక్ష్మదృష్టితో పరామర్శితమైనాయి. తిక్కన కృతిపతి అయిన హరిహరనాథుడు ఆంధ్రదేశంలోని దేవాలయాల్లో నెలకొన్న ప్రత్యేక దైవంగా పరిశోధకులు భావిస్తున్న తరుణంలో తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరుడే హరిహర నాథుడు అన్న అభిప్రాయాన్ని ప్రతిపాదించటంలో శేషేంద్ర సునిశిత పరిశోధనా పాటవం ద్యోతకమవుతుంది.

'ప్రతి కవిత్వ అభ్యాసకుడూ ఋగ్వేదం చదవాలి' అని పేర్కొన్న (రక్తరేఖ) శర్మగారు మంత్రయోగ వేదాంత శాస్త్రార్థాలను వివరిస్తూ వెలువరించిన రెండు విమర్శగ్రంథాలూ ప్రౌఢవిమర్శకునిగా ఆయనకు ప్రశస్తిని గడించాయి.

'షోడశి–రామాయణ రహస్యములు'లో (1967) రామాయణంలో విష్ణుపారమ్యం కన్న ఇంద్ర పారమ్యమే ప్రధానమని, వేదాలలోని ఇంద్రునికి పురాణాలలోని విష్ణువుకు ఎంతో సామ్యం ఉందని సహేతుకంగా నిరూపించారు. రామాయణ రచన మార్గదర్శకంగా అర్వాచీనమైన భారత రచన కొనసాగిందని వివరించారు. ఇందలి పదహారువ్యాసాలలో రామాయణంలో నిక్షిప్తమైన గాయత్రీమంత్రం, కుండలినీ యోగం మున్నగు నిగూఢ రహస్యాలను లోచూపుతో విశదపరచారు.

'షోడశి' కి ముందుమాట వ్రాస్తూ విమర్శకాగ్రేసరులు విశ్వనాథ సత్యనారాయణ గారు – **" వీరి పాండిత్యం చాలా లోతుకలది. వీరి శ్రీవిద్యా రహస్యవేత్తృత సర్వంకషమని చెప్పుట కభ్యంతరముండదు. మహామేధావులైన వారితో నిండియున్న ఈ ప్రపంచంలో లేరనుటకు వీలు లేదు గాని యున్నచో భారతదేశమున నొకరిద్దరుందురేమో!"** అని ప్రశంసించారు.

నైషధకావ్యంలో హర్షుడు నిక్షేపించిన మంత్ర, యోగ, వేదాంత రహస్యాలను వెల్లడించే అపూర్వ గ్రంథం **'స్వర్ణహంస'** (1968). సాహిత్య వేదాంత రసములు ఒక్కటే అని భావించిన శర్మగారు గూఢ ధ్వని కావ్యమైన నైషధంలో ఆ రెంటి అభిన్నతను విశదీకరిస్తూ అందలి గ్రంథ గ్రంథులను విడదీసి చూపారు. నలుడు జీవునికి ప్రతీక అని, దమయంతి శ్రీ మహా త్రిపురసుందరి అని, హంస అజపామంత్రాధిదేవత అని పెక్కు శాస్త్ర గ్రంథాలనుండి దృష్టాంతాలను పేర్కొన్నారు. శేషేంద్రకు గల వివిధ శాస్త్ర వైదుష్యాన్ని చాటే గొప్ప వ్యాఖ్యాన విమర్శ 'స్వర్ణహంస'

విమర్శరంగంలో ప్రతీక విమర్శకు మార్గదర్శకుడు శేషేంద్ర అని పేర్కొనవచ్చు. ధ్వనికి, ప్రతీకకు గల భేదాన్ని సుస్పష్టం చేస్తూ కవిత్వంలో ప్రతీకా ప్రాధాన్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసిన విమర్శకులు శర్మగారు. అనంతర కాలంలో ఆయనకు కీర్తిగడించిన మహాకావ్యాలు ప్రతీకాత్మకంగా సాగటం గమనింపదగింది. బోదివేర్, మల్లార్మే మున్నగు పాశ్చాత్యుల ప్రతీక విమర్శను గాఢంగా జీర్ణించుకొన్న ప్రతిభామూర్తి శేషేంద్ర.

1970 తర్వాత శేషేంద్ర కవితాయాత్రలో నూత్న పరిణామం చోటు చేసుకుంది. శేషజ్యోత్స్న (1972), మండే సూర్యుడు(1974), నా దేశం నాప్రజలు (1975), నీరైపోయింది (1976),గొరిల్లా (1977) మున్నగు కావ్యాల ద్వారా వచన కవితా విహాయసంలో ధ్రువతారగా వెలుగొందారు. ఆ సందర్భంలోనే ఆధునిక కావ్యశాస్త్రమైన **'కవిసేన మేనిఫేస్టో'** వెలువడి (1977) తీవ్ర సంచలనాన్ని కలిగించింది. ఇటు సంప్రదాయవాదులనూ, అటు అభ్యుదయవాదులనూ కాదని ఆయన తనదైన బాణీలో ముందుకు సాగిపోయాడు.

సమకాలీన సాహిత్యరంగంలో నెలకొని ఉన్న అజ్ఞానాన్ని ఖండిస్తూ కవిత్వం పేరుతో చెలామణీ అవుతున్న అకవిత్వాన్ని తీవ్రంగా నిరసించాడు. సాహిత్యస్పృహ ప్రాధాన్యాన్ని వెల్లడిస్తూ సాహిత్య భావచైతన్య వ్యాప్తి కొరకు నిర్వహించిన ఉద్యమమే 'కవిసేన'గా ఆవిర్భవించింది. **"సామాజిక చైతన్యాన్ని సాహిత్య చైతన్యంగా మార్చేశక్తి కవికి కావాలని నిరూపించి భావవిప్లవానికి మార్గదర్శకులయ్యారు శర్మగారు"** అని ఈ గ్రంథంపై తమ అభిప్రాయాన్ని ప్రకటించారు త్రిపురనేని వెంకటేశ్వర రామ.

'సాహిత్యవ్యాసావళి'లో మూడు 'సాహిత్యకౌముది'లోని వ్యాసాలే చేరాయి. మొదటి వ్యాసం (ధ్వనిమథనం)లో ధ్వని సిద్ధాంత ప్రాశస్త్యాన్ని నిరూపిస్తూ ధ్వనియుక్తమైన కావ్యమే

ఉత్కృష్టమైనదని సిద్ధాంతీకరించారు. డైరీ రూపంలో వెలువడిన **'రక్తరేఖ'** (1975), లేఖలు-ఇంటర్వ్యూలు - వ్యాసాల సమాహారమైన **'సాహిత్యదర్శని'** విభిన్న విషయాలపై శేషేంద్ర ఆలోచనలను వ్యక్తీకరిస్తూ ఆయన అంతరంగానికీ, దార్శనికతకూ దర్పణం పడతాయి. ప్రాచ్య, పాశ్చాత్య ఆలంకారిక సంప్రదాయాలను కూలంకషంగా మథించిన మేధావి శేషేంద్ర.

శర్మగారి 'ఋతుఘోష' కావ్యానికి కూడా విశ్వనాథ 'కావ్యతత్త్వ ప్రకాశిక' ను కూర్చారు. **'సాహిత్య విమర్శకు విషయం పుస్తకమే కాని పుస్తక కర్త కాదు.'** అని భావించిన శేషేంద్ర వస్త్వాశ్రయ విమర్శకు దారిచూపిన విశ్వనాథ బాటలోనే పయనించారనటం అత్యుక్తికాదు. ఆధునికులలో విశ్వనాథ, రాయప్రోలు శేషేంద్ర అభిమాన కవులు. నవ్య కవిత్వావతరణలో రాయప్రోలు స్థానాన్ని ధ్రువీకరిస్తూ **"కఠోర ఆంధ్రప్రబంధ రాక్షసుల లోహబాహుబంధాలు ఛేదించుకొని బయటకు దూకిన మహోజ్వల విప్లవమూర్తి"**గా అభివర్ణించారు. కవిత్వ పరిభాషలో, అభివ్యక్తి విధానంలో శేషేంద్ర కనబరిచిన వైలక్షణ్యం శ్రీనాథుని వక్రోక్తిని, ఉద్దండశైలిని తలపుకు తెస్తాయి. ఆయన విమర్శలో కవితావేశం ప్రతిధ్వనిస్తుంది.

కావ్య ప్రశంసకుడిగా విమర్శ రంగంలో శేషేంద్ర నిర్వహించిన పాత్ర గణనీయమైనది. దేశదేశాల కవిత్వాన్ని ఆస్వాదించే మార్గాలు ఆయన చవిచూపాడు. సంస్కృత మహాకవులు- గ్రీక్, ల్యాటిన్ మహాకవుల తులనాత్మక పరిశీలన చేశాడు. ఈ శతాబ్ది చింతనగా ఆయన పేర్కొన్న **'కాలరేఖ'** (1990) వ్యాస సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందటం ఔచితీమంతం.

నెల్లూరు జిల్లాలోని నాగరాజుపాడు (తోటపల్లి గూడూరు) లో 1927 అక్టోబర్ 20న సుబ్రహ్మణ్యం, అమ్మాయమ్మ దంపతులకు జన్మించిన గుంటూరు శేషేంద్రశర్మ 2007 మే 30న పరమపదించారు.

శేషేంద్రశర్మ అస్తమయంతో ప్రాక్ పశ్చిమ సాహిత్యమర్మాలను విప్పిచెప్పగల రసజ్ఞ శేఖరుడిని ఆంధ్ర సాహితీ రంగం కోల్పోయింది.

(మూసీ, జులై 2007)

17. ఆర్.ఎస్.సుదర్శనం

(1927-2001)



నవలా రచయితగా, కథకుడుగా సృజనాత్మక సాహిత్యంలో ప్రత్యేకతను ప్రదర్శించిన ఆర్.ఎస్.సుదర్శనం విమర్శనా సాహిత్యంలోకూడా సమానమైన ప్రఖ్యాతి గడించారు. రెండు ప్రక్రియల్లోనూ పురస్కారాలు అందుకొన్నారు. చిత్తూరు జిల్లా మదనపల్లిలో 1927 డిసెంబర్ 13న జన్మించిన రాచకొండ సుబ్బు సుదర్శనం విద్యాభ్యాసం మదనపల్లి, మద్రాసుల్లో కొనసాగింది. క్రిస్టియన్ కాలేజీ నుంచి ఎం.ఏ. .(ఆంగ్లం) డిగ్రీ పొంది ఆంగ్లోపన్యాసకులుగా, అనంతపురం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఉన్నత విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది రాజమండ్రిలో ఉద్యోగ విరమణ కావించారు.

అనుబంధాలు, మళ్లీ వసంతం, అసుర సంధ్య, సంసార వృక్షం నవలలు, కాలం తెచ్చిన మార్పు, మధురమీనాక్షి కథాసంపుటులు రచయితగా ఆయనకు మంచి పేరు గడించాయి. సాహిత్యంలో దృక్పథాలు (1968), సమాజము - సాహిత్యము (1972), సాహిత్య నేపథ్యం (1983), నూరు సమీక్షలు (1987), గుడిపాటి వెంకట చలం విమర్శరంగంలో ప్రశస్తి నార్జించాయి. వీనిలో 'సంసార వృక్షం' నవలకు 'సాహిత్యంలో దృక్పథాలు' గ్రంథానికి (1975) సాహిత్య అకాడమీ బహుమతులు లభించాయి.

ఆంధ్రాంగ్ల సాహిత్యాలతో వివిధ శాస్త్రాలతో గాఢ పరిచయం కల్గిన సుదర్శనం రచనలు కుతూహలాన్ని రేకెత్తిస్తూ పాఠకులను ఆకర్షిస్తాయి. భారతీయ తత్త్వశాస్త్ర

ప్రభావం-ముఖ్యంగా అద్వైత సిద్ధాంత ప్రభావం ఆయన నవలల్లో అంతర్లీనంగా పొడసూపుతుంది. తాత్త్విక చింతనా సంబంధమైన అంతర్ముఖీనత ఆయన కలానికి జవాన్ని ప్రసాదించింది. పాశ్చాత్యమైన మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు, అస్తిత్వవాదం, ప్రాగ్రూప విమర్శ మున్నగు శాస్త్రాంశాలు ఆయన సాహిత్య విమర్శకు భూమికగా నిలిచాయి. ప్రాచీనాధునిక సాహిత్యాలపై సమాన ఆదరం కలిగిన ఆయన విమర్శలో ప్రాచ్య పాశ్చాత్య విమర్శ దృక్పథాల విశిష్ట సమన్వయం ద్యోతకమవుతుంది.

"నవ్యాంధ్ర సాహిత్యంలో దృక్పథాలు" శీర్షికలో భారతి పత్రికలో ధారావాహికంగా వెలువడిన వ్యాసాలు, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక మొదలైన పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాలు గ్రంథరూపంలో సంకలితమైనాయి. ఆయన గ్రంథ నామాలను పరికిస్తే ఆయన విమర్శ స్వభావం విశద మవుతుంది. కవి దృక్పథాన్ని బట్టి కావ్యతత్త్వ వివేచన సాగాలన్నది ఆయన తాత్పర్యం. "సాహిత్యంలో దృక్పథాలు' వ్యాస సంపుటి ఈ అభిప్రాయాన్నే చాటుతుంది. అల్లసాని పెద్దన తాత్త్విక దృక్పథాన్ని అనుశీలిస్తూ మనుచరిత్రలో శృంగారరసం కంటే శాంతరసమే ప్రధానమని వెల్లడించారు. "ఇంద్రియ సుఖమూ, ధర్మమూ, దయ, ప్రేమ, వైరాగ్యము, వీని తాత్త్విక నిరూపణమూ, సమన్వయమూ పెద్దన 'మనుచరిత్ర' కావ్యం. సమకాలీన జీవన ధోరణికి తాత్త్వికుడు, ధర్మజ్ఞుడు అయిన కవిగా జీవితం మీద ఆసక్తి, గౌరవమూ కలిగిన మేధావంతుడుగా పెద్దన వ్యాఖ్యానం చేశాడు. ఉదాత్త శృంగారానికి శ్రీకారం చుట్టిన నవ్యకవులకు కూడా పితామహుడు పెద్దన" అని ఉగ్గడించారు. వరూధిని, ప్రవరుడు, స్వరోచి పాత్రల విశ్లేషణ ఆధారంగా ప్రేమయొక్క రూపాలను విశదీకరించారు.

సుదర్శనం విమర్శలలో ప్రతీకాత్మకదృష్టి ప్రాధాన్యం వహించింది. ప్రాచీన కావ్యమైన మనుచరిత్రలోనే కాక గురజాడ, చలం, పాత్రల సృష్టిలో కూడా ప్రతీకాత్మకతను దర్శించారు. అమీనా పాత్ర చలం అతఃకరణకు ప్రతీకగా, గిరీశం పాత్ర కల్పన ప్రతీకా ప్రతిష్ఠాపనగా భావించారు. కన్యాశుల్కంలోని హాస్య రసావిష్కరణలో గురజాడ పాటించిన నిర్లిప్తతను నిరూపిస్తూ "జీవితం మీద తప్ప మరి దేని మీదా విశ్వాసం లేని వాడు గిరీశం." అంటూ ఆ పాత్రలోని ఆకర్షణ శక్తిని సుస్పష్టం చేశారు. షేక్స్పియర్ హెన్రీ నాటకంలోని ఫాల్‌స్టాఫ్‌తో గిరీశం పాత్రను పోల్చి చూపటంలో ఆయన తులనాత్మక వివేచనం కూడా ద్యోతకమవుతుంది.

స్వతః నవలారచయిత అయిన సుదర్శనం గారికి నవలా సాహిత్యం పట్ల అభిమానం ఉండటం సహజమే. అందుకే ఆయన విమర్శలో నవలా ప్రక్రియకు పెద్దపీట లభించింది. ఉన్నవ, విశ్వనాథ, చలం, గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి నవలల్లో ప్రతిఫలించిన తాత్త్విక దృక్కోణాలను ప్రతిభావంతంగా ప్రదర్శించారు. సంఘువ్యవస్థ – వైయక్తిక ధర్మం అనే ద్వంద్వానికి అతీతమైన సమన్వయం సాధించిన 'ఏకవీర' విశ్వనాథ రచనల్లో గొప్పనవల అనీ, 'వేయిపడగలు' లో వ్యవస్థనే మూలధర్మంగా ప్రతిపాదించడం వల్ల ఆయన స్థాయి దిగజారిందనీ పేర్కొన్నారు. చెలియలికట్ట, తెరచిరాజు, స్వర్గానికి నిచ్చెనలు మున్నగు నవలలను పరామర్శిస్తూ "ఆయన నవలలన్నీ కాల్పనికోద్యమ స్వభావం కలిగిన ఆత్మాశ్రయ రచనలే" అని ఉగ్గడించారు.

సిగ్మండ్ ఫ్రాయిడ్, అతని శిష్యుడు ఆల్‌ఫ్రెడ్ ఆడ్లర్ ప్రవచించిన మనోవైజ్ఞానిక శాస్త్ర సిద్ధాంతాల ప్రభావం గోపీచంద్, బుచ్చిబాబు, రావిశాస్త్రి నవలలపై ఏవిధంగా ప్రసరించిందో హృద్యంగా విశదీకరించారు సుదర్శనం. "అసమర్థుని జీవయాత్ర"లోని నాయకుడు సీతారామారావు ఆత్మహత్య ద్వారా తండ్రి (త్రిపురనేని రామస్వామి చౌదరి) ప్రభావంతో తనలో ఏర్పడిన హేతువాదానికి గోపీచంద్ వీడ్కోలు చెప్పాడని భావిస్తూ ఆ నవలను "ఆత్మ కథాత్మక నవల"గా అభివర్ణించారు. 'చివరకు మిగిలేది' లోని 'ఈడిపస్ కాంప్లెక్స్' ను, 'అల్పజీవి' లో వ్యక్తమైన ఆత్మన్యూనతా భ్రాంతిని (ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్) లోచూపుతో విశదీకరించారు. "పాశ్చాత్య సంస్కృతీ స్రవంతి ఎంతగా ప్రవహించినా, భారతదేశంలో దాని గమ్యస్థానం వేదాంతసాగరం అనే సామాన్య విషయాన్ని రుజువు చేస్తున్నది ఈ నవల (చివరకు మిగిలేది). కాని అది ఎవరికి వారు వ్యక్తిగతంగా రుజువు చేసుకోవాలనీ, సాధించాలనీ నొక్కి చెప్పడమే విశేషం" అంటూ జీవితంపై ఒక దృక్పథం కలిగించడంలో బుచ్చిబాబు సఫలుడైనాడని పేర్కొన్నారు.

సాంప్రదాయకమైన విమర్శ ధోరణికి భిన్నంగా ఆధునిక దృక్పథంతో సుదర్శనం వెలువరించిన వ్యాసాలు నవలావిమర్శ మార్గానికి నూతన ద్వారాలు తెరిచాయి. 'సాహిత్యము – సమాజము' వ్యాససంపుటి కూడా ఈ బాటలోనే కొత్త వెలుగులు ప్రసరించింది. ఇందులోని మూడు విభాగాలలో పన్నెండు వ్యాసాలున్నాయి. మొదటి భాగంలోని నాలుగువ్యాసాల్లో (తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, తెలుగు సమాజంపై కాల్పనికవాద ప్రభావం, విప్లవము – సాహిత్యము, మానవత్వము–ఆధునికత)

సాహిత్యంపై వివిధ వాదాల ప్రభావ ప్రసారాన్ని విశ్లేషించటంలో సుదర్శనం గారి సామాజిక దృక్పథం సువ్యక్తమవుతుంది. "విప్లవ సాహిత్యం అంటే కొత్త దృష్టిని కల్పించే సృజనాత్మకరచన. పాత కొత్తలకు వంతెన" అంటూ దానిపై గౌరవం ప్రకటిస్తూనే రచయితల స్వేచ్ఛను పరిహరించే విప్లవోద్యమాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు.

"మానవత్వము–ఆధునికత" వ్యాసంలో యువతరంగురించి వెలువరించిన అభిప్రాయాలు ఆయన ప్రగతిశీల దృష్టిని చాటుతాయి. "నేటి యువతరం వారు క్రమంగా విశృంఖల సమాజం వైపు పయనిస్తున్నారు అనడంలో సందేహం లేదు. ఇది అవాంఛనీయమని ఎవరు ఎలా బాధపడ్డా మారుతున్న యుగ లక్షణమైన ఈ ధోరణి అరికట్టే మార్గం ఏమీ కనిపించదు.... నేటి యువతరానికి పెద్దవాళ్ళు – అంటే నలభై డెబ్బై ఏళ్ళ వయస్సుగలవాళ్ళ నాయకత్వం మీద నమ్మకం పోతున్నది. విప్లవ నాయకత్వం ముప్పయి ఏళ్ళకు లోబడినవాళ్ళే అంటే విశ్వవిద్యాలయ విద్యార్థులే చేబట్టాలనే నమ్మకం కుదురుతున్నది." ఈ అభిప్రాయాలు ఈ నాటి వాతావరణానికి అక్షరాలా వర్తిస్తాయి.

ఈ సంపుటి రెండో భాగంలోని ఏడు వ్యాసాలు నవలా ప్రక్రియకు సంబంధించిన పెక్కు అంశాలను వివిధ కోణాలనుంచి విశిష్ట పంథలో విశ్లేషించాయి. సాహిత్య ప్రక్రియగా నవల, నవల–సామాజిక పరిణామము, నవల–పాత్రచిత్రణము అనే వ్యాసాల్లో నవల స్వరూప స్వభావాలు హృద్యంగా వివేచితమైనాయి. "వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసుకొని సామాజిక జీవితాన్ని స్ఫురింపచేసే సాహిత్య ప్రక్రియ నవల–నవల ద్వారా జీవితాన్ని గూర్చి కలిగే ప్రత్యక్షానుభూతి కూడా విశిష్టమైనదే" అంటూ చక్కగా నిర్వచించారు. మనోవైజ్ఞానిక నవల, అస్తిత్వవాద నవలలు, అధీరనాయకుడి లక్షణాలను ప్రామాణికంగా, శాస్త్రీయంగా వివరించిన విమర్శకుడు సుదర్శనం. చివరకు మిగిలేది, అల్పజీవి నవలలను తెలుగు సాహిత్యాకాశంలో ధ్రువతారలుగా ఆయన పేర్కొన్నాడు. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మనస్తత్వశాస్త్రాలలో ఆయనకున్న గాఢ పరిజ్ఞానం ఈ వ్యాసాల ద్వారా అవగతమవుతుంది. "సామాజిక పరిస్థితుల అవగాహన, పై శాస్త్రాల అనుశీలన + సమకాలిక సాహిత్య పరిశీలన = సుదర్శనంగారి వ్యాసాలు." (ఎమ్వీయల్). మానవ విజ్ఞానంలోని భిన్నాంశాలను పరిశీలించి వాటిని సాహిత్యానికి సమన్వయించి చూపటంలో ఆయన ప్రత్యేకత గోచరమవుతుంది.

"సాహిత్య నేపథ్యం" లోని వ్యాసాలు కూడా ఆయన విలక్షణ విమర్శనా దృష్టికి గీటురాళ్ళు. "మాటల కందని సంశ్లిష్టమైన అనుభూతిని మాటల ద్వారా అందజేసే ప్రయత్నమే సాహిత్యంలో సృజన" అని నిర్వచిస్తూ క్లిష్టమైన అంశాలను కూడా సరళ మైన రీతిలో వ్యాఖ్యానిస్తారు. అనుభూతి కవిత్వతత్త్వాన్ని వెల్లడిస్తూ "అనుభూతి కవిత్వంలో అనుభూతి నిర్దేశం పాఠకునికే వదిలి పెట్టబడింది.... కవిత చదివిన తర్వాత మిగిలేది ఒక సందేశం, భావం, ఒక దృక్పథం కాకుండా కేవలం అనిర్దిష్టమైన అనుభూతి కావాలి.... అనుభూతి కవిత ఒక వెలుతురు వంటిది, వెలుతురులో కనిపించే వస్తువు వంటిది కాదు" అంటూ తేల్చి చెప్పారు. సుదర్శనంగారి "నూరు సమీక్షలు"లో 72 సమీక్షలు నవల (52) కథా (20) ప్రక్రియలకు సంబంధించినవే కావటం కాల్పనిక సాహిత్యంపై ఆయనకు గల మక్కువను వెల్లడిస్తుంది. గుణదోష విచారణతో కూడిన ఈ సమీక్షలు ఆయన సమదర్శనానికి తార్కాణాలు.

కేంద్ర సాహిత్య అకాడమి ప్రకటించిన చిన్నపుస్తకం 'గుడిపాటి వెంకట చలం'లో చలం జీవిత, సాహిత్యాల సమన్వయం సమర్థవంతంగా చేయబడింది. వ్యక్తిగా, రచయితగా చలం కొనసాగించిన ప్రస్థానం అతని అన్వేషణ ముగియకుండానే గడిచిందని సుదర్శనం భావించారు. "మార్మికుడుగా పరిణతి చెందిన భావుకుడు చలం" అని ఉగ్గడించారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటైన నాయని సుబ్బారావు స్మారకోపన్యాసంగా ఆర్.ఎస్.సుదర్శనం చేసిన ఆంగ్ల ప్రసంగం (The Concept of Freedom in the Telugu Romantic Poetry) లఘు పుస్తక రూపంలో ముద్రితమైంది. తత్త్వవేత్త రూసో, ఆంగ్లకవులు షెల్లీ, కీట్స్, మున్నగు పాశ్చాత్యుల కాల్పనికవాద దృక్పథాల వెలుగులో తెలుగులో భావకవిత్వం స్వరూప స్వభావాలు, ఇందు లోచూపుతో పరామర్శితమైనాయి. తాత్త్విక కావ్యం 'నిశాంతం' ద్వారా సుదర్శనం గారు కవిగా కూడ పాఠకులకు పరిచయమైనారు. ఇందలి పద్యాలను విని మెచ్చుకున్న విశ్వనాథ సత్యనారాయణగారు ఈ కావ్య ప్రచురణకు దోహదం చేశారని విశ్రుతి. సుదర్శనంగారి అర్ధాంగి ఆర్. వసుంధరాదేవి కూడా రచయిత్రిగా ప్రశస్తి గడించారు. 2001 డిసెంబర్14న తనువు చాలించిన సుదర్శనంగారు నవలా రచయిత గానే కాక నవలా విమర్శకులుగా కూడ గుర్తుంటారు.

సుదర్శనం గారు వ్యక్తపరచిన విమర్శాభిప్రాయాలతో అందరూ ఏకీభవించక పోవచ్చు. కావ్యమును బట్టి కాక కవి వ్యక్తిత్వాన్ని అనుసరించే కావ్య పరిశీలన జరగాలన్నది సమగ్రమైన దృక్పథం కాదు. ఐతిహాసిక నవలగా (క్లాసిక్) సాహిత్య ప్రపంచంలో శాశ్వత స్థానం గడించిన 'వేయిపడగలు' మున్నగు నవలలపై అభిప్రాయాలు అందరికీ ఆమోద యోగ్యమైనవి కావు. సామాజిక స్పృహ కంటే కూడా వ్యక్తి ఆంతరంగిక చిత్రణమే ప్రధానం అన్న వాదం కూడా అభ్యుదయ వాదులకు రుచింపక పోవచ్చు.


అయితే – "నేటి విమర్శకుడు వెలయించే వ్యాఖ్యానమే ఒక ఉత్తమ కావ్యానికి భరతవాక్యం కానేరదు. అలా అయ్యే పరిస్థితే ఉంటే ఆ కావ్యం యొక్క జీవితం అంతటితో పరిసమాప్తి చెందిందనే అనుకోవచ్చు. అప్పుడు కావ్యాన్ని చదివినా విమర్శ చదివినా ఒక్కటే అవుతుంది." అన్న సమ్యగవగాహన ఉన్న సద్విమర్శకుడు సుదర్శనం. సుదర్శనం ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని సాహిత్యానికి అన్వయించడాన్ని, ముక్కుకు సూటిగా విషయాన్ని చెప్పే చలం పాత్రలను ప్రతీకలుగా భావించటాన్ని సంచలన విమర్శకుడు రా.రా. ఖండించినా – పాశ్చాత్య సిద్ధాంతాలను ఆకళింపు చేసుకొని, మేధావి లక్షణమైన జ్ఞాన సంపదకు తోడు సాహిత్యాన్ని సహృదయంతో చూడగలవాడిగా ఆయన్ను మెచ్చుకున్నారు.

వివిధ శాస్త్రాల విజ్ఞానానికి గవాక్షాలు తెరచి వాటి వెలుగుల ప్రసారంలో సాహిత్యాన్ని దర్శించడంలో సుదర్శనం సఫలుడైనాడు. తాను కనుగొన్న సత్యాలను సుస్పష్టంగా వ్యక్తీకరించడంలో కృతకృత్యుడైనాడు. కావ్యాన్ని (నవలను) ఎలా రాయాలో, ఎలా అర్థం చేసుకోవాలో కూడా ఆయన విమర్శ మార్గం నిర్దేశిస్తుంది. అందుకే పాఠకులతో బాటు రచయితలకు కూడా ఆయన విమర్శ సాహిత్యం ఉపాదేయం అవుతున్నది.

(మిసిమి, డిసెంబర్ 2010)

18. కె.వి.రమణారెడ్డి

(1928-1998)



నేను కాలేజి విద్యార్థిగా ఉన్న రోజుల్లో విశాలాంధ్ర పత్రికలో (1960) 'అక్షర తూణీరం' శీర్షికలో ప్రచురితమవుతున్న వ్యాసాలు ఆసక్తితో చదువుతూ ఉండేవాణ్ణి. ఒక వారం విశ్వనాథ కవిత్వం పాషాణపాకం అన్న శ్రీశ్రీ అభిప్రాయాన్ని విమర్శిస్తూ రాసిన వ్యాసం నన్ను ఆకర్షించింది. రెక్క ఒరుగుడు (పక్షపాతం) లేని విమర్శగా అది నాకు అనిపించింది. ఆ రోజుల్లోనే అనుకుంటాను- భారతి పత్రికలో 'కొడవటిగంటి నవలా ప్రపంచం' వ్యాసం చదివినపుడు మాత్రం విమర్శలో అస్పష్టతకు ఉదాహరణగా గోచరించింది. సాహిత్య విమర్శపై పిహెచ్.డి. పరిశోధన చేస్తున్న సమయంలో గురజాడ, దువ్వూరిలపై ఆయన గ్రంథాలు చదివినప్పుడు విమర్శకుడుగా కె.వి.ఆర్. గొప్పతనం స్ఫురించింది. రమణారెడ్డి విమర్శలోని దశలనూ, పరిణామాన్నీ ఇవి సూచిస్తాయి.

కె.వి.ఆర్.గా సాహిత్య ప్రపంచానికి సుపరిచితుడైన ఆయన పూర్తిపేరు కనుమూరు వెంకట రమణారెడ్డి. 1928 మార్చి 23వ తేదీన జన్మించిన ఆయన విద్యార్థి సంఘనాయకుడిగా వామపక్షభావాలను జీర్ణించుకొని ఇరవై ఏళ్ళ ప్రాయంలోనే అభ్యుదయ రచయితల సంఘం సభ్యునిగా (1948) చేరారు. 1955లో జరిగిన అరసం సభల్లో కీలకపాత్ర వహించారు. రెండు దశాబ్దాలపాటు కావలి జవహర్ భారతి కళాశాలలో రాజనీతిశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేసిన అనుభవంతో రాజకీయ సిద్ధాంతాల తత్త్వాన్ని బాగా ఆకళించుకున్నారు.

అరసం నుంచి విరసంలోకి ప్రవేశం ఆయన రాజకీయ, సాహిత్య వ్యక్తిత్వంలోని ముఖ్యమైన మలుపు. 1970లో స్థాపితమైన విప్లవ రచయితల సంఘానికి కార్యదర్శిగా ఉండటమే కాక ఎమర్జెన్సీ కాలంలో (1975) ఇరవై ఎనిమిది నెలల పాటు జైలుశిక్ష కూడా అనుభవించారు. సికింద్రాబాదు కుట్ర కేసులో ముద్దాయిగా విచారణను ఎదుర్కొన్నారు. 1983లో ఏర్పడిన అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితికి (A I L R C) దశాబ్దం పాటు కార్యదర్శిగా వ్యవహరించారు. శ్రీశ్రీ రాజీనామా తర్వాత ఖాళీగా ఉన్న విరసం అధ్యక్షపదవికి ఎన్నికైనారు. ఎరుపు, అరుణతార పత్రికలకు సంపాదకుడుగా రాజకీయ, సాహిత్య చర్చల్లో వాడిగా వేడిగా పాల్గొన్న చైతన్యశీలి ఆయన.

అడవి (1952), భువనఘోష (1956), అంగార వల్లరి మున్నగు కావ్యాల ద్వారా రమణారెడ్డి సృజనాత్మక కవిగా గుర్తింపు పొందారు. జైలు కోకిల, కాహళి, సూరీడు మావోడు కవితా సంపుటులు సమకాలీన సామాజిక రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టాయి. 'మాభూమి' తరహాలో అన్నపూర్ణ, రాజీవం అనే సందేశాత్మక నాటకాలు కూడా ఆయన కలం నుంచి వెలువడ్డాయి.

గురజాడ వెలుగుజాడ (1963), కవికోకిల (1965), మహోదయం (1969), ఆధునిక యుగంలో కవిలోకం (1984), జగన్నాథ రథ చక్రాలు (1986) ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర (1992), ప్రజాగేయకవులు (1997), శరత్‌బాబు జీవిత సాహిత్య పరిచయం మొ॥ విమర్శ గ్రంథాలు కవిగా కంటే విమర్శకుడిగా ఆయనకు ఎక్కువ పేరు గడించాయి. సాహిత్య పాఠాలు (1985), జైలు డైరీ (1995), అక్షర తూణీరం (1999), ప్రజాపంథా (1997), సాహిత్యలేఖలు రచనల్లో కూడా ఆయన విమర్శనా దృక్పథం వ్యక్తమవుతుంది.

గురజాడ అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, శ్రీరంగం శ్రీనివాసరావు కెవిఆర్ అభిమాన కవులు. అందుకే వారిపై ప్రత్యేక విమర్శ గ్రంథాల ద్వారా వారి కవిత్వతత్త్వ వివేచనకు పూనుకొన్నారు. నవ్య కవిత్వానికి ఆద్యుడుగా పరిగణింపబడుతున్న గురజాడ జీవిత - వ్యక్తిత్వాలు, విద్యా విషయకమైన భావాలు, సాహిత్య దృక్పథం, ఆయనపై పాశ్చాత్య భావ ప్రసారం మొ॥ అంశాలు 'గురజాడ వెలుగుజాడ' వ్యాస సంపుటిలో పరామర్శితమైనాయి. ఇంతకన్నా సమగ్రంగా గురజాడ జీవిత సాహిత్యతత్త్వాలను

వివేచించినగ్రంథం 'మహోదయం'. ఇందులోని మూడు అధ్యాయాలలో ఆంధ్రసాహిత్య పరిణామ వివరణ (ఉదయసంధ్య), గురజాడ లౌకిక జీవిత చిత్రణ (అరుణోదయం), వివిధ రచనల పరామర్శ (సప్తాశ్వాలు) విపులంగా గోచరిస్తాయి. జాతీయ పునరుజ్జీవనంలో గురజాడ పాత్రను ఈ గ్రంథం విశదీకరిస్తుంది. "రాయప్రోలు సుబ్బారావుగారి నవ్యత్వం చాలావరకు లౌకికమే కాని భావ సంబంధి కాదు. గురజాడ అప్పారావు ఆధునికుడే కాక నవ్యుడున్నూ" అని ఉగ్గడించారు. గురజాడ సాహితీ జీవితాన్ని నడిపించిన సంఘటనలన్నింటిని పేర్కొంటూ కవిగా, కథకుడుగా, నాటకకర్తగా ఆయన స్థానాన్ని నిరూపించారు.

దువ్వూరి రామిరెడ్డి జీవిత సాహిత్యాలను సమ్యగ్విలోకనంతో సమీక్షించిన గ్రంథం "కవికోకిల". పూర్వాపర సందర్భ వివరణతో, సంక్షిప్త విశ్లేషణతో దువ్వూరి రచనా పరిణామం ఇందులో సహృదయంగమంగా పరామర్శితమైంది. విమర్శ వ్యాసాల పరిశీలనలో చేసిన తెలుగు సాహిత్య విమర్శ సమీక్ష, చివరి ప్రకరణంలో ఆంధ్రసాహిత్యంలో రామిరెడ్డి స్థానం గురించిన వివేచన గణనీయమైనవి. "రామిరెడ్డి సాంఘిక భావనకు రూపురేఖలను దిద్దిందీ, అతని అభిరుచులను ఏర్పరచిందీ, అభిమానాలను కదిపిందీ ఈ కర్షక 'స్వర్గ' వాతావరణమే. అందుచేతనే రామిరెడ్డి రచనలు ఒక విధంగా గ్రామీణ కర్షక సమాజ జీవన దర్పణా లయ్యాయి." అంటూ ఆయనను కర్షక కవిగా దర్శించారు. 'మహోదయం'లోని అధ్యాయాలకు (ఉదయసంధ్య, అరుణోదయం, సప్తాశ్వాలు), 'కవికోకిల' లోని ప్రకరణాలకు (ఆటవిక గానములు, కవికుల వసంతము, విశ్వరసోదయ హేతువు), శ్రీశ్రీపై విమర్శ గ్రంథానికి (జగన్నాథ రథ చక్రాలు) పెట్టిన పేర్లు రమణారెడ్డి కవితాత్మక హృదయాన్ని చాటుతాయి.

కవి జీవిత సాహిత్యాలను సమన్వయిస్తూ వినూత్నమైన పంథాలో విమర్శను సాగించిన కె.వి.ఆర్ ఆధునికమైన విమర్శనారీతికి మార్గదర్శకుడైనాడు. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ 'వేమన'లో (1929) ఈ పద్ధతికి బీజారోపణ జరిగినప్పటికీ కవి జీవిత సమన్వయ విమర్శ విధానానికి కె.వి.ఆర్ స్పష్టమైన స్వరూపం కల్పించాడు. విశ్వవిద్యాలయాల్లో కవులు - రచయితలపై కొనసాగుతున్న పరిశోధనలు చాలావరకు ఈ బాటలోనే పయనించడం గమనార్హం. సమాజచరిత్ర, రచయిత జీవిత సాహిత్యాల విశ్లేషణల సమ్మేళనంగా కవి జీవిత విమర్శనా రీతి రూఢి అయింది.

శ్రీశ్రీ కవిత్వాన్ని 'జగన్నాథ రథచక్రాలు'లోని వ్యాసాలలో విపులంగా సమీక్షించిన రమణారెడ్డి ఆ మహాకవి రచనలను షష్టిపూర్తి సందర్భంగా ఆరు సంపుటాలుగా ప్రకటించటంలో ఆయన సాహిత్య పరిశ్రమ ద్యోతకమవుతుంది. వాటికి జతపరిచిన పీఠికల్లో ఆయన విమర్శనా దృక్పథం వెల్లడవుతుంది. 'కన్యాశుల్కం' నాటకాన్ని 'మరోముద్రణ' రూపంలో వెలువరించి దానికి టీకాటిప్పణి కూర్చిన కె.వి.ఆర్ 'నూరేళ్ళ కన్యాశుల్కం' విశిష్టతను చాటి చెప్పారు.

వ్యక్తి పూజకు, దురభిమానాలకు తావివ్వని సాంఘిక వాస్తవిక దృక్పథంతో విమర్శకు పూనుకొన్న కె.వి.ఆర్ సాహిత్య సేవను నిష్కామకర్మగా భావించారు. గురజాడ కన్యాశుల్కం వంటి నాటకం "న భూతో న భవిష్యతి" అన్న కొందరి అభిప్రాయాన్ని పేర్కొంటూ "న భవిష్యతి" అని చెప్పడానికి మనకేం అధికారం ఉందని ప్రశ్నిస్తాడు. మార్క్సిస్టు విమర్శనా ధోరణి గలవాడైనా ఆయనలో పిడివాదం గోచరించదు. రాతల్లో కటువుగా అనిపించినా, మాటల్లో సాధువుగా గోచరించే వ్యక్తిత్వం ఆయనది. అయితే కవితల్లోనూ, వచనంలోనూ కొన్నిచోట్ల ఆయన అవలంబించిన ఆలంకారిక శైలి పాఠకులకు ఇబ్బంది కలిగించినమాట వాస్తవం.

పైన పేర్కొన్న విమర్శ గ్రంథాలను మినహాయిస్తే రమణారెడ్డి విమర్శలన్నీ వ్యాసరూపంలోనే వెలువడ్డాయి. "ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర" లో కందుకూరి నుంచి సమకాలం వరకూ సి.ఆర్.రెడ్డి, ఉన్నవ, కొడవటిగంటి ప్రభృతుల సాహిత్యదృక్పథాలు సమాలోచితమైనాయి. 'ప్రజాగేయకవులు'లో కాళోజీ నుండి గద్దర్ వరకు కవుల పరామర్శ ఉంది. జైలుడైరీ, సాహిత్య లేఖలలో సామాజిక, రాజకీయ అంశాలపై పత్రికా సంపాదకులకు, కవి మిత్రులకు రాసిన లేఖలు ప్రచురితమైనాయి. 'ప్రాచీనసమాజం'లో హిమయుగం మొదలుకొని అనంతరయుగ పరిణామం, ప్రాచీన భారతీయ సాహిత్యంలోని సామాజిక చిత్రణం గురించిన పాఠాలపై ప్రసంగాలు చోటు చేసుకున్నాయి. నిశితమైన దృక్కుతో విమర్శనాస్త్రాలు సంధిస్తుంది ఆయన 'అక్షరతూణీరం'.

పుస్తక రూపం దాల్చని రమణారెడ్డి వ్యాసాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. రాజకీయ సంబంధమైన చర్చలు, పుస్తక సమీక్షలు, వాద వివాదాలు వీనిలో గోచరిస్తాయి. విప్లవోద్యమంతో గాఢమైన సంబంధం ఉండటంచే విప్లవ కవులపై, వారి సాహిత్య

సమర్థన పై ఆయన దృష్టి ఎక్కువగా ప్రసరించింది. శ్రీకాకుళం నుంచి కరీంనగర్ వరకూ సాగిన ఉద్యమాల చరిత్రకు సాక్షిగా, వ్యాఖ్యాతగా నిలిచాడు. తాను నమ్మిన సిద్ధాంతాలపై పూర్తి నిబద్ధత ఆయనలో కనిపిస్తుంది. "సమకాలీన సామాజిక పరిస్థితులకు ప్రగతి శీలంగా స్పందించే హృదయం, సమాజ చరిత్ర పట్ల శాస్త్రీయమైన దృక్పథం, సాహిత్య ప్రయోజనం పట్ల నిర్దుష్టమైన అభిప్రాయం, కళాత్మకతలు రమణారెడ్డి సాహిత్య జీవితాన్ని నడిపించాయి." ***(డి. చంద్రశేఖర రెడ్డి)***

ప్రజలే ప్రాణపంచకంగా భావిస్తూ మానవ జీవితమే స్వీకార్యంగా, చారిత్రక ప్రమేయమే ధ్యేయంగా చాటుతుంది ఆయన వ్యక్తిత్వం. గిరిజనోద్యమంపై రాసిన 'Flame of the Forest' పై వచ్చిన ఆదాయాన్ని చింతపల్లి గిరిజనుల గృహసముదాయ నిర్మాణం కొరకు వెచ్చించటం ఆయన ప్రజాసేవ దృక్పథానికి నిదర్శనం. 1998 జనవరి 15వ తేదీన రమణారెడ్డి కన్నుమూసిన సందర్భంలో చేకూరి రామారావు ఇలా నివాళి నర్పించారు – "కవీ, విమర్శకుడూ, నిస్వార్థజీవి, నిబద్ధ కార్యకర్తా, నిర్విరామ సాహిత్య కార్మికుడూ కె.వి.ఆర్. గారికి ఎన్నివిధాల నివాళులర్పించినా తనివి తీరదు. ఆయన లేని లోటు ఒక కుటుంబానిదే కాదు, తెలుగు సాహిత్యానిది."

(పాలపిట్ట, డిసెంబర్ 2010)

19. పాకాల యశోదారెడ్డి
(1929 - 2007)



శ్రీమతి పాకాల యశోదా తిరుమలరెడ్డి సంస్కృతాంధ్ర విదుషీమణి, విశిష్ట కథారచయిత్రి, ప్రౌఢగంభీరవక్తగానే కాక ఉత్తమ విమర్శకురాలుగా కూడ యశస్సు గడించారు. జానపదం, పాండిత్యం కలబోసుకున్న మూర్తిమత్త్వం, పొల్లులేని నిర్మలవ్యక్తిత్వం, అనర్గళమైన వక్తృత్వం ఆమెకు పెట్టని సొమ్ములు.

1929 ఆగష్టు 8వ తేదీన పాలమూరుజిల్లా బిజినేపల్లిలో పొన్నకల్లు కాశిరెడ్డి, సరస్వతమ్మ దంపతులకు జన్మించిన యశోదారెడ్డి రాజాబహద్దర్ వెంకటరామారెడ్డి ప్రోత్సాహంతో హైదరాబాదులో పాఠశాల విద్యను కొనసాగించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు, సంస్కృతం ఎం.ఏ. డిగ్రీలు పొంది 1955లో లెక్చరర్ వృత్తిని చేబట్టారు. 'తెలుగు హరివంశముల'పై పరిశోధన సల్పి డాక్టరేట్ పట్టం పొందారు. తెలుగు శాఖలో ప్రొఫెసర్గా పదవీవిరమణ చేసిన (1987) తర్వాత ఆంధ్రప్రదేశ్ అధికారభాషాసంఘం అధ్యక్షులుగా (1990-93) కొనసాగారు.

యశోదారెడ్డి సృజనాత్మక రంగంలోనూ, విమర్శనాత్మక రంగంలోనూ సవ్యసాచిగా ప్రశస్తిగడించారు. ఆకాశవాణిద్వారా ప్రసారం చేసిన 'మాఊరి ముచ్చట్లు' తెలంగాణ మాండలికభాషా పెన్నిధులుగా భాషా జిజ్ఞాసువులను ఆకట్టుకున్నాయి. యాభైకిపైగా కథలు మూడుసంపుటాలుగా - మా ఊరిముచ్చట్లు (1973), ధర్మశాల

(1993), ఎచ్చుమ్మ కతలు (2000) వెలువడ్డాయి. 'కథాచరిత్ర' (1989)ను విశదీకరిస్తూ ఆమె రాసిన విమర్శనాగ్రంథం కథాప్రక్రియపై ఆమెకు గల అభిమానాన్ని చాటుతుంది. ఉగాదికి ఉయ్యాల, భావిక అనే వచనకవితా సంపుటాలు ఆమె భావనాశక్తికి గీటురాళ్లు. "దేశమంటే మట్టికాదోయ్" అని గురజాడ అంటే

"దేశమంటే ఏందోయ్
మట్టీ మనుషులు రెండోయ్
మట్టికున్న మమకారం
నీకేం తెలుసొయ్"

అంటూ ఆమె వచించారు. రచ్చబండ, నాగి, నందిని, పరివ్రాజక దీక్ష మున్నగు నాటికలు, చిఱు గజ్జెలు మొ॥ బాలసాహిత్య రచనలు ఆమె కలంనుంచి వెలువడ్డాయి.

యశోదారెడ్డి విమర్శనా ప్రతిభకు నిదర్శనమైన గ్రంథాలు – కావ్యానుశీలనము, ఎర్రాప్రెగడ (1972), తెలుగులో హరివంశములు (1973), పారిజాతాపహరణ పర్యాలోచనము (1973), ఆంధ్ర సాహిత్య వికాసము (1974), భాగవతసుధ, భారతంలో స్త్రీ మొదలైనవి. ద్విపద, ప్రబంధవాఙ్మయ ప్రక్రియలను సమాలోచిస్తూ ఆమె వెలువరించిన ఉపన్యాసాలు కూడ గ్రంథరూపం పొందాయి.

ఎం. కులశేఖరరావు (3), యశోదారెడ్డి (4) రచించిన ఏడువ్యాసాల సంకలనం 'కావ్యానుశీలనం'. తొలివిమర్శ రచనలలోనే యశోదారెడ్డి నిశిత పరిశీలనా దృష్టి ద్యోతకమవుతుంది. ఇందలి వ్యాసాలలో ఉత్తర హరివంశంలోని సామెతలు, జాతీయాల సొగసును హృద్యంగా వ్యాఖ్యానించారు. పాండురంగ మాహాత్మ్యములోని పుండరీకుడు, నిగమశర్మ కథలలో రామకృష్ణుడు కనబరచిన ప్రజ్ఞావిశేషాలను వెల్లడించారు. కవయిత్రులైన మొల్ల, రంగాజమ్మ, ముద్దుపళని కావ్యాల విశేషాలను సమకాలీన ప్రభావ నేపథ్యంలో వివరించారు. అసందర్భములైన కథాంశములు ఉన్నప్పటికీ యయాతి చరిత్రలోని రచనాశైలి మాధుర్యాన్ని ప్రశంసించారు.

యశోదారెడ్డి సిద్ధాంత గ్రంథం "తెలుగులో హరివంశములు" సప్రమాణమైన, సమగ్రమైన బృహద్విమర్శనా గ్రంథం. వైష్ణవాచార కుటుంబంనుంచి వచ్చిన ఆమెకు

శ్రీహరి చరిత్రపై ఆసక్తి కలుగటం స్వభావసిద్ధం. ఎర్రన, నాచన సోమనల తులనాత్మక పరిశీలనయేకాక, శేషధర్మములు, ఆధునికమైన వచన కావ్యాలు (వెంపరాల సూర్యనారాయణశాస్త్రి) మున్నగు ఇతర హరివంశరచనలను ఇందులో సాకల్యంగా పరిశీలించారు. సంస్కృతమూలాలను శోధించి, తెలుగుకవులు చేసిన మార్పులను విశదీకరించారు. నిరంతర పరిశోధనకు కొనసాగింపుగా నేమాని భైరవకవి 'ఉత్తర హరివంశము'ను వెలుగులోకి తేవటమేకాక, సాహిత్య అకాడమీ ప్రచురించిన నాచనసోమన 'ఉత్తర హరివంశా'నికి వివేచనాత్మకమైన విపుల పీఠికను సమకూర్చారు.

ఎర్రన, నంది తిమ్మనలపై ప్రత్యేకగ్రంథాలు కూడా ఆమె విమర్శనా పటిమకు తార్కాణాలు. 'ఎర్రా ప్రెగడ'లో నృసింహపురాణ మూలం, ఎర్రన కవితా విశేషాలు పరామర్శితమైనాయి. పారిజాతాపహరణం రుద్రభట్టు కన్నడ కావ్యం జగన్నాథవిజయానికి అనువాదం అన్న దురభిప్రాయాన్ని ఖండించి రెండింటికీ సంస్కృతహరివంశమే మూలమని నిరూపిస్తూ 'పారిజాతాపహరణ పర్యాలోచనము' కావించారు. ఇతివృత్తం, పాత్రపోషణ, రసనిర్వహణ, అలంకారాలు, వర్ణనలు మున్నగు అంశాలలో ముక్కుతిమ్మన చూపిన ఔచిత్యం, శాస్త్రపరిజ్ఞానం, సమకాలీన సాంఘికచిత్రణం ఇందులో సమాలోచితమైనాయి. ఆంధ్ర వాఙ్మయాన్ని ఆమూలాగ్రం అవలోడించిన ఆమె విపులమైన తెలుగు సాహిత్య చరిత్రరచనకు సంకల్పించింది కాని మొదటిభాగం మాత్రమే 'ఆంధ్రసాహిత్యవికాసము'గా వెలువడింది. పురాణ (అనువాద) యుగంలోని ప్రసిద్ధకవుల కావ్యరీతులు - ప్రక్రియలు ఇందులో వివేచితమైనాయి.

యశోదారెడ్డి సాహిత్యోపన్యాసాలు విషయగౌరవంతోపాటు ప్రౌఢమైన భాషాపాటవాన్ని సంతరించుకొన్నాయి. వాటికి దీటుగా తెలుగు నుడికారం రంగరించుకొన్న మాండలికంలో గలగలా మాట్లాడగలిగే పట్టుకూడా ఆమెకు ఉంది. పాలమూరు బాస-యాస ఆమెకు వెన్నతోపెట్టిన విద్య. అసలు సిసలైన తెలుగు భాషారుచిని ఆస్వాదించాలంటే తెలంగాణా తెలుగును వినమని, చదువమని చెబుతుండేవారు.

"తెలుగుభాషారుచిని ఆస్వాదించదలచితే తెలంగాణపు తెలుగును చదవండి, వినండి. అంతేగాని ఆభాషపై సరియైన అవగాహన, అధికారం లేనివారి మాటలు విని అది

అనాగరికుల భాష అనీ, శిష్టవ్యవహారయోగ్యంకాని భాష అంటూ ఈసడించుకొని గూండాలకు, రౌడీలకు పరిమితం చేస్తూ వారినోట పలికించడంలో ఏ ఫలమూ సిద్ధించదు. వారినోట ఆమాటే వస్తుంది కాని తెలంగాణపు తెలుగు అది కాదు."

నాగరికత మునుగులో కనుమరుగైపోతున్న మన భాషాసంపదను భద్రపరచుకోవాలన్న తాపత్రయం ఆమెలో అడుగడుగునా కనిపించేది.

"ఇప్పుడు సీమిడి ముక్కులు లేవు, సింపులు లేవు, సీరపేండ్లు లేవు, గజ్జిపుండ్లు లేవు, ఒంటిపుర్రెల్లేవు, వోరగాళ్లు లేవు, కూర్కిపాట్లులేవు, ఊడ్చుకండ్లు లేవు. పిల్లలంతా ఉంకుచెండ్లోలె, దోసపండ్లోలె జళజళమంటుండరు." ('కొత్తబాట' కథ)

తన కథల్లో ఆమె వాడిన మాండలిక పదాలను, జాతీయాలను, పదబంధాలను, మాండలికపదాల పరిణామ క్రమంలో ధ్వనులలో వచ్చిన మార్పులను పెక్కుపుటల్లో వివరంగా పొందుపరచడం భాషామాండలికాల పరిరక్షణపట్ల ఆమెకు గల శ్రద్ధాసక్తులకు నిదర్శనం. భాషారంగంలో ఆమెకు గల ప్రజ్ఞకు ప్రతిఫలంగా తెలుగు సామెతలు, మాండలిక పదకోశము, ఆంధ్రక్రియాస్వరూపమణిదీపిక మున్నగు పదకోశాల సంకలనంలో పాల్గొన్నారు.

"సూటితప్ప పక్క పోటెరుగనిది" యశోదమ్మమాట. యుగయుగాలుగా ఉన్న స్త్రీ సమస్యలను స్త్రీవాద దృక్కోణం నుంచే కాక పూర్వాపర సంబంధ పూర్వకంగా స్త్రీ పురుషులమధ్య తలెత్తే సమస్యలను 'భారతంలో స్త్రీ' అన్న రచనలో నిష్పక్షపాతంగా చర్చించింది. స్త్రీ ఒక మైనపుబొమ్మ అన్న రష్యన్ కథకుడు చెకోవ్ భావనను ఖండిస్తూ కొత్త ఆలోచనలను మన ముందుంచింది.

"స్త్రీ ఎప్పుడూ మెత్తని మైనంకాదు, పురుషుడు తన ఇష్టం వచ్చిన బొమ్మను చేయడానికి. ఇది భారతీయ స్త్రీవిషయంలో అసాధ్యమైన పని... తన ఇంటిపై మమకారాన్ని చంపుకోలేక స్త్రీ అందరికీ ఊడిగంచేస్తూ వారి అభివృద్ధిని చూచి మురిసిపోయింది. పోతూ ఉంది. తానొక సమిధగా మండిపోతూ తన వ్యక్తిత్వాన్ని తనకుటుంబపు బాగోగులకు ఆహుతి ఇచ్చింది... కాని స్త్రీ ఈనాడు రాకూడని క్షేత్రంగానీ, తెలియగూడని విషయంగానీ, నేర్వకూడని విద్యగానీలేదు. పులులకంటే సమీపించరాని పురుషసింహాలను మైనపు బొమ్మలుగా చేస్తూ రాజకీయరంగంలో ప్రయోజనాలూ సాధిస్తున్నారు."

చిత్రకళారంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన పి.టి. రెడ్డి (పాకాల తిరుమలరెడ్డి) ఆమె భర్త. వారి అన్యోన్య దాంపత్యం సాహిత్య - చిత్రకళల అపూర్వసంగమంగా భాసించింది. నారాయణగూడలోని నివాసభవనం (సుధర్మ) వారికళాభిరుచికే కాక, సాహిత్య చర్చలకు కూడా నిలయంగా వెలుగొందింది. సహచరునితో కలిసి విదేశపర్యటన కావించిన అనుభవంతో ఆమె 'భారతీయ చిత్రకళ' గ్రంథం రూపొందింది.

భర్త మరణానంతరం పి.టి. రెడ్డి స్మారక పురస్కారనిధిని ఏర్పాటుచేసిన అనురాగమూర్తి యశోదారెడ్డి తన 78వ ఏట 2007 అక్టోబర్ 7న అనారోగ్యంతో తనువు చాలించారు. ఆమె ప్రతిభకు గుర్తింపుగా ఆగ్రా విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవడాక్టరేట్ ప్రదానం చేసింది. ఇంకా నాళం కృష్ణారావు అవార్డు (1989), తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం (1991), సుశీలానారాయణరెడ్డి అవార్డు మొ॥గు సత్కారాలు పొందారు. తెలంగాణ తెలుగుదనం, ఆత్మాభిమానం మూర్తీభవించిన విదుషీమణి శ్రీమతి పాకాల యశోదారెడ్డి.

20. కేతవరపు రామకోటిశాస్త్రి

(1931-1991)



విలక్షణమైన రీతిలో వివేచించి, విశిష్టంగా విశ్లేషించిన విమర్శకవతంసులు కేతవరపు రామకోటి శాస్త్రి. గుంటూరుజిల్లా రంగశాయుపురం అగ్రహారంలో 1931 డిసెంబర్ 26న జన్మించిన ఆయన వినుకొండ, గుంటూరు, వాల్తేరులలో ఉన్నతవిద్యను అభ్యసించారు. గుడివాడ కళాశాలలో మూడు సంవత్సరాలపాటు ఆంధ్రోపన్యాసకులుగా పనిచేసి తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో "తిక్కన కావ్యశిల్పము, తత్త్వము"పై పరిశోధనచేసి డాక్టరేట్ పట్టంపొందారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, తెలుగుశాఖ అధ్యక్షులుగా పనిచేస్తూ అరవయ్యో ఏట (28-10-1991) అకాలమరణం చెందారు.

శాస్త్రిగారి కలంనుంచి కొన్నికావ్యాలు వెలువడినా, విస్తృతంగా విమర్శరచనలే చేశారు. ఇరవైకి పైగా ఉన్న విమర్శగ్రంథాలలో ఆరుమాత్రమే ఆయన జీవించి ఉండగా ప్రకటితమైనాయి. మిగిలినవి 1992-2010 మధ్య ప్రతిఏటా ఆయన స్మారకంగా ఆయన వారసులు ప్రసిద్ధరచయిత్రి ఆచార్య కాత్యాయనీ విద్మహే, ఆమెచెల్లెళ్ళు మైథిలీ ధీమహీ, శ్రీగౌరీప్రచోదయాత్ కృషిమూలంగా వెలుగులోకి వచ్చాయి. ప్రచురణ కాలక్రమాన్ని అనుసరించి శాస్త్రిగారి విమర్శగ్రంథాల వరుస ఇలా ఉంది -

1. నైమిశం (1961)
2. సమీక్షణ (1963)

3. తిక్కన కావ్యశిల్పము (1973)
4. తిక్కన హరిహరనాథ తత్త్వము (1976)
5. మహాభారత తత్త్వదర్శనము (1976)
6. పోతన్న గారి వైచిత్రి (1987)
7. మళ్ళీ కన్యాశుల్కం గురించి (1992)
8. నాటకవిశ్లేషణ (1993)
9. విశ్వనాథ వైఖరి (1994)
10. మహిళా సమాజవాద సాహిత్యవ్యాసాలు (1995)
11. అభ్యుదయవాద సాహిత్యవిమర్శన దృక్పథం (1997)
12. కవిత్వం – సమాజం, క్రిస్టొఫర్‌కాడ్వెల్ విశ్లేషణ (1998)
13. భారతీయ సాహిత్య శాస్త్రం – భిన్న సంప్రదాయ దృక్పథాలు (1999)
14. నాచన సోముడు (2000)
15. ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలు (2001)
16. భాషా సాహిత్యాలు – సామాజిక భావనలు (2002)
17. పురాణేతిహాసాలు – విశేష విశ్లేషణలు (2003)
18. సంఘర్షణ – సంవాదం (2004)
19. దృష్టి – దృశ్యం (2005)
20. కావ్య జిజ్ఞాస (2007)
21. సాహిత్య సామాజికతావాదం – కొన్ని ప్రతిపాదనలు (2008)
22. ఒకరత్నము – ఒక మంత్రము (2010)

పైగ్రంథాలపట్టికను పరిశీలిస్తే శాస్త్రిగారి విమర్శనా చక్షువు బహుముఖీనమైన అంశాలపై ప్రసరించినట్లు ద్యోతకమవుతుంది. వీటన్నింటినీ లక్ష్యవిమర్శ – లక్షణవిమర్శ అని రెండు ప్రధాన విభాగాలుగా వింగడింపవచ్చు. ఆయన లక్ష్యవిమర్శ ప్రాచీనుల్లో ఆంధ్ర భారతేతిహాస కవులైన నన్నయ, తిక్కనలపై ప్రముఖంగానూ, పోతన, శ్రీనాథుడు, నాచన సోమనలపై ప్రత్యేకంగానూ కొనసాగింది. ఈ విమర్శరూపాలకు బీజాలు 1960కి ముందే శాస్త్రిగారు వివిధ పత్రికల్లో వెలువరించిన వ్యాసాల్లో గోచరిస్తాయి. ఆంధ్రభారత విమర్శనము (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, దుర్ముఖి సం॥ – నైమిశం 1961) వ్యాసంలో

నిర్మలేతిహాసమైన (Authentic) సంస్కృత భారతానికీ, కావ్యేతిహాసమైన ఆంధ్రభారతానికీ గల ప్రక్రియా భేదాన్ని అనుసరించి వాని తారతమ్య నిరూపణం తగదనీ, ఆంధ్రభారతాన్ని మూలగ్రంథ నిరపేక్షంగా, ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరం ఉందనీ ప్రతిపాదించారు. వ్యాసుని దేవయాని ఉద్విగ్న మనస్తత్వాన్ని నిరూపించే వ్యాసంతోపాటు (ఆం.సా.ప. పత్రిక, జయ సం॥, సమీక్షణ - 1963), వేదవ్యాసుని తత్త్వాన్ని విశదీకరించే వ్యాసం (విశ్వసాహితి - 1960) కూడా భారత సంబంధమైనవి.

ఈ వ్యాసాల్లో బీజరూపంగా ఉన్న అభిప్రాయాలు డాక్టరేట్‌పట్టం పొందిన సిద్ధాంత గ్రంథంలో (తిక్కన కావ్యశిల్పము, తత్త్వము - 1973) విపులీకరింపబడ్డాయి. శాస్త్రిగారి మహాభారత వివేచన మూడు సంపుటాలుగా ప్రకటితమైంది. 'తిక్కన కావ్యశిల్పము' (1973) లో ఉత్తర రామాయణం, ఆంధ్రభారతం ఉత్కృష్టంగా పరామర్శితమైనాయి. నిర్వచన రామాయణం రెండు లఘుకావ్యాల సంపుటి అని, పూర్వభాగంలో రావణుడు, ఉత్తరభాగంలో రాముడు నాయకులని శాస్త్రిగారు వినూత్నంగా ప్రతిపాదించారు. పాత్రచిత్రణతోపాటు, తిక్కన కావ్యదృష్టి, మూలానుసరణం, నిర్మాణకుశలత, రసనిర్వహణ మున్నగు అంశాలను హృద్యంగా వివేచించారు. భారతంలో ధర్మరాజు నాయకుడని, రసం శాంతమని పేర్కొన్న శాస్త్రిగారు వివిధ పర్వాలలో తిక్కన ప్రదర్శించిన శిల్పాన్ని, ఉపకథల ప్రయోజనాన్ని విశదీకరించారు. వర్ణనలు, అలంకారాలు, వృత్తౌచిత్యం మున్నగు అంశాలను నూత్నదృష్టితో సమీక్షించారు. ఈ గ్రంథానికి కొనసాగింపుగా తిక్కన హరిహరనాథ తత్త్వము, మహాభారత తత్త్వ దర్శనము 1976లో ప్రకటితమైనాయి.

నిరంతర పరిశోధనా వ్యాసంగ వ్యగ్రులైన రామకోటి శాస్త్రి అనంతరకాలంలో పురాణేతిహాసాల స్వరూప స్వభావాలను వివేచిస్తూ వెలువరించిన 28 వ్యాసాలు 'పురాణేతిహాసాలు - విశేష విశ్లేషణలు' (2003) పేరిట సంకలితమైనాయి. వీనిలో అధికభాగం భారతేతిహాసానికి సంబంధించినవే. పదివ్యాసాలు నన్నయ తిక్కనల భారతరచనా దృక్పథాన్ని వెల్లడించేవి. ఆరువ్యాసాలు పురాణసాహిత్య విశ్లేషణ (3), పోతన భాగవతరచనా పరిశీలనతో (3) కూడినవి. మిగతానాలుగు రామాయణ తత్త్వాన్ని విశదీకరించేవి. పురాణేతిహాసాల అధ్యయనం ఆధునిక సామాజిక అవసరంగా గుర్తించిన శాస్త్రిగారు "నేను బాగుపడవలయును అన్న ప్రగాఢమైన ఇచ్ఛగల ప్రతివిద్యార్థి భారతం

అధ్యయనం చేయవలసి ఉంటుందని నేను భావిస్తున్నాను" (పు. 128) అంటూ భారత అధ్యయనానికి పిలుపు నిచ్చారు. మహాభారతం వంటి ఇతిహాసాన్ని ఎన్నికోణాలనుంచి అధ్యయనం చేయవచ్చో నిరూపించే ఈ గ్రంథం పురాణేతిహాసాల సమ్యగవగాహనకు దోహదం చేస్తుంది. ఇతిహాస పురాణాల తత్త్వాన్ని శాస్త్రీయంగా విశ్లేషించిన మార్గదర్శకులు శాస్త్రిగారు. ఈ మార్గంలో పురాణ ప్రక్రియా వివేచనలో పేర్కొనదగినవారు జి.వి. సుబ్రహ్మణ్యం (ప్రథమాంధ్రమహాపురాణం), తుమ్మపూడి కోటేశ్వరరావు (పురాణ విద్య) గారలు.

కాకతీయ విశ్వవిద్యాలయం పరిశోధన పత్రిక 'విమర్శిని' లో (1981-82) ప్రచురితమైన 'పోతన్నగారి వైచిత్రి'యే తర్వాత ప్రత్యేక గ్రంథంగా (1987) రూపుదాల్చింది. పోతన్న ఉభయకావ్యకరణ దక్షుడైనా, ఆలంకారికులు పేర్కొన్న సుకుమార, విచిత్రమార్గాలలో విచిత్రమార్గవైపే మొగ్గుచూపాడని శాస్త్రిగారు భావించారు. భగవంతుడే భాగవత వస్తువని, పోతన భాగవతపురాణం వస్తుధ్వని ప్రధాన కావ్యమని ఉగ్గడించారు. పోతన చరిత్ర, కవితా విశేషాలు మున్నగు సర్వాంశాలనూ సమగ్రంగా పరామర్శించిన గ్రంథం 'పోతన్నగారి వైచిత్రి.'

ప్రాచీనాంధ్రకవులను ఏ విధంగా అధ్యయనంచేయాలో సూచించే నమూనా గ్రంథాలు రామకోటిశాస్త్రి కవి విమర్శలు. ఉత్తరహరివంశంలోని 'హంసడిభకోపాఖ్యానం' ఎం.ఏ. విద్యార్థులకు పాఠ్యాంశంగా ఉన్న సందర్భంలో (1970-71) ఆయన వ్రాసికొన్న 'నోట్సు' ఒక ప్రణాళికాబద్ధంగా 'నాచన సోముడు' (2000) పేరుతో వెలువరించారు కాత్యాయనిగారు. పాఠభేదాల పరిశీలన, కొన్ని పద్యాలకు మాదిరివ్యాఖ్య, మూలంతో తులనాత్మక పరిశీలన, వీటి నేపథ్యంతో నాచనసోముని కవిత్వ వివేచన – ఈ పద్ధతిలో కొనసాగింది ఆయన విమర్శ. "నాచన సోమనకు పద్యరచనయందున్న శ్రద్ధ కృతినిర్మాణంలో గానీ, నిర్వహణలోగానీ లేకపోయినా" ప్రతిభావంతుడైన కవి గనుక జాతీయమును వ్యవహారమును అయిన ఒడుపు మాటలను ఎడనెడ ప్రయోగించుట ద్వారా సంవిధానమును రక్తిగట్టించాడని శాస్త్రిగారు నిష్కర్ష చేశారు. ఈ కావ్యానికి "ఉత్తరహరివంశం' బదులు 'హరిలీలావిలాసము' అన్న పేరు సార్థకంగా ఉంటుందని భావించారు. ఈ గ్రంథంలో వివిధ శీర్షికల అధ్యాయాలను గమనిస్తే ఇది ఒక చక్కని

ఎం.ఫిల్. పరిశోధన గ్రంథంగా గోచరమవుతుంది. వీటినే మరికొంత విపులీకరిస్తే పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథమవుతుంది. అనుబంధంలో ఉన్న కందుకూరి పీఠికలు, ఎర్రన – సోమనల కవిత్వంపై పండితాభిప్రాయాలు శాస్త్రిగారి బహుగ్రంథ పరిశీలనాసక్తిని చాటుతాయి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధన పత్రిక 'వివేచన' (డిసెంబర్ 1976)లో ప్రచురితమైన 'ఒక రత్నము ఒక మంత్రము' వ్యాసంతోపాటు శృంగారనైషధకావ్య జిజ్ఞాసకు సంబంధించిన మరి ఎనిమిది వ్యాసాలను చేర్చి ఒక సంపుటిగా (2010) ప్రకటించటం జరిగింది. 1970 తర్వాత దేవీ ఆరాధనా మార్గంలో పయనించిన శాస్త్రిగారి శ్రీనాథకావ్య విమర్శపై గుంటూరు శేషేంద్రశర్మగారి 'స్వర్ణహంస' (1968) ప్రభావం గోచరిస్తుంది. దమయంతి శ్రీమహాత్రిపుర సుందరి అని, నలుడు జీవుడు అని, హంస ఆ జపామంత్రాధిదేవత అని పెక్కు శాస్త్రగ్రంథాల ఆధారంగా నిరూపిస్తూ శేషేంద్ర హర్షుని సంస్కృతనైషధంలో నిక్షిప్తమైన మంత్రయోగవేదాంత రహస్యాలను వెల్లడించారు. అయితే రామకోటిశాస్త్రి వీటిని శ్రీనాథుని శృంగారనైషధంలో అన్వయించి చూపారు. ఈ గ్రంథానికి అంతర్వాణి పేరుతో తొలిపలుకు వ్రాసిన కొర్లపాటి శ్రీరామమూర్తిగారు శృంగార నైషధములోని కవితావిశేషాలు చాలవరకు నైషధీయచరితములోనివే అని ఉగ్గడించారు. కవిత్రయము వారిది స్వతంత్రానువాదము కావచ్చునేమోకాని శ్రీనాథునిది మటుకు యథాంధ్రీకరణమే. కవి సార్వభౌముని ప్రతిభ అంతా వక్రోక్తి గుంఫితమైన అతని రచనాశైలిలో ప్రకాశిస్తుంది. ఈ గ్రంథంలో శ్రీనాథునిది వైదర్భీరీతిగా పేర్కొనబడింది. నైషధంతోపాటు భీమఖండ, కాశీఖండములలోని శ్రీనాథుని కావ్యతత్త్వదృక్పథాన్ని శాస్త్రిగారు 'కావ్య జిజ్ఞాస'లోని వ్యాసంలో విశదీకరించారు.

ప్రాచీనాంధ్ర సాహిత్య విమర్శకు సంబంధించిన పన్నెండు వ్యాసాల సంపుటి (2007) 'కావ్యజిజ్ఞాస'. తెనాలి రామకృష్ణుని ఘటికాచలమాహాత్మ్యమును 'నైమిశము'లో (1963) పరిశీలించిన శాస్త్రిగారు ఇందులో ఉద్భటారాధ్య చరిత్రమును పరామర్శించారు. మొదటిది స్థలమాహాత్మ్య కావ్య విమర్శకు మార్గ దర్శకంగా ఉంది. ఉద్భటారాధ్యచరిత్ర రచనలో రామకృష్ణ కవికి శ్రీనాథుడు ఆదర్శంగా నిలచాడని పేర్కొన్నారు. సాహిత్య చరిత్రలో ప్రముఖ – అల్పభేదాలతో ఏరచననైనా నిర్లక్ష్యం చేయకూడదని భావించిన సహృదయవతంసులు రామకోటి శాస్త్రి. సుబ్రహ్మణ్యకవి శత్రుఘ్నవిజయ ప్రబంధము,

వీరరాఘవకవి ఉద్యోగపర్వము, ముద్దుబాలంభట్టు మంథెన రామాయణము మున్నగు కావ్యాలను లోకానికి పరిచయం చేసిన శాస్త్రిగారు సాహిత్యవికాసంలో ప్రాంతీయరచనల పాత్రను గుర్తించటం ప్రశంసనీయం.

ఆధునికయుగ రచయితల్లో విశ్వనాథసత్యనారాయణపై రామకోటిశాస్త్రికి ఆరాధనాభావంతో కూడిన అభిమానం ఉంది. 1953 నుంచీ ఆయనతో ముఖాముఖీ పరిచయం ఉండటమేకాక గుడివాడలో పనిచేసిన రోజుల్లో ఆయన సాన్నిహిత్యంలో సారస్వతాభిరుచిని పెంపొందించుకొన్నారు. 1956లో కవిసమ్రాట్ షష్టిపూర్తినాటినుంచీ – రామాయణ కల్పవృక్షం తప్ప మరోధ్యాస లేనట్లుగా ఆయన సాహిత్యంపై ఏదో ఒక విమర్శవ్యాసం వ్రాస్తూనే వచ్చారు. 1975 తర్వాత విశ్వనాథ నవలలపై దృష్టి మరలింది. 1953 నుంచి 1991 లో తనువు చాలించేంతవరకూ సత్యనారాయణపై వ్రాసిన వ్యాసాలూ, వ్రాసుకున్న 'నోట్సు' కలిపి 'విశ్వనాథ వైఖరి'గా (1994) సంకలితమైనాయి. వీనిలో 17 వ్యాసాలు రామాయణకల్పవృక్ష పరామర్శలు కాగా, 7 వ్యాసాలు నవలా సంబంధమైనవి. కల్పవృక్షాన్ని శిల్ప విమర్శదృష్టితో వీక్షించిన శాస్త్రిగారు నవలలను వస్తుగత దృక్కోణంతో పరిశీలించారు. "వస్తునిర్మాణంవల్ల సరే – దాన్ని మించి అసాధారణమైన రచనాశిల్ప కళాకౌశలం వల్ల విశ్వనాథ శారద ప్రకాశిస్తున్నది" అని భావించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో నవ్యసంప్రదాయవాదానికి ప్రతినిధిగా విశ్వనాథ గోచరిస్తే – ఆ నవ్యసంప్రదాయ దృక్పథానికి భాష్యకారుడుగా శాస్త్రిగారు నిలుస్తారు.

విశ్వనాథపై తొలివ్యాసంలో (1956 జనవరి–కృష్ణాపత్రిక) పూర్వాంధ్రమహాకవుల గుణ విశేషములను తనలో ఇముడ్చుకొన్న కారణజన్ముడు, యుగపురుషుడు, మహాకవిగా ఆయన్ను దర్శించిన శాస్త్రిగారు చివరివ్యాసంలో (కవితా సంభారము – 1990) "నిరంతర దైవచింతనా పరతంత్రత వల్ల ఏర్పడ్డ వైదగ్ధ్యమునుండి సద్యోనిర్గతమైన సర్వకవితా సంభారమే శ్రీమద్రామాయణ కల్పవృక్షం" అని ఉగ్గడించారు. "రామాయణ కల్పవృక్షం విశ్వనాథ సత్యనారాయణ అపూర్వ కవితాసృష్టి. ఇప్పటివరకు ఉన్న రామాయణాలలో అది అత్యుత్తమమైనది. తెలుగులో వచ్చిన ఇతర రామాయణ రచనలన్నిటిని అధిగమించిన గొప్పరచన" అని నిర్ద్వంద్వంగా వచించారు. ఈ వ్యాసాలన్నీ చదివితే "విశ్వనాథ రచనలను అర్థం చేసుకోవటానికి భారతీయ మతతాత్త్విక విజ్ఞానం ఎంతగా ఉండాలో ఆధునిక

ప్రాపంచిక దృక్కోణం అంతగా ఉండాలని అర్థమవుతుంద"ని కాత్యాయనీ విద్మహే పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో విశ్వనాథ వాఙ్మయజీవిత పరిశోధనా కార్యక్రమానికి రూపకల్పనచేసిన (1972) శాస్త్రిగారు విశ్వనాథ వాఙ్మయసూచిక (1974) రూపొందటానికీ, విశ్వనాథ వాఙ్మయ జీవిత విశేష సంచిక (1977) వెలువడటానికీ ఎంతో కృషి సల్పారు.

విద్యార్థిదశలో కన్యాశుల్కంలోని అగ్నిహోత్రావధాన్లు వేషంలో నటించిన రామకోటిశాస్త్రి పరిశోధనావ్యాస రచన నాటకవిమర్శతోనే ప్రారంభం కావటం గమనార్హం. తెలుగునాట ప్రసిద్ధి పొందిన గురజాడ కన్యాశుల్కం, చిలకమర్తి గయోపాఖ్యానం, ధర్మవరం విషాదసారంగధర నాటకాలపై 1955లో పత్రికల్లో వ్యాసాలు ప్రచురించారు. కన్యాశుల్కంలో నాటక ప్రక్రియా లక్షణాలు పొసగవనీ, అది ప్రదర్శనయోగ్యంకాదనీ, అందులో రచయిత సాధించిన పరమార్థం ఏదీ లేదనీ భావించిన (నైమిశము) శాస్త్రిగారు మరొకవ్యాసంలో "అప్పారావుగారు జీవితాన్ని బహుముఖాలుగా దర్శించిన అద్వితీయమైన ప్రతిభాశాలి" అంటూ (సమీక్షణ) వివిధ ప్రక్రియారచనల్లోని (నాటకం, గేయం, కథ, వ్యాసం) గురజాడ ఆంతర్యాన్ని విశదీకరించారు. కన్యాశుల్కం నాటకం గురించి ఆయన ఆలోచనల్లో వచ్చిన మార్పుకు నిదర్శనం ఆ నాటక శతజయంతి సందర్భంగా ప్రచురితమైన గ్రంథం 'మళ్లీ కన్యాశుల్కం గురించి' (1992).

గయోపాఖ్యానం నాటకంలోని ఇతివృత్త నిర్వహణలో ఔచిత్యం ఉన్నా, పాత్రోన్మీలనంలో, రచనా శిల్పంలో లోపాలున్నాయని పేర్కొన్న శాస్త్రిగారు విషాద సారంగధరలో కథానాయకుడు రాజరాజనరేంద్రుడని, విషాదాంతనాటక లక్షణాలు దానికి బాగా పట్టవని, తొలి దశలోని రచనకావటమే అందుకు కారణమనీ భావించారు. సమీక్షణ సంపుటి (1963)లోని ఈ రెండు వ్యాసాలు అనంతరకాలంలోని 'నాటక విశ్లేషణ' (1997)లో చేరినాయి. ఈ రెండు తెలుగునాటకాల వివేచనతో పాటు ప్రసిద్ధ సంస్కృతరూపకాలైన భవభూతి ఉత్తర రామచరిత, విశాఖదత్తుని ముద్రారాక్షసము, ఆంగ్లకవి షేక్స్‌పియర్ హామ్లెట్ నాటకం కూడా ఇందులో విస్తృతంగా సమాలోచితమైనాయి. ఉత్తర రామచరిత విశ్లేషణ సమగ్రంగా (120 పుటలు) ప్రత్యేకవిమర్శ గ్రంథస్థాయిలో ఉంది. ఉత్తర రామచరిత కథావస్తు నిర్వహణలో కాళిదాసు శాకుంతలంతో పోలికలను చూపటం శాస్త్రిగారి ఆంతర్వీక్షణను చాటుతుంది. భవభూతి

నాటకం కౌటుంబిక సంబంధాలకు ప్రతిరూపమైతే, విశాఖదత్తుని నాటకం రాజకీయవ్యవస్థను చిత్రిస్తుంది. కనుక ఈ రెంటినీ చదివితే జీవితంపై సమగ్ర అవగాహన ఏర్పడుతుందన్న అభిప్రాయాన్ని ప్రకటించారు శాస్త్రిగారు. హామ్లెట్ నాటకం కూడా ఎం.ఏ.కు పాఠ్యగ్రంథంగా ఉండటంతో దానిపై ప్రత్యేక దృష్టిని సారించారు. మొదటివ్యాసంలో ట్రాజెడీ లక్షణాలను వివరించిన 'నాటక విశ్లేషణ' వ్యాససంపుటిని పరికిస్తే ట్రాజెడీ పై శాస్త్రిగారి ప్రత్యేక అధ్యయనం బహిర్గతమవుతుంది.

రామకోటిశాస్త్రి ప్రాచీన సాహిత్యాన్ని ఎంత అభినివేశంతో అధ్యయనం చేశారో అంత అభిమానంతోనూ ఆధునిక సాహిత్యావలోకనం చేశారు. ఆయన ఆధునిక కవిత్వ పరామర్శకు బీజాలు నైమిశము (1961)లోని వ్యాసాల్లో గోచరమవుతాయి. పరిశోధకుడుగా లబ్ధ ప్రతిష్ఠుడైన సురవరం ప్రతాపరెడ్డి కవిత్వాన్ని పరిచయం చేసిన వ్యాసం (సమీక్షణ) శాస్త్రిగారి నిశిత – సమవీక్షణానికి గీటురాయి. విమర్శిని సంచికలు – ఆధునిక కవితా విశేష సంచిక (1976), విశ్వనాథ రాయప్రోలుల వాఙ్మయజీవితవిశేష సంచికల్లో (1977, 79) ఆధునిక కవితా సంబంధమైన వివేచన విస్తృతంగా చేశారు. 1985లో నిర్వహించిన సదస్సులో 'పునరుజ్జీవన సంస్కరణ స్వాతంత్ర్యోద్యమాలు – చారిత్రక నేపథ్యం' అన్న కీలక పత్రం సమర్పించారు. వీటిని కలుపుకొని ఆధునిక కవిత్వారంభంనుండి కొనసాగిన తెలుగు కవితా ప్రస్థానంపై వెలువరించిన సమీక్షావ్యాసాలు, వ్రాసుకొన్న నోట్సును శ్రమతో సమీకరించి జాగ్రత్తగా సంకలనంచేసిన గ్రంథం "ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలు" (2002). వివిధ ఉద్యమాలనేపథ్యంలో రూపుదిద్దుకొన్న కాల్పనిక, అభ్యుదయ, దిగంబర, విప్లవకవిత్వాల స్వరూప స్వభావాలను పరామర్శించిన గ్రంథం ఇది. శిల్పదృష్టినుండి వస్తుగత దృక్పథ విమర్శలోకి పరివర్తన చెందిన పరిణామం ఇందులో స్పష్టమవుతుంది. కవిత్వాల వెనుక ఉన్న సంఘటనలు, చరిత్రల వివరణమే ఇందుకు సాక్ష్యం. ఆధునిక కవిత్వ చరిత్రను అవగాహనచేసుకోవటానికి ఈ గ్రంథం ఎంతో ఉపకరిస్తుంది.

మల్లినాథుని నుండి మార్క్సువరకూ అధ్యయనం చేసిన రామకోటిశాస్త్రి సాహిత్యశాస్త్రాన్ని గురించి కూడా విస్తృతంగా చర్చచేశారు. ఆయన లక్షణవిమర్శలో ప్రముఖంగా పేర్కొనతగినది 'భారతీయ సాహిత్యశాస్త్రం: భిన్న సంప్రదాయాలు –

దృక్పథాలు' (1999). సంస్కృత అలంకారశాస్త్ర విషయాలను సుబోధకం కావించిన వ్యాసాల సంకలనం ఇది. తెలుగు కవుల సాహిత్య భావనలు కూడా ఇందు ప్రస్తావితమైనాయి. కావ్యకళాతంత్రము అన్న మొదటి భాగంలో కవి సహృదయుల సంబంధం, వేదాంతశాస్త్ర ప్రాతిపదికపై ధ్వని సిద్ధాంతం వివృతమైనాయి. రెండవభాగంలోని 31 శీర్షికల్లో భరతుని నుండి ఆనందవర్ధనుని వరకు కళలు, సాహిత్య – కావ్యతత్త్వం, కావ్య ప్రయోజనం మున్నగు పలు విషయాలపైగల అభిప్రాయాలు విశ్లేషింపబడ్డాయి. ధ్వని – రసం – ఆనందం – జ్ఞానం అన్న సోపానాలపై కావ్యాత్మ ప్రతిపాదింపబడింది.

తర్వాతి గ్రంథాల (ఏడు)లో సాహిత్య శాస్త్రాన్ని సామాజిక చారిత్రక దృక్పథంతో అధ్యయనం చేయాలన్న స్పృహ ప్రబలంగా కనిపిస్తుంది. అభ్యుదయవాద సాహిత్య విమర్శన దృక్పథం (1997), భాషా సాహిత్యాలు – సామాజిక భావనలు (2002)లో గతితార్కిక చారిత్రక భౌతిక వాద దృక్కోణంనుండి సాహిత్య సామాజిక తత్త్వ లక్షణాలు వివరింపబడ్డాయి. మార్క్సిజం, విప్లవం అన్న పదాలు విని భయపడాల్సిన అవసరం లేదని, విప్లవం అన్నది చారిత్రక ఆవశ్యకత అని ఉగ్గడించారు. యూ.జి.సి స్కీంలో వివిధ విశ్వవిద్యాలయాల్లో చేసిన ప్రసంగవ్యాసాల సంపుటి 'సాహిత్య సామాజికతావాదం – కొన్ని ప్రతిపాదనలు' (2008)లో అలంకారశాస్త్రాన్ని ఆధునిక దృక్పథంతో వ్యాఖ్యానించిన తీరు గోచరిస్తుంది. 'దృష్టి – దృశ్యం' (2005) ఆధునిక విమర్శరీతుల విశ్లేషణ. 'సంఘర్షణ – సంవాదం' (2004) లోని నాలుగువ్యాసాలలో వివిధ సందర్భాలలో చేరా, ఆర్.ఎస్. సుదర్శనం, కొమ్మూరి వేణుగోపాలరావు, ముదిగొండ వీరభద్రయ్యలు ప్రకటించిన అభిప్రాయాలతో విభేదించిన ప్రతిపాదనలు, రంగనాయకమ్మ అభిప్రాయాలకు సమర్థనలు ఉన్నాయి. శేషేంద్రశర్మది విప్లవోద్యమం కాదని, వైజ్ఞానిక ఉద్యమం అని పేర్కొన్నారు. స్త్రీవాద సంబంధమైన 'మహిళా సమాజవాద సాహిత్య వ్యాసాలు' (1995)లో చేరా రూపవాదవిమర్శపై ఖండనఉంది. 'కవిత్వం – సమాజం' (1998)లో క్రిస్టాఫర్ కాడ్వెల్ కవితాదృక్పథం విశదీకరింపబడింది. ఈ గ్రంథాలన్నింటిలోనూ శాస్త్రిగారు సాహిత్య తాత్త్విక దృక్పథంనుండి సోషలిస్టు సాహిత్య తాత్త్విక దృక్పథంవైపు చేసిన ప్రయాణం స్పష్టమవుతుంది.

రామకోటిశాస్త్రి సృజనాత్మకరంగంలో కూడ అడుగుపెట్టి కొన్ని కావ్యాలు వెలువరించారు. ఆనందచేతన (1968), అనంగహేల (పుష్పబాణవిలాసము), శత్రుంజయము (1968) ఆయన జీవితకాలంలో ప్రచురితమైనాయి. తర్వాత వెలువడిన మూడుకావ్యాలలో ఒకే ఇద్దరము (1996) భావకవితా ధోరణికి చెందింది కాగా, చిచ్చేతన (2006) శతకం, శ్రీకృష్ణ దూత్యము (2009) ముక్తక ప్రక్రియకు సంబంధించినవి. కాకతీయ ప్రతాపరుద్రదేవుని ఏడు అంకాల సంస్కృత నాటకం 'యయాతి చరిత్ర' (1972) అనువాదం డిగ్రీతరగతికి పాఠ్యగ్రంథంగా ఉండింది.

పాఠ్యప్రణాళికల్లో మార్పులు ప్రవేశపెట్టటమేకాక, పాఠ్యాంశాలకు విద్యార్థులకు ఉపయుక్తమైన విపులవ్యాఖ్యానాలు వెలువడాలన్నది ఆయన ఆకాంక్ష. సాధ్యమైనంత విస్తృత సమాచారాన్ని అందించాలన్నది ఆయన తపన. ఆయన విమర్శల్లో చాలావరకు ఆవిధంగా రూపుదిద్దుకున్నవే. విశ్వవిద్యాలయస్థాయిలో ప్రసిద్ధకవుల వాఙ్మయజీవన సూచికలకు రూపకల్పన చేసింది కూడ ఆయనే. సాహిత్యచర్చల్లో, సదస్సు పత్రాల అంశాల్లో కొత్త భావాలకు, ఆలోచనలకు నూత్నగవాక్షాలు తెరిచారు. ఆయన రచనా విధానం విద్యార్థులకు పాఠం బోధించేవిధంగా, వివరణాత్మకంగా, తర్కబద్ధంగా ఉంటుంది. శైలివిషయంలో తొలుత గ్రాంథిక వాదిగా విశ్వనాథ గద్యరచనాశైలిని పుణికిపుచ్చుకొని తర్వాత వ్యావహారిక భాషాశైలిని అలవర్చుకొన్నారు. ఆయన భాషా సాహిత్య విమర్శ రచనలో విశ్వనాథ ప్రభావం తక్కువేమీకాదన్నది వాస్తవం.

నిరంతర అధ్యయన శీలి అయిన శాస్త్రిగారు అభిప్రాయ వ్యక్తీకరణలో నిర్భయంగా నిక్కచ్చిగా వ్యవహరించేవారు. "రామకోటి శాస్త్రి అంటే సాహిత్య అధ్యయనం, సాహిత్య సంభాషణ" (వరవరరావు). నేను "తెలుగులో సాహిత్య విమర్శ' పై పరిశోధన చేస్తున్న రోజుల్లో ఆయన వ్యాసాలు నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. షష్టిపూర్తికి ముందే లోకానికి దూరమైన శాస్త్రిగారు సాంద్రమైన ఆలోచన, హేతుబద్ధమైన వివేచనతో విమర్శరంగంలో శాశ్వతమైన, 'తన'దైన ముద్రను వేసి వెళ్లారు.

21. కోవెల సంపత్కుమారాచార్య

(1933-2010)



కోవెల సంపత్కుమారాచార్య గారు వైష్ణవులు. వైష్ణవుల్లో ఏ తెగకు చెందినవారో తెలియదుకాని నాకు మాత్రం వారు త్రినామధారిగా గోచరించేవారు. ఆయనకున్న మూడు నామాలు ఒకటి ఛందస్సు, రెండు అలంకారశాస్త్రం, మూడు వచన పద్యం. సంపత్కుమార సాహిత్య విమర్శ అంతా ఈ మూడు అంశాలుగా విస్తరిల్లింది.

ఛందస్సుపై జరిగిన శాస్త్రీయ పరిశోధన చాలా తక్కువనే చెప్పాలి. ఇంతవరకూ వెలువడిన గ్రంథాలు కొన్నింటిలో మిన్నగా పేర్కొనతగింది ఆయన 'తెలుగు ఛందోవికాసం' (1962). నేను ఎం.ఏ. విద్యార్థిగా వున్నరోజుల్లో ప్రచురితమైన ఆ గ్రంథరచనా ప్రణాళిక నన్ను ఎంతగానో ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రకటించిన పోటీకోసం వ్రాయబడ్డ మూడు గ్రంథాలలో అది ఒకటి. అవార్డులు అదృష్టాన్ని అనుసరిస్తాయన్న మాట నిజమైతే ఈ పోటీలో గిడుగు సీతాపతి గారిని అదృష్టం వరించింది. భాషాఛందస్సుల స్వరూప స్వభావాలకు సంబంధించిన మౌలిక వివేచనలో సీతాపతిగారు నిష్ణాతులు అయినా వారి 'తెలుగు ఛందో రీతులు' గ్రంథం ఆయా సందర్భాలలో పత్రికల్లో, లక్షణ గ్రంథ పీఠికల్లో వ్యక్తపరచిన వివిధ అంశాల సమీకరణం మాత్రమే. అకాడమీ ప్రకటించిన పోటీ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని తెలుగు ఛందస్సు పరిణామాన్ని సమగ్రంగా సమాలోచించిన గ్రంథం సంపత్కుమారగారి 'తెలుగు ఛందో వికాసం'. ప్రాఙ్నన్నయ యుగం మొదలుకొని ఆధునికయుగం వరకూ ఛందోవిధానం యొక్క క్రమవికాసాన్ని నిశితమైన వివేచనతో, సప్రమాణమైన విశ్లేషణతో నిరూపించిన గ్రంథం అది.

ఈ గ్రంథం అనుబంధంలో ఆధునిక ఛందస్సులను వివేచించిన సంపత్కుమారగారు ఆధునిక కవితారూపాలలో ప్రాచుర్యం వహించిన వచన పద్యంపై విశేషంగా తమ దృష్టిని సారించారు. వచన కవితపై వెలువరించిన వ్యాసాలే అందుకు సాక్ష్యం. ఫ్రీవర్స్ ఫ్రంట్ ప్రచురణ 'వచన కవిత – వివిధ కవుల పథాలూ, దృక్పథాలూ'(1967) సంకలనంలోని వ్యాసంలో ఆధునిక ఛందః పరిణామాన్ని విశదీకరించారు. వరంగల్లు జనధర్మ పత్రికానుబంధంగా ప్రకటితమైన 'స్వాతంత్ర్యోత్తరకాలాన తెలుగు కవిత'లో (1969) అర్వాచీన కవితను అనుశీలించారు.

చేతనావర్త కవులలో ఒకరుగా వెలుగులోకి వచ్చిన సంపత్కుమార చేతనావర్తం రెండవ సంపుటికి (1970) విలువైన పీఠికను సమకూర్చారు. సాహిత్యరంగంలో ఏర్పడిన గందరగోళాన్ని తొలగించి కవిత్వం పట్ల సదవగాహనను పెంచి కనుమరుగవుతున్న విలువలను పునరుద్ధరించటం చేతనావర్త కవుల లక్ష్యం. అనంతరకాలంలో వరంగల్లు సాహితీ బంధుబృందం ప్రకటించిన 'అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు'(1987) లోని వ్యాసంలో దేశీయతాభావ భూమికలో వచ్చిన కావ్యాలను (ఆధునిక కవిత్వం – దేశీయత) సంపత్కుమార పరామర్శించారు. స్వార్థపూరితమైన ఒత్తిడుల కారణంగానూ, తెలిసి కొంతా – తెలియక కొంతా రకరకాల భ్రాంతులతోనూ దేశీయతా సమగ్రభావనను విచ్ఛిన్నపరిచే ప్రయత్నాలు కొనసాగుతున్నంతకాలం దేశీయతను గూర్చి మళ్ళీమళ్ళీ విచారించుకొంటూ వుండవలసిన అవసరాన్ని ఉగ్గడించారు.

ఈ వ్యాసాలు అలా వుంచి – వచన పద్యం ఛందస్సు స్వరూప స్వభావాలపై చేరాతో చేసిన చర్చలు ప్రయోగాత్మకంగా గణింపదగినవి. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక, భారతి ముఖంగా కొనసాగించిన ఈ వాదాలు తర్వాత గ్రంథరూపం (వచన పద్యం – లక్షణ చర్చ,1978) దాల్చాయంటే వాటి ప్రత్యేకత గోచరమవుతుంది. ఛందస్సుతో పాటు భాషావ్యాకరణాలకు చెందిన నూత్న విషయాలు ఎన్నో వీనిలో ప్రసక్తమైనాయి. సంపత్కుమార వ్యాససంకలనం 'తెలుగు ఛందస్సు పై కొన్ని వెలుగులు' వారి షష్టి పూర్తి సందర్భంలో ఆచార్య చేకూరి రామారావుగారికి అంకితం కావటం ఔచితీమంతం.

అన్నింటికి మించి సంపత్కుమారగారికి అభిమాన పాత్రమైనది అలంకారశాస్త్రం. అయితే చాలామంది వలె ఆయన దాన్ని పైపైన చదివి ఊరుకోలేదు. నిష్ఠతో పఠించి

అందలి లోతులను అవగాహన చేసుకొన్నారు. "గాఢమైన అధ్యయనావగాహనములు లేకపోవుట హేతువుగా, శ్రుతపరిచయము తోడనో, పూర్వోత్తర సమన్వయమునం దోపిక లేకపోవుటచేతనో, మరిదేని కారణంగానో బాధ్యతారహితముగా 'వ్యాఖ్య'లు చేయు అలవాటు, కల్పిత భ్రాంతులు తొలగవలసిన అవసరము సాహిత్యవిమర్శరంగమున... దాని ప్రగతి వికాస పరమార్థ భావుకులగు వారు వాంఛింపదగినది". ఈ కోరిక ప్రేరకంగా 'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ : సాంప్రదాయిక రీతి' (1981) అన్న సిద్ధాంతవ్యాసాన్ని ఆయన వెలువరించారు.

"ఈ దేశమునకున్న సాహిత్య విమర్శ సంప్రదాయము ప్రాచీనమగుటయేగాక సువ్యవస్థితము, సమృద్ధము కూడానని ప్రత్యేకముగా చెప్పవలసిన యవసరము లేదు. అయితే ప్రాంతీయ భాషలన్నింటికీ ఆద్యోద్గమమైన సంస్కృతభాషలో సర్వప్రాంతీయులైన మహానుభావులచే, సాహిత్య మర్మవేత్తలచే పరివర్ధితమైన సాహిత్య విమర్శ సంప్రదాయమే ప్రాంతీయభాషా సాహిత్యముల కన్నింటికి ప్రామాణికముగా అనువర్తించినది".

సంప్రదాయ ప్రభావం, తెలుగు విమర్శలో దాని అనువర్తనం గురించిన మౌలికమైన వివేచన, శాస్త్రీయమైన సమాలోచన ఈ గ్రంథంలో గోచరిస్తాయి. తెలుగులో విమర్శసాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ప్రముఖ విమర్శకుల విమర్శనాధ్యయనంలో నిష్పన్నములైన సాహిత్య విమర్శ సిద్ధాంతాలను నిరూపించటంతో పాటు వానిలో అలంకారశాస్త్ర సంప్రదాయ ప్రసారమును విశిష్టంగా విశ్లేషించి చూపారు సంపత్కుమారగారు.

ఆధునిక విమర్శ పరిణామంలో మైలురాయిగా పేర్కొనబడిన 'కవిత్వతత్త్వ విచారము' నకు సంబంధించిన ప్రకరణం ఇందులో విపులమైన స్థానాన్ని ఆక్రమించింది. కట్టమంచి రామలింగారెడ్డి గారు ప్రధానంగా ప్రతిపాదించిన 'భావనాశక్తి' రాజశేఖరుడు, రుద్రటుడు మున్నగు లాక్షణికులు పేర్కొన్న 'ప్రతిభ'లోనే అంతర్భవిస్తుందన్న అంశాన్ని స్పష్టీకరిస్తూ, ప్రతిభ నుంచి భావనాశక్తిని విడదీసి వేరుచేయటంలో పాశ్చాత్య విమర్శ అంశమైన Imagination ప్రభావాన్ని నిరూపించారు. సంప్రదాయసిద్ధములైన పదముల విశిష్ట స్ఫూర్తిని గమనించక స్వసంకేతమైన అర్థాలలో వాటిని ఉపయోగించటం వల్ల ఏర్పడే అస్తవ్యస్తతను కూడా ఎత్తి చూపారు.

కథైక్యతను పరామర్శిస్తూ, భామహుడు, భోజుడు చెప్పిన కథాభేదాలను విశ్లేషించి ప్రఖ్యాత ఉత్పాద్యముల ఆంతర్యమును వివరించటంలో సంపత్కుమార వివేచనా ప్రతిభ ద్యోతక మవుతుంది. కథానిర్వహణ గురించి రెడ్డిగారు చేసిన విచారములో దండి భామహులు వచించిన భావికత్వ గుణము ప్రతిఫలిస్తుందని పేర్కొంటూ కథా విషయంలో ఈ లాక్షణికులు నిరూపించిన అంశాలు అవగాహనా రాహిత్యం వల్ల అనంతరకాలంలో ఉపేక్షకు గురి అయినాయన్న సత్యాన్ని చాటి చెప్పారు.

కవిత్వతత్త్వ విచారము తర్వాత విపులంగా సమాలోచితమైన అంశం విశ్వనాథ 'కావ్య పరమార్థ దృక్పథము'. విశ్వనాథ స్వోపజ్ఞమైన 'జీవుని వేదన' ప్రత్యేకంగా మరొక ప్రకరణంలో చర్చింపబడింది. ఇంకా రాళ్ళపల్లి కావ్యకళాదృక్పథం, దువ్వూరి రసరామణీయ కములు, రాయప్రోలు రమ్యాలోకం, నండూరి బంగారయ్య నిర్మాణ శిల్పం, శ్రీశ్రీ సంవిధాన సామాజిక దృక్పథం మున్నగువానిలోని సంప్రదాయానుస్యూతి విస్పష్టంగా ప్రదర్శితమైంది. ఈ విధంగా తెలుగు విమర్శరంగాన్ని ప్రభావితం చేసిన విమర్శకుల సాహిత్య దృక్పథాలను సహేతుకంగా సమాలోచించి వానియందు భారతీయ లాక్షణిక సిద్ధాంతాల ప్రసారాన్ని సప్రమాణంగా నిరూపించిన ఈ సిద్ధాంతగ్రంథం కాకతీయ విశ్వవిద్యాలయ తొలి స్నాతకోత్సవంలో తొలి డాక్టరేట్ పట్టా పొందటం కాకతాళీయమే అయినా స్మరింపదగిన సన్నివేశం.

ఈ గ్రంథానికి భూమికగా వుండదగిన – ప్రాచీనాంధ్రకవులు తమ కావ్యాల్లో నెరపిన విమర్శ వివేచన ప్రత్యేక గ్రంథం కాదగునని భావించిన సంపత్కుమార అనంతర కాలంలో ఆ బాధ్యతను కూడా నెరవేర్చారు. ఆయన నిరంతర అధ్యయన శీలతకూ, విమర్శ జిజ్ఞాసకూ నిదర్శనం 'పూర్వకవుల కావ్య దృక్పథాలు' (1990). కొందరు ఆంధ్ర మహాకవులు కావ్యలక్షణాలను నిశితంగా వివేచించి తమ కావ్యాల్లో సూత్రప్రాయంగా నిక్షేపించారు. వ్యాఖ్యాన సాపేక్షములైన ఆ విమర్శసూత్రాలు విభిన్నమైన అభిప్రాయాలకూ చర్చలకూ తావిచ్చాయి. అవగాహనా లోపం వల్ల వాని స్పష్టస్వరూపం నిరూపితం కాలేదు. దీనిని గమనించిన సంపత్కుమార కావ్య విషయంగా మౌలికమైన ఆలోచనలు అందించిన నలుగురు మహాకవుల దృక్పథాలను ఈ గ్రంథంలో విశదీకరించటం జరిగింది. సందర్భానుగుణంగా ప్రాచీనాలంకారికుల అభిప్రాయాలు ఇందులో ప్రస్తావితమైనాయి. 'ఎడద మెత్తదనంబు విడిది చేసిన చోటు', సాహిత్య ప్రియంభావుకుడు అయిన జువ్వాడి గౌతమరావుగారికి ఇది అంకితం కావటం అభినందనీయం.

సకల సాహిత్యరీతులూ, ప్రక్రియలూ స్వీయముద్రతో ప్రయోగించి, అపరిమితమైన సాహిత్యసృష్టి చేసిన విశ్వనాథ సత్యనారాయణను సాహిత్యరంగంలో అద్భుత ప్రతిభావంతుడుగా పరిగణించిన సంపత్కుమార ఆయన సాహిత్యాన్ని 'లో చూపు' తో విశ్లేషిస్తూ వ్యాసాలూ, గ్రంథాలు రచించారు. ఆయా సందర్భాలలో విశ్వనాథపై వెలువరించిన పధ్నాలుగు వ్యాసాల సంకలనం 'విశ్వనాథ సాహిత్య దర్శనం (2004). ఇందులో రామాయణ కల్పవృక్షంపై 6 వ్యాసాలు, నవలలు – నాటకాలు – గేయకావ్యాలపై 7 వ్యాసాలు ఉన్నాయి. విశ్వనాథపై సంత్కుమార తొలివ్యాసంగా గణింపదగిన 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము: తులనాత్మక పరిశీలన'లో (1957) తులసీదాస్ రామాయణంతో తులనాత్మక వివేచన గోచరిస్తుంది. యుద్ధకాండలోని కవితాశిల్పం, ఆనందవర్ధనుని ప్రతిపాదనలకు వ్యాఖ్యాప్రాయమైన విశ్వనాథ 'మహో' కవిత్వం గురించిన వ్యాసాలు సంపత్కుమార సూక్ష్మ పరిశీలనాదృష్టిని ప్రస్ఫుటం చేస్తాయి.

'భారతీయ సాహిత్య నిర్మాతలు' శీర్షికలో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన 'విశ్వనాథ సత్యనారాయణ' (2007)లో ఆయన జీవిత, వ్యక్తిత్వాలతో పాటు కావ్యం, నవల, రూపకం, విమర్శ, వ్యాసాలు, పీఠికలు మున్నగు ప్రక్రియా రచనలను హృద్యంగా వివేచించారు. ప్రతిష్ఠాత్మకమైన రామాయణ కల్పవృక్షం, వేయి పడగలు గ్రంథాలను ప్రత్యేక ప్రకరణాలలో పరిచయం చేస్తూ విశ్వనాథ సాహితీ వైశిష్ట్యాన్ని ప్రకాశమానం చేశారు. ప్రవాహవాణి పత్రికానుబంధంగా ప్రచురితమైన లఘుగ్రంథం 'కిన్నెరసాని పాటలు – వస్తు విన్యాసం'లో (1999) ఆ పాటల నేపథ్యాన్ని, వివిధ ఖండాలలోని వస్తు శిల్పాన్ని సోదాహరణంగా విశ్లేషించారు. "కావ్యారంభంలో భర్తృవియోగినిగా, దుఃఖమూర్తిగా ఉండిన కిన్నెర కావ్య సమాప్తిలో భక్తియోగినిగా, శాంతమూర్తిగా పరిణత వ్యక్తిత్వాన్ని సాధించింది. లోకానికి జీవన ప్రదాయినీ స్థాయి కెదిగింది. ఆత్మ సంగీతంగా సత్కవి కావ్యంలో ప్రవహించింది" అంటూ కిన్నెర ఆంతర్యాన్ని అంతర్వీక్షణంతో దర్శించారు.

సంపత్కుమార ఏది వ్రాసినా అనేక మౌలికాంశాలను వినూత్నంగా వివేచించటం ఆయన విమర్శరీతిలోని వైలక్షణ్యం. 'కన్యాశుల్కం – మరోవైపు' (2000) ఆనాటకాన్ని కొత్తకోణాల్లో దర్శిస్తుంది. గురజాడ సాహిత్యాన్ని దేశీయతా భూమికపై వాస్తవ దృక్పథంతో పరిశీలిస్తుంది. కన్యాశుల్కం తొలి, మలి కూర్పులను సమీక్షిస్తూ రెండవ కూర్పులో

ప్రవేశపెట్టిన మార్పులు అనుచితంగా ఉన్నాయని భావించారు. నాటక ప్రక్రియా దృష్టిలో అది విఫలమైందని పేర్కొన్నారు. ఈ గ్రంథం అనుబంధంలో తన అభిప్రాయాలపై విమర్శలు, వాటికి సమాధానాలు చేర్చటంతో పాటు ముగింపుగా కొన్ని చర్చనీయాంశాలను ప్రతిపాదించారు.

షష్టిపూర్తి సందర్భంలో వెలువడిన ఎనిమిది వ్యాసాల సంపుటి 'కావ్యం: కవిస్వామ్యం' (1993). దేశీయతా భూమికపై ఆధునిక కవిత్వ పరిణామాల సమాలోచనకు సంబంధించిన వ్యాసాలు గణనీయమైనవి. భావకవిత్వంపై నవ్య సంప్రదాయ కవుల తిరుగుబాటు, ప్రగతివాద (అభ్యుదయ) కవిత్వంపై దేశీయతా భావన తిరుగుబాటు వీనిలో సవిస్తరంగా పరామర్శితమైనాయి. "దేశీయమైన ఉదాత్త కావ్య సంప్రదాయాన్ని ఆధునికీకరించుకొన్నది నవ్య సంప్రదాయ కావ్యవిధానం" అని విశదీకరించారు.

ఛందోలంకార విమర్శకులుగానే కాక, గ్రంథపరిష్కర్తగా, పరిశోధకులుగా కూడా సంపత్కుమార గణనీయమైన కృషి సల్పారు. 'మన పండితులు – కవులు – రచయితలు' (1970) వరంగల్లు ప్రాంతానికి చెందిన పాతికమంది రచయితల సమగ్ర చరిత్రతోపాటు వారి సాహిత్య పరామర్శకూ నెలవైన గ్రంథం. ఆయన పరిష్కరించిన కూచిమంచి తిమ్మకవి లక్షణసార సంగ్రహం (1971) , అప్పకవీయానికి సవరణగా నలభై అఖండయతి ప్రయోగాలను ప్రదర్శించిన కూచిమంచి వెంకటరాయని 'సుకవి మనోరంజనం'(1976) గ్రంథాలను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రకటించింది. తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన కంకంటి పాపరాజు ఉత్తర రామాయణం ఆయన పరిష్కరణలోనే వెలువడింది. తెలుగు అకాడమి పక్షాన వెలువడిన 'తెలుగు ఛందః పదకోశా'నికి (1977) సంపాదకత్వం నిర్వహించారు. విశిష్టమైన రీతిలో విశ్వనాథ సాహిత్య అధ్యయన వివేచనములను సల్పిన సంపత్కుమారగారు 'విశ్వనాథ సాహిత్య వ్యక్తిత్వం' (1980) నిరూపించే వివిధ రచయితల వ్యాసాలను సంకలించారు. అసంఖ్యాకమైన విశ్వనాథ అముద్రిత రచనలను సేకరించి 'అసంకలిత సాహిత్యం' పేరిట ఆరు సంపుటాలుగా ప్రకటించటంలో ప్రధానపాత్ర వహించారు. ఇంకా వివిధ సంచికల్లో, పత్రికల్లో అనేక విమర్శనాత్మక వ్యాసాలు, గ్రంథ సమీక్షలు ప్రచురించారు.

తెలుగులో సంప్రదాయజ్ఞులైన విమర్శక విజ్ఞులెందరో వున్నారు. కాని తమ పరిజ్ఞానాన్ని ఆధునిక దృక్పథంతో సమన్వయించి వివేచన సాగించినవారు అరుదు. అట్టి అరుదైన విమర్శకుల్లో సంపత్కుమారకు సముచితమైన స్థానం ఉంది. తెలుగు విమర్శపై అంతా అలంకారశాస్త్ర ప్రభావమే వుందనికాని, లేదా అంతా ఆంగ్ల విమర్శ ప్రభావమే ఉందని కాని అనుకోవడం పొరపాటు. ప్రాచ్యపాశ్చాత్య సిద్ధాంతాలు దేశీయకవుల దృక్పథాల సమ్యక్ సమ్మేళనంతో పురోగమించటమే పునాదిగా గతాన్ని సమన్వయించుకొని భవిష్యత్తును రూపొందించుకోవటం సంపత్కుమార సాహిత్య దృక్పథం.

ఆయన సాహిత్య విమర్శ ప్రధానంగా దేశీయత - జాతీయత అన్న అంశాల భూమికపై కొనసాగింది. వాక్యనిర్మాణ శైలి విభిన్నంగా, భాష విలక్షణంగా ఉండటం ఆయన ప్రత్యేకత. అయితే "తనదైన ఆలోచనల్లో చేసే సూక్ష్మ తర్కం కొన్నిచోట్ల ఎంతలోతుగా ఉంటుందో, కొన్ని చోట్ల అంత అప్రస్తుతార్థాల్ని లాగుతున్నట్లుగా కూడా ఉంటుంది. అంతేకాక రచనాశైలి లోని క్లిష్టత చాలా చోట్ల విషయాన్ని సులభంగా చదవనివ్వదు." (అద్దేపల్లి రామమోహనరావు) అని కొందరు విమర్శకుల అభిప్రాయం.

1933 జూన్ 26న చూడమాంబా, రంగాచార్యులకు జన్మించిన సంపత్కుమార తండ్రి వద్ద సంస్కృతం అభ్యసించి చిట్టిగూడూరు ప్రాచ్య కళాశాలలో భాషా ప్రవీణ (1953) అధ్యయనం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఏ. (1963), హిందీ ఎం.ఏ. (1966) డిగ్రీలు పొందారు. చాలా కాలం జగిత్యాల కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి తర్వాత కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా చేరి 1993లో పదవీ విరమణ చేశారు. హృద్గీతి, చేతనావర్తం, ఆనందలహరి, అంతర్మథనం, కాలస్పృహ, ఆముక్త, ఆంజనేయాననం, చేరాకు శతమానం, అపర్ణ, చింతయంతి మున్నగు వచనగేయ, పద్య కవితా సంపుటులు ఆయన సృజనాత్మక ప్రతిభకు గీటురాళ్లు. సాహిత్య రంగంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా దాశరథి అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారాలు, జీవియస్ కళాపీఠం అవార్డు, కేంద్ర ప్రభుత్వ ప్రతిభా రాజీవ్ అవార్డు (2009) మున్నగు గౌరవాలు అందుకొన్నారు.

కోవెల సంపత్కుమారాచార్య నాకు ఎంతో ఆత్మీయులు. మా ఇద్దరికీ అభిమాన పాత్రమైన విషయం సాహిత్య విమర్శ. ఆ అంశంపైనే పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీ పొందాం. నా సిద్ధాంత గ్రంథం (తెలుగులో సాహిత్య విమర్శ) రెండు ముద్రణలపై

వారు పత్రికల్లో సమీక్షలు రాశారు. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య గ్రంథాలకు సహరచయితలుగా, సంపాదకులుగా ఉన్నాం. చివరి దశలో నా 'విశ్వనాథ దర్శనం' గ్రంథానికి 'దర్శన వేళ' పేరుతో ముందుమాట (13-12-2009) అందించారు. కాని అది ముద్రితం కాక ముందే 2010 ఆగస్ట్ 5న ఈ లోకాన్ని వీడివెళ్లారు. ఆయన అస్తమయంతో లోతైన పాండిత్యం, గాఢమైన వివేచనాశీలం కల ఒక ఉదాత్త విమర్శకుడిని సాహిత్య జగత్తు కోల్పోయింది.

వార్త, ఆదివారం (15 ఆగస్ట్, 2010)

22. జి.వి. సుబ్రహ్మణ్యం

(1935–2006)



ఆధునిక యుగంలో పరిశోధన ప్రముఖ ప్రక్రియగా పరిఢవిల్లి ప్రత్యేకస్థానాన్ని గడించుకొన్నది. తొలిదశలో – 19వ శతాబ్దిలో సామగ్రి సేకరణ, గ్రంథపరిష్కరణ, కవిచరిత్ర నిర్మాణం, కర్తృత్వ విచారం, పాఠపరిశీలనం మున్నగు అంశాల విచారణతో ప్రారంభమైన తెలుగు పరిశోధన మలిదశలో – 20వ శతాబ్దంలో నవీన సిద్ధాంతాల ప్రతిపాదన, విశ్లేషణ, సమన్వయ సంవిధానం మున్నగు విశిష్ట లక్షణాలను సంతరించుకొని ముందుకు సాగుతున్నది. ఈ రెండుదశలలోని లక్షణాలూ పరిశోధనలోని బహిరంతరంగ ప్రవృత్తులు. ఈ ప్రవృత్తులకు సంబంధించిన పరిశీలన విధానాలు విమర్శరంగంలో నూత్న సిద్ధాంత దర్శనానికి దోహదం చేస్తాయి. అట్టి నూత్న సిద్ధాంత దార్శనికుల్లో జి.వి.సుబ్రహ్మణ్యం గారిది విశిష్ట స్థానం.

నాలుగు దశాబ్దాలుగా అసంఖ్యాక సాహిత్య విద్యార్థులను తీర్చిదిద్దుతూ పరిశోధనరంగంలో నూతన కాంతులను ప్రసరింపజేస్తున్న ఆచార్య వరేణ్యులు జి.వి.యస్. అధ్యాపక వృత్తికీ, అధ్యయన ప్రవృత్తికీ అవినాభావ సంబంధం ఉంది. ఐ.ఎ.రిచర్డ్స్ విశ్వనాథ, పింగళి మొదలుకొని ప్రసిద్ధ విమర్శకులందరూ అధ్యాపకులే కావటం గమనార్హం. సుబ్రహ్మణ్యం గారి పాఠబోధన తరగతి గదికే పరిమితం కాకుండా విశాల

సాహితీ గవాక్షాలను తెరిచి విద్యార్థుల్లో నవ్యాలోకానికి దోహదం చేసింది. గతాన్ని సమ్యగవగాహన చేసుకొని, వర్తమానంతో సమన్వయించి, భవిష్యద్దర్శనం కావించిన మార్గదర్శకులు ఆయన.

అధ్యయన, అధ్యాపక రంగాల్లో ఆయనది గురుస్థానం. తరగతి గదిలో క్రొత్త సమస్యలు – ఆలోచనలతో విద్యార్థుల జిజ్ఞాసకు పదును పెట్టడమేగాక, ఎందరో పరిశోధక విద్యార్థులకు (63) పర్యవేక్షకులుగా వారిని తీర్చిదిద్దారు.

జీవియస్ సృజనాత్మక శీలియైన గొప్ప భావుకుడు. ఆ భావనా బలంతో ఎన్నో కథలు, కవితలు, నాటకాలు, నవలలు రచించాడు. సాహిత్య రూపకాల్లో శ్రీనాథుడు, మున్నగు కవుల పాత్రలను కౌశలంతో అభినయించడమే కాక, దివాకర్ల వారితో రూపుదిద్దుకొన్న 'భువన విజయం' ప్రదర్శనలను రక్తి కట్టించాడు. 'వీరరసం' గ్రంథంతో ఆయన సృజనాత్మకత రంగాన్ని వదిలి వివేచనాత్మక జగత్తులో ప్రవేశించారు. ఆనాటి నుండి వెనుచూడకుండా విమర్శ ప్రక్రియకే అంకితమై విమర్శనా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. విమర్శ క్షేత్ర పరిధిని విస్తరింపజేశారు. పరిశోధనం, విమర్శనం ఆయనకు నయనయుగళం అయినాయి. నూత్నాంశాల ఆవిష్కరణ, వినూత్న సత్యాల విశ్లేషణలతో ఏభై వత్సరాల ఆయన సాహిత్య ప్రస్థానం విజయవంతంగా కొనసాగింది.

పరిశోధన, విమర్శ – రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి పరస్పర పోషకాలుగా వర్ధిల్లుతున్నాయి. పరిశోధనలో అన్వేషణకు ప్రాముఖ్యం – సాహిత్య విమర్శలో అనుశీలనకు ప్రాధాన్యం. ఒకటి శోధనం – మరొకటి మథనం. పరిశోధనలోని అంతరంగ ప్రవృత్తినీ, విమర్శలోని అంతర్మథనాన్నీ గర్భీకరించుకొన్న ఉత్తమ పరిశోధక విమర్శకులు సుబ్రహ్మణ్యంగారు. వీర రసం, రసోల్లాసం, ప్రథమాంధ్ర మహపురాణం, ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం, సారస్వత సౌరభం, నవ్యాలోకం, అభినవలోచనం, సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, నవ్యసంప్రదాయం – విశ్వనాథ మొదలైన గ్రంథాలు, వారి పరిశోధనా పాటవానికి, విమర్శ వైభవానికి నిదర్శనాలు.

జీ.వి.యస్ గారి సాహిత్య సమాలోచనను ఈ కింది అంశాలుగా వింగడింపవచ్చు.

- రసప్రస్థానంలో నూత్నమార్గ దర్శనం

- పురాణ లక్షణ నిరూపణం
- సాహిత్య చరిత్రలో ప్రక్రియావికాస పరమైన విశ్లేషణం
- పాశ్చాత్య విమర్శనారీతుల సమన్వయం
- నవ్యసంప్రదాయ సిద్ధాంత ప్రతిపాదనం
- ప్రాచీనాధునిక కవి హృదయ ప్రకాశనం

ఆయన నిశితమైన పరిశీలనాచక్షువు మొట్టమొదట రసతత్త్వంపై ప్రసరించింది. రస సిద్ధాంతాన్ని అభినవ లోచనంతో వీక్షించి వీరమే 'రసానాం రసః' అన్న క్రొత్త వాదాన్ని నెలకొల్పారు. ఆయన రచించిన 'వీరరసం' గ్రంథానికి 1961లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించటమే దాని ప్రాశస్త్యానికి తార్కాణం. ఈ గ్రంథంలో స్వతంత్రాలోచనతో వీర రస భేదాలను నిరూపిస్తూ – స్వాతంత్ర్య వీరము, యశో వీరము మాన వీరము అన్న భేదాలను క్రొత్తగా పేర్కొన్నారు సుబ్రహ్మణ్యంగారు. కావ్య వాఙ్మయంలోనే కాక, నవలలు, నాటకాలు, చలన చిత్రాలు మున్నగు ప్రక్రియల్లోని వీర రసాన్ని ప్రదర్శించటంలో ఆయన వివేచనా ప్రతిభ ద్యోతకమవుతుంది.

'వీర రసము'లో బీజరూపంగా ప్రతిపాదితములైన భావాలను విస్తృత రూపాలు 'రసోల్లాసము'లోని వ్యాసాలు. ఆయన నిరంతర సాహితీ జిజ్ఞాసకు దర్పణం ఈ గ్రంథం. రామాయణం కరుణ రసభరితం, మహాభారతం శాంతరసోపేతం అన్న ప్రసిద్ధమైన లాక్షణిక మార్గాన్ని కాదని రామాయణభారతాల్లో అంగిరసం ధర్మవీరం అన్న సిద్ధాంతాన్ని స్థాపించి అలంకార శాస్త్ర ప్రస్థానంలో నూత్న దర్శనానికి దారి తీశారు. ప్రధాన పాత్రలు పొందే ఫలప్రాప్తినీ, సామాన్య పాఠకుల స్థాయి నధిగమించిన సహృదయ రసానుభూతినీ ప్రమాణాలుగా స్వీకరించి ఈ సిద్ధాంత స్థాపనకు పూనుకొన్నారు. రస సమీకరణ వాదాలను తులనాత్మకంగా వివేచించి వాటిని కావ్యవిమర్శకు సమన్వయించి చూపారు.

.'రసోల్లాసము' లోని వ్యాసాలన్నింటిలోనూ ఒక కొత్త సమన్వయ దృక్పథం గోచరమవుతుంది. శబ్ద – అర్థగుణాలతో కూడిన రచనా విధానాలను వివరించి తిక్కన శైలిలో ప్రదర్శించే ప్రౌఢోక్తి పాటవాన్ని విశదీరకరించారు. శృంగార శాకుంతలంలో పినవీరభద్ర కవి వస్తు నిర్మాణంలో ప్రతిఫలింపజేసిన రసశిల్పాన్ని నిరూపించారు. కళాపూర్ణోదయంలో సరస్వతీ చతుర్ముఖుల ప్రణయకేళిలోని బింబ ప్రతిబింబ సంఘటనం

కావ్యకథాకల్పనకు మూలమైన వైనాన్ని హృద్యంగా వివరించారు. చేమకూర కవి విజయవిలాసంలోని ప్రతీకాత్మక ప్రవృత్తిని ఎత్తిచూపారు. సుబ్రహ్మణ్యం గారి విమర్శమార్గంలో ప్రతీక విమర్శకు ప్రాధాన్యం ఉంది. ప్రాచీన సాహిత్యంలోనే కాక ఆధునిక సాహిత్యంలోని ప్రతీకలను కూడా నిశిత దృష్టితో వీక్షించారు. కె.శివారెడ్డి 'ఆసుపత్రి గీతం' వర్తమాన భారతానికి ప్రతీకగా ఆయన పరిశీలన కావించిన విధానమే దానికి సాక్ష్యం.

జీవియస్ గారి శాస్త్రీయమైన పరిశోధనా పద్ధతికీ, నూత్నాంశాల సమన్వయం దృక్పథానికీ మరొక నిదర్శనం ఆయన కావించిన పురాణతత్త్వ వివేచనం. మార్గపురాణ సంప్రదాయానికి విభిన్న రీతిలో వెలసిన బసవ పురాణంపై ప్రసరించిన జైనపురాణ ప్రభావాన్ని విశదీకరించటంలో నవాలోకంతో కూడిన ఆయన పరిశీలనాప్రతిభ గోచరమవుతుంది. సాహిత్య అకాడమీ ప్రచురించిన బసవ పురాణ పీఠికలో సంస్కృత పురాణాల పంచలక్షణాలకు ప్రతిగా జైన పురాణాల్లో నిబంధితమైన ఉత్సవ పంచలక్షణాలను పేర్కొని పాల్కురికి సోమన బసవపురాణ కావ్యానికి చక్కగా సమన్వయించి చూపారు.

దేశిపురాణమైన బసవపురాణానికి ప్రతిగా తెలుగులో సంప్రదాయ మార్గంలో వెలసిన మహాపురాణం మారన విరచితమైన 'మార్కండేయ పురాణం'. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖలో డాక్టరేట్ పట్టం పొందిన సిద్ధాంత వ్యాసం 'ప్రథమాంధ్ర పురాణం' (1973)లో మార్కండేయ పురాణం సాంగోపాంగంగా సమాలోచితమైంది. సమకాలీన సాహిత్య మర్యాదలను, సాంఘిక సాహిత్య ప్రయోజనాలను ప్రతిబింబిస్తూ వెలువడిన మారన కావ్యం అనంతర ప్రబంధాలకు మూలంగా నిలచిన ప్రత్యేకతను సహృదయ హృదయంగమంగా వెల్లడించారు సుబ్రహ్మణ్యం గారు. పురాణేతిహాసాల స్వరూప స్వభావాలను, ప్రాచ్య పాశ్చాత్య ప్రక్రియలైన పురాణేతిహాసాల భేద సాదృశ్యాలను, పురాణ పంచలక్షణ - దశలక్షణ - దశాధిక లక్షణ పరిణామ వికాసాలను సశాస్త్రీయంగా విశదీకరించారు. గుణత్రయ విభాగాన్ని అనుసరించి నూత్నరీతిలో పురాణ వర్గీకరణ కావించారు. జీ.వి.యస్ పరిశోధనా ప్రతిభకు ఎత్తిన పతాక 'ప్రథమాంధ్ర మహాపురాణము'.

ఆంధ్రసాహిత్య విమర్శను ఆంగ్లవిమర్శ ప్రభావ పరిశీలన దృష్టితో సింహావలోకనం చేసి, తులనాత్మక సమన్వయ దృక్పథంతో పునఃపరిశీలించి, ఫలితాంశాలను వివేచించి సాహిత్య విద్యార్థులకు అందించిన ఉత్తమ విమర్శ గ్రంథం 'ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల విమర్శ ప్రభావం' (1983) తెలుగు సాహిత్యం మీద పాశ్చాత్య ప్రభావాన్ని విశదీకరించిన విమర్శకులున్నారు. కాని సాహిత్య విమర్శమీద ఆంగ్ల ప్రభావాన్ని అధ్యయనం చేసినవారు లేరు. అందుకే పాశ్చాత్య కవిత్వోద్యమాలను గురించి తెలిసినంతగా విమర్శోద్యమాలను గురించి అంతగా తెలియదు. సుబ్రహ్మణ్యంగారు ఈ లోటును తీర్చటానికి పూనుకొని పాశ్చాత్య విమర్శకులు కవిత్వాన్ని గురించి, విమర్శను గురించి, వివిధ ప్రక్రియలను గురించి వెలువరించిన వాదాలను, సిద్ధాంతాలను చారిత్రక దృక్పథంతో పరామర్శించారు. కాల్పనిక విమర్శయుగం, శిల్పానుశీలన యుగం, సమన్వయ యుగం, సమీక్షాయుగం అన్న యుగ విభాగంలోనూ విమర్శోద్యమాల చరిత్రను అందించటంలోనూ ఆయన సూక్ష్మ పరిశీలనాదృష్టి ద్యోతకమవుతుంది.

ప్రాచ్యపాశ్చాత్య విమర్శసూత్రాల అధ్యయనం వల్ల కలిగిన అనుభవంతో ఆంధ్రసాహిత్య చరిత్రను నూత్నకోణాలతో దర్శించి, విశ్లేషించి, వివరించడానికి చేసిన ప్రయత్నమే 'సాహిత్యచరిత్రలో చర్చనీయాంశాలు' అన్న బృహద్గ్రంథం. ప్రక్రియా స్వరూప వివేచనతో కొనసాగిన ఈ వ్యాసపరంపరలో అనేక నూత్నాంశాల ప్రతిపాదన, విశ్లేషణ గోచరిస్తాయి.

సాహిత్య పరిణామ వికాసాల నిరూపణంలోనే కాదు రాయప్రోలు అమలిన శృంగార సిద్ధాంత వివరణం కాని, విశ్వనాథ నవ్య సంప్రదాయ మార్గ వివేచనం కాని – సుబ్రహ్మణ్యంగారి వ్యాఖ్యానంలో నూత్న భాష్యాలు గోచరిస్తాయి. ఆధునిక సాహిత్య పరిణామ గతిలో విస్మరింపరానిది నవ్యసంప్రదాయ ధోరణి అన్నది ఆయన వినూత్న ప్రతిపాదనం. కేవలం సంప్రదాయ పద్ధతిలో కాకుండా సమకాలీనోద్యమ ప్రభావంతో సంప్రదాయానికి నూత్న సమన్వయంలో వెలువడిన సాహిత్యం నవ్య సంప్రదాయ సాహిత్యం. ఆంగ్ల సాహిత్యంలో నియోక్లాసిజంతో దీనికి ఏమాత్రం సంబంధం లేదు. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, సంప్రదాయ కవిత్వం మున్నగు కవితా ధోరణులతో పాటు విలక్షణమైన నవ్య సంప్రదా మార్గంలో ఎందరో నవకవులు పయనించినా వారిలో విశ్వనాథది విశిష్టమార్గమని భావించిన సుబ్రహ్మణ్యం గారు 'నవ్యసంప్రదాయం – విశ్వనాథ' (1995) అన్న ప్రత్యేక విమర్శగ్రంథం ప్రకటించారు.

తెలుగు సాహిత్య విమర్శకు సుబ్రహ్మణ్యంగారు అందించిన ఉపాయనం నవ్య సంప్రదాయవాదం. క్లాసిక్ తత్త్వాన్ని జీర్ణించుకొని, సమకాలీన చైతన్య ప్రభావంతో వినూత్న దృక్పథంతో ఆధునిక యుగంలో కొనసాగిన కావ్య రచనా మార్గాన్ని నవ్య సంప్రదాయమార్గంగా ఆయన పేర్కొన్నారు. అనుకరణ ప్రాయమైన సంప్రదాయ కావ్యరచనకు భిన్నంగా ప్రయోగదృష్టితో కొనసాగిన ఈ మార్గాన్ని అర్థం చేసుకోలేని కొందరు నవ్య సంప్రదాయ వాదాన్ని స్వీకరించలేదు. ఆధునిక యుగంలోని ఖండకావ్యాలను సైతం జీవియస్ నవ్య సంప్రదాయ సాహిత్యంగా పరిగణించడం కూడా ఇందుకు కొంత కారణమైందని చెప్పవచ్చు.

విస్పష్టమైన ప్రక్రియా స్వరూప వివేచన, ప్రతీకాత్మక విశ్లేషణతో కూడిన వ్యాస సంపుటులు (సారస్వత సౌరభం, నవ్యాలోకం, అభినవలోచనం, అనుశీలన, విభావన మొ॥) నిత్యనూతనమైన జీవియస్ ఆలోచనా రీతికి నిలువుటద్దాలు. ప్రాచ్య పాశ్చాత్య విమర్శ సూత్రాల అధ్యయానుభవంతో వెయ్యేళ్ళ ఆంధ్ర సాహిత్య చరిత్రను నూత్నకోణాలతో దర్శించి, వినూత్నంగా వింగడించి, వివరించటానికి చేసిన ప్రయత్నమే "సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు" (1991) అన్న బృహద్గ్రంథం. ప్రాచీనాంధ్ర కావ్యాల్లోని (విజయ విలాసం మొ॥) ప్రతీకాత్మక రీతిని విశ్లేషించటం. కె. శివారెడ్డి 'ఆసుపత్రి గీతం' వర్తమాన భారత స్థితికి దర్పణంపట్టే ప్రతీక కావ్యంగా పేర్కొనటం ప్రతీక విమర్శలో ఆయన ప్రత్యేకతను సువ్యక్తం చేస్తాయి. ఎండ్లూరి సుధాకర్ (వర్తమానం), శిఖామణి (చిలక్కొయ్య) మున్నగు సమకాలీనుల వచన కావ్యాలను అభిమానించటం ప్రాచీనాధునిక సాహిత్యాలపై ఆయనకు గల సమవీక్షణాన్ని ద్యోతకం చేస్తుంది.

వివిధ గ్రంథాలకు రచించిన పీఠికలు కూడ పరిశోధనాత్మకములై వివేచనాత్మకములై ఒప్పుతున్నాయి. పరిశోధన ప్రవృత్తి పట్ల మక్కువ ఎక్కువగా ఉన్న సుబ్రహ్మణ్యం గారు యువభారతి ప్రచురణ 'మహతి', రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రచురణలైన రజతోత్సవ సంచిక 'తెలుగు పరిశోధన', 'సారస్వత వ్యాసములు', 'సమాలోచన' మున్నగు వానికి సంపాదక బాధ్యతను సమర్థంగా నిర్వహించారు. పరిశోధన పద్ధతులు, పరిశోధన చరిత్రను శాస్త్రీయంగా వివరించే విపుల భూమికలను సమకూర్చారు. ఊర్వశి పాత్ర తత్త్వాన్ని వివేచిస్తూ బెజవాడ గోపాలరెడ్డి 'లాస్యకింకిణి'కి కూర్చిన పీఠిక వంటివి పరిశోధనాత్మక వ్యాసాలుగా రూపొందాయంటే అత్యుక్తి కాదు. ఆలంకారికశైలిపై అభిమానంతో ఒకటి

రెండు చోట్ల శాఖా చంక్రమణం కనిపించినా పరిశోధనను ఉద్యమంగా తీర్చి దిద్దిన నిత్యచైతన్య మూర్తి జి.వి.సుబ్రహ్మణ్యం గారు.

తి.తి.దేవస్థానం వారి ఆంధ్ర మహాభారత వ్యాఖ్యాన సంపుటాలకు జతపరచిన బృహత్ పీఠికలు మహాభారత తత్త్వాన్ని సమగ్రంగా వెల్లడించే విజ్ఞాన పేటికలు. ఆయన సాహితీ జీవిత సాఫల్యానికి ఎత్తిన పతాకలు. విమర్శ రంగాన్ని ప్రోత్సహించే సత్సంకల్పంతో జీవియస్ సాహితీ కళాపీఠాన్ని నెలకొల్పి ప్రతియేటా తన జన్మదినంనాడు ఉత్తమ విమర్శకులకు పురస్కారాలు ప్రదానం చేస్తూ వచ్చారు. సాటి విమర్శకులను సమాదరిస్తూ వారి విమర్శ దృక్పథాలను సంకలనంగా (మా విమర్శ ప్రస్థానం) వెలువరించటం ఆయన విశాల హృదయానికి తార్కాణం. అందులో నాకు కూడా స్థానం కల్పించారు.

జీ.వి.యస్.గా సాహిత్యాభిమానులకు సుపరిచితులైన గూడ వెంకట సుబ్రహ్మణ్యం నాకు ఎంతో ఆత్మీయులు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయన పురాణ ప్రక్రియపై (1969), నేను విమర్శప్రక్రియపై (1973) డాక్టరేట్ పట్టా పొందాం. అధ్యాపకులుగా కలిసి పనిచేశాం. నాకన్నా ఐదు సంవత్సరాలు పెద్దవారైన సుబ్రహ్మణ్యంగారు అధ్యాపక వృత్తిలోనూ, విమర్శక ప్రవృత్తిలోనూ నాకు మార్గదర్శిగా ఉన్నారు.

“ఏదో చెప్పాలన్న కోరిక, క్రొత్తవైన సమస్యయా లివ్వాలనే ఉత్సాహం, వినూత్న సిద్ధాంతాలను స్థాపించాలన్న తపన నన్ను ఉక్కిరి బిక్కిరి చేసినప్పుడు రచన చేయకుండా ఉండలేను. శక్తి లేదని వూరుకొన్నదానికంటే చేతనైనంత చెప్పటం నా కర్తవ్యమని అనుకొని అడుగు ముందుకువేస్తుంటాను” అని ఆయన వినయపూర్వకంగా వచించారు.

విమర్శనారంగంలో మేరునగస్థానీయులైన ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు 15 ఆగస్టు 2006 నాడు తనువు చాలించారన్న వార్త తెలుగు సాహితీ జగత్తులో తీరని విషాదాన్ని మిగిల్చింది.

సాహిత్య ప్రపంచంలో ‘జీనియస్’గా గుర్తింపు పొందిన జీ.వి.యస్ లేని లోటు తీరేది కాదు. గతానికి సంబంధించిన సమ్యగవగాహనతో, వర్తమాన సమన్వయంతో, భవిష్యద్దర్శనం కావించిన గొప్ప దార్శనికుడు జి.వి.సుబ్రహ్మణ్యంగారు.

(ఆంధ్రభూమి, 21 ఆగస్ట్ 2006)

23. వల్లంపాటి వెంకటసుబ్బయ్య

(1937-2007)



"సాహిత్యరంగంలో నేను అన్నిట్లో వేలుపెట్టి Jack of all Trades గా మాత్రమే మిగిలాను. కథలు కొంతకాలం, నవలలు కొంతకాలం, అనువాదాలు కొంత కాలం, విమర్శ కొంతకాలం... అన్నీ కొంత కొంత మాత్రమే. ఏ రంగంలోనూ నిలకడగా చేసిందేమీ లేదు" అని తమ మిత్రులు పెనుగొండ లక్ష్మీనారాయణకు వ్రాసిన లేఖలో (20-8-1996) వల్లంపాటి వినయ పూర్వకంగా పేర్కొన్నా, విమర్శ రంగంలో మాత్రం నిలకడగానే రచనలు చేసినట్లు సాహితీ మిత్రులందరూ అంగీకరిస్తారు. అందుకే వల్లంపాటి అనగానే విమర్శకుడుగా గుర్తుకొస్తారు.

చిత్తూరుజిల్లా రొంపిచర్లలో 1937 మార్చి 15న జన్మించిన వల్లంపాటి వెంకట సుబ్బయ్య శ్రీ వేంకటేశ్వర, ఆంధ్రవిశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసంచేసి ఎం.ఏ. (ఆంగ్లం)లో ఉత్తీర్ణులైనారు. ఆంగ్లసాహిత్య బోధనలో 'భారతీయతత్త్వం' అనే అంశంపై పరిశోధన చేసి హైదరాబాద్ సీఫిల్ నుండి ఎం.లిట్ పట్టం పొందారు. మదనపల్లిలో రవీంద్రుడు నివసించి వెళ్ళిన ఇంట్లో ఉండి బెసెంట్ థియోసాఫికల్ కాలేజీలో చిరకాలం ఆంగ్లోపన్యాసకులుగా ఉద్యోగించారు.

మధురాంతకం రాజారాం ప్రేరణతో కథారచనచేసిన వల్లంపాటి పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రోత్సాహంతో విమర్శరంగంలో అడుగుపెట్టారు. బహుభాషా

కోవిదులైన పుట్టపర్తి శిష్యునిగా వారి కుటుంబంతో ఆయనకు గాఢమైన సాన్నిహిత్యం ఉంది. 1958–85 మధ్య సుమారు డెబ్బై కథలు, నాలుగు నవలలు రచించారు. ప్రాచీన కవుల సంక్షిప్త చరిత్ర (రచనల్లో నాటి కవులు – 1963) ఆయన తొలి విమర్శ రచన. అనుశీలన (1985), వల్లంపాటి సాహిత్య వ్యాసాలు (1997), నవలా శిల్పం (1989), కథాశిల్పం (1995), విమర్శ శిల్పం (2002) విమర్శకుడిగా ఆయనకు పేరు గడించాయి. కథాశిల్పం రాష్ట్ర (1997), కేంద్ర (1999) సాహిత్య అకాడమీల బహుమతులు పొందింది. రాయలసీమ ఆధునిక సాహిత్యం – సామాజిక సాంస్కృతిక విశ్లేషణ (2006) ఆయన చివరి విమర్శ గ్రంథం.

అనువాద ప్రక్రియలో కూడా వెంకట సుబ్బయ్యకు విశిష్ట స్థానం ఉంది. కన్నడ, ఆంగ్లభాషల్లో నిష్ణాతులైన ఆయన పెక్కు గ్రంథాలను ఆంధ్రీకరించారు. తస్లీమా నస్రీన్ నవల 'లజ్జ'ను, దేవనూరు మహాదేవ కన్నడ నవల 'బదులాళ్' (బ్రతుకంతా)ను తెలుగులోకి తెచ్చారు. రాల్ఫ్ ఫాక్స్ విమర్శగ్రంథం Novel and the People (నవల–ప్రజలు)ను తెనుగించారు. ప్రపంచచరిత్ర (1986), ప్రాచీన భారతదేశంలో ప్రగతి – సంప్రదాయవాదం (1998), ప్రాచీన భారతదేశ చరిత్ర (2002) మున్నగు ఐదు చరిత్ర గ్రంథాలను ఆంగ్లంనుంచి అనువదించారు. కొన్ని తెలుగు వ్యాసాలను కూడా ఆంగ్లీకరించారు.

ఆంగ్ల భాషా బోధనానుభవంతో పాటు వివిధ శాస్త్రాలు – చరిత్ర గ్రంథాల అధ్యయనం ఆయన దృష్టి వైశాల్యాన్ని విస్తరించాయి. భారతీయ – పాశ్చాత్య విమర్శ సూత్రాల సమన్వయంతో, మార్క్సిస్టు సిద్ధాంతాల అన్వయంతో ఆయన సాహిత్య విమర్శ కొనసాగింది. సమకాలీన తెలుగు, ఆంగ్ల పత్రికల్లో పెక్కు విమర్శవ్యాసాలు వెలువరించారు. వాటిలో కొన్నింటిని 'అనుశీలన' పేరుతోనూ (1985), తర్వాత మరికొన్నింటిని కలిపి 'వల్లంపాటి సాహిత్యవ్యాసాలు' గానూ (1996) ప్రచురించారు. అనుశీలనలో శిల్ప వివేచన ప్రాధాన్యం వహించింది. మార్క్సిస్టు దృక్పథంతో వస్తు, శిల్పాల సంబంధాన్ని వివరిస్తూ అరెంటి మధ్య ఐక్యతను ప్రతిపాదించారు.

"కథావస్తువు యొక్క మూర్త రూపమే కథ. కథా వస్తువును కథగా మార్చేది రూపమే. కథా రూపాన్ని పాత్రలు, వాతావరణం, దృష్టికోణం, కంఠస్వరం (Tone), కథన పద్ధతి అనే అంశాలను కలిపి స్థూలంగా 'శిల్పం' అని వ్యవహరించటం కూడా జరుగుతుంది" (అనుశీలన).

"ఉద్దేశాన్ని కళగా మార్చే పరుసవేది శిల్పం - లేదా - రూపం. వస్తువును కళగా మార్చేది రూపం" (సాహిత్య వ్యాసాలు) అంటూ శిల్పానికీ - రూపానికీ అభేదాన్ని పాటించారు. ఆధునిక విమర్శకులు కొందరు వస్తువుకేకాని రూపానికి విలువలేదని భావిస్తూ శిల్పం, ప్రయోగ శీలం మొదలైన వాటిని పరిగణించటం లేదు. కాని గొప్ప రచనలో వస్తువు, రూపం రెండూ సమ్మిళితమై ఉంటాయని, మార్క్సిస్టు విమర్శ చారిత్రక నేపథ్యంలో వస్తు రూపాలను పరిశీలించాలన్నది వల్లంపాటి అభిప్రాయం.

మార్క్సిస్టు విమర్శకుడే అయినా, రాజకీయాలే సాహిత్యం అన్న అతివాదాన్ని ఆయన అంగీకరించలేదు - "మార్క్సిజాన్ని ఒక నిశ్చల సిద్ధాంతంగా కాకుండా చలన శీలత ఉన్న ఒక మెథడాలజీగా ఉపయోగిస్తే అది భారతదేశం వంటి తూర్పు దేశాల సమాజాలను కూడా విశ్లేషించగలదు. ఉదాహరణకు భారతదేశంలో వర్గంతోపాటు వర్ణం నిర్వహించిన, నిర్వహిస్తున్న పాత్రను పొరపాటు లేకుండా గుర్తించగలదు" (విమర్శ శిల్పం) అని ఉగ్గడించారు. ఆయన సాహిత్య వ్యాసాలలో (పదహారు) సమాజం, సాహిత్యం, విమర్శపట్ల గల ఆలోచనలు, సాహిత్య ప్రయోజనం గురించిన అభిప్రాయాలు ద్యోతకమవుతాయి.

కల్పనా సాహిత్య ప్రక్రియలైన (Fiction) కథానిక, నవలలపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించిన వెంకట సుబ్బయ్య కథాశిల్పం, నవలా శిల్పం అన్న ప్రత్యేక విమర్శలు వెలువరించారు. కథానిక స్వరూప స్వభావాలను వివరించిన కథాకథనం, కథా - కమామిషు అన్న గ్రంథాలు కూడా ఆయన కలం నుంచి వెలువడ్డాయి. పాఠకుల దృష్టితో 'కథను చదవడం ఎలా?' అన్న వ్యాసం రచించారు. అయితే 'కథాశిల్పం'లో మధురాంతకం రాజారాం, బుచ్చిబాబు, రావిశాస్త్రి మున్నగువారిపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు కొందరు విమర్శకుల (వాకాటి పాండురంగరావు, ముదిగొండ వీరభద్రయ్య, ద్వానాశాస్త్రి మొ॥వారు) ఖండనలకు గురియైనాయి (చూ. ఆధునిక సాహిత్య విమర్శకులు - ప్రస్థానాలు, దార్ల వెంకటేశ్వరరావు వ్యాసం). మార్క్సిజం శిబిరంలో లేని రచయితల పట్ల ఆయనకు ప్రెజుడిస్‌లు ఉన్నాయని, వల్లంపాటిలో సంయమనం లోపించటమే ఇందుకు కారణమని మరికొందరు సమీక్షకులు భావించారు (వార్త సమీక్ష - 24 మే 2009 - కిరణ్‌కుమార్). ఈ విమర్శలకు సమాధానంగానే కావచ్చు - "ఒక గొప్ప రచయితలో ఒక అసమగ్రతను ఎవరో చూపించినంత మాత్రాన ఆయన అభిమాన బృందం గింజుకోవటం" సమంజసం కాదని ఒక ఇంటర్వ్యూలో (జీవనరేఖలు-తాళ్లపల్లి మురళీధరగౌడు) వల్లంపాటి వచించారు.

'నవలాశిల్పం'లో నవలాచరిత్ర, నవలా విమర్శలతోపాటు ఉన్నవ, గోపీచంద్, బుచ్చిబాబు, విశ్వనాథ, కొడవటిగంటి, రావిశాస్త్రి ప్రభృతుల రచనలు పరామర్శితమైనాయి. వల్లంపాటి కథా, నవలా విమర్శలు తులనాత్మక పద్ధతితో కూడిన అనువర్తిత విమర్శ రీతికి ఉదాహరణ ప్రాయంగా ఉన్నాయి. రచయితలనూ, విమర్శక పాఠకులనూ దృష్టిలో పెట్టుకొని ఇవి విరచితమైనాయి. అందుకే ఆయన్ను 'Fine Critic of Fiction' గా ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య (Major Critics of Modern Telugu Literature) ఉగ్గడించారు.

'విమర్శ శిల్పం'లో అలంకారశాస్త్ర విషయాలతోపాటు రసం, ధ్వని – భేదాలు మున్నగు అంశాల సమాలోచన గోచరిస్తుంది. విమర్శకుడు ఉత్తమ పాఠకుడు, సాహిత్యేతర శాస్త్రాలు అధ్యయనం చేసే ఉత్తమ విద్వాంసుడుగా రూపొందటం అవసరమని ఆయన పేర్కొన్నారు. రచయితలు చదువుతోనూ, పరిశీలనతోనూ భాషను సృజనాత్మకంగా ఉపయోగించుకోగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని హితవు చెప్పారు. ప్రాంతీయ అస్తిత్వానికి ప్రాధాన్యమొసగిన "రాయలసీమలో ఆధునిక సాహిత్యం – సామాజిక సాంస్కృతిక విశ్లేషణ"లో రాయలసీమ చరిత్ర, ప్రాచీన ఆధునిక సాహితీ ప్రక్రియలు ప్రస్తావితమైనాయి. స్థానీయ చైతన్య దృష్టితో ప్రాంతీయ సాహిత్య అధ్యయనానికి మార్గదర్శకమైన గ్రంథం ఇది.

సాహిత్య విమర్శను బాధ్యతాయుతమైన ప్రక్రియగా భావించిన కొద్దిమంది విమర్శకుల్లో వల్లంపాటి ఒకరు. సాహిత్యరంగంలో కులమత భేదాలకు తావివ్వకూడదని ఆయన దృఢాభిప్రాయం. "ప్రాంతం, కులం, శాఖ, మతం మొదలైన అంశాలు సాహిత్య విమర్శలోనూ, సాహిత్యానికి విలువ కట్టడంలోనూ ప్రవేశించకూడదు" (విమర్శశిల్పం) అంటారు. "మనం ఆధునిక ఈర్ష్యాద్వేషాలను (నియోగి, వైదిక వగైరా) ప్రాచీన సాహిత్యానికి కూడా అంటగట్టాం. విమర్శలోకి కులాన్నీ ప్రాంతాన్నీ తీసుకొచ్చాం – భావజాలం పేరుతో సెక్టేరియనిజంను ప్రోత్సహించాం. సాహిత్యాన్ని వదిలిపెట్టి సాహిత్యేతరమైన అనేక ప్రిజడిసెస్‌ను విమర్శలోకి తీసుకువచ్చాం" అని పాపినేని శివశంకర్‌కు వ్రాసిన లేఖ (31-8-1979)లో విచారాన్ని వ్యక్తం చేశారు. జాషువాను కేవలం దళితకవిగా, శ్రీశ్రీని బ్రాహ్మణకవిగా చూసేవారికి ఈ మాటలు రుచింపక పోవచ్చు.

"భవిష్యత్తులో ప్రింట్ మీడియా ప్రభావం బాగా తగ్గవచ్చు. కానీ పుస్తకం ఇచ్చే సంతృప్తి ఎలక్ట్రానిక్ మీడియా ఇస్తుందని నాకు అనిపించటం లేదు" అన్నమాటలు ఆయన సాహిత్యాభిమానానికీ, అభిరుచికీ నిదర్శనం. "మార్క్సిస్టు సాహిత్య విమర్శకునికి ఉండవలసిన భౌతికవాద ప్రాపంచిక దృక్పథం, చారిత్రక దృష్టి, సామాజిక అవగాహన, వస్తుతత్వం, విస్తృత అధ్యయన శీలం, ఆలోచనాపరమైన స్పష్టత, అభివృద్ధికరమైన సరళత, విషయ ప్రతిపాదనలో ఉండవలసిన క్రమత వల్లంపాటి సాహిత్య విమర్శలో పుష్కలం"గా గోచరిస్తాయి (రాచపాళెం చంద్రశేఖరరెడ్డి). అటువంటి విమర్శకుడు తన డెబ్బయవ ఏట, 2-1-2007న అనారోగ్యంతో కన్నుమూశారు.

(పాలపిట్ట, మార్చి2011)

ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణలు

1. ఆంధ్ర మహాభారతోపన్యాసములు .... రూ॥ 100/-
2. తెలుగు వాగ్గేయకారులు-అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం.... రూ॥ 70/-
3. తెనుగు సాహితి .... రూ॥ 36/-
4. స్త్రీల రామాయణపు పాటలు.................................. రూ॥ 36/-
5. సమీక్షణం.. రూ॥ 36/-
6. పరిణతవాణి-1,2,3,4,5 సంపుటాలు (36,45,60,60).. రూ॥ 266/-
7. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు.......... రూ॥ 70/-
8. ఇరివెంటి వ్యాసాలు.. రూ॥ 30/-
9. శాలివాహన గాథా సప్తశతీసారము .... రూ॥ 15/-
10. రాయప్రోలు రచనలు - తత్త్వ వివేచన...................... రూ॥ 60/-
11. తెలుగు సాహిత్యోద్ధారకులు .... రూ॥ 40/-
12. మల్లికాగుచ్ఛము... రూ॥ 8/-
13. మన జాతినిర్మాతలు.. రూ॥ 4/-
14. సుమతి, వేమన, కృష్ణ శతకాలు.............................. రూ॥ 24/-
15. తెలంగాణాలో జాతీయోద్యమాలు............................. రూ॥ 10/-
16. తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం............................ రూ॥ 100/-
17. నా సాహిత్యోపన్యాసములు.................................... రూ॥ 5/-
18. గౌతమబుద్ధుడు - జవహర్‌లాల్ నెహ్రూ.................... రూ॥ 3.60
19. కర్నల్ కాలిన్ మెకంజీ .... రూ॥ 1.60
20. మనదేశం - తెలుగు సీమ .... రూ॥ 7/-
21. మన నదులు - కృష్ణాగోదావరులు .... రూ॥ 3/-
22. మధురభక్తి - ముగ్ధభక్తి.. రూ॥ 80/-
23. ప్రాచీన కవిత .... రూ॥ 10/-
24. ప్రసంగ వ్యాసాలు .... రూ॥ 5/-
25. ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక.............. రూ॥ 50/-
26. ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక.............. రూ॥ 250/-
27. దశరూపక సారం .... రూ॥ 5/-
28. భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం .... రూ॥ 2/-
29. నా రేడియో ప్రసంగాలు .... రూ॥ 5/-
30. సాహిత్యానువాదం : సమాలోచనం............................ రూ॥ 60/-
31. శివరాత్రి మాహాత్మ్యము .... రూ॥ 75/-
32. తెలుగు రచన .... రూ॥ 7/-
33. ఆంధ్రవాఙ్మయ చరిత్ర .... రూ॥ 85/-
34. సాహిత్య సోపానములు .... రూ॥ 75/-
35. మన హాస్యము... రూ॥ 100/-
36. శ్రీ ఆంధ్రమహాభాగవతోపన్యాసములు......................... రూ॥ 125/-

---

గమనిక: పైన పేర్కొన్న గ్రంథాలలో ఏవేని కావలసినవారు ఆయా గ్రంథాల మూల్యంలో సగం సొమ్ము ముందుగా పంపించవలెను.